ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

గుంటూరు

fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

26-8-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 207 పేజీలు: 12 వెల: 6.50

భారత్ ప్రజాస్వామ్యానికి బిఎల్‌ఒలే పునాది

కులగణనలో 'ఓపన్‌ఎండెడ్' వద్దు

5లో



వెలిగొండ శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు (ఫైల్)

# 30 యేళ్ల సంకల్పం నెరవేరింది!

## వెలిగొండ 'వెలుగుల దండ్లు

## జలసిరులు - అభివృద్ధికి రెక్కలు

### 'ఎక్స్' వేదికగా తన భావాలను వ్యక్తం చేసిన చంద్రబాబు

### 31న ప్రాజెక్టును ప్రారంభించబోతున్నాం: సిఎం వెల్లడి

**విజయవాడ, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రతి రైతు పొలానికి నీరు... ప్రతి యువకుడికి ఉపాధి... ప్రతి కుటుంబానికి భరోసా కల్పించాలని సిబిఎన్ అనే నేను సంకల్పించినట్టు 'ఎక్స్' వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఇంటింటికి కుళాయి ద్వారా పశ్చిమ ప్రకాశం జిల్లా ప్రజలను ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత సమస్య చూపిస్తామంటూ భరోసా ఇచ్చారు, ఈ పోస్టులోనే 30యేళ్ల క్రితం వెలిగొండ ప్రాజెక్టుకు తాను శంకుస్థాపన చేసిన ఫొటోను జత చేసారు. వెలిగొండ ప్రాజెక్ట్‌కు శంకుస్దాపన చేసింది నేనే, ప్రారంభిస్తుంది తానేనని వ్యాఖ్యానించారు. ఎన్నో అవాంతరాలు, అడ్డంకులు, సవాళ్లు, సమస్యలను అధిగమించి భగీరథ ప్రయత్నంతో, గొప్ప సంకల్పంతో వెలిగొండ ఫేజ్-1ను పూర్తి చేసినట్లు వివరించారు. తద్వారా కరువునేలకు కృష్ణమ్మ జలాలను అందించబోతున్నామని తెలిపారు. "తీవ్ర కరువు ప్రాంతంగా, అత్యంత వెనుకబాటుతనంతో ఉన్న ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజల జీవితాలు మార్చేందుకు 30 యేళ్ల క్రితం తీసుకున్న సంకల్పం నేడు సాకారమైంది. ఉమ్మడి రాష్ట్రంలో నాడు ముఖ్యమంత్రిగా >>2



మంగళవారం న్యూఢిల్లీలో చిరాగ్ పాశ్వాన్ నుంచి అవార్డు అందుకుంటున్న సెర్ప్ అధికారి

# 'సెర్ప్'కు అవార్డు

**విజయవాడ,ఆగస్టు 25.ప్రభాతవార్త ప్రతినిధి:** సీడ్ క్యాపిటల్ మరియు హైయ్యర్ ఆర్డర్ ఎంటర్ప్రైజెస్ రుణాలు అందచేయడంలో, గ్రామీణ పేదరిక నిర్మూలనసంస్థ(సెర్ప్), ఆంధ్ర ప్రదేశ్‌కు జాతీయ స్థాయి అవార్డును మంగళవారం కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ న్యూఢిల్లీలో అందజేశారు. ఈ నెల ఆగస్టు 24, 25 తేదీలలో కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల మంత్రిత్వ శాఖ, ఇండియా హేబిటేడ్ సెంటర్ న్యూఢిల్లీలో నిర్వ >>2

# అఖండ గోదారిని ఆరాధించేలా పుష్కరాలు

### భక్తులకు అత్యుత్తమ సౌకర్యాలు, పవిత్రతకు పెద్దపీట

### 10 కోట్ల మంది పుణ్య స్నానాలు చేస్తారని అంచనా

### 181 కొత్త ఘాట్ల నిర్మాణం సహా 440 ఘాట్ల అభివృద్ధి

### మొత్తం రూ.4,026 కోట్ల వ్యయంతో 4,932 పనులు

### గోదావరి పుష్కరాలపై సిఎం చంద్రబాబు సమీక్ష



మంగళవారం సచివాలయంలో గోదావరి పుష్కరాలపై సమీక్ష జరుపుతున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రకృతి ఆరాధన, ఆధ్యాత్మిక చింతన మమేకం చేస్తూ గోదావరి పుష్కరాలు నిర్వహించాలని సిఎం చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ఎక్కడా పవిత్రత దెబ్బతినకుండా, భక్తులకు సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వచ్చే యేడాది జూన్ 26 నుంచి జులై 7వరకు 12 రోజుల పాటు పుష్కరాలు అత్యంత వైభవంగా జరపాలని చెప్పారు. పుష్కరాలు కేవలం ప్రభుత్వం నిర్వహించడమే కాదని, స్థానిక ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. పుష్కరాల్లో భాగంగా రూ.4,026 కోట్లతో చేపట్టిన 4,932 పనులకు సంబంధించి పురోగతిపై సచివాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి సమీక్షించారు. పుష్కరాలకు ఇంకా 10 నెలల సమయమే ఉన్నందున త్వరితగతిన అన్ని పనులు ప్రారంభించి సకాలంలో పూర్తి చేయాలన్నారు. పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని స్పష్టం చేశారు. అయితే ఈ పనులకు సంబంధించి ఇప్పటికే రూ.899 కోట్లు ఆర్థిక శాఖ కేటాయింపులు జరిగాయని అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి తెలిపారు. వీటిలో పట్టణాభివృద్ధి, ఆర్అండ్‌బి, జల వనరులు, విద్యుత్, పంచాయతీ రాజ్ శాఖలకు >>2



మంగళవారం సచివాలయంలో జూడా ప్రతినిధులతో సత్యకుమార్ యాదవ్

# జూడాల సమ్మె విరమణ

- మంత్రి సత్యకుమార్‌తో జూడా ప్రతినిధుల చర్చలు
- జూడాల డిమాండ్లపై సానుకూలంగా, సానుభూతితో పరిశీలిస్తాం
- స్టైపెండ్ పెంపుపై ఉన్నతస్థాయి అధికారుల కమిటీ
- త్వరలోనే జూడా ప్రతినిధులతో సమావేశం
- రిటైర్మెంట్ వయసు పెంపుపైనా పునఃపరిశీలన
- నాన్ క్లినికల్ పోస్టుల్లో ఎంఎస్సీ, పిహెచ్‌డి అభ్యర్థుల అంశాన్ని పరిశీలిస్తాం
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ హామీ
- రెండు వారాల్లోగా నిర్ణయం తీసుకోండి
- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

**విజయవాడ,ఆగస్టు 25,ప్రభాతవార్తప్రతినిధి:** డాక్టర్ల (జూడా) డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిమితులను దృష్టిలోఉంచుకుని.. ఇతర రాష్ట్రాల్లో జూనియర్ డాక్టర్లకు అందుతున్న స్టైపెండ్, ఇతర ప్రయోజనాలను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, కేరళ, తెలంగాణల్లో వీరికి అందుతున్న స్టైపెండ్ తదితర అంశాలను రాష్ట్రంలో అమలవుతున్న విధానంతో పోల్చి ఇప్పటికే కూలంకషంగా చర్చించామన్నారు. రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్‌లో మంగళవారంనాడు జూడా ముఖ్య ప్రతినిధులు మంత్రి సత్య కుమార్, కార్యదర్శి జి వీర పాండియన్ ను కలిశారు. సమ్మెను విరమించి విధుల్లోనికి వెళ్లడం ప్రారంభించినట్లు ప్రతినిధులు మంత్రికి తెలియజేశారు. ఈ సందర్భంగా వారికి మంత్రి కృతజ్ఞతలు >>2

# పోక్సో కేసులో నిందితుడికి 20యేళ్ల జైలు

### రూ.5 వేల జరిమానా

### కాకినాడ ప్రత్యేక కోర్టు తీర్పు

**రాజమహేంద్రవరం(అర్బన్), ఆగస్టు 25 ప్రభాతవార్త:** మైనర్ బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన కేసులో నిందితుడికి కాకినాడ ప్రత్యేక పోక్సో న్యాయస్థానం కఠిన శిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు విలువరించింది. నేరం రుజువు కావడంతో చిర్రా ఆనంద్ కుమార్ అనే వ్యక్తికి 20యేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, రాజమహేంద్రవరం రూరల్ మండలం కొలమూరు గ్రామానికి చెందిన 16యేళ్ల బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి నిందితుడు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి రాజానగరం ఎస్ఐ యు.వి.ఎస్. నాగబాబు కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో ఈస్ట్‌జోన్ డిఎస్పీ ఎ.టి.వి. రవికుమార్ శాస్త్రీయ ఆధారాలు, వైద్య నివేదికలు, 164 సిఆర్‌పిసి ప్రకారం నమోదైన వాంగ్మూలాలను సేక >>2

# 'పవర్'లో ఎపి నం.1

- 175 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యమే లక్ష్యం
- రాష్ట్రవ్యాప్తంగా గ్రీన్‌ఎనర్జీలో 22 క్లస్టర్ల అభివృద్ధి
- సుజ్లాన్ భాగస్వామ్యంతో యువతకు నైపుణ్య శిక్షణ
- అనంతపురం అంటే కియా కార్లు, ఫైటర్ జెట్లు, రెన్యువల్ ఎనర్జీ
- ఐటి, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టీకరణ
- కణేకల్లులో పవన విద్యుత్ ప్రాజెక్టులకు శంకుస్థాపన



మంగళవారం హులికెర వద్ద నిర్వహించిన సభలో మాట్లాడుతున్న మంత్రి లోకేష్

**రాయదుర్గం, ఆగస్టు 25 ప్రభాతవార్త:** పునరుత్పాదక ఇంధన రంగంలో ఎపిని నంబర్ వన్‌గా నిలబెట్టడమే మన లక్ష్యమని, సుజ్లాన్ పవన విద్యుత్ ప్రాజెక్ట్ ఎపి నూతన అధ్యాయానికి నాంది అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గం కణేకల్లు మండలం హులికెర వద్ద సుజ్లాన్ విండ్ ఎనర్జీ ప్రాజెక్టులకు శంకుస్థాపన అనంతరం నిర్వహించిన సభలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ, విండ్ ఎనర్జీ రంగంలో మన దేశం సత్తా చాటిందన్నారు. "ప్రస్తుత ప్రాజెక్టులు మొత్తం 1,325 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యం. సుమారు రూ.10వేల కోట్ల పెట్టుబడి, 4 వేలకు పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలను తీసుకురానున్నాయి. మనం నిర్మించే ప్రతి మెగా వాట్ చివరికి మన యువతకు అవకాశంగా మారాలి. ఎపిలో సుజ్లాన్‌కు ఇప్పటికే సుమారు 1,600 మెగావాట్ల స్థాపిత సామర్థ్యం ఉంది. మరో 2,700 మెగావాట్లు అభివృద్ధి, నిర్మాణ దశలో ఉన్నాయి. అనంతపురం ప్రాంతంలో సుమారు 1,300 మెగావాట్ల కొత్త పవన విద్యుత్ ప్రాజెక్టులు అభివృద్ధి దశలో ఉన్నాయి అని వివరించారు.

**సౌర, పవన విద్యుత్, నిల్వ సాంకేతికతలు కలిసి పనిచేయాలి**

"ఆంధ్రప్రదేశ్‌కు పవన విద్యుత్ భవిష్యత్ ఇంధన మిశ్రమంలో కీలక భాగం. భారతదేశంలో సూర్యరశ్మి సమృద్ధిగా ఉంది. పగటి సమయంలో >>2

# తాటి వనం.. తీరానికి రక్షణ కవచం

- గ్రేట్ గ్రీన్ వాల్ రెండో అంచెలో తుపాను గాలి నిరోధక వ్యవస్థగా తాటి చెట్లు
- తాటి గింజల సేకరణ, నాటే ప్రక్రియ ప్రారంభం
- 5,499 హెక్టార్ల విస్తీర్ణంలో 55 లక్షల తాటి గింజలు నాటడం లక్ష్యం
- సీజన్ ప్రారంభంలోనే 13 లక్షల తాటి గింజలు సేకరించిన అటవీ శాఖ
- తాటి వనాల ఏర్పాటు ప్రక్రియలో ప్రజలంతా భాగస్వాములు కావాలి
- ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కల్యాణ్ పిలుపు



**విజయవాడ, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** సుదీర్ఘ తీర ప్రాంతానికి సహజ రక్షణ కవచం ఏర్పాటు దిశగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కల్యాణ్ తీసుకున్న గ్రేట్ గ్రీన్ వాల్ సంకల్పంలో కీలకమైన తాటి వనాల ఏర్పాటు ప్రక్రియ మొదలయ్యింది. తాటి కాయల సీజన్ ప్రారంభం కావడంతో తాటి గింజల సేకరణ, నాటే కార్యక్రమానికి రాష్ట్ర అటవీ శాఖ శ్రీకారం చుట్టింది. గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో ప్రకృతి విపత్తుల సమయంలో గాలి నిరోధక వ్యవస్థగా తాటి వనాలు తీర ప్రాంత గ్రామాలకు తీవ్ర గాలుల నుంచి రక్షణ కల్పించనున్నాయి. మూడంచెల గ్రేట్ గ్రీన్‌వాల్ ఏర్పాటు ప్రక్రియలో తాటి వనాల ఏర్పాటుకు ఎంతో ప్రాముఖ్యత ఉంది.

ఉప్పు నీరు, హోరు గాలులతో ఉండే తీర ప్రాంతాల కఠిన వాతావరణ పరిస్థితులకు తాటి చెట్టు అత్యంత అనుకూలమైన వృక్ష జాతి. ఉప్పు నేలలు, ఇసుక, బుసకతో కూడిన తీర ప్రాంత ఒండ్రు నేలల్లో సైతం పెరిగే సామర్థం తాటి చెట్టుకు ఉంది. ఎత్తుగా పెరిగే జాతి కావడంతో బలమైన సముద్ర గాలులకు సహజ నిరోధక వ్యవస్థగా పని చేస్తుంది. అంతే కాదు బలమైన తాటి వేర్లు నేలను గట్టిగా పట్టి ఉండడం వల్ల తీర ప్రాంతాల్లో కోత >>2

# పట్టణాల అభివృద్ధికి యుకె సహకారం



మంగళవారం అమరావతిలో మంత్రి నారాయణ సమక్షంలో మున్సిపల్ శాఖ - యుకె ప్రభుత్వాల మధ్య కీలక ఒప్పంద దృశ్యం

### మునిసిపాలిటీల్లో రూ.40 వేల కోట్లతో మౌలిక వసతుల కల్పన

### ప్రపంచస్థాయి సాంకేతికత వినియోగం

### వరల్డ్ క్లాస్ స్మార్ట్, లివబుల్ సిటీగా అమరావతి అభివృద్ధి

### యుకె- ఎపి ప్రభుత్వాల మధ్య కీలక ఒప్పందం: మంత్రి నారాయణ

**విజయవాడ. ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ పట్టణాభివృద్ధిని అంతర్జాతీయ నైపుణ్యం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సుస్థిర మౌలికవసతులతో మరింత ముందుకు తీసుకెళ్లే దిశగా రాష్ట్రప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. పట్టణాభివృద్ధి, మౌలిక సదుపాయాల రంగాల్లో దీర్ఘకాలిక సహకారం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం- యునైటెడ్ కింగ్డమ్ ప్రభుత్వం మధ్య అవగాహన ఒప్పందం మంగళవారం అమరావతిలో కుదిరింది. వెలగపూడిలోని సచివాలయంలో నిర్వ >>2

# శ్రీశైలంలో విషాదం

### అన్నదాన సత్రంలో ఐదుగురు ఆత్మహత్య

### మృతులంతా ఒకే కుటుంబ సభ్యులు

### సత్యసాయి జిల్లా బత్తలపల్లి వాసులు

### ఆర్థిక ఇబ్బందులతోనే బలవన్మరణం

### పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడి

**శ్రీశైలం ప్రాజెక్టు, ఆగస్టు 25 ప్రభాతవార్త:** శ్రీశైల క్షేత్రంలో వడ్డెర ప్రైవేట్ అన్నదాన సత్రంలో ఒకే కుటుంబ సభ్యులు ఐదు మంది ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం వెలుగు చూసింది. మృతులు సత్యసాయి జిల్లా బత్తలపల్లి గ్రామానికి చెందిన కుటుంబం. గతనెల 28న ఓ ఆటోలో వచ్చి వడ్డెర సత్రంలో రూమ్ 11ను తీసుకుని ఉంటున్నారు. అప్పటినుండి ప్రతిరోజు సత్రంలో భోజనానికి రావడం, బయట తిరగడం ఆలయానికి వెళ్లిరావడం చేస్తున్నారు. అయితే గత మూడు రోజులుగా రూమ్ నుండి ఎవరు బయటకు రాకపోవడం, పైగా దుర్వాసన రావడంతో సత్రం నిర్వాహకులు కిటికీలోనుంచి చూడగా ఉరివేసుకున్న దృశ్యాలుచూసి కంగుతిన్నారు. వెంటనే సత్రం నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. >>2




ఆంధ్రప్రదేశ్ లోకాయుక్తగా జస్టిస్ మల్లిఖార్జున రావుతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్.వేదికపై సిఎం చంద్రబాబు నాయుడు

# లోకాయుక్తగా జస్టిస్ మల్లిఖార్జున రావు


### లోక్‌భవన్‌లో ప్రమాణస్వీకారం చేయించిన గవర్నర్

### సిఎం చంద్రబాబు, మంత్రులు, హైకోర్టు జడ్జిలు, డిజిపి హాజరు

**విజయవాడ, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ లోకాయుక్తగా నియమితులైన హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లిఖార్జునరావుతో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో లోక్ భవన్ దర్బార్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రమాణ >>2

26-8pg2exHMNWJQE:26-8pg2exHMNWJQE.qxd 26/Aug/26 12:05 AM Page 1






విండ్ ఎనర్జీ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రులు నారా లోకేష్, పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, సుజ్లాన గ్రూప్ కో ఫౌండర్, వైస్ చైర్మన్ గిరీష్ తంతి తదితరులు

# 'పవర్స్'లో ఎపి నం.1

>> సౌర విద్యుత్ కీలక పాత్ర పోషిస్తుంది. కానీ ప్రతి సాయంత్రం సూర్యుడు అస్తమిస్తాడు. మన ఆర్థిక వ్యవస్థ మాత్రం ఆగదు. సాయంత్రం 6 గంటలకైనా మన ఇళ్లకు విద్యుత్ అవసరం ఉంటుంది. మన పరిశ్రమలు పనిచేస్తూనే ఉంటాయి. మన ఆసుపత్రులు పనిచేస్తూనే ఉంటాయి. మన డేటా సెంటర్లు ప్రతి క్షణం సమాచారాన్ని ప్రాసెస్ చేస్తూనే ఉంటాయి. అందుకే సౌర, పవన విద్యుత్, నిల్వ సాంకేతికతలు కలిసి పనిచేయాలి. ఆంధ్రప్రదేశ్ దేశంలోని అతిపెద్ద డేటా సెంటర్ పర్యావరణ వ్యవస్థల్లో ఒకదాన్ని నిర్మిస్తున్నందున ఇది మరింత కీలకంగా మారుతోంది. మేం 6.5 గిగావాట్ల డేటా సెంటర్ సామర్థ్యాన్ని అభివృద్ధి చేస్తున్నాం. ఈ డిజిటల్ మౌలిక వసతులకు అవసరమైన విద్యుత్‌ను అందించేందుకు సుమారు 25 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన అవకాశాన్ని సృష్టించవచ్చు" మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

**175 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యం లక్ష్యం**

"మా విజన్ కేవలం విద్యుత్‌తో ఆగిపోదు. క్లీన్ ఎనర్జీని గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియాగా మార్చాలని మేం కోరుకుంటున్నాం. గ్రీన్ డేటా సెంటర్ల ద్వారా ఎఐ ఆర్థిక వ్యవస్థకు విద్యుత్ అందించాలని కోరుకుంటున్నాం. చివరికి క్లీన్ ఎనర్జీకి సౌది అరేబియాగా ఎపిని తీర్చిదిద్దాలన్నదే మా అంతిమ లక్ష్యం. వివిధ రూపాల్లో స్వచ్ఛ ఇంధనాన్ని ప్రపంచానికి ఎగుమతి చేయగల రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దాలి. మనకు పునరుత్పాదక ఇంధన సామర్థ్యం ఉంది. సుదీర్ఘ సముద్ర తీరం ఉంది. రాష్ట్ర స్థాయిలో 175 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ లక్ష్యాన్ని సాధించడంలో సుజ్లాన్ వంటి సంస్థలు కీలక పాత్ర పోషించనున్నాయి" అని మంత్రి లోకేష్ వివరించారు.

**సుజ్లాన్ భాగస్వామ్యంతో 12వేల మంది యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ**

"ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సుజ్లాన్ కలిసి 12వేల మంది యువతకు, అందులో 25శాతం మహిళలకు ప్రాతినిధ్యం ఉండేలా గ్రీన్ ఎనర్జీ ఉద్యోగాల కోసం శిక్షణ అందిస్తున్నాయి. ఉరవకొండ, విజయవాడలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు పునరుత్పాదక ఇంధన రంగానికి అవసరమైన ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులను సిద్ధం చేస్తున్నాయి. రేపటి కంపెనీలు నైపుణ్యం ఉన్న ప్రాంతాలకే వస్తాయి. ఆ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఆంధ్రప్రదేశ్ యువత సిద్ధంగా ఉండేలా చూడటం మన బాధ్యత. భారతదేశ స్వచ్ఛ ఇంధన భవిష్యత్తు కోసం శిక్షణ పొందుతున్న యువ ఇంజనీర్లు, సాంకేతిక నిపుణుల ద్వారా స్వర్గీయ 'తులసి తంతి' వారసత్వం మరోసారి కొనసాగుతోంది" అని మంత్రి పేర్కొన్నారు.

**20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం**

"ఒక్క కియా పరిశ్రమ ఎన్ని కుటుంబాల్లో వెలుగు నింపిందో నేను పాదయాత్రలో స్వయంగా చూశాను. అప్పుడే 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలి అనే లక్ష్యంగా పెట్టుకున్నాను. ప్రపంచమంతా తిరిగి కంపెనీలను తీసుకువస్తున్నాం. ప్రధానమంత్రి నరేంద్రమోడీకూడా రాష్ట్రానికి కంపెనీలను తీసుకురావడానికి సహకరిస్తు న్నారు. కంపెనీలను తీసుకురావడం మా బాధ్యత. ఆ అవకాశాలను అందిపుచ్చుకోవడం యువత బాధ్యత. మీ పని తీరుబట్టే మరిన్ని కంపెనీలు ఎపికి వస్తాయి. పరిశ్రమలతో నేరుగా అనుసంధానం చేసి, యువతకు అవసరమైన నైపుణ్యాలను నేర్పించాలని కోరుతున్నాం" అని మంత్రి లోకేష్ అన్నారు.

**మన భవిష్యత్ మనమే నిర్మించుకుందాం..**

"ప్రభుత్వం, పరిశ్రమలు, యువత కలిసి పనిచేసినప్పుడు ఎంత అద్భుత ఫలితాలు వస్తాయో మనం చూస్తున్నాం. పరిశ్రమలు పెట్టుబడులు, సాంకేతికతను తీసుకువస్తాయి. ఈ రోజు మనం కేవలం పవన విద్యుత్ ప్రాజెక్టులకు భూమిపూజ చేయడం లేదు. ఇంధనం, తయారీ, సాంకేతికత, ప్రతిభ ఆధారంగా నిర్మించబోయే కొత్త పారిశ్రామిక ఆంధ్రప్రదేశ్‌కు పునాది వేస్తున్నాం. భవిష్యత్తు కోసం మనం ఎదురుచూడబోం. స్వచ్ఛ ఇంధనం, కొత్త పరిశ్రమలు, కొత్త ఉద్యోగాలు, కొత్త నైపుణ్యాలతో భవిష్యత్తును మనమే నిర్మించబోతున్నాం" అని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, అనంతపురం ఎంపి అంబికా జీ.లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు, దగ్గుపాటి వెంకటప్రసాద్, సుజ్లాన్ గ్రూప్ కో ఫౌండర్, వైస్ ఛైర్మన్ గిరీష్ తంతి, సిఇఒ అజయ్ కపూర్, అడ్వైజర్ విబి రావు, టాటా పవర్ ఎండి, సిఇఒ సంజయ్ బంగా, సుజ్లాన్ గ్రూప్ డైరెక్టర్ రంజిత్ సిన్హా అభయ్ సిన్హా పర్మార్, ఎన్ఆర్ఇడిసిఎపి లిమిటెడ్ విసి, మేనేజింగ్ డైరెక్టర్ ఎమ్.కమలాకర బాబు, టోరెంట్ పవర్ డైరెక్టర్ జిగీష్ మెహతా, వారీ ఎనర్జీస్ సిఎండి హితేష్ దోషి, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పాల్గొన్నారు.

# జస్టిస్ మల్లిఖార్జున రావు

>> స్వీకారం చేయించారు. ఎడి ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు, ఆ తర్వాత లోకాయుక్త రిజిస్ట్రార్ ఆంధ్రప్రదేశ్ లోకాయుక్తగా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లిఖార్జునరావును నియమిస్తూ గవర్నర్ జారీ చేసిన అపాయింట్‌మెంట్ వారెంట్‌ను చదివి వినిపించారు. అనంతరం, ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త జస్టిస్ (రిటైర్డ్) తల్లాప్రగడ మల్లిఖార్జునరావును గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందించి పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాసంశెట్టి సుభాష్, హైకోర్ట్ న్యాయమూర్తులు, డిజిపి హరీష్ కుమార్ గుప్తా, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. అనంతరాము, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, ఎపి శాసనసభ సెక్రటేరియట్ సెక్రటరీ జనరల్ పసన్నకుమార్ సూర్యదేవర న్యాయశాఖఅధికారులు, ఇతర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పోక్సో కేసులో నిందితుడికి 20యేళ్ల జైలు

>> రించి చార్జిషీట్ దాఖలు చేశారు. సిఐ వీరయ్య గౌడ్ దర్యాప్తును పర్యవేక్షించారు. కోర్టు విచారణలో ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పిపి పి. శ్రీదేవి సమర్థవంతంగా వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాలను కోర్టులో ప్రవేశపెట్టడంతో నిందితుడిపై నేరం రుజువైంది. పోస్కో చట్టంలోని సెక్షన్ 3 ఆర్/డబ్ల్యూ 4(2) కింద 20యేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించకపోతే అదనంగా మరో మూడు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలి. ఐపిసి 363 కింద మూడు నెలల సాధారణ జైలు, రూ.500 జరిమానా విధించారు. ఈ రెండు జైలుశిక్షలు ఏకకాలంలో అమలుకానున్నాయి. జరిమానా మొత్తాన్ని అప్పీల్ గడువు అనంతరం బాధితురాలికి పరిహారంగా అందించాలని కోర్టు ఆదేశించింది.



సముద్రతీర ప్రాంతాల్లో తాటి వనాల కోసం విత్తనాలు నాలుగుతున్న అటవీశాఖ సిబ్బంది

# తీరానికి రక్షణ కవచం

>> నిరోధక వ్యవస్థగా కూడా ఉంటుంది. పక్షులు, కొన్ని రకాల సరిసృపాలకు ఆవాసంగా ఉండే తాటి చెట్లు జీవ వైవిధ్యానికి ప్రతీకగా ఉంటాయి. వాతావరణ మార్పుల ప్రభావాన్ని కూడా తట్టుకోగల శక్తి తాటి చెట్టు సొంతం. అందుకే పవన్ కల్యాణ్ రూపొందించిన మూడంచెల గ్రేట్ గ్రీన్ వాల్ ప్రణాళికల్లో మొదటి అంచె మడ అడవులకు, రెండో అంచె తాటి వనాలకు ప్రాధాన్యత ఇచ్చారు.

రాష్ట్రవ్యాప్తంగా తీర ప్రాంతం వెంబడి 5,499 హెక్టార్ల పరిధిలో తాటి వనాల ఏర్పాటును లక్ష్యంగా ఉప ముఖ్యమంత్రి ప్రతిపాదించారు. అందుకు దాదాపు 55 లక్షల తాటి గింజలు అవసరం అవుతాయని అటవీ శాఖ భావిస్తోంది. ఈ యేడాది తాటి కాయల సీజన్ మొదలైన నాటి నుంచి ఇప్పటి వరకు గ్రామీణ ప్రజలు, వివిధ వ్యవస్థల భాగస్వామ్యంతో 13 లక్షల తాటి గింజలు సేకరించారు. ఇప్పటికే 1 లక్ష 65 వేల తాటి గింజలను పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖలు, స్కూలు విద్యార్థులు, ప్రజల భాగస్వామ్యంతో నాటే ప్రక్రియను రాష్ట్ర అటవీ శాఖ ఆధ్వర్యంలో పూర్తిచేశారు. ఈ సీజన్‌లో పవన్ కల్యాణ్ నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్న బలమైన సంకల్పంతో ముందుకు వెళ్తున్నట్టు ఆ శాఖ అధికారులు స్పష్టం చేశారు.

# పట్టణాల అభివృద్ధికి యుకె సహకారం

>> హించిన కార్యక్రమంలో పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, యుకె ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఫర్ బిజినెస్ అండ్ ట్రేడ్ గవర్నమెంట్ పార్ట్‌నర్‌షిప్స్ డిప్యూటీ డైరెక్టర్ చాజ్ వాలియా ఒప్పందంపై సంతకాలు చేశారు. పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి మంత్రి పి. నారాయణ నాయకత్వంలో ఎపి ప్రతినిధి బృందం, యుకె ప్రతినిధి బృందం కార్యక్రమంలో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా మంత్రి పి. నారాయణ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్, యుకె డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ అండ్ ట్రేడ్‌తో అవగాహన ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను మరింత మెరుగ్గా అభివృద్ధి చేయడమే ఈ ఒప్పందం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని నగరాలను లివబుల్ సిటీలుగా, స్మార్ట్ సిటీలుగా అభివృద్ధి చేయడానికి యుకె సహకారం అందించనుందని తెలిపారు. బెస్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్లానింగ్, సస్టైనబుల్ సిటీస్ డెవలప్‌మెంట్, టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్మేషన్, ఇంటిగ్రేటెడ్ అర్బన్ మొబిలిటీ వంటి రంగాల్లో ప్రత్యేకంగా సహకారం అందనుందని చెప్పారు. యుకెలోని వివిధ కంపెనీల బెస్ట్ ఎక్స్‌పర్టైజ్‌ను ఆంధ్రప్రదేశ్‌కు తీసుకురావడం, ప్రపంచస్థాయి టెక్నాలజీ, బెస్ట్ ప్రాక్టీసెస్‌ను రాష్ట్రంలో అమలు చేయడం ఈ భాగస్వామ్యం ద్వారా సాధ్యమవుతుందని మంత్రి తెలిపారు.

లండన్‌కు చెందిన నార్మన్ ఫోస్టర్ అండ్ పార్ట్‌నర్స్ అమరావతి ఐకానిక్ టవర్స్, అసెంబ్లీ, హైకోర్టు డిజైన్‌లో భాగస్వామ్యం కావడం ఇప్పటికే ఉన్న సహకారానికి నిదర్శనమన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు అవసరమైన సాంకేతిక సహకారం అందించేందుకు యుకె ప్రతినిధులు ముందుకు వచ్చారని, యుకె డిప్యూటీ హై కమిషనర్, బిజినెస్ విభాగం డైరెక్టర్ జనరల్ సహా ప్రతినిధులు అమరావతికి వచ్చి రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో చర్చలు జరిపారని మంత్రి తెలిపారు. సిఎం చంద్రబాబు నాయుడు సూచనల మేరకే యుకె ప్రభుత్వంతో చర్చలు జరిపి ఈఅవగాహన ఒప్పందం చేసుకున్నామని మంత్రి పేర్కొన్నారు. అమరావతితో పాటు రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కూడా ఈ సహకారం ఉపయోగపడనుంది.

**నాలుగు ప్రధాన రంగాల్లో సహకారం..**

ఆంధ్రప్రదేశ్- యుకె భాగస్వామ్యం ప్రధానంగా మౌలిక వసతుల ప్రణాళిక, సుస్థిర పట్టణాభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ-ఆవిష్కరణలు, సమగ్ర పట్టణ రవాణా వ్యవస్థలపై కొనసాగనుంది. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ప్రాజెక్టుల ప్రణాళిక, ప్రాధాన్యత క్రమం, ఆర్థిక సాధ్యాసాధ్యాల అంచనా, పెట్టుబడులకు అనుకూలమైన బిజినెస్ కేసుల రూపకల్పన, ప్రాజెక్ట్ డిజైన్, ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్, అమలు వంటి అంశాల్లో ఇరు ప్రభుత్వాలు కలిసి పనిచేయనున్నాయి. రాష్ట్రంలోని నగరాలను మెరుగైన అర్బన్ స్ట్రక్చర్‌తో స్మార్ట్, లివబుల్ సిటీలుగా తీర్చిదిద్దేందుకు యుకె నైపుణ్యాన్ని వినియోగించుకోనున్నారు.

**అమరావతి అభివృద్ధిలో యుకె నైపుణ్యం**

అమరావతి అభివృద్ధిలో యుకె సంస్థలతో ఇప్పటికే ఏర్పడిన అనుసంధానాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. లండన్‌కు చెందిన ఫోస్టర్ + పార్ట్‌నర్స్ సంస్థ అమరావతి ప్రభుత్వ సముదాయంలోని అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ భవనాల రూపకల్పనలో భాగస్వామ్యం కావడం ఇరు పక్షాల మధ్య ఉన్న సహకారానికి ఉదాహరణగా నిలుస్తోంది. అమరావతి తదుపరి దశ అభివృద్ధిలో పట్టణ ప్రణాళిక, సుస్థిర మౌలిక వసతులు, పట్టణ రవాణా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ప్రాజెక్టుల రూపకల్పన, అమలు తదితర రంగాల్లో యుకె నైపుణ్యాన్ని మరింతగా వినియోగించుకునే అవకాశాలను పరిశీలించనున్నారు. అమరావతి రివర్‌ఫ్రంట్, పట్టణ పునరుద్ధరణ, మిశ్రమ వినియోగ అభివృద్ధి వంటి రంగాల్లోనూ అంతర్జాతీయ అనుభవాన్ని వినియోగించుకునే అవకాశాలు ఉన్నాయి.

**ఆధునిక సాంకేతికతకు ప్రాధాన్యం..**

సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, ఆవిష్కరణలకు ఈ ఒప్పందంలో ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ఇంటెలిజెంట్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్స్ బిల్డింగ్ ఇన్ఫర్మేషన్ మోడలింగ్, డిజిటల్ ట్విన్స్, ఆధునిక నిర్మాణ సాంకేతికతలు, పరిశోధన-అభివృద్ధి వంటి రంగాల్లో సహకారం అందించనున్నారు.యుకెలోని వివిధ సంస్థల అత్యుత్తమ నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానం, బెస్ట్ ప్రాక్టీసెస్‌ను రాష్ట్రానికి తీసుకురావడం ద్వారా ప్రభుత్వ సంస్థల సామర్థ్యాన్ని పెంచడం, నిపుణుల మధ్య జ్ఞాన మార్పిడిని ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎపి సిఆర్‌డిఎ కమిషనర్ విజయ రామరాజు, ఎపి సిఆర్‌డిఎ అదనపు కమిషనర్ రాహుల్, సిడిఎంఎ, ఆంధ్రప్రదేశ్ మెట్రో రైల్ కార్పొరేషన్‌కు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. యుకె ప్రతినిధి బృందంలో దక్షిణాసియా ట్రేడ్ కౌన్సిలర్ మార్క్ బిరెల్, డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్, నేషనల్ లీడ్-ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రిషికేష్ చందా, సౌత్ ఇండియా రీజినల్ హెడ్-ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రోహిత్ చంద్రగిరి, గవర్నమెంట్ పార్ట్‌నర్‌షిప్స్ డిప్యూటీ డైరెక్టర్ చాజ్ వాలియా పాల్గొన్నారు.

# జూడాల సమ్మె విరమణ

>> తెలిపారు. అనంతరం తనను కలిసిన విలేకరులతో మంత్రి సత్య కుమార్ మాట్లాడుతూ జూనియర్ డాక్టర్లు ప్రధానంగా స్టైపెండ్ పెంపుతో పాటు రిటైర్మెంట్ వయసు పెంచకూడదని జూడా ప్రతినిధులు ఇంతకుముందు డిమాండ్ చేశారని మంత్రి తెలిపారు. రిటైర్మెంట్ వయసు పెంపు అంశంపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు. కొన్ని ప్రాంతాల్లో వైద్యుల లభ్యత తగ్గుతున్న నేపథ్యంలో ఆ అంశాన్ని కేవలం పరిశీలన మాత్రమే చేశామని చెప్పారు. జూడాల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని దీనిపై మరోసారి పునఃపరిశీలన చేస్తామని వెల్లడించారు.

**స్టైపెండ్ పెంపు అంశంపై కమిటీ పరిశీలన**

స్టైపెండ్ పెంపు అంశంపై ప్రత్యేకంగా కమిటీని ఇప్పటికే ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. ఆరోగ్యశాఖ కార్యదర్శి వీరపాండియన్ ఆధ్వర్యంలో కమిటీ పనిచేస్తుందని చెప్పారు. ఒకటి రెండు రోజుల్లో జూడా సంఘాల నాయకులతో కమిటీ సమావేశమై వారి డిమాండ్లపై చర్చిస్తుందని తెలిపారు. ప్రభుత్వం ఆర్థిక పరిమితులు, అందుబాటులో ఉన్న వనరులు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు.

**నాన్ క్లినికల్ పోస్టులపైనా పునఃపరిశీలన**

నాన్ క్లినికల్ విభాగాల్లో ఎంఎస్సీ, పీహెచ్‌డీ అర్హత కలిగిన వారిని నియమించే అంశంపైనా మరోసారి పునఃపరిశీలన చేస్తామని మంత్రి చెప్పారు. ఈ విషయంలో ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదన్నారు. జాతీయ వైద్య కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా కొత్త వైద్య కళాశాలలను త్వరగా ప్రారంభించాల్సిన అవసరం ఏర్పడిందని, అందులో భాగంగానే నోటిఫికేషన్లు జారీ చేసినట్లు తెలిపారు. వాటికి తగిన స్పందన రాని పరిస్థితుల్లో కొన్నిచర్యలు తీసుకోవాల్సి వచ్చిందన్నారు. ఈ అంశంపైనా జూడాల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని పునఃపరిశీలిస్తామని స్పష్టం చేశారు.

**సిఎం దృష్టికి తీసుకెళ్లి నిర్ణయం**

జూడాల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు సత్యకుమార్ తెలిపారు. ప్రభుత్వం వారి డిమాండ్ల పట్ల సానుకూలంగా ఉందని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ప్రభుత్వ పరిమితులపై జూడా నాయకులకు కూడా అవగాహన ఉందన్నారు. అందువల్ల ఇరువర్గాల మధ్య చర్చల ద్వారా సమస్యకు పరిష్కారం కనుగొనే ప్రయత్నం జరుగుతుందని పేర్కొన్నారు. 9,500 మంది వైద్యుల సేవలు కీలకంరాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో దాదాపు 9,500 మంది జూడాలు సేవలు అందిస్తున్నారని మంత్రి తెలిపారు. పేద, సామాన్య ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులపై ఆధారపడుతున్నారని, ముఖ్యంగా అత్యవసర వైద్య సేవల్లో జూడాల పాత్ర కీలకమని చెప్పారు. సమ్మె కారణంగా అత్యవసర వైద్య సేవలకు ఇబ్బందులు తలెత్తే పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని జూడాలు మానవతా దృక్పథంతో సమ్మె విరమించడం అభినందనీయమన్నారు.

ప్రజల ఆరోగ్య ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని సమ్మె విరమించిన జూడా నాయకులకు, డాక్టర్లందరికీ మంత్రి సత్యకుమార్ మరోసారి కృతజ్ఞతలు తెలిపారు. వారి సమస్యలను పరిష్కరించే విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు.

# జూనియర్ డాక్టర్ల సమ్మెపై హైకోర్టులో విచారణ

## సమ్మె విరమిస్తున్నట్లు న్యాయస్థానానికి తెలిపిన జూడాలు

**విజయవాడ. ఆగస్టు 25,ప్రభాతవార్తప్రతినిధి:** జూనియర్ డాక్టర్ల సమ్మెపై దాఖలైన పిటిషన్‌పై ఎపి హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా సమ్మె విరమిస్తున్నట్లు జూడాల సంఘం ప్రకటించింది. ఈ మేరకు హైకోర్టుకు నివేదించింది. ఈ సందర్భంగా తమ డిమాండ్లు పరిష్కరించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని జూడాల సంఘం అభ్యర్థించింది. దీంతో రెండు వారాల్లో నిర్ణయం తీసుకో వాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీంతో సమ్మె విరమిస్తున్నట్లు హైకోర్టుకు జూడాల సంఘం నివేదించింది. ఆంధ్రప్రదేశ్ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (ఎపి జూడా) ఆధ్వర్యంలో ఈనెల 11న తొలిదశ, 12 నుంచి రెండోదశ ఆందోళనలు కొనసాగాయి. అత్యవసర సేవలు మాత్రమే అందిస్తూ 16వ తేదీ వరకు నిరసనలు తెలిపారు. 15 స్టైపెండ్ పెంచాలన్న జూడాల డిమాండ్‌కు ప్రభుత్వం తలొగ్గకపోవడంతో 17 నుంచి మూడో దశ ఆందోళనలో భాగంగా అత్యవసరంతో పాటు అన్నిసేవలూనిలిపివేసి సమ్మెను తీవ్రతరం చేశారు.

# గోదారిని ఆరాధించేలా పుష్కరాలు

>> సంబంధించి అత్యధిక పనులు ఉన్నాయి. ఇందులో తూర్పు గోదావరి జిల్లాలో 1,869, పశ్చిమ గోదావరి జిల్లాలో 625, కోనసీమ జిల్లాలో 1,501, ఏలూరు జిల్లాలో 426, కాకినాడ జిల్లాలో 321, పోలవరం జిల్లాలో 190 పనులు చేపడుతున్నారు. అయితే ఈ పనుల పూర్తికి అవసరమైన నిధుల సమీకరణపై అధికారులు దృష్టి పెట్టాలని, కేంద్ర సాయం కూడా తీసుకోవాలని అధికారులకు సిఎం సూచించారు.

**2027 పుష్కరాలకు భారీగా భక్తులు..**

2015 మహా పుష్కరాల్లో ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 4.86 కోట్ల మంది భక్తులు పుణ్య స్నానాలు చేయగా. 2027లో 8 నుంచి 10 కోట్ల మంది గోదావరి పుష్కరాలకు తరలి వస్తారని అంచనా వేస్తున్నట్టు అధికారులు వివరించారు. రోజుకు సుమారు కోటి మంది పుణ్య స్నానాలు చేసే అవకాశం ఉందన్నారు. రద్దీని తట్టుకునేలా మొత్తం 440 ఘాట్లు సిద్ధం చేస్తున్నామన్నారు. వీటిలో ప్రస్తుతం ఉన్న 259 ఘాట్లను అభివృద్ధి చేయడంతో పాటు అదనంగా 181 కొత్త ఘాట్లను నిర్మిస్తున్నామన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 82 ఘాట్లు, పశ్చిమగోదావరి జిల్లాలో 40 ఘాట్లు, కోనసీమ జిల్లాలో 175 ఘాట్లు, ఏలూరు జిల్లాలో 44 ఘాట్లు, కాకినాడ జిల్లాలో 88 ఘాట్లు, పోలవరం జిల్లాలో 11 ఘాట్లు అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు.

**టెంపుల్ టూరిజంపై ప్రత్యేక దృష్టి**

గోదావరి పరివాహక ప్రాంతంలో ఎన్నో పుణ్యక్షేత్రాలు ఉన్నాయని... పిఠాపురంలో శక్తి పీఠం సహా పంచారామాల్లో 4 క్షేత్రాలు, ఇంకా ద్వారకా తిరుమల, అన్నవరం, వాడపల్లి, అంతర్వేది వంటి ప్రధాన ఆలయాలను కలుపుతూ టూరిజం సర్క్యూట్‌గా అభివృద్ధి చేయాలని సీఎం అధికారులకు సూచించారు. పుష్కరాలకు వచ్చే భక్తులు పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలను సందర్శించేందుకు వీలుగా హోం స్టేలను ప్రోత్సహించాలని సూచించారు. కొత్తగా హోటళ్ల నిర్మాణం చేపట్టేవారికి త్వరితగతిన అనుమతులు ఇవ్వాలన్నారు. 'రాజమహేంద్రవరంలో వివిధ కార్యక్రమాల నిర్వహణ కోసం కన్వెన్షన్ సెంటర్ నిర్మించాలి. దేశ విదేశాల్లో ప్రముఖులు అందరికీ గోదావరి పుష్కరాలకు ఆహ్వానం అందించాలి. రాష్ట్ర విశిష్టత తెలిసేలా, ప్రతిష్ట పెరిగేలా చేసేందుకు ఇదొక అవకాశంగా భావించాలి. కూచిపూడి ఈవెంట్ వంటివి భారీ తరహాలో నిర్వహించేలా దేవాదాయపర్యాటక శాఖలు ప్రణాళికలు రూపొందించాలి. పోలవరం ప్రాజెక్టును సందర్శించేలా రహదారుల నిర్మాణం జరగాల్సి ఉంది. హేవ్‌లాక్ బ్రిడ్జి, సమీపంలో దీవుల అభివృద్ధి పనులు పూర్తి చేయాలి.' అని నిర్దేశించారు.

**రద్దీ నిర్వహణకు ఎఐ వినియోగం**

ఈసారి పుష్కరాల్లో భద్రత, రద్దీ నిర్వహణకు ఎఐ ఆధారిత క్రౌడ్ అనలిటిక్స్, సిసిటివి ఎంట్రీఎగ్జిట్ మానిటరింగ్, డ్రోన్ సర్వైలెన్స్, క్యూఆర్ ఆధారిత వాహన గుర్తింపు, డీసెంట్రలైజ్డ్ డిప్లాయ్‌మెంట్ సిస్టమ్ వంటి సాంకేతికత వినియోగిస్తున్నట్టు అధికారులు తెలిపారు. వైద్య సేవల పరంగానూ ఎటువంటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. అంబులెన్స్‌లు, ఫస్ట్ ఎయిడ్, మెడికల్ క్యాంపులు నిర్వహిస్తామని చెప్పారు. 30 ఫీల్డ్ ఆస్పత్రులను తాత్కాలిక ప్రాతిపదికన ఏర్పాటు చేసి, వాటికి అనుబంధంగా ల్యాబ్‌లు సిద్ధం చేస్తున్నామని సిఎం చంద్రబాబు తెలిపారు.

**మోడల్ పుష్కర పంచాయతీగా ముని కూడలి..**

గోదావరి నదీ పరివాహక జిల్లాల్లోని 260 గ్రామ పంచాయతీలలో 50 గ్రామ పంచాయతీలను మోడల్ పుష్కర పంచాయతీలుగా అభివృద్ధి చేయ తలపెట్టారు. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలోని ముని కూడలిని పైలట్ మోడల్ పుష్కర పంచాయతీగా ఎంపిక చేశారు. కొవ్వూరు- పోలవరం మీదుగా పట్టిసీమ రోడ్డు, సీతానగరం నుంచి సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ వరకు తీగ రోడ్డు, అలాగే అవెన్యూ ప్లాంటేషన్, బ్యూటిఫికేషన్... సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్‌నుంచి కొవ్వూరువరకు రోడ్లు అభివృద్ధిచేయనున్నారు. రాజమహేంద్రవరం- పోలవరం మధ్య జాతీయ రహదారి అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. పుష్కరాలు కాలుష్య రహితంగా చేసేందుకు 487 గ్రీన్ ఎనర్జీ బస్సులు వినియోగించనున్నారు. అలాగే 11 బస్‌స్టేషన్లను ఆధునీకరిస్తున్నారు. నదిలో భక్తుల భద్రతకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారు. 2,697 రెస్క్యూ బోట్లు సిద్ధం చేయడంతో పాటు, 8,955 శిక్షణ పొందిన ఈతగాళ్లను పుష్కరాల సమయంలో నియమించనున్నారు.

**అఖండ గోదావరికి పుష్కర ఏర్పాట్లు**

గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు, దేశ, విదేశాల నుంచి వచ్చే భక్తులు, పర్యాటకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రపంచస్థాయి మౌలిక వసతులు, రవాణా, పారిశుద్ధ్యం, తాగునీరు, వైద్య సేవలు, భద్రత, వసతి, సాంకేతిక పరిజ్ఞానంతో సమగ్ర ఏర్పాట్లను అద్భుతంగా చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టంచేశారు. గోదావరి జన్మస్థానం నుంచి సముద్ర సంగమం వరకు అనేక ఉప నదులు, వాగులు, ఏరులు కలుస్తున్నందున 'అఖండ గోదావరి' పేరుతో పుష్కరాలు నిర్వహించే అంశాన్ని పరిశీలించాలని సిఎం సూచించారు.

# శ్రీశైలంలో విషాదం

>> ఆత్మకూరు డి.ఎస్.పి రామాంజి నాయక్ సంఘటన స్థలానికి చేరుకొని తలుపులు తెరచి చూడగా బాత్రూమ్‌లో ముగ్గురు మహిళలు, మెయిన్ రూమ్‌లో ఫ్యాన్‌కు ఇద్దరు పురుషులు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. మృతులను సుధాకర్(36), గోగుల ఆదిలక్ష్మి 50), మల్లేశ్వరి(45), శ్రీదేవి(33), మణికంఠ(15)గా గుర్తించారు. ఆత్మహత్యకు ఆర్థిక ఇబ్బందులే కారణంగా పోలీసులు భావిస్తున్నారు. ముగ్గురు అక్కలలో ఇద్దరుఅక్కలకు పెళ్లిళ్లయిన భర్తలు వదిలేయడం, ఒక అక్కకు పెళ్లి చేయకపోవడం తీవ్ర అప్పులు కావడంతో ఓ అక్క కొడుకుతో సహా మొత్తం ఐదు మంది శ్రీశైలం వచ్చి ఆత్మహత్య చేసుకున్నట్లుగా పోలీసుల ద్వారా సమాచారం తెలుస్తుంది.విషయం తెలుసుకున్న శ్రీశైల దేవస్థానం చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు, ఇఒ ఎం.శ్రీనివాసరావు ఆత్మహత్య చేసుకున్న సత్రంలోని రూమును పరిశీలించారు. మృతుల వివరాలను డిఎస్పీ రామాంజి నాయక్‌తో అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ శ్రీశైలం క్షేత్రంలో ఒకే కుటుంబం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని, ఆర్థిక ఇబ్బందులు ఉన్న ప్రభుత్వం ద్వారా పరిష్కరించుకోవాలని అన్నారు.

## వారం - వర్జ్యం

26-08-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం, మఖకార్తె
తి.త్రయోదశి ఉ.7.58
న.శ్రవణ రా.12.46
వ.తె.5.00-ఉ.6.42
దు.ఉ.11.44-మ.12.34
రాహు మ.12.00-మ.1.30
శుభ ఉ.7.00-ఉ.8.00

## వార్తాఫలం

**మేషం :** క్రీడారంగంలోని వారికి అనుకూలంగా ఉంటుంది. ఆవేశాన్ని కలిగి ఉంటారు. కష్టాలు ఎప్పుడు వంటరిగా రావు.

**వృషభం :** ప్రభుత్వపరమైన పనులు సానుకూల పడతాయి. పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. ఇంటాబయట ప్రోత్సాహం.

**మిథునం :** ప్రయోజనాలను పరిరక్షించుకోవడానికి మీ ఆత్మసాక్షికి విరుద్ధంగా ఓ కార్యక్రమాన్ని చేపడతారు. ఆహ్వానాలు.

**కర్కాటకం :** ఖచ్చితమైన ప్రణాళికలను రూపొందించు కుంటారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారంచుడతారు. వస్తువులు కొనుగోలు.

**సింహం :** ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. సోదరుల ద్వారా విలువైన సమాచారం అందుకుంటారు.

**కన్య :** అనుకోని ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి. కొత్త వస్తువులు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు. బంధువుల సలహాలు తీసుకుంటారు.

**తుల :** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. కోపతాపాలకు దూరం వుండండి. వాహనాలు కొనుగోలు యత్నాలు.

**వృశ్చికం :** వృత్తి, వ్యాపారాలలో మార్పులు వుంటాయి. ఆర్థికపరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. వస్త్రా లాభం.

**ధనుస్సు :** మనోనిబ్బరంతో ముందడుగు వేసి ముఖ్యమైన వ్యవహారాలు పూర్తి చేస్తారు. కోపతాపాలకు దూరంగా వుండండి.

**మకరం :** వ్యాపారాలను ప్రారంభించడానికిగాను కావలసిన వనరులను సమకూర్చుకునే యత్నాలను ప్రారంభిస్తారు.

**కుంభం :** వృత్తి, వ్యాపారాలలో మార్పులు వుంటాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. నూతన వ్యక్తులతో పరిచయాలు.

**మీనం:** భాగస్వామ్య వ్యాపారాలలో అభివృద్ధిని సాధిస్తారు. జీవిత భాగస్వామి సహాయం సహకారాలను అందుకుంటారు. ధనలాభం.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# సంకల్పం నెరవేరింది!

>> 1996 మార్చి 5న వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశాను. మూడు దశాబ్దాల తర్వాత అదే ప్రాజెక్టును నా చేతుల మీదుగా ప్రారంభిస్తున్నాను. 10.7 టిఎంసిల నీటిని నల్లమల సాగర్‌కు రిలీజ్ చేయబోతున్నాం. ఈ చారిత్రక ఘట్టానికి ఈ నెల 31వ తేదీ మార్కాపురం జిల్లా వేదిక కాబోతోంది. ఫేజ్-1తో 1.19 లక్షల ఎకరాలకు, ఫేజ్-2తో 3.283 లక్షల ఎకరాలకు సాగునీరు. అలాగే లక్షలాది మందికి మంచి నీటితో తరతరాలుగా కరువుతో పోరాడిన ప్రజలకు ఉపశమనం కల్పించడమే మా లక్ష్యం" అని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. "వెలిగొండ జలవిజయంతో కరువు ప్రాంతంలో కృష్ణమ్మతో జలహారతి ఇస్తున్నాం. నెర్రలు బారిన నేలను కృష్ణా జలాలతో తడపబోతున్నాం. ఈ నెల 31వ తేదీ నుంచి మొదలయ్యే వెలిగొండ జలసిరులుతో ఈ ప్రాంత అభివృద్ధికి రెక్కలు తొడుగుతుంది. ఈ జలంతో జీవం జీవితం... సాగు-బాగు. పశ్చిమ ప్రకాశం ప్రజల ఎన్నో యేళ్ల కల అయిన మార్కాపురంజిల్లాను ఏర్పాటు చేసి ఆ ఆకాంక్షను నెరవేర్చాం. రాయలసీమ, ఉమ్మడి ప్రకాశం జిల్లాలను హార్టికల్చర్ హబ్‌గా చేసేందుకు రూ.లక్ష కోట్ల పెట్టుబడులతో త్వరలో పనులు ప్రారంభిస్తున్నాం. నేషనల్ హైవేలు, పోర్టులతో ఈ ప్రాంతానికి లాజిస్టిక్స్ లోటు లేకుండా చేస్తున్నాం. బెంగుళూరు- అమరావతి హైవే, రామాయపట్నం పోర్టులతో వాణిజ్య, పారిశ్రామిక అభివృద్ధికి కొత్త ద్వారాలు తెరుస్తున్నాం అన్నారు.

# 'సెర్ప్'కు అవార్డు

>> హించిన దేశవ్యాప్త పిఎం ఎఫ్ఎంఈ కాంక్లేవ్ నందు ఈ అవార్డును బహుకరించారు. ప్రైమ్ మినిస్టర్ ఫార్మలైజేషన్ మైక్రో ఎంటర్ప్రైజెస్ సీడ్ క్యాపిటల్ కాంపోనెంట్ కింద ఆమోదించబడిన పనితీరు ప్రమాణాల ఆధారంగా స్వయం సహాయక సంఘ మహిళలకు అందిస్తున్న సేవలు, నిధుల వినియోగం, యూనిట్ల అభివృద్ధి తదితర అంశాల్లో వివిధ రాష్ట్రాల గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థల పనితీరును కేంద్ర ఆహార శుద్ధి మంత్రిత్వ శాఖ మూల్యాంకనం చేసింది. ఈ మూల్యాంకనంలో సెర్ప్ ఎపి సమగ్ర పనితీరు ఆధారంగా ఉత్తమ పనితీరు కనబరిచిన విజేతల్లో ఒకటిగా ఎంపికైంది. ఈ సందర్భంగా కేంద్ర ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాస్వాన్ చేతుల మీదుగా ఆంధ్రప్రదేశ్ తరఫున జీవనోపాధుల విభాగపు డైరెక్టర్ డాక్టర్ శివ శంకర ప్రసాద్, అదనపు డైరెక్టర్ కె సరళ , కన్సల్టెంట్ రమ్య ఈ అవార్డును స్వీకరించారు.ఎస్ హెచ్ జి మహిళలకు సీడ్ కాపిటల్ ద్వారా, పీఎం ఎఫ్ఎంఈ పథకం ద్వారా సబ్సిడీతో కూడిన రుణాలను బ్యాంకుల ద్వారా అందించి, మహిళలను ఎంటర్ ప్రెన్యూర్స్ గా తీర్చిదిద్దడానికి సెర్ప్ చేసిన కృషిని ఈ సందర్భంగా పలువురు అభినందించారు. ఈ అవార్డు రాష్ట్రంలోని మహిళా ఎంటర్ ప్రెన్యూర్స్ ని మరింత ప్రోత్సాహన్ని అందించడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాల పెంపు, మహిళల ఆర్థిక సాధికారత మరియు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి దోహదపడుతుందని సెర్ప్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి కరుణ వాకాటి తెలిపారు.

# నాలెడ్జ్ హబ్‌గా అమరావతిని తీర్చిదిద్దుతాం

## ● డిసెంబర్ చివరికి క్వాంటం కంప్యూటింగ్ భవనం పూర్తి ● జనవరిలో క్వాంటం కంప్యూటింగ్ సేవలు ప్రారంభించే దిశగా చర్యలు ● మంత్రి పొంగూరు నారాయణ

**సచివాలయం, ఆగస్టు 25 ప్రభాతవార్త :** అమరావతి రాజధాని నాలెడ్జ్ హబ్‌గా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. హైదరాబాద్‌ను ఐటి హబ్‌గా అభివృద్ధి చేసిన తరహాలో అమరావతిని క్వాంటం కంప్యూటింగ్, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. అమరావతిలో నిర్మిస్తున్న క్వాంటం కంప్యూటింగ్ భవన నిర్మాణ పనులను మంత్రి నారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్వాంటం వ్యాలీ మిషన్‌లో భాగంగా సుమారు 45,216చ.అ. విస్తీర్ణంలో క్వాంటం కంప్యూటింగ్ భవనాన్ని నిర్మిస్తున్నట్లు మంత్రి తెలిపారు. క్వాంటం ల్యాబ్ కోసం ప్రత్యేకమైన నిర్మాణ సాంకేతికతను వినియోగిస్తున్నామని మంత్రి తెలిపారు. "రూమ్ వితిన్ రూమ్" కాన్సెప్ట్‌తో ల్యాబ్‌ను రూపొందిస్తున్నామని చెప్పారు. భూమి నుంచి వచ్చే సీస్మిక్ వైబ్రేషన్స్, పరిసర ప్రాంతాల నుండి వచ్చే ట్రాఫిక్ తదితర శబ్దాలు క్వాంటం కంప్యూటింగ్ పరికరాల పనితీరుపై ప్రభావం చూపకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం జర్మన్ టెక్నాలజీని వినియోగిస్తున్నట్లు వెల్లడించారు.



**క్వాంటం వ్యాలీలో రెండు భారీ టవర్లు:** క్వాంటం కంప్యూటింగ్ భవనం పక్కనే రెండు భారీ టవర్లు నిర్మించేందుకు ప్రభుత్వ ప్రణాళిక రూపొందించిందని మంత్రి తెలిపారు. ఒక్కో టవర్ 48అంతస్తులతో 202మీటర్ల ఎత్తు ఉండేలా డిజైన్ చేసినట్లు చెప్పారు. రెండు టవర్లకు కలిపి సుమారు 37లక్షల చ.అ.విస్తీర్ణం అందుబాటులోనికి రానుందని తెలిపారు. హైదరాబాద్ సైబర్ టవర్స్ తరహాలో కాకుండా, అంతకంటే మెరుగైన స్థాయిలో క్వాంటం వ్యాలీ టవర్లను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు లక్ష్యంగా పెట్టుకున్నారని మంత్రి నారాయణ తెలిపారు.

**డిసెంబర్ చివరి నాటికి పూర్తి:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన దిశానిర్దేశం మేరకు డిసెంబర్ చివరి నాటికి క్వాంటం కంప్యూటింగ్ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి తెలిపారు. సెప్టెంబర్ 15నాటికి ఎల్ అండ్ టి సంస్థ ఎంఇపి పనులు కోసం భవనాన్ని అప్పగించేలా చర్యలు తీసుకుంటునట్లు తెలిపారు. అమరావతిని నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దడంతోపాటు, క్వాంటం కంప్యూటింగ్ రంగంలో రాష్ట్రాన్ని దేశంలోనే ముందంజలో నిలపడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి నారాయణ స్పష్టంచేశారు. జనవరిలో క్వాంటం కంప్యూటింగ్ సేవలను అందుబాటులోనికి తీసుకురావడానికి అవసరమైన అన్ని చర్యలను వేగవంటం చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

# అద్భుత నగరంగా అమరావతిని నిర్మిద్దాం

## సెక్రటేరియేట్, అసెంబ్లీ, హైకోర్టు భవనాల ఇంటీరియర్ డిజైన్లపై నార్మన్ పోస్టర్స్ ప్రతినిధులతో సిఎం చంద్రబాబు సమీక్ష

**విజయవాడ, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రపంచంలో అత్యంత అద్భుత నగరంగా అమరావతిని నిర్మించాలన్నదే తమ ప్రభుత్వం లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పునరుద్ఘాటించారు. పర్యాటక ఆకర్షణీయంగా నగరం ఉండాలన్నారు. విస్తారమైన రోడ్లు, రవాణా వ్యవస్థలు అందుబాటులోకి తీసుకుని వస్తున్నామన్నారు. రాజధానిలో ప్రతి నిర్మాణం కళాత్మకంగా, సాంకేతికంగా అపూర్వంగా ఉండాలన్నారు. రాజధాని అమరావతిలో నిర్మిస్తున్న సెక్రటేరియేట్, అసెంబ్లీ, హైకోర్టు భవనాల ఇంటీరియర్ డిజైన్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించారు. ప్రముఖ ఆర్కిటెక్ట్ సంస్థ నార్మన్ ఫోస్టర్స్ ప్రతినిధుల బృందం ఇంటీరియర్ డిజైన్లను ప్రజెంట్ చేసింది. దీనిపై సీఎం చంద్రబాబు పలు సూచనలు చేశారు. అమరావతి అంటే ఇట్టే ప్రపంచమంతా గుర్తించాలన్నారు. విద్య, వైద్య రంగాల్లోను, సాంకేతికపరంగా నగరం ప్రత్యేకంగా ఉండాలన్నారు. ఈ నగరంలో నిర్మాణాల ఇంటీరియల్ డిజైనింగ్ విషయంలో అత్యంత నైపుణ్యత ఉండాలన్నారు. నగరంలో ఒక ప్రదేశం నుంచి మరో ప్రాంతానికి సునాయాసంగా వెళ్ళగలిగే దిశలో రవాణా వ్యవస్థ డిజైనింగ్ ఉండాలన్నారు. సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు భవనాలకు సంబంధించి ఇప్పటికే మనం అనుకున్న దిశలో నిర్మాణాలు ఉండాలన్నారు. ఏ విషయంలో రాజీలేకుండా రాజధానిని నిర్మిద్దామన్నారు. ఈ సమీక్షలో మంత్రి నారాయణ, పట్టణాభివృద్ధి శాఖ, సీఆర్డీఏలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




# రాజధానిలో ఏడుచోట్ల ఎనర్జీ స్టేషన్లు

## - టెండర్లను ఆహ్వానించిన సిఆర్‌డిఎ



**విజయవాడ, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతిలో విద్యుత్ వాహనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించిన ప్రభుత్వం ఏడుచోట్ల విద్యుత్ వాహన ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనుంది. దీనికోసం టెండర్లను ఆహ్వానించింది. స్టేషన్ల ఏర్పాటుకు 18.25 ఎకరాలను కేటాయించింది. అనంతవరంలో ఒకటి, కురగల్లులో మూడు, నేలపాడులో రెండు, వెలగపూడిలో ఒకటి ఏర్పాటు చేయనున్నారు. అమరావతి రోడ్డు నెట్‌వర్క్‌ని పౌర సౌకర్యాల ఏర్పాటులో భాగంగా సమీకృత, బహుళ ఉపయోగ 'ఎనర్జీ స్టేషన్లను అభివృద్ధి చేయాలని భావిస్తున్నట్లు టెండర్లలో పేర్కొంది. భవిష్యత్లో పెట్రోల్, డీజిల్, సిఎన్‌జి, ఎలక్ట్రిక్ వెహికల్ ఛార్జింగ్, రిటైల్, ఫుడ్ అండ్ బెవరేజ్, వెల్‌నెస్ వంటి సదుపాయాలూ కల్పించాలని అధికారులు నిర్ణయించారు.

సెక్రటేరియట్, లెజిస్లేచర్, జ్యుడీషియరీ అనుబంధ ప్రభుత్వ కార్యాలయాల వాహనాలకు 24 గంటలూ అందుబాటులో ఉండాలని పొందుపరిచారు. జాతీయ విద్యుత్ వాహన మొబిలిటీ ప్రాజెక్టులో భాగంగా ఏర్పాటు చేసే ఈ కేంద్రాలకు సంబంధించి అమరావతి ప్రయోగాత్మక కేంద్రంగా ఉండాలని నిర్ణయించినట్లు టెండర్లలో పేర్కొన్నారు. ముఖ్యమైన ఆర్టీరియల్ ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కారిడార్ల వెంట ప్రతిఒక్కరూ చేరుకునేలా వీటిని పెట్టాలని ప్రతిపాదించారు.

భవిష్యత్‌లో వచ్చే హైడ్రోజన్ వాహనాలకు ఇంధనం నింపే కేంద్రాలుగా మార్చేలా ఈ కేంద్రాలు మారుతాయని తెలిపారు. డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్ పద్ధతిలో 33యేళ్ల కాలం, అవసరమైతే మరో 33యేళ్లు కాలపరిమితిని పొడిగించనున్నట్లు టెండర్లలో పేర్కొన్నారు. ఒక కంపెనీకి మూడు స్టేషన్లు మాత్రమే ఇస్తామని తెలిపారు. వార్షిక లీజు అద్దె ఇంధన, ఇంధనేతర ఆదాయంపై నిర్దిష్ట శాతం కమీషన్ చెల్లించే ప్రాతిపదికన భూ భాగాలను కేటాయించనున్నట్లు వివరించారు.

**GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION**

T.N.No.02/2026-27/CE/SE(P)/EE(PD-I)/GVMC/ Dt: 25.08.2026

Number of Works : 01 (One), Value of Works (ECV) : Rs.116.35 Crores

Downloading starting Date : 27.08.2026 @ 5.00 PM

Downloading End Date : 16.09.2026 @ 3.00 PM

Last date for Submission of bid : 16.09.2026 @ 5.00 PM

Further Details at http://www.apeprocurement.gov.in

O/o the Executive Engineer (PD-I) Division : 9848308824 Sd/- Commissioner

# అక్రమ సంపాదనతో భారీగా ఆస్తుల కొనుగోలు

## కుటుంబసభ్యుల ఖాతాల్లో కోట్ల రూపాయలు జమ

## కారుమూరి రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలు

**హైదరాబాద్, ఆగస్టు 25 ప్రభాతవార్త:** వైసిపి హయాంలో వెలుగుచూసిన మద్యం రవాణా కుంభకోణం కేసులో నిందితుడుగా వున్న మాజీ మంత్రి, వైసిపి నేత కారుమూరి నాగేశ్వరరావు రిమాండు రిపోర్టులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారులు కీలక విషయాలు వెల్లడించారు. ఆదివారం హైదరాబాద్‌లో ఆయనను అరెస్టు చేయగా సోమవారం సాయంత్రం కోర్టులో హాజరు పరిచి రిమాండు నిమిత్తం చంచల్‌గూడ జైలుకు తరలించడం తెలిసిందే. ఈ గోల్‌మాల్ వ్యవహారంలో కారుమూరి పాత్రతోపాటు ఆయన కుటుంబసభ్యులు ఎంతమేర లబ్ధి పొందారనే వివరాలను ఇడి అధికారులు మంగళవారం నాంపల్లిలోని ఇడి కోర్టుకు రిమాండు రిపోర్టులో సమగ్రంగా వెల్లడించారు. ఈ స్కాంకు సంబంధించి ఎపి బెవరేజెస్ నాటి ఎండి వాసుదేవరెడ్డితో పాటు కీలక సూత్రధారిగా వ్యవహరించిన రాజ్ కసిరెడ్డిని, కారుమూరి నాగేశ్వరరావు తనయుడు సునీల్ రెడ్డిని ఇదివరకే అరెస్టు చేయగా తాజాగా నాగేశ్వరరావును అరెస్టు చేసినట్లు ఈడీ వెల్లడించింది. మద్యం రవాణా కుంభకోణంలో కారుమూరి నాగేశ్వరరావు ఒక ముఠాను ఏర్పాటుచేసి సర్కారు ఖజానాకు 195.33 కోట్ల రూపాయల మేరకు నష్టం కలిగించారని ఇడి పేర్కొంది. ఈ స్కాంలో కొల్లగొట్టిన డబ్బులో రూ.11.95 కోట్ల కారుమూరి ఖాతాలో వెళ్లిందని, దీంతో పాటు రూ18.09 కోట్ల మనీలాండరింగ్ జరిగిందని ఈడీ పేర్కొంది. కారుమూరి అప్పట్లో మంత్రిగా వుండడం, రాజకీయంగా బలంగా వుండడంతో అక్రమాలకు పాల్పడ్డాడని ఈడీ పేర్కొంది. తన ఖాతాలో వచ్చిన డబ్బులతో కారుమూరి పాత అప్పులను తీర్చడం, పెద్దఎత్తున స్థిరచరాస్తులను కొన్నట్లు ఈడీ తెలిపింది. తన పుట్టిన రోజు వేడుకలను ఈ డబ్బులతోనే ఘనంగా జరుపుకున్నాడని, ఖరీదైన వాచీలు కొనడంతో పాటు విమానాల్లో అనేక ప్రాంతాలకు పర్యటించినట్లు ఈడీ తెలిపింది. ఇక రాజ్ కసిరెడ్డి నెలకు రూ.50 నుంచి 60 లక్షల వరకు తీసుకునేవాడని ఈడీ వెల్లడించింది. మొదట అనుమాని తుడుగా కారుమూరి నాగేశ్వరరావుకు పది నోటీసులు ఇచ్చామని, అయితే ఆయన విచారణకు రాకుండా కేసు ముందుకు సాగకుండా, విచారణ జరగకుండా చూసేందుకు తన పలుకుబడిని వాడారని, తప్పించు కుతిరిగారని తెలిపింది. మద్యం అక్రమ రవాణాలో సంపాదించిన డబ్బులను తన కుటుంబ సభ్యుల ఖాతాల్లోకి మళ్లించడంలో కారుమూరి పాత్ర వుందని పేర్కొంది. మద్యం అక్రమ రవాణాలో పలువురికి కారుమూరి సబ్ కాంట్రాక్టులు ఇప్పించి అందులో 50శాతం వాటా పొందాడని, ఇలా సంపాదించిన డబ్బులను కారుమూరి కుమారుడు సునీల్ రెడ్డి, భార్య కీర్తి, మామ ప్రతాప్ రెడ్డి, తల్లి కారుమూరి లక్ష్మీ కిరణ్, సోదరి దీపికా, ఆమె మామ అచ్చప్ప రామూర్తిల బ్యాంకు ఖాతాలకు మళ్లించినట్లు ఈడీ తన రిమాండు రిపోర్టులో వెల్లడించింది. మద్యం రవాణాలో ఒక్కో మద్యం కేసుపై కిలోమీటర్‌కు రూ13ల చొప్పున దోచుకున్నారని, ఈడీ తెలిపింది.

Ref B1/155/2026 dt.14.08.2026

స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) వారి కార్యాలయం
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఫారం నెం: VI (ఎ)

(2013, భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో నిష్పాక్షిక నష్టపరిహారం పొందే హక్కు, పారదర్శకత చట్టం నందలి సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014 లో రూల్ (19) సబ్ రూల్ (1) ననుసరించి)

ప్రాధమిక ప్రకటన

ఈ దిగువ షెడ్యూల్ లో చూపబడిన ఏలూరు జిల్లా **వేలేరుపాడు** మండలం, **రాళ్ళపూడి గ్రామము** నందలి భూమి ప్రజాహిత కార్యాలకు అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు క్రింద **కూనవరం** మండలం, **పెద్ద ఆర్కూరు గ్రామం** లోని గిరిజన రైతుల నుండి సేకరించిన భూమికి బదులుగా భూమి , పునరావాస, పునస్థాపనల క్రింద, వారికి భూమిని కేటాయించు నిమిత్తము భూమి అవసరమైనట్లు ప్రాజెక్ట్ ఆఫీసర్, ఐ.టి.డి.ఎ, చింతూరు,మరియు ఆర్&ఆర్ అధికారి చింతూరు యూనిట్, చింతూరు, పోలవరం జిల్లా వారు భావించినందున 2013, భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో నిష్పాక్షిక నష్టపరిహారం పొందే హక్కు, పారదర్శకత చట్టం నందలి 11వ విభాగపు 1వ ఉప విభాగములోని నిబంధనలననుసరించి ఈ విషయం గురించి ఇందుకు సంబంధించిన యావన్మందికి తెలియజేయడం కొరకు ఇందు మూలముగా నోటీసు జారీచేయబడినది.

పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించి పర్యావరణ ప్రభావం మదింపు (ఇఐఏ) క్లియరెన్స్ భారత ప్రభుత్వం వారి అటవీ మరియు పర్యావరణ మంత్రిత్వ శాఖ వారి లేఖ నెం. జె12011/74/20051ఎ1, తేది.25.10.2005 ప్రకారం జారీ చేయబడినది.

చట్టంలోని విభాగం 43 (1) క్రింద ప్రభావిత కుటుంబాలకు పునరావాసం మరియు పునస్థాపన కొరకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ ది. 10.05.2020వ తేదీన జారీ చేసిన జి. ఓ.యం.యస్. నెం.42 ప్రకారం ప్రాజెక్టు నిర్వాహకులు నియమించబడినారు.

ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు చట్టంలోని విభాగము 12 క్రింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించేందుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, వి ఆర్ పురం యూనిట్1, చింతూరు వారికి, వారి సిబ్బందికి ఇందుమూలముగా అధికారము యిచ్చియున్నారు.

పై చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి, ఈ ప్రాధమిక ప్రకటన వెలువడిన తేదీ నుంచి ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం/ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, వి ఆర్ పురం యూనిట్1 , చింతూరు వారి ముందస్తు అనుమతి లేనిదే ఏ వ్యక్తి ఈ ప్రకటనలో తెలిపిన భూమిని ఏ విధమైన అమ్మకం/కొనుగోలు (క్రయ, విక్రయాలు) లేదా ఏ విధమైన లావాదేవీలు జరపరాదని తెలియజేయడమైనది.

పై చట్టంలోని సెక్షన్ 15 ననుసరించి భూసేకరణపై ఏమైనా అభ్యంతరములు /ఆక్షేపణలు ఉన్నయెడల సంబంధించిన వ్యక్తివ్యక్తులు ఈ ప్రకటనను ప్రచురించబడిన తేదీ నుండి 60(అరువది) దినములలోగా కలెక్టరు/ప్రత్యేక కలెక్టరు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారి ఎదుట అభ్యర్ధనలు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూలు

జిల్లా: ఏలూరు | మండలం: వేలేరుపాడు | గ్రామం : రాళ్ళపూడి

| క్రమ సంఖ్య | సర్వే నెంబరు | మొత్తము విస్తీర్ణం (య.గుంటలు) | భూసేకరణ క్రింది విస్తీర్ణం (య.గుంటలు) | విస్తీర్ణం (య. సెంట్లు) | భూమి తరగతి | సంబంధిత ఆసామి పేరు మరియు చిరునామా | సరిహద్దులు: తూర్పు | పడమర | ఉత్తరము | దక్షిణం | చెట్లు కట్టడములు ఇతరముల వివరములు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 |
| 1 | 1 | 5.12 | 5.12 | 5.300 | khalsa | చను పల్లి అప్పారావు తండ్రి నరసయ్య | 97 | 97 | 97 | 97 | |
| 2 | 2 | 2.00 | 2.00 | 2.000 | khalsa | సోయమ్మ రాజులు తండ్రి రాజులు | 77 | 73,72 | 74 | 71 | రాటి 2 |
| 5 | 8 | 2.38 | 2.38 | 2.950 | G.D | పుశి చిన్న భీమయ్య తండ్రి రామయ్య | 97 | 11 | 97 | 10&9 | రాటి 6 |
| 7 | 11 | 1.19 | 1.19 | 1.475 | G.D | తుర్రమ్ సంకురమ్మ భర్త ముర్యాలు | 8 | 12 | 97 | 10 | రాటి 4 |
| 10 | 14 | 1.06 | 1.06 | 1.150 | G.D | సోయం మహాలక్ష్మి భర్త బజారు | 13 | 15 | 13 | 15 | రాటి 10 |
| 11 | 17 /ఇ | 2.31 | 2.31 | 2.775 | G.D | అగరం రాముడు తండ్రి కన్నయ్య | 16 | 144 | 18&140 | 141&142 | |
| 12 | 19 | 1.37 | 1.37 | 1.925 | G.D | సోడి వెంకమ్మ తండ్రి గంగయ్య | 20 | 18 | 31 | 16 | రాటి 5 |
| 13 | 25 /2 | 1.11 | 1.11 | 1.275 | G.D | కుంజ లక్ష్మమ్మ భర్త కన్నయ్య | 97 | 28 | 26 | 24 | రాటి 4 |
| 14 | 25/ఇ | 1.11 | 1.11 | 1.275 | G.D | | 97 | 28 | 26 | 24 | రాటి 4 |
| 15 | 14 | 3.00 | 3.00 | 3.000 | G.D | కర్సం అమ్మయ్య తండ్రి వెంకయ్య | 25 | 29 | 27 | 21 | రాటి 3 |
| 16 | 42 | 1.05 | 1.05 | 1.125 | G.D | సోయమ్మ రాజులు తండ్రి రాజులు | 41 | 83 | 40 | 45 | |
| 17 | 51/అ | 1.09 | 1.09 | 1.225 | G.D | సోయం రాజులు తండ్రి ముర్యాలు | 25 | 29 | 27 | 21 | |
| 18 | 51/ఆ | 1.10 | 1.10 | 1.250 | G.D | తుర్రమ్ సంకురమ్మ తండ్రి ముర్యాలు | 18&140 | 52 | 50 | 139 | |
| 19 | 132/అ | 0.36 | 0.36 | 0.900 | G.D | తుర్రం మంగమ్మ తండ్రి మల్లయ్య | 127 | 133 | 131 | రామవరం 81 | రాటి 4 |
| 20 | 132/ఆ | 0.36 | 0.36 | 0.900 | G.D | తుర్రం నాగయ్య తండ్రి మల్లయ్య | 98 | 97 | 97 | 98 | రాటి 2 |
| 21 | 132/ఇ | 0.36 | 0.36 | 0.900 | G.D | తుర్రం మల్లయ్య తండ్రి బుచ్చయ్య | 98 | 97 | 97 | 98 | రాటి 4 |
| 22 | 135 | 2.07 | 2.07 | 2.175 | G.D | గొల్లమందల మరియమ్మ తండ్రి వెంకయ్య | 136 | 136 | 134 | 136 | రాటి 7 |
| 23 | 142/1 | 1.07 | 1.07 | 1.175 | G.D | పుశి కన్నమ్మ భర్త లచ్చయ్య | 144 | 141&17 | 17 | 143 | |
| TOTAL | | 32.31 | 32.31 | 32.775 | | | | | | | |

Place: వి.ఆర్.పురం యూనిట్ - 1
Date : 14-08-2026

కె.నాగమల్లేశ్వరరావు
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే)
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు,
వి.ఆర్.పురం యూనిట్ - 1, చింతూరు.

వి.అభిషేక్ ఐ.ఎ.ఎస్
స్పెషల్ కలెక్టర్ (భూ.సే) (ఎఫ్.ఎ.సి),
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు,
రాజమహేంద్రవరం

## గంజాయి పట్టివేత

**చీరాల, ఆగస్టు 25 ప్రభాతవార్త:** చీరాల రైలు మార్గంలో అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను చీరాల వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 11 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు మాదకద్రవ్యాల కట్టడికి చేపట్టిన ప్రత్యేక చర్యల్లో భాగంగా ఈ పట్టివేత జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం తమిళనాడు రాజధాని చెన్నైకి చెందిన బాల శ్యాంప్రసాద్(19), అరవిందన్ శంకర్(18) అనే ఇద్దరు యువకులు మరో వ్యక్తితో కలిసి పార్వతీపురంలో గంజాయి కొనుగోలు చేశారు. అనంతరం దానిని చెన్నైకి తరలించేందుకు రైలులో ప్రయాణిస్తుండగా, బాపట్ల- చీరాల మధ్య పోలీసులు రైలు తనిఖీలు చేపట్టడాన్ని గమనించారు. పట్టుబడతామనే భయంతో 24వ తేదీ రాత్రి చీరాల రైల్వేస్టేషన్‌లో దిగిపోయారు. నిందితుల కదలికలపై అందిన పక్కా సమాచారంతో, చీరాల ఎస్పీడీవో సూచనల మేరకు వన్‌టౌన్ ఎస్ఐ హారిక నేతృత్వంలోని పోలీసు బృందం పట్టణంలోని దండుబాట రోడ్డు టీ జంక్షన్ వద్ద నిఘా పెట్టింది. అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా, 11 కిలోల గంజాయి లభ్యమైంది. దీనిపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

**AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్)**

AU SMALL FINANCE BANK — A SCHEDULED COMMERCIAL BANK

నమోదిత కార్యాలయం: 19-ఎ, ధూలేశ్వర్ గార్డెన్, అజ్మీర్ రోడ్, జైపూర్-302001, రాజస్థాన్, (ఇండియా) (CIN:L36911RJ1996PLC011381)

**అనుబంధం-IV-A- (నియమం 8(6) నిబంధన చూడండి) స్థిర ఆస్తుల అమ్మకానికి విక్రయ ప్రకటన**

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002 యొక్క నిబంధన 8(6) ఏర్పాటుతో చదువబడే సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్తుల యొక్క అమ్మకానికి ఇ-వేలం విక్రయ ప్రకటన.

ఇందుమూలముగా సాధారణ ప్రజానీకానికి ప్రత్యేకంగా రుణగ్రహీత(లు)/సహ-రుణగ్రహీత(లు), తనఖాదారులు(లు) మరియు హామీదారులు(లు) (ఎవరైతే సెక్యూరిటీ క్రెడిటార్కు తనఖా ద్వారా ఆర్థిక రుణ సౌకర్యాన్ని పొందారో వారికి) **AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్)** యొక్క అధీకృత అధికారిచే నిర్మాణాత్మక/భౌతిక స్వాధీనం చేసుకొనబడిన వారికి ఈ ప్రకటన జారీ చేయబడుతోంది. ఇక నుండి ఆ పై అది AUSFBకి రిఫర్ చేయబడుతుంది. ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్షియల్ బ్యాంక్ లిమిటెడ్ ఏదైతే ఇప్పుడు 01వ ఏప్రిల్ 2024 నుండి **AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్** లోనికి మరియు విలీనమైందో దాని నుండి క్రింద వివరించబడిన స్థిరాస్తులు, స్వాధీనం చేసుకొన్న సెక్యూర్డ్ ఆస్తుల క్రింద పట్టికలో పేర్కొన్న మొత్తం రికవరీ నిమిత్తం 'ఏది ఎక్కడ' 'ఎలా ఉన్నవి అక్కడ అలా' 'ఏవి ఎలా ఉన్నవో' మరియు 'అక్కడ ఏదో అలాగే' ప్రాతిపదికన తదుపరి వచ్చే వడ్డీ, ధర, ఛార్జీలు మరియు ఖర్చులు AUSFBకి అనగా సెక్యూర్డ్ క్రెడిటార్కు బకాయి కారణంగా ఇవేలం ద్వారా విక్రయించబడతాయి.

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా వెబ్సైట్ **https://sarfaesi.auctiontiger.net** ద్వారా బహిరంగ ఇవేలం నిర్వర్తిస్తున్నారని మీకు తెలియజేస్తున్నాము.

| రుణ ఖాతా నం. రుణగ్రహీతలు, సహ-రుణగ్రహీతలు, తనఖాదారులు, హామీదారుడి పేరు | డిమాండ్ నోటీసు 13(2) యొక్క తేదీ & మొత్తం | స్వాధీనతా తేదీ | ఆస్తి కొరకు రిజర్వ్ ధర | ఆస్తి కొరకు బయానా | ఇ-వేలం తేదీ & సమయం | బిడ్ సమర్పణ తేదీ | టెండర్ దాఖలు యొక్క ఇ-వేలం ప్రదేశం | సంప్రదించు వ్యక్తి & ఆస్తి దర్శించుతేదీ |
|---|---|---|---|---|---|---|---|---|
| (Loan A/C No.) L22660000579761 పత్రి వెంకటేశ్వర్లు (రుణగ్రహీత) పత్రి రేవతి (సహ-రుణగ్రహీత) | 21-ఆగస్ట్-24 రూ.13,27,259/- రూ.పదమూడు లక్షల ఇరవై ఏడు వేల రెండు వందల యాభై తొమ్మిది మాత్రమే. 13-ఆగస్ట్-24 నాటికి | 11-మే -26 | రూ. 27,30,000/- రూ.ఇరవై ఏడు లక్షల ముప్పై వేలు మాత్రమే | రూ. 2,73,000/- రూ. రెండు లక్షల డెబ్బై మూడు వేలు మాత్రమే | 07-అక్టోబరు-26 మ.2.00గం. నుండి సా.4.00గం.కు 5 నిమిషాలు యొక్క అపరిమిత పొడిగింపుతో | 05-అక్టోబరు -26న లేదా ముందు | AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ బ్రాంచ్ చిరునామా : 1వ అంతస్తు, హరిహరనగర్ నం. 7, 1200/3 మంగమూరు రోడ్, వార్డు నం. 35 ఒంగోలు, ఆంధ్రప్రదేశ్ 523001 | పత్రి వెంకటేశ్వర్లు 9989156979 భాను ప్రతాప్ సింగ్, 9358002663, bhanu.singh3@aubank.in 30-సెప్టెంబరు-26 |
| తనఖా పెట్టిన ఆస్తి వివరణ: ప్రకాశం జిల్లా, ఒంగోలు సబ్‌రిజిస్ట్రార్ పరిధి, కొత్తపట్నం మండలం, రంగాయపాలెం గ్రామ పంచాయతీ, రంగాయపాలెం గ్రామం, సర్వే నం. 561/2, డోర్ నం. 1-146, అసెస్‌మెంట్ నం. 241. ఈ ఆస్తి పరిధిలో మొత్తం 3523.6 చదరపు అడుగులు లేదా 48 గదీల 67.6 చదరపు అడుగులు/391.5 చదరపు గజాలు/327.33 చదరపు మీటర్ల స్థలం మరియు దానిపై ఉన్న 319 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన RCC భవనం అన్ని అమరికలు మరియు అనుబంధ హక్కులతో సహా ఉన్నాయి. మొత్తం విస్తీర్ణం: 391 చదరపు గజాలు. | | | | | | | | |
| (Loan A/C No.) L23660002106836 & L22660001430344 కోకి సుబ్బారెడ్డి (రుణగ్రహీత) కోకి అరుణ (సహ-రుణగ్రహీత) | 15-మే-25 రూ.10,22,763/- రూ.పది లక్షల ఇరవై రెండు వేల ఏడువందల అరవై మూడు మాత్రమే. 15-మే-25 నాటికి | 16-జూన్ -26 | రూ. 13,20,000/- రూ.పదమూడు లక్షల ఇరవై వేలు మాత్రమే | రూ. 1,32,000/- రూ. ఒక లక్ష ముప్పై రెండు వేలు మాత్రమే | 07-అక్టోబరు-26 మ.2.00గం. నుండి సా.4.00గం.కు 5 నిమిషాలు యొక్క అపరిమిత పొడిగింపుతో | 05-అక్టోబరు -26న లేదా ముందు | AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ శాఖ చిరునామా : వార్డ్ నం.23, నం. 23/1/21/1/2 సంత బజార్ వీధి, ఉడ్‌నగర్ కాలనీ, చీరాల, ఆంధ్రప్రదేశ్ -523155 | పత్రి వెంకటేశ్వర్లు 9989156979 భాను ప్రతాప్ సింగ్, 9358002663, bhanu.singh3@aubank.in 30-సెప్టెంబరు-26 |
| తనఖా పెట్టిన ఆస్తి వివరణ: బాపట్ల జిల్లా, బాపట్ల ఆర్.డి. మరుప్రోలువారిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని మరుప్రోలువారిపాలెం గ్రామంలో గల డి. నంబర్ 264/1లో 0-07 1/2 సెంట్లు లేదా 350.9 చదరపు గజాల స్థలం, ఇందులో 300 చదరపు అడుగుల విస్తీర్ణంలో ACC ఇంటి నిర్మాణం పాత ఇంటి నంబర్ 10-108, ప్రస్తుత ఇంటి నంబర్ 2-116, అసెస్‌మెంట్ నంబర్ 316 మరియు దానికి సంబంధించిన అన్ని ఫిక్చర్లు అలాగే ఈజ్‌మెంట్ హక్కులు కలిగి ఉన్నాయి. మొత్తం విస్తీర్ణం: 350 చదరపు గజాలు. | | | | | | | | |
| (Loan A/C No.) L23660000268674 మార్నె ఆదిశేషురెడ్డి (రుణగ్రహీత) మార్నె వెంకటేశ్వరమ్మ (సహ-రుణగ్రహీత) | 28-ఫిబ్రవరి-25 రూ.7,64,239/- రూ.ఏడు లక్షల అరవై నాలుగు వేల రెండు వందల ముప్పై తొమ్మిది మాత్రమే. 24-ఫిబ్రవరి-25 నాటికి | 11-జూన్ -26 | రూ. 8,50,000/- రూ. ఎనిమిది లక్షల యాభై వేలు మాత్రమే | రూ. 85,000/- రూ. ఎనభై ఐదు వేలు మాత్రమే | 07-అక్టోబరు-26 మ.2.00గం. నుండి సా.4.00గం.కు 5 నిమిషాలు యొక్క అపరిమిత పొడిగింపుతో | 05-అక్టోబరు -26న లేదా ముందు | AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ శాఖ చిరునామా : వార్డ్ నం.23, నం. 23/1/21/1/2 సంత బజార్ వీధి, ఉడ్‌నగర్ కాలనీ, చీరాల, ఆంధ్రప్రదేశ్ -523155 | శైలా ప్రవీణ్ 8008801095 భాను ప్రతాప్ సింగ్, 9358002663, bhanu.singh3@aubank.in 30-సెప్టెంబరు-26 |
| తనఖా పెట్టిన ఆస్తి వివరణ: బాపట్ల జిల్లా, బాపట్ల SRO బాపట్ల ఆర్‌డి పరిధిలోని ఆడవి గ్రామ పంచాయతీ, కొత్త వాడరేవు గ్రామం ఆడవి గ్రామం, D.No 577/5 లోని మొత్తం 0-13 ఎకరాల స్థలంలో, 0-05 1/2 ఎకరాలు లేదా 266.2 చదరపు గజాలు విస్తీర్ణం గల స్థలం మరియు దానిపై ఉన్న RCC భవనం D.No 6-225, అసెస్‌మెంట్ నం. 1551. ఈ స్థలంలో 660 చదరపు అడుగుల విస్తీర్ణంలో RCC భవనం ఉంది; దీనితో పాటు అన్ని ఫిక్చర్లు మరియు ఈజ్‌మెంట్ హక్కులు అనుబంధ హక్కులు కూడా వర్తిస్తాయి. మొత్తం విస్తీర్ణం: 266 చదరపు గజాలు. | | | | | | | | |
| (Loan A/C No.) L23630000000430 ఒస్సూరి వీరన్న (రుణగ్రహీత) ఒ.మల్లీశ్వరి (సహ-రుణగ్రహీత) | 15-మే-24 రూ.10,85,572/- రూ. పది పది లక్షల ఎనభై ఐదు వేల ఐదు వందల డెబ్బై రెండు మాత్రమే. 02-మే-24 నాటికి | 01-జూన్ -26 | రూ. 19,30,000/- రూ. పంతొమ్మిది లక్షల ముప్పై వేలు మాత్రమే | రూ. 1,93,000/- రూ. ఒక లక్ష తొంభై మూడు వేలు మాత్రమే | 07-అక్టోబరు-26 మ.2.00గం. నుండి సా.4.00గం.కు 5 నిమిషాలు యొక్క అపరిమిత పొడిగింపుతో | 05-అక్టోబరు -26న లేదా ముందు | AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ శాఖ చిరునామా : వార్డ్ నం.4, 1వ అంతస్తు రాజ స్ట్రీట్, నందికొట్కూరు వగిద్యాల రోడ్, నందికొట్కూరు, ఆంధ్రప్రదేశ్ 518401 | తొగట విజయ్ 9182357270 భాను ప్రతాప్ సింగ్, 9358002663, bhanu.singh3@aubank.in 30-సెప్టెంబరు-26 |
| తనఖా పెట్టిన ఆస్తి వివరణ: సర్వే నంబర్ 476లో 242 చదరపు గజాల విస్తీర్ణం గల స్థలం మరియు ఇల్లు ఇంటి నంబర్ 2-102, అసెస్‌మెంట్ నంబర్ 361. ఇది నంద్యాల జిల్లా, నందికొట్కూరు సబ్-రిజిస్ట్రేషన్ జిల్లా పరిధిలోని వగిద్యాల గ్రామ పంచాయతీ గ్రామం మరియు మండలంలో ఉంది. విస్తీర్ణం: 242 చదరపు గజాలు; నిర్మాణ విస్తీర్ణం గ్రౌండ్ ఫ్లోర్: 1080 చదరపు అడుగులు. కొలతలు: తూర్పు పడమర: 25 అడుగులు, ఉత్తర దక్షిణం : 41.5 అడుగులు. మొత్తం విస్తీర్ణం: 242 చదరపు గజాలు. | | | | | | | | |
| (Loan A/C No.) L22660000765331 సర్వేపల్లి వెంకయ్య (రుణగ్రహీత) సర్వేపల్లి మునలమ్మ (సహ-రుణగ్రహీత) | 18-జూలై-24 రూ.5,46,448/- రూ.ఐదు లక్షల నలభై ఆరు వేల నాలుగు వందల నలభై ఎనిమిది మాత్రమే. 17-జూలై-24 నాటికి | 23-జూన్ -26 | రూ. 9,10,000/- రూ. తొమ్మిది లక్షల పది వేలు మాత్రమే | రూ. 91,000/- రూ. తొంభై ఒక్క వేలు మాత్రమే | 07-అక్టోబరు-26 మ.2.00గం. నుండి సా.4.00గం.కు 5 నిమిషాలు యొక్క అపరిమిత పొడిగింపుతో | 05-అక్టోబరు -26న లేదా ముందు | AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ బ్రాంచ్ చిరునామా : 1వ అంతస్తు, హరిహరనగర్ నం. 7, 1200/3 మంగమూరు రోడ్, వార్డు నం. 35 ఒంగోలు, ఆంధ్రప్రదేశ్ 523001 | పత్రి వెంకటేశ్వర్లు 9989156979 భాను ప్రతాప్ సింగ్, 9358002663, bhanu.singh3@aubank.in 30-సెప్టెంబరు-26 |
| తనఖా పెట్టిన ఆస్తి వివరణ: ప్రకాశం జిల్లా-ఒంగోలు సబ్‌డివిజన్ - కొత్తపట్నం మండలం - పదర్తి గ్రామం, పంచాయతీ పరిధి - సర్వే నంబర్ 500: అన్ని రాకపోకలు మరియు అనుబంధ హక్కులతో కూడిన 1904 చదరపు అడుగులు లేదా 26.32 గదీలు/211.59 చదరపు గజాలు/176.860 చదరపు మీటర్ల విస్తీర్ణం కలిగిన స్థలం. కొలత: 211.55 చదరపు గజాలు. | | | | | | | | |

**ఇ-వేలం అమ్మకం నిబంధనలు మరియు షరతులు:**

1). సెక్యూర్డ్ ఆస్తి యొక్క ఇ-వేలం అమ్మకం "ఎక్కడ ఉన్నది ఉన్నట్లుగానే", "ఏది ఉందో అలాగే", "ఏది ఉందో అలాగే" మరియు "అక్కడ ఏది" ఆధారంగా సెక్యూర్డ్ క్రెడిటర్ అంటే AUSFB తరపున జరుగుతుంది మరియు పేర్కొన్న ఆస్తిపై ఎటువంటి తెలిసిన చిక్కులు లేవు.

2). ఆన్లైన్ ఇవేలం అమ్మకంలో పాల్గొనడానికి, బిడ్ డాక్యుమెంట్, పాన్ కార్డ్ కాపీలు, కంపెనీ విషయంలో బోర్డు రిజల్యూషన్ మరియు ఫోటో ఐడి, చిరునామా రుజువును బయానాతో పాటు సమర్పించాలి, దీనిని MSME AUCTION POOL ACCOUNT OF AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్, కరెంట్ ఖాతా నం. 1921201121711599 AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ ఐదవ మరియు ఆరవ అంతస్తు సన్నీ బిగ్ జంక్షన్ STC ఖస్రా నం. 64 నుండి 67, గ్రామ్ సుఖైపురా న్యూ ఆతిష్ మార్కెట్ జైపూర్ 302020. IFSC కోడ్: AUBL0002011, ఆన్లైన్ బిడ్ సమర్పించిన తర్వాత, దానిని ఉపసంహరించుకోలేరు. ఇంకా బిడ్డర్ సమర్పించిన ఏదైనా EMD రద్దు చేయబడిన చెక్కు కాపీతో RTGS/NEFT యొక్క UTR/రిఫరెన్స్ నంబర్ను ఈ క్రింది ఇమెయిల్ IDకు అంటే auction aubank.inకు పంపాలి.

3) ఆసక్తిగల పాల్గొనేవారు/బిడ్డర్లు అందరూ మరిన్ని వివరాల కోసం https://sarfaesi.auctiontiger.net & https://www.aubank.in/bank-auction వెబ్‌సైట్‌ను సందర్శించాలని అభ్యర్థించారు. ఇ-వేలం అమ్మకాల ప్రక్రియలో పాల్గొనడానికి నిబంధనలు & షరతులు మరియు auctions aubank.in ఇమెయిల్ ద్వారా కూడా సంప్రదించవచ్చు.

దయచేసి గమనించండి: పైన పేర్కొన్న తేదీన టెండర్/ఇంటర్ సే బిడ్డింగ్ ద్వారా అమ్మకం గురించి పైన పేర్కొన్న రుణ ఖాతా యొక్క రుణగ్రహీతలు/సహ రుణగ్రహీతలు/ తనఖాదారులకు నియమం 8(6)తో కలిపి చదవబడిన నియమం 9(1) కింద ఇది 30 రోజుల నోటీసు కూడా. ఇచ్చిన నోటీసు వ్యవధిలో రుణగ్రహీత వారి బకాయిలను పూర్తిగా తిరిగి చెల్లించకపోతే ఆస్తి అమ్మబడుతుంది.

తేది: 25/08/2026 ప్రదేశం : ఆంధ్రప్రదేశ్ అధీకృత అధికారి, AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్.

26-8pg4:26-8pg4.qxd 25/Aug/26 10:26 PM Page 1



వార్త

మితభాషి ఎక్కువగా వినగలుగుతాడు కనుక అతనే అధికంగా నేర్చుకుంటాడు.

న- లాబ్ సాంగ్‌రపా

# ఉల్లికి పాట్లు!

ఈ భూప్రపంచం మీద 'వాన రాకడ ప్రాణంపోకడ' గురించి చెప్పగలిగే ఆధునిక శాస్త్ర పరిజ్ఞానం పెరుగుతూనే ఉంది. కానీ మార్కెట్లోకి 'ఉల్లి రాకడ ధరల పోకడల' గురించి చెప్పే ఏ శాస్త్రము అందుబాటులో లేదు. ప్రకృతి వైపరీత్యాల నేపథ్యంలో వ్యవసాయ శాస్త్రజ్ఞుల అంచనాలు కూడా తారుమారవుతున్నాయి. ఆధునిక పరిజ్ఞానం ఉపయోగపడక ఉల్లిధరల విషయంలో ఎప్పుడూ ఒక అడుగు వెనకాలకే ఉంది. ఒక సీజన్లో ఉల్లిధర పెరిగితే, మరో సీజన్లో ఉల్లి ధర తగ్గుతుంది. ఈ రెండింటి మధ్య సమతుల్యం చేసుకోలేక ఉల్లి రైతు సతమతమవుతున్నాడు. ఉల్లి సాగుకు దూరమౌతున్నాడు. నిన్నమొన్నటి వరకు రైతుకు గిట్టుబాటుధర లేకమార్కెట్ యార్డుల్లోనే ఉల్లిని వదిలేసే పరిస్థితి ఉండగా, నేడు అదే ఉల్లి వినియోగదారుడి జేబుకు చిల్లుపెడుతోంది. ఉల్లి ధర మళ్లీ సామాన్యుడి వంటింట్లో మంటలు రేపుతోంది. లోపభూయిష్టమైన వ్యవసాయ మార్కెట్ వ్యవస్థ తెచ్చిపెట్టే అనర్థమిది. ప్రస్తుతం దేశంలోని ప్రధాన ఉల్లి మార్కెట్లలో సరఫరా తగ్గడం, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, రవాణా సమస్యలు వంటి కారణాలు ధరల పెరుగుదలకు దారితీస్తున్నాయి. పంటసాగు విస్తీర్ణం తగ్గడం, రుతుపవనాలు ఆలస్యం కావడం వంటివి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపాయి. దేశంలోనే అతిపెద్ద ఉల్లి ఉత్పత్తిదారు మహారాష్ట్రలో ఈసారి ఖరీఫ్ పంట దిగుబడి 5 నుంచి 7శాతం వరకు తగ్గడమే ఈధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఒక సీజన్‌లో ధరలు పడిపోతే రైతు నష్టపోతాడు. మరుసటి సీజన్‌లో రైతులు సాగు తగ్గిస్తే తగిన దిగుబడి లేకధరలు పెరుగుతాయి. ప్రధానంగాటమోటా, ఉల్లి విషయంలో ఏటా ధరల చక్రం ఇదేమాదిరి పునరావృతమవుతున్నా, శాశ్వత పరిష్కార మార్గం దొరకడం లేదు. ఉల్లి సంక్షోభం కేవలం ధరల సమస్య కాదు. ఇది వ్యవసాయ విధానాల వైఫల్యానికి అద్దం. దేశవ్యాప్తంగా ఉల్లి ధరలు అమాంతం పెరిగిపోయి సామాన్యుడికి చుక్కలు చూపిస్తుండటంతో, వాటిని అదుపులోకి తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం బఫర్ స్టాక్‌లోని ఉల్లిని మార్కెట్‌కు తరలించేందుకు 'కందా ఎక్స్‌ప్రెస్'ను ప్రారంభించింది. ఇందులో భాగంగా, ఉల్లి బఫర్ నిల్వలను నాసిక్ నుంచి ఢిల్లీ, చెన్నై, కొచ్చి, గువాహటి వంటి నగరాలకు తరలించి సరఫరాను పెంచి ఆయా ప్రాంతాల్లో ధరలను అదుపు చేసే చర్యలు చేపట్టింది. ఇటువంటి అత్యవసర చర్యలు తాత్కాలికంగా మాత్రమే ధరలను నియంత్రిస్తాయి. కానీ ప్రతిసారీ సంక్షోభం వచ్చినప్పుడు బఫర్ స్టాక్ విడుదల చేయడం కంటే, ఉల్లి ఉత్పత్తి, నిల్వ, రవాణా, మార్కెటింగ్ వ్యవస్థను సమగ్రంగా బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లోనూ పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. రాయలసీమలో వర్షాభావ పరిస్థితులతో ఉల్లిసాగు గణనీయంగా తగ్గింది. ఉల్లి ధరలు జూన్‌లో కిలోకు సుమారు రూ.25 నుంచి ఆగస్టులోరూ.60 వరకు పెరిగినట్లు తాజా నివేదికలు చెబుతున్నాయి. ఏప్రిల్‌లోనేఆంధ్రప్రదేశ్‌లో గిట్టుబాటు ధర లేక కొందరు రైతులు ఉల్లిబస్తాలను మార్కెట్ యార్డుల్లో వదిలేసిన ఘటనలు నమోదయ్యాయి. రైతు ఉత్పత్తి చేసినప్పుడు ధర లేదు. కొరత ఏర్పడినప్పుడు కూడా వినియోగదారుడికి గిట్టుబాటు ధర దక్కడం కష్టం. రైతుకు కనీస గిట్టుబాటు ధర, శాస్త్రీయ నిల్వ సదుపాయాలు, సమయానుకూల ప్రభుత్వ కొనుగోళ్లు అవసరం. వినియోగదారుడికి మాత్రం స్థిరమైన సరఫరా, పారదర్శక మార్కెట్ ధరలుకావాలి. రైతు వినియోగదారుల మధ్య ఉన్న మార్కెట్ గొలుసులో అనవసరమైన మధ్యవర్తిత్వం, నిల్వదారుల దోపిడీ, కృత్రిమకొరతకు అవకాశం లేకుండా పర్యవేక్షణ పెరగాలి. సాగు ఉత్పత్తులు పెంచడమే కాదు, ధరల స్థిరత్వం కూడా ప్రభుత్వ బాధ్యతే. ధరల అస్థిరతకు శాశ్వత పరిష్కారం కావాలి. ఒక సమతుల్య మార్కెట్ వ్యవస్థను నిర్మించాలి. రైతుకు న్యాయమైన ధర, వినియోగదారుడికి అందుబాటు ధర ఈ రెండింటినీ సాధించగలిగినప్పుడే వ్యవసాయమార్కెట్ విజయవంత మైనట్లవుతుంది. శనివారం నాటికి దేశంలో ఉల్లి సగటు రిటైల్ ధర కిలోకు రూ.42కి చేరింది. గతేడాదితో పోలిస్తే ఇది దాదాపు 45 శాతం, గత నెలతో పోలిస్తే 19 శాతం అధికం. ముఖ్యంగా ఢిల్లీలో కిలోఉల్లి ధర రూ. 65కి చేరగా (గతేడాది ఇదే సమయానికి రూ. 35), చెన్నైలో రూ. 58కి (గతేడాది రూ. 33) విక్రయిస్తున్నారు. కేరళ, అసోం రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో కూడా ధరలు గణనీయంగా పెరిగాయి. అధిక ధరలున్న మార్కెట్లలో సరఫరా పెంచి, ధరలు మరింతపెరగకుండా నిరోధించడమే తమ లక్ష్యమని వినియోగదారుల వ్యవహారాల శాఖ కార్యదర్శి నిధిఖరే ధృవీకరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్ సంస్థలు సుమారు 1.2 లక్షల టన్నుల ఉల్లిని సేకరించాయని, ప్రభుత్వంతో పాటు రైతులవద్ద కూడా తగినన్ని నిల్వలు అందుబాటులో ఉన్నట్లు అధికారులు చెప్పేవివరణ. 'ధరలస్థిరీకరణ నిధి' కింద ప్రభుత్వం ఇలాంటి చర్యలు చేపట్టడంకొత్తేమీ కాదు. ఒక పక్క పశ్చిమాసియా యుద్ధ వాతావరణ నేపథ్యం దాదాపు అన్ని నిత్యావసర వస్తువులు, చమురు ధరలనేకాకుండా, తాజాగా చక్కెర ధరలను అందనంత ఎత్తుకు తీసుకుపోయింది. మహారాష్ట్రలో నిల్వ ఉందంటున్న ఉల్లిలో 50-70శాతం దెబ్బతినడం కూడా ఉల్లి సరఫరాకు ఆటంకంగా ఉందని భోగట్టా. రాష్ట్రాల వ్యాపారులపై కేంద్రం స్టాక్ లిమిట్ నిర్దేశించడం, ఎగుమతులపై ఆంక్షలు, 40శాతం ఎగుమతి సుంకం విధించడం మంచిదేమో ఆలోచించాలి. అప్పుడే ఉల్లిధరల ఘాటు శాంతిస్తుంది. గతంలో 2024 అక్టోబర్‌లోనూ ఉల్లిధరల నియంత్రణకు ఇలాంటి ప్రత్యేక రైళ్లనే వినియోగించారు. ఏదైనా



మనలోని ప్రతిభను గుర్తించి దానిని వెలికితీసి రాణింపునకు తీసుకురావడానికి ప్రయత్నించేవారే మంచి మిత్రులు.

హెన్రీఫోర్డ్



ఈశతాబ్దాన్ని తప్ప మిగతా అన్నింటినీ, ఈ దేశాన్ని తప్ప మిగిలిన అన్ని దేశాలను ఉత్సాహంగా కీర్తించేవాడు మూర్ఖుడు.

సర్ విలియం గిల్బర్ట్

# ప్రజావాక్కు



## రైతుది కష్టం, దళారిది లాభం

దేశానికి వెన్నెముక రైతని అందరూ ఒప్పుకున్న విషయమే. ఇటీవల ఏలూరు జిల్లా ముసునూరు మండలం కాట్రేనిపాడులో గౌర్మెట్ పాప్ కార్న్‌కా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఉత్పత్తి చేసిన నూతన పాప్ కార్న్‌కా వంగడాన్ని ఆవిష్కరించిన సమయంలో ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్ గుర్తు చేసారు. కాని మన దేశంలో ప్రతి రోజు అన్నంపెట్టే రైతు పడేకష్టాలు వర్ణనాతీతం. ప్రకృతి వైపరీత్యాల వలన సరైన సమయంలో వర్షాలు పడకపోవడం, కరవురావడంలేదా అకాలవర్షాలు, తుఫాన్ల వల్ల చేతికొచ్చిన పంట నీట మునగడం. భారీ పెట్టుబడులు పెట్టుట వలన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు, ట్రాక్టర్ వగైరా పనులకు, కోతలు, రవాణా కోసంవేల రూపాయలు ఖర్చు అవుతుంది. గిట్టు బాటు ధరలేకపోవడం వలన కష్టపడిపండించిన పంటను మార్కెట్‌కు తీసుకెళ్తే సరైన మద్దతు ధర లభించక రైతులు నష్టపోతున్నారు. కావున రైతులకు ప్రోత్సాహాలు పెంచి ఆదుకోగలగాలి.

- డా.దన్నాన అప్పలనాయుడు,విజయనగరం

## గిరిజన కోఆర్డినేటర్లను నియమించాలి

తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమలు అయ్యే సంక్షేమ పథకాల గురించి గిరిజనులకు అవగాహన చైతన్య కార్యక్రమాలను నిర్వహించే గిరిజన కో ఆర్డినేటర్ అవసరం. గిరిజనసంక్షేమ శాఖలో, గురుకులాలలో పనిచేస్తున్న లెక్చరర్స్, టీచర్స్‌ను ఎంపిక చేసి వారికి టిఎ డిఎ ఇచ్చివాహన సౌకర్యం కల్పించి ప్రతినెల ప్రతి మండలంలో అవగాహన చైతన్య కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి. గిరిజన తండాలకు వాహన సౌకర్యం, రోడ్లు, మంచినీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం, విద్య, వైద్య సౌకర్యం, వంటి అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడానికి ఈ ప్రోగ్రాం అవసరం.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్

## పేదింటి కల నెరవేరిన వేళ

సమాజంలో మధ్యతరగతి, బడుగు బలహీన వర్గాల కుటుంబాలు చిన్నప్పటినుండి అష్టకష్టాలు పడుతూ ఉన్నదో లేనిదోతింటూ సంవత్సరాల తరబడిరెక్కలు ముక్కలు జేసుకుని ఇల్లు నిర్మించినప్పుడు గాని ఏవైనా కార్యక్రమాలు చేసినప్పుడు ఆ కుటుంబంలోని ఆనందం మాటల్లో వర్ణించలేనిది. కావున ప్రభుత్వ పథకాల్లో నిరుపేదలకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

## దేశ భవిష్యత్తును నిర్ణయించేది యువతే

యువత, విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, తీవ్రవాద నిర్మూలన వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వడం స్వాగతించదగినదే. దేశ భవిష్యత్తును నిర్ణయించే యువత గురించి మాట్లాడటం అవసరం. అయితే ప్రసంగాల్లో వినిపించే హామీలు యువత జీవితాల్లో మార్పుగా కనిపించినప్పుడే వాటికి నిజమైన విలువ ఉంటుంది. నేటి యువతకు ఆకర్షణీయమైన ప్రకటనల కంటే స్పష్టమైన లక్ష్యాలు, నిర్ణీత గడువులు, కనిపించే ఫలితాలు అవసరం. ప్రభుత్వం ప్రకటించే ప్రతి ప్రధాన కార్యక్రమానికి ఎంతమందికి ప్రయోజనం కల్పించాలి, ఎప్పటిలోగా లక్ష్యాన్ని చేరుకోవాలి, అమలుకు బాధ్యత వహించే శాఖ ఏది, ఇప్పటివరకు ఎంత పురోగతి సాధించామన్న వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలి. నిర్దిష్ట కాల వ్యవధుల్లో పురోగతిని బహిరంగంగా సమీక్షిస్తే పాలనా వ్యవస్థలో జవాబు దారీతనం పెరుగుతుంది. పార్లమెంట్‌తో పాటు ప్రజలు కూడా హామీల అమలును అంచనా వేసే అవకాశం ఉంటుంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## కల్కి స్వపక్షమా, ప్రతిపక్షమా?

భూమన్ కరుణాకరరెడ్డి ఆక్రమణలను స్వాధీనం చేసుకున్నారు సంతోషం. అదే జిల్లాలో కల్కి అనే దొంగస్వామి ఆక్రమించినఅంజూర్ అటవీ భూములను ఎపుడు స్వాధీనం చేసుకుంటారు? ఆ పక్కనే వరదయ్య పాలెం మండలంలో కల్కి ఆక్రమించిన దళితుల భూములను దళితులకు ఎపుడు స్వాధీనం చేస్తారు కరుణాకరరెడ్డి ప్రతిపక్షం, కల్కి మీ పక్షమా? 20 సంవత్సరాలనుండి తిరుపతి జిల్లాలో కల్కి ట్రస్టు వారు బీఎన్ కండ్రిక మండలం కల్లివెట్టు గ్రామ పరిధిలోని 295 సర్వే నంబర్‌లో అంజూర్ అటవీ భూమిని అక్రమించి విదేశీయులనురప్పించి, అటవీ నిబంధనలకువ్యతిరేకంగా, వాళ్లను రాత్రులు అక్కడే వసతి కల్పించి, భజనలు యాగాలు చేస్తున్నారు. ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. కనుక తిరుపతి జిల్లాలో కల్కి అక్రమాలపై నిగ్గు తేల్చాలి

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

## విద్యార్థుల సంఖ్య పెరిగేదెలా?

దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య తగ్గుతుంది. దేశవ్యాప్తంగా ఎక్కువ ప్రాంతాల్లో తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రైవేటు విద్యా సంస్థల్లో చేర్పించేందుకే మొగ్గు చూపుతున్నట్లు కేంద్ర విద్యా శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. దీనికిగల కారణాలను లోతుగా అధ్యయనం చేసి, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# రిజర్వేషన్లు తొలగిస్తే సమానత్వం వచ్చేస్తుందా?

*సామాజిక న్యాయం అంటే ఒకరిని తగ్గించడంకాదు, వెనుకబడిన వారిని పైకి తీసుకురావడం. అసలు ప్రశ్న ఉద్యోగాల సంఖ్యతోనే ముగియదు. ఎవరు విశ్వవిద్యాలయాల్లో ఉన్నారు? ఎవరు పరిశోధన చేస్తున్నారు? ఎవరు పరిపాలనలో నిర్ణయాలు తీసుకుంటున్నారు? ఎవరు విధానాలు రూపొందిస్తున్నారు? ఎవరి స్వరం మీడియా, న్యాయవ్యవస్థ, కార్పొరేట్ సంస్థలు, విద్యా సంస్థల్లో బలంగా వినిపిస్తోంది? ఇవన్నీ ప్రాతినిధ్యానికి సంబంధించినప్రశ్నలే. అందుకే దేశం ఇప్పుడు రిజర్వేషన్‌పై కేవలం ఉంచాలా? తొలగించాలా?"అనే ద్వంద్వ ప్రశ్నలో చిక్కుకోకూడదు. ఎవరికి ఇంకా అవకాశం లేదు? ఎవరి ప్రాతినిధ్యం ఇంకా తక్కు? ఎవరి స్వరం నిర్ణయ వ్యవస్థకు చేరడం లేదు? అన్నప్రశ్నలకు సమాధానం వెతకాలి. రిజర్వేషన్లను మెరుగుపరచాలి. అవసరమైన చోట సంస్కరించాలి. నిజంగా వెనుకబడినవారికి చేరేలా చేయాలి. కానీ సామాజిక అసమానత తొలగిపోయిందనే సాక్ష్యం లేకుండానే రిజర్వేషన్ తొలగించాలని చెప్పడం సామాజిక అసమానతల చరిత్రకు అకాల ముగింపు పలకడమే అవుతుంది.*

దుంద్రా కుమారస్వామి

జంతర్ మంతర్‌లో 'రిజర్వేషన్ హటావో' నినాదం వినిపించింది. కుల ఆధారిత రిజర్వేషన్లు వద్దని, ఆర్థిక వెనుకబాటుతనమే ప్రాతిపదిక కావాలని డిమాండ్లు వచ్చాయి. 'ప్రతిభకు ప్రాధాన్యం ఇవ్వాలి' అన్న మాటకు సహజంగానే ఆకర్షణ ఉంటుంది. పేదరికంలో ఉన్న ప్రతి యువకుడికీ అవకాశం రావాలన్న ఆకాంక్ష కూడా న్యాయమైనదే. కానీ దేశం ఇప్పుడు అడగాల్సిన అసలు ప్రశ్నవేరొకటి. రిజర్వేషన్లు తొలగిస్తే సమానత్వం నిజంగానే వచ్చేస్తుందా? లేక సామాజిక అసమానతను కనిపించకుండా చేయడమే జరుగుతుందా? రిజర్వేషన్‌ను కేవలం ఉద్యోగంలో ఒకసీటు, విద్యలో ఒక సీటుగా చూడటం దాని అసలు ఉద్దేశాన్నిచిన్నదిగా చేయడమే. భారత రాజ్యాంగం రూపుదిద్దుకున్న సమాజం శతాబ్దాలుగా సమాన అవకాశాలతో నడిచిన సమాజం కాదు. కులం ఆధారంగా వృత్తి, విద్య, సామాజిక గౌరవం, నివాసం, అధికారానికి ప్రవేశం నిర్ణయించబడిన చరిత్రమన ముందు ఉంది. అందుకే రాజ్యాంగ నిర్మాతలు సమానత్వాన్ని ప్రకటించడంతో ఆగలేదు. సమాన అవకాశాలు అందని వర్గాలకు ప్రత్యేక అవకాశాలకుకూడా మార్గం సుగమం చేశారు. ఇక్కడే ఆర్థిక వెనుకబాటుతనం, సామాజిక వెనుకబాటుతనం మధ్య తేడాను గుర్తించాలి. ఒక పేద కుటుంబానికి చెందిన యువకుడు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటాడు. అది నిజమే. అతనికి విద్య, స్కాలర్‌షిప్, కోచింగ్, ఉపాధి, ఆర్థిక సహాయం అందాలి. కానీ ఆర్థిక పరిస్థితి మెరుగుపడితేఆర్థిక సమస్య తగ్గవచ్చు. సామాజిక వివక్ష మాత్రం కేవలం ఆదాయం పెరిగిందని తొలగిపోదు. ఒక వ్యక్తి ఆదాయం పెరిగినా, అతని సామాజిక గుర్తింపు, కులపరమైన అనుభవం, సంస్థల్లో ప్రాతినిధ్యం వంటి ప్రశ్నలు అలాగే ఉండవచ్చు. అందుకే 'పేదలందరికీ ఒకే రిజర్వేషన్' అనే వాదన వినడానికి సమానత్వంలా కనిపించినా, అది సామాజిక వెనుకబాటుతనాన్ని పూర్తిగా అంచనా వేయగలదా అన్నది పరిశీలించాలి. పేదరికం జేబును ప్రభావితం చేస్తుంది. సామాజిక వివక్ష మనిషి అవకాశాలను, గౌరవాన్ని, సంబంధాలనుప్రభావితం చేస్తుంది. రెండింటికీ పరిష్కారాలు అవసరం. కానీ రెండింటినీ ఒకే కొలమానంతో కొలవడం సరైన విధానం కాదు. సుప్రీంకోర్టు కూడా రిజర్వేషన్‌ను సమానత్వానికి వ్యతిరేకమైన మినహాయింపుగా మాత్రమే చూడలేదు. 2024లో రాజ్యాంగంలోని ఆర్టికల్ 16(4) ఉద్దేశాన్ని విశ్లేషిస్తూ, చారిత్రకంగా కొద్దిమంది సమూహాల ఆధిపత్యంలో ఉన్న పరిపాలనా వ్యవస్థలో వెనుకబడిన వర్గాలకు ప్రాపర్ లుక్ ఇన్ కల్పించడం, వారికి పరిపాలనలో, పాలనలో వాటా కల్పించడం రిజర్వేషన్ లక్ష్యమని న్యాయపరమైన చర్చనునమోదు చేసింది. 2026లోనూ సుప్రీంకోర్టు ఆర్టికల్ 14, 15, 16, పరిధిలో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల ప్రతికూలతలను తొలగించేందుకు రాష్ట్రం తగిన చర్యలు తీసుకోవచ్చని, రిజర్వేషన్లు సమాన అవకాశాన్ని సాధించే ఒక మార్గమని పేర్కొంది. అంటే రాజ్యాంగ దృష్టిలో రిజర్వే షన్‌కు మూల ప్రశ్న ఎవరు పేద? అనేది మాత్ర మేకాదు. ఎవరు వెనుకబడ్డారు? ఎవరు తగిన ప్రాతినిధ్యంపొందలేదు? ఎవరు నిర్ణయ వ్యవస్థలోకి



ప్రవేశించలేకపోయారు?" అన్నదీ అంతే ముఖ్యమైన ప్రశ్న. ఆర్టికల్ 342ఎ కూడా సామాజి కంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల రాష్ట్రాలవారీ గుర్తింపుకు రాజ్యాంగపరమైన వ్యవస్థను కొన సాగిస్తోంది. అయితే ఇక్కడ మరో నిజాన్ని కూడా ఒప్పుకోవాలి. ఎసి, ఎస్టీ, బిసి/ఒబిసిలను ఒకే రకమైన సామాజిక సమూహాలు గా చూడటం సరైంది కాదు. ముఖ్యంగా ఒబిసి వర్గంలోనే విద్య, ఉద్యోగం, ఆర్థికస్థితి, రాజకీయ ప్రాతినిధ్యంలో తీవ్ర అంతర్గత తేడాలున్నాయి. కొన్ని వర్గాలుముందుకు వెళ్లాయి. మరికొన్ని అత్యంత వెనుకబడిన స్థితిలోనే ఉన్నాయి. అందుకే ఒబిసి రిజర్వేషన్‌పై చర్చలో క్రీమీ లేయర్, అత్యంత వెనుకబడిన వర్గాల ప్రయోజనం, డేటా ఆధారిత సమీక్ష వంటి అంశాలు తప్పనిసరిగా ఉండాలి. ఇదే విషయంలో సుప్రీంకోర్టు కూడా ఒబిసిలలో క్రీమీ లేయర్‌ను వేరు చేయడం, నిజంగా అవసరమైన వర్గాలకు రిజర్వేషన్ ప్రయోజనం చేరేలా చూడడం వంటి అంశాలను ప్రస్తావించింది. రిజర్వేషన్ వ్యవస్థలో లోపాలుంటే వాటినిసరిదిద్దాలి. కానీ లోపాలున్నాయని మొత్తం వ్యవస్థనే తొలగించడంపరిష్కారం కాదు. ప్రయోజనాలు నిజంగా అర్హులైన వారికి చేరేలా చేయడం అసలు పరిష్కారం. ఇక్కడ ప్రతిభ అనేపదాన్నీ ఒకసారి ప్రశ్నించాలి. పరీక్షలో వచ్చిన మార్కులే ప్రతిభకు పూర్తి కొలమానమా? ఒక విద్యార్థికి చిన్నప్పటి నుంచే మంచి పాఠశాల, ప్రైవేట్ కోచింగ్, పుస్తకాలు, ఇంట ర్నెట్, చదువుకు అనుకూలమైన వాతావరణం లభిస్తేమరొక విద్యార్థి ఉపాధ్యాయుల కొరత, పేదరికం, సామాజిక వెను కబాటుతనం మధ్య చదివితే ఇద్దరినీ ఒకే ప్రారంభ రేఖ వద్దనిలబెట్టినట్టు ఎలా భావించగలం? పోటీకి ముందు సమాన అవకాశాలు ఉన్నాయా అన్న ప్రశ్న లేకుండా, పోటీ ఫలితాన్ని మాత్రమే మెరిట్‌గా పిలవడం అసంపూర్ణమైన విశ్లేషణ. ఇదేసమయంలో రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా ఉన్న వారి ప్రశ్నలను కొట్టి పారేయడం కూడా సరైంది కాదు. రిజర్వేషన్ ఎంతకాలం? ప్రయోజనం ఎవరికి చేరుతోంది? నిజంగా వెనుకబడినవారికి అందుతోందా? ఒకే కుటుంబాలు తరతరాలుగా ప్రయోజనం పొందుతున్నాయా? క్రీమీలేయర్ పరిమితులు సమర్థంగా అమలవుతున్నాయా? ఈ ప్రశ్నలకు సమాధానాలు కావాలి. సామాజిక న్యాయం పేరుతో వ్యవస్థలోని లోపాలను దాచడంకూడా సామాజిక న్యాయంకాదు. కానీ ఆ ప్రశ్నలకు సమాధానం రిజర్వేషన్ రద్దు అని చెప్పడం మాత్రం తార్కికంగా సరిపోదు. ప్రభుత్వ విద్యావ్యవస్థను బలోపేతం చేయాలి. పేద యువతకు కోచింగ్, స్కాలర్‌షిప్‌లుపెంచాలి. ఉన్నత విద్యలో నిలకడైన అవకాశాలు కల్పించాలి. ఒబిసిలలో అత్యంత వెనుకబడిన వర్గాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఎస్సి, ఎస్టి విద్యార్థులకు నాణ్యమైన విద్య, నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలు విస్తరించాలి. అగ్రవర్ణ పేదల ఆర్థిక వెనుకబాటుతనాన్నీ ప్రభుత్వం వదిలిపెట్టకూడదు. సామాజిక న్యాయం అంటే ఒకరిని తగ్గించడంకాదు, వెనుకబడిన వారిని పైకి తీసుకురావడం. అసలు ప్రశ్న ఉద్యోగాల సంఖ్యతోనే ముగియదు. ఎవరు విశ్వవిద్యాలయాల్లో ఉన్నారు? ఎవరు పరిశోధన చేస్తున్నారు? ఎవరు పరిపాలనలో నిర్ణయాలు తీసుకుంటున్నారు? ఎవరు విధానాలు రూపొందిస్తున్నారు? ఎవరి స్వరం మీడియా, న్యాయవ్యవస్థ, కార్పొరేట్‌సంస్థలు, విద్యా సంస్థల్లో బలంగా వినిపిస్తోంది? ఇవన్నీ ప్రాతినిధ్యానికి సంబంధించినప్రశ్నలే. అందుకే దేశం ఇప్పుడు రిజర్వేషన్‌పై కేవలం ఉంచాలా? తొలగించాలా?"అనే ద్వంద్వ ప్రశ్నలో చిక్కుకోకూడదు. ఎవరికి ఇంకా అవకాశం లేదు? ఎవరి ప్రాతినిధ్యం ఇంకా తక్కు? ఎవరి స్వరం నిర్ణయ వ్యవస్థకు చేరడం లేదు? అన్నప్రశ్నలకు సమాధానం వెతకాలి. రిజర్వేషన్లను మెరుగుపరచాలి. అవసరమైన చోట సంస్కరించాలి. నిజంగా వెనుకబడినవారికి చేరేలా చేయాలి. కానీ సామాజిక అసమానత తొలగిపోయిందనే సాక్ష్యం లేకుండానే రిజర్వేషన్ తొలగించాలని చెప్పడం సామాజిక అసమానతల

# 'వందేమాతరం'పై ఇంత రాద్ధాంతం దేనికి!

జయసూర్య

'జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసి' త్రేతాయుగం నాటి శ్రీమద్రామాయణంలోని తల్లి మాతృభూమి గురించిన ప్రశంస ప్రస్తుత కలియుగ భారతావనిలో జనని, జన్మభూమిగా మాతృభూమి, బానిస శృంఖలాలు ఛేదించే స్వాతంత్ర్యోద్యమసమరంలో 'వందే మాతరం' అయింది. వందేమాతరం అంటే "తల్లీ! నీకు ప్రణామం" అథర్వణ వేదంలోని పృథివీ సూక్తంలో అభివర్ణించారు రుషిపుంగవులు. ఆ ప్రాచీన పవిత్ర భావన మరింత ప్రగాఢమై దేశమాత ఆవిర్భవించింది. దేవీదేవతలు ఆరాధనలోంచి దేశమాత జనించింది. వందేమాతరం జపమంత్రంగా దేశభక్తి నినాదమైంది. వందేమాతరం, మాతృభూమి పట్ల ఆధ్యాత్మిక శక్తిని ఉద్భవింపచేసే రణతంత్రం అయింది. జన్మయిచ్చిన భూమి పట్ల అనన్య భక్తి నిర్మింప చేసింది. బెంగాల్ సమర యోధులు, మేధావులకు పుట్టిల్లు బంకించంద్రఛటర్జీ, వైభవాన్వితమైన మాతృభూమికి స్వేచ్ఛా, విముక్తి సాధనకు దేశభక్తి రగిలించాలంటే, దైవ భక్తిలోంచి దేశభక్తి స్ఫూరింపచేసే ఆనందమఠం నవలగా రచించారు. స్వరూపాలుగా జగద్ధాత్రి, కాళి ఉగ్రరూపాలతో పాటూ భారతావనని దివ్యమంగళ స్వరూపంగా అభివర్ణించి, సంతాన తెగకు చెందిన సన్యాసుల స్వాతంత్ర్య దీక్షాలక్ష్యం ఆ నవలలో విపులీకరించబడింది. దేశభక్తులైన సంతానులు, సన్యాసులు దట్టమైన కీకారణ్యంలో శిథిల దుర్గం అయిన ఆనందమఠంలో రహస్యంగా నివసిస్తుంటారు. ఘోర కరవు కాటకాల కారణంగా నాటి జమీందార్ మహేంద్ర సింగ్ కుటుంబం అడవులపాలై విడిపోతారు. భార్య కల్యాణి దోపిడీ దొంగల బారి నుండి తప్పించుకుని ఆనందమఠంలో ఆశ్రయం పొందుతుంది. సత్యానంత ఆదే శాలనుసారం భావానంద మహేంద్రసింగ్‌ను అరణ్యంలో వెతుకుతుంటాడు. ఇంతలో యాభై మంది సాయుధ సిపాయి దళం, ఆంగ్లేయ సైనికాధికారి కమాండర్‌గాకంపెనీ ఆదాయ నిధులు కోల్‌కత్తా అరణ్య మార్గంలో తీసుకుని వెళ్తుంటారు. దేశభక్తులైన సన్యాసులు జీవానంద నాయకునిగా ఆ నిధిని దోపిడీతో కొల్లగొట్టారు. ఆంగ్ల సైనికాధికారిని సంహరించి, సిపాయిలను పరాజితులు చేసి లూటీ చేస్తారు. శత్రుసంహారం, లూటీ దోపిడీ దేశభక్తులైన సంతానులు నేరాలుగా పరిగణించరు. మహేంద్ర, భావానందలు సిపాయిల నిర్బంధానికి గురి అయి తప్పించుకుని ఆనంద మఠంవైపు వెళ్తుండగా, సన్యాసుల లూటీ, దోపిడీ, దౌర్జన్యాలను మహేంద్ర విమర్శిస్తాడు. అప్పుడు భావానంద ఆకాలంలో రాజ్యమేలుతున్న అణచివేత, నిరంకుశ పాలన, అరాచకం, దారిద్ర్యస్థితిగతుల నుండి నాటి పాలనాధికారి, నవాబు రక్షణ కల్పించలేనందున అసమర్థునికిహక్కులేదని, అందువలన లూటీ దోపిడీ న్యాయమైన చర్యలని సమర్థిస్తాడు. భావోద్రేక భక్తి ఉద్విగ్న తన్మయత్వంతో కవి బంకించంద్రుడు దేశమాత మాతృభూమి స్వర్గతుల్యమని సుజలం, సుఫలం మలయ శీతలమైన దేవీ మాతృస్వరూపాన్ని వందేమాతరంగా గానం చేస్తాడు. 1875 నవం బరులో గేయరూపంలో ఆవిర్భవించిన వందేమాతరం, ఆయన సంపాదకత్వంలో ప్రచురితమయ్యే 'బంగదర్శన్' పత్రికలో ప్రచురింపబడింది. బంగదర్శన్ పత్రిక 1880- 1881 మధ్యకాలంలోఆనంద మఠ్ నవలనుధారావాహికగా ప్రచురించింది. ఆ నవలలో వందేమాతరం గీతం యధాత థంగా పొందుపరచబడింది. 1876లో యదునాథ భట్టాచార్య అనే కవి ఈ గీతం మల్హార్‌రాగంలో పాడారు. 1882లో ఆనందమఠం నవల పుస్తకంగా ప్రచురితమైంది. 1872-1875 మధ్య రాత ప్రతిగా ఉందని చరిత్ర భావి స్తోంది. 1885 జాతీయ కాంగ్రెస్ కోల్‌కత్తా సమావేశంలో విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్ దేశిరాగంలో స్వరబద్ధం చేసి స్వయంగా పాడి శ్రోతలను ముగ్ధులు చేశారు. జాతీయ కాంగ్రెస్ మహాసభలలో వందేమాతరం పాడటం అప్పటి నుంచే ప్రారంభమైంది. 1836జూన్ 26న జన్మించిన బంకించంద్ర ఛటర్జీ 1894 ఏప్రిల్ 8న స్వర్గస్థుడైనాడు. 58 ఏళ్ల జీవించిన మహాదార్శనిక అక్షర శిల్పి తన 44 యేటా ఈ గేయం రచించారు. ప్రప్రథమంగా భారత జాతీయ పితామహుడు దాదాభాయనౌరోజీ సమక్షంలో జాతీయ కాంగ్రెస్‌ద్వితీయ మహాసభలో 450 మంది ప్రతినిధులు, ఈదేశ భక్తిగేయం ఆలపించి ఉత్తేజితుల య్యారు. 1905 నాటికి కాశీ భారత జాతీయ కాంగ్రెస్‌లో గోపాలకృష్ణగోఖలే సూచనపై రవీంద్రుని మేనకోడలు సరళా దేవి చౌదురాణి ఈ గేయాన్ని ఆలపించారు. బాలగంగాధర తిలక్ మాటలలో చెప్పాలంటే భారత జాతీయ పునరుజ్జీ వానికి, వందేమాతరం ఒక మంత్రనాదం. నాటి బ్రిటీష్ ప్రభుత్వం నిషేధించినా వందే మాతరం సంప్రదాయసొసైటీ అధ్యక్షునిగా కోల్‌కత్తా నగర వీధులలో మానవేంద్రనాథ్ రాయ్ మార్చింగ్ సాంగ్‌గా నిర్వర్తించేవారు. 23చరణాలున్న వందేమాతరం, మొదటి రెండు స్టాంజాలు మాత్రమే మాతృదేశభక్తికి సంబంధించినవిగా గుర్తించబడుతున్నాయి. 7 పాదాల తొలి స్టాంజాలే గుర్తింపు పొందాయి. 150 వసంతాల తర్వాత, ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం జాతీయ గౌరవ అవమానాల నిరోధక (సవరణ) బిల్లు 2026 వందేమాతరం బిల్లుగా తెచ్చింది. మొత్తం 6 చరణాల భాగాల సంపూర్ణ గేయం లోని మొదటి రెండు చరణాలు మాత్రమే 1950 జనవరి 24 భారత రాజ్యాంగ సభ అధికారిక ఆమోదయోగ్యంగా సుమారు 76 సంవత్స రాలకు పైగా మాతృదేశాన్ని తల్లిగా వందేమాతరం పాడి పూజిస్తున్నాం. ఇప్పుడు ఎందుకీ అనర్థ రాద్ధాంతం? ●

(రచయిత : సీనియర్ జర్నలిస్టు)

# పర్యాటకంతో ఆర్థిక వృద్ధి సాధించగలమా?

దుంగ జయరాం

భారత్‌లో 2025లో 428.7 కోట్ల దేశీయ పర్యాటక సందర్శనలు నమోదయ్యాయి. అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఇది 45.55శాతం పెరుగుదల. దేశంలో పర్యాటకానికి ఉన్న విస్తృత డిమాండ్‌ను ఈ గణాంకం స్పష్టం చేస్తోంది. అయితే అసలు ఆర్థిక ప్రశ్న పర్యాటకసందర్శనలు ఎన్ని అన్నది కాదు. ప్రతి పర్యటన ద్వారా ఎంత ఆదాయం, ఉపాధి, స్థానిక వ్యాపారం, పెట్టుబడి సృష్టించగలుగుతున్నామన్నదే. పర్యాటకాన్ని ఆర్థిక శక్తిగా మార్చాలంటే భారత్ సంఖ్యల పెరుగుదల నుంచి ఒక్కో పర్యాటకుడి ద్వారా సృష్టించే విలువ పెరుగుదల వైపు మళ్లాలి. పర్యాటకం ఇప్పటికే భారత ఆర్థికవ్యవస్థలో గణనీయమైన పాత్రపోషిస్తోంది. పర్యాటక మంత్రిత్వ శాఖ అంచనాల ప్రకారం2023-24లో ఈ రంగం రూ.15.74 లక్షల కోట్ల ఆర్థిక విలువను సృష్టించింది. ఇది దేశ స్థూలదేశీయోత్పత్తిలో 5.22 శాతం. పర్యాటక రంగంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడిన ఉపాధి 8.463 కోట్లకు చేరింది. పర్యాటకుడి ఖర్చు రవాణా, వసతి, ఆహారం, కొనుగోళ్లు, వినోదం, స్థానిక ఉత్పత్తులు, సేవల్లో చలామణి అవుతుంది. అందుకే పర్యాటకం అనేక రంగాలను ఒకేసారి కదిలించగల ఆర్థిక గొలుసు. ఈ గొలుసు ఎంత బలంగా పనిచేస్తుందన్నదే పర్యాటకం సృష్టించే విలువను నిర్ణయిస్తుంది. ఒక ప్రదేశాన్ని కొన్ని గంటలు చూసి వెళ్లిపోయే పర్యాటకుడి వ్యయం పరిమితంగా ఉంటుంది. అదే పర్యాటకుడు రెండు మూడు రోజులు ఉండి సమీప ప్రాంతాలను సందర్శిస్తే వసతి, భోజనం, రవాణా, కొనుగోళ్లు, మార్గదర్శక సేవలు, సాంస్కృతిక కార్యక్రమాలకు ఆదాయం పెరుగుతుంది. అందువల్ల ఎంతమంది వచ్చారు? అనేదానితో పాటు ఎంతకాలం ఉన్నారు, ఎంత ఖర్చు చేశారు, ఆ ఖర్చులో ఎంత భాగం స్థానికంగా చలామణి అయింది?" అన్నదీ కొలవాలి. దీనికి గమ్యస్థానాలను విడివిడిగా కాకుండా పర్యాటక మార్గాలుగా అభివృద్ధి చేయాలి. దేవాలయాలు, వారసత్వ కట్టడాలు, సముద్ర తీరాలు, వన్యప్రాణి ప్రాంతాలను సమీప ఆకర్షణలతో అనుసంధానించి నాణ్యమైన వసతి, రహదారి-రైలు-విమాన సౌకర్యాలు, పరిశుభ్రత, స్థానిక ఆహారం, సాంస్కృతిక అనుభవాలు, కొనుగోళ్లు, వినోదం అందుబాటులోకి తేవాలి. రవాణా మౌలిక వసతులను కూడా కేవలం ప్రయాణ సౌకర్యాలుగా కాకుండా ప్రాంతీయ ఆర్థికవ్యవస్థలను మార్కెట్లతో కలిపే వసతులుగా చూడాలి. అప్పుడు పర్యాటక ఆదాయం పెద్ద నగరాలకే పరిమితం కాకుండా చిన్న పట్టణాలు, గ్రామాలకు విస్తరిస్తుంది. ఇక్కడ ఒక కీలకమైన ప్రశ్నఉంది.



పర్యాటకుడు ఖర్చు చేసిన ప్రతి రూపాయిలో ఎంత భాగం స్థానిక ఆర్థిక వ్యవస్థలోనే మిగులుతోంది? హోటళ్లు స్థానిక రైతుల నుంచి కొనుగోలు చేస్తే అది వ్యవసాయఆదాయంగా మారుతుంది. పర్యాటకుడు కళాకారుడి ఉత్పత్తిని కొనుగోలు చేస్తే అది కుటుంబ ఆదాయంగా మారుతుంది. స్థానిక వాహనదారులు, మార్గదర్శకులు, భోజనశాలలు, గ్రామీణ వసతి కేంద్రాలు కూడా ఆ ఖర్చులో భాగస్వాములవుతాయి. ఈ స్థానిక అనుసంధానం పెరిగితే పర్యాటక వ్యయపు ఆర్థిక గుణక ప్రభావం బలపడుతుంది. అందుకే స్థానిక ఆహారం, కళలు, సంగీతం, సంప్రదాయ వృత్తులు, ప్రకృతి అనుభవాలను పర్యాటక ఉత్పత్తులుగా మలచడంతో పాటు స్థానిక ఉత్పత్తులకు మార్కెట్లు కల్పించాలి. ఉపాధి విషయంలోనూ సంఖ్య కంటే నాణ్యత ముఖ్యం. విదేశీ భాషలు, వంటకళ, వారసత్వ వివరణ, అతిథి సేవలు, సాహస పర్యాటకభద్రత, ప్రచార నైపుణ్యాలకు డిమాండ్ పెరుగుతుంది. శిక్షణ పొందిన వారిసంఖ్య కంటే శిక్షణ తర్వాత లభించిన ఉద్యోగాలు, వేతనాలు, ఉత్పాదకత ఎంత పెరిగాయన్నదే నైపుణ్య కార్యక్రమాల విజయానికి కొలమానం కావాలి. అంతర్జాతీయ పర్యాటకంలో భారత్‌కు మరింత పెద్ద అవకాశం ఉంది. 2025లో విదేశీ పర్యాటకుల రాక 91.5 లక్షలుగానమోదై, అంతకుముందు ఏడాదితో పోలిస్తే 8.07 శాతం తగ్గింది. భారతదేశ భౌగోళిక వైవిధ్యం, వారసత్వం, ఆధ్యాత్మికత, వన్యప్రాణులు, వైద్య సేవలు, వంటకాలు, సాహస పర్యాటకానికి ఉన్న అవకాశాలను ప్రపంచ మార్కెట్లకు లక్ష్యంగా పరిచయం చేయాలి. వీసా ప్రక్రియను సులభతరం చేయడం, అంతర్జాతీయ విమాన అనుసంధానాన్ని విస్తరించడం, చివరి దశ రవాణాను మెరుగుపరచడం కూడా అవసరం. విదేశీ పర్యాటకులు దేశంలోకి విదేశీ కొనుగోలు శక్తిని తీసుకువస్తా రు. 2025లో పర్యాటకం ద్వారా భారత్‌కు సుమారు రూ. 2.7 లక్షల కోట్ల విదేశీ మారకద్రవ్య ఆదాయం లభించినట్లు అంచనాలు సూచిస్తున్నాయి. ఈ ఆదాయం కూడా తగ్గింది. కాబట్టి లక్ష్యం కేవలం ఎక్కువ మంది విదేశీ పర్యాటకులను ఆకర్షించడం కాకుండా ఎక్కువ రోజులు ఉండే, అనేక ప్రాం తాలను సందర్శించే, అధిక విలువైన అనుభవాలపై ఖర్చు చేసే పర్యాటకులను ఆకర్షించడం కావాలి. పరిశుభ్రత, భద్రత, పారదర్శక ధరలు, విశ్వసనీయ సేవలు, సమయ పాలన ఈ వ్యూహంలో కీలకం. ప్రపంచ ప్రయాణ, పర్యాటక మం డలి అంచనాల ప్రకారం 2026లో భారత పర్యాటకరంగం 8.5శాతం వృద్ధితో 286.1బిలియన్ డాలర్ల ఆర్థిక సహకా రం అందించవచ్చని అంచనా. 2036నాటికి ఇది527 బిలి యన్ డాలర్లకు చేరవచ్చని కూడా అంచనా ఉంది. ఈ సామ ర్థ్యాన్ని అందుకోవడం పర్యాటకుల సంఖ్యపైనే కాకుండా మౌలిక వసతులు, గమ్యస్థానాల నాణ్యత, స్థానిక వ్యాపారాల

26-8Pg5:26-8Pg5.qxd 25/Aug/26 10:55 PM Page 1



# కులగణనలో 'ఓపెన్‌ఎండెడ్' వద్దు



## కులాల డ్రాప్‌డౌన్ జాబితా చేర్చండి

## ప్రధాని మోడీకి ఖర్గే, రాహుల్ సంయుక్త లేఖ

### తెలంగాణ, బీహార్‌ల విధానాన్ని అనుసరించాలని సూచన

**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఒక సంయుక్త లేఖ రాశారు. జనాభా లెక్కలలో కుల సమాచారాన్ని సేకరించడానికి ప్రతిపాదించిన 'ఓపెన్‌ఎండెడ్' విధానం వల్ల ఒకే కులాన్ని వేర్వేరు పేర్లతో నమోదు చేసే అవకాశం ఉందని, తద్వారా డేటా తప్పుగా మారే అవకాశం ఉందని కాంగ్రెస్ నేతలు హెచ్చరించారు. దానికిబదులుగా, ఫారంలో "కులాల డ్రాప్‌డౌన్ జాబితా"ను చేర్చాలని వారు కోరారు. "ఖచ్చితమైన డేటా లేకుండా భారత దేశంలో సామాజిక న్యాయ విధానాలను సమర వంతంగా రూపొందించలేము" అని పేర్కొంటూ కుల గణనను సరిగ్గా నిర్వహిస్తేనే వివిధ కులాల సంఖ్యా బలం, సామాజిక ఆర్థిక స్థితిపై ఖచ్చితమైన అంచనా సాధ్యమవుతుందని ఆ లేఖలో పేర్కొన్నారు. "జనాభా గణన సమయంలో కుల వివరాలను నమోదు చేయడానికి ప్రభుత్వం 'అపరిమితమైన' ప్రశ్నల విధానాన్ని ఎంచుకుంది, ఇది తప్పుదోవ పట్టించే పద్ధతి. ఈ పద్ధతి ప్రకారం, ఒక వ్యక్తి తన కులానికి ఏ పేరు చెప్పినా, అది ఉన్నది ఉన్నట్లుగానే నమోదు చేయబడుతుంది" అని ఖర్గే, రాహుల్‌గాంధీ అభిప్రాయపడ్డారు. దేశంలోని వివిధ ప్రాంతాలలో ఒకే కులాన్ని తరచుగా వేర్వేరు పేర్లు, ఉప కులాలు, భాషా వైవిధ్యాలతో పిలుస్తారని గుర్తుచేశారు. ఒకే కులానికి చెందిన వారిని వేర్వేరు పేర్లతో నమోదు చేస్తే, "ఒకే కులం వేలాది విభిన్న నమోదులుగా విడిపోయే అవకాశం ఉంది" అని హెచ్చరించారు. "దీనివల్ల లక్షలాది కుల పేర్లు పుట్టుకొస్తాయి, కుల గణన నుండి పొందిన మొత్తం డేటాసెట్ నిరుపయోగంగా మారుతుంది" అని కాంగ్రెస్ నాయకులు ఎత్తి చూపారు. ఒక వర్గం కచ్చితమైన జనాభా గణనను నమోదు చేయకపోతే, "వారి స్థితిపై చేసే ఏ అంచనా అయినా అనివార్యంగా లోపభూయిష్టంగా ఉంటుంది" అనిపేర్కొన్నారు. "ఇది వెనుకబడిన, అత్యంత వెనుకబడిన, ఇతర అణగారిన వర్గాలకు నష్టం కలిగిస్తుంది. అంతేకాకుండా విద్య, ఉపాధి, సంక్షేమ పథకాలు, సామాజిక న్యాయానికి సంబంధించిన నిర్ణయాలపై కూడా ప్రభావం చూపుతుంది. అన్నింటికన్నా ముఖ్యంగా, ఈ పద్ధతి భారతదేశంలోని ఒబిసి జనాభా వాస్తవ పరిమాణాన్ని వెల్లడించడంలో విఫలమవుతుంది. ఎందుకంటే ఈ జనాభా లెక్కలలో 'వెనుకబడిన తరగతి' అనే పదాన్నే చేర్చలేదు" అని ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే "కులాల డ్రాప్‌డౌన్ జాబితా"ను రూపొందించాలని కాంగ్రెస్ నాయకులు సూచించారు. "షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల గణన కోసం ఉపయోగించే పద్ధతి ఇది. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల వంటి ప్రభుత్వ జాబితాలు, భారత మానవ శాస్త్ర సర్వే (ఆంత్రోపాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా) నుండి సేకరించిన సమాచారం ఆధారంగా ఇలాంటి జాబితాను సులభంగా రూపొందించవచ్చు" అని పేర్కొన్నారు.

తెలంగాణ, బీహార్‌లలో నిర్వహించిన కుల సర్వేలలో కూడా ఇదే విధానాన్ని అనుసరించారని, కేంద్ర ప్రభుత్వం కూడా అదే విధానం అనుసరించాలని సూచించారు. "ప్రస్తుత పద్ధతిలో కుల గణన నిర్వహించడాన్ని తాము అంగీకరించము. ప్రభుత్వం ప్రస్తుత ప్రశ్నాపత్రాన్ని రద్దు చేసి, రాజకీయ పార్టీలు, నిపుణులు, ప్రజలతో సంప్రదించిన తర్వాత కొత్తదాన్ని రూపొందించాలి" అని డిమాండ్ చేశారు.

# రంగంలోకి 'మాలిస్'



## అమెరికా ఆవిష్కరించిన తాజా ఆయుధం

## 463 కి.మీ దూరం నుంచే కూల్చేసే శక్తివంతమైన క్షిపణి

**వాషింగ్టన్, ఆగస్టు 25:** ఆధునిక యుద్ధ వ్యూహాలపై పదునుపెడుతోన్న అమెరికా తాజాగా సరికొత్త ఆయుధాన్ని సిద్ధం చేసింది. సుదూరం నుంచే శత్రు ముప్పును ఛేదించేలా సరికొత్త ఎయిర్-టు-ఎయిర్ క్షిపణిని యుఎస్ నేవీ ఆవిష్కరించింది. 'మాలిస్'గా పిలిచే ఈ దీర్ఘశ్రేణి క్షిపణి వందల కిలోమీటర్ల దూరం నుంచే విమానాలను కూల్చగలదని అగ్రరాజ్యం చెబుతోంది. ఇంతకీ ఏమిటీ క్షిపణి? దీని ప్రత్యేకలేమిటి?

**మాలిస్.. 'రేంజ్' వేరు**

మాలిస్ క్షిపణి సాంకేతిక పేరు ఎఐఎం-424 ఎల్ఆర్ఎఎం. రేథియాన్ సంస్థతో కలిసి అమెరికా నైకాదళం అత్యాధునిక ఎయిర్-టు-ఎయిర్ క్షిపణిని అభివృద్ధి చేసింది. పొడవు 4.11 మీటర్లు.. 680 కిలోల బరువుండే ఈ క్షిపణిలో సాలిడ్ ప్రొపెల్లెంగ్ రాకెట్ మోటార్ ప్రొపల్షన్ అమర్చారు. దీని సాంకేతికతను యుఎస్ నేవీ పూర్తిగా బయటపెట్టనప్పటికీ.. శత్రువు టార్గెట్‌ను గుర్తించిన వెంటనే.. దాన్ని కూల్చివేసేలా రూపొందించారు. 250 నాటికల్ మైళ్ల (463 కిలోమీటర్ల) దూరంలో ఉండే లక్ష్యాలను ఇది ఛేదించగలదు. గగనతల లక్ష్యాలను టార్గెట్ చేసే క్షిపణుల్లో ఇదే ఇప్పటివరకు అంత్యంత లాంగ్ రేంజ్ మిసైల్. దీంతో అమెరికా యుద్ధ విమానాలు లక్ష్యాలకు చేరువగా వెళ్లాల్సిన పని ఉండదు. అప్పుడు యుద్ధ క్షేత్రంలో అగ్రరాజ్యం వైపు తక్కువ నష్టం ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు.

**ఏ యుద్ధవిమానాల్లో వాడుతారు?**

ఎఐఎం-424 క్షిపణిని ప్రధానంగా ఎఫ్-35సి యుద్ధ విమానాల కోసం డిజైన్ చేశారు. దీంతోపాటు ఎఫ్/ఎ-18ఇ/ఎఫ్ సూపర్ హార్నెట్ ఫైటర్ జెట్లలోనూ వీటిని అమర్చేందుకుకూడా పరీక్షలు జరుపుతున్నారు. ఇటీవల జరిగిన టెస్ట్ ఈవెంట్‌లో ఈ క్షిపణులను యుద్ధ విమానాలకు అమర్చిన ఫొటోలను అమెరికా నేవీ విడుదల చేసింది. మరోవైపు, చైనా కూడా ఇలాంటి దీర్ఘశ్రేణి క్షిపణులపై దృష్టి పెట్టింది. వేల మైళ్ల దూరంలో ఉన్న గగనతల లక్ష్యాలను ఛేదించే హైపర్‌సోనిక్ గ్లైడ్ వెహికల్స్‌ను తయారుచేస్తున్నట్లు సమాచారం. ఈ క్షిపణులు దాదాపు 2,414 కిలోమీటర్ల దూరం ప్రయాణించగలవని అంచనా. అంటే.. చైనా నుంచి అమెరికా గగనతాన్ని లక్ష్యంగా చేసుకోవచ్చని సమాచారం. అయితే, ఈ క్షిపణికి సంబంధించిన వివరాలు ఇంకా బయటకు రాలేదు. ప్రస్తుతం బీజింగ్ వద్ద కనీసం 3,150 బాలిస్టిక్ క్షిపణులు, 300 గ్రౌండ్‌క్రూజ్ మిసైళ్లు ఉన్నాయని అంచనా.




# మహిళలకూ కమాండో శిక్షణ

## ఎన్ఎస్‌జి కీలక నిర్ణయం

**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** భారతదేశ ఉగ్రవాద నిరోధక వ్యవస్థలో మహిళల కార్యాచరణ సామర్థ్యాలను బలోపేతం చేసే లక్ష్యంతో, మనేసర్‌లోని నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్ఎస్‌జి) శిక్షణా అకాడమీ, రాష్ట్ర పోలీసు బలగాలు, కేంద్ర సాయుధ పోలీసు బలగాల (సిఎ పిఎఫ్) మహిళా సిబ్బంది కోసం మొట్టమొదటి మహిళా కమాండో కన్వర్షన్ కోర్సు (ఎంసిసిసి)ను ప్రారంభించింది. ఈ కార్యక్రమాన్ని 'నారీ శక్తి'లో ఒక కొత్త మైలురాయిగా అభివర్ణిస్తూ, ఉగ్రవాద నిరోధక కార్యకలాపాలలో క్లిష్టమైన ప్రత్యేక పాత్రలకోసం మహిళా సిబ్బందిని సిద్ధం చేయడమే ఈ కోర్సు లక్ష్యమని ఎన్ఎస్‌జి పేర్కొంది. శారీరకంగా దృఢంగా, సాంకేతికంగా నైపుణ్యం కలిగి, కార్యాచరణకు సిద్ధంగా ఉన్న మహిళా కమాండోలను అభివృద్ధి చేయడానికి ఈ 12 వారాల ఇంటెన్సివ్ కోర్సును రూపొందించారు. ఈ శిక్షణా కార్యక్ర మంలో కఠినమైన శారీరక కండిషనింగ్, ఆయుధాల నిర్వహణ, మార్క్‌మ్యాన్‌షిప్, వ్యూహాత్మక జోక్యం, బందీల రక్షణ, ఉగ్రవాద నిరోధక కార్యకలాపాలకు సంబంధించిన ఇతర ప్రత్యేక అంశాలు ఉంటాయి. వివిధ భద్రతా దళాల నుండి ఎంపిక చేయబడిన మహిళా సిబ్బందికి, దళం ప్రత్యేక ఉగ్రవాద నిరోధక నైపుణ్యాన్ని విస్తరించడం ద్వారా, వ్యక్తిగత నైపుణ్యాభివృద్ధికి అతీతంగా వెళ్లడమే ఎన్ఎస్‌జి శిక్షణా అకాడమీ ఉద్దేశ్యం. ఎన్ఎస్‌జి ప్రకారం, ఈ కోర్సు శిక్షణ పొందిన కార్యాచరణ సిబ్బంది విస్తృత సమూహాన్ని సృష్టించడంలో సహాయపడుతుంది. అదే సమయంలో, ఉమ్మడి వృత్తిపరమైన ప్రమాణాలను ప్రోత్సహిస్తూ, భారతదేశ భద్రతా వ్యవస్థలో పాలుపంచుకుంటున్న వివిధ దళాల మధ్య పరస్పర సహకారాన్ని

# రెండువారాల్లోగా లొంగిపోవాలి...

## తరుణ్ తేజ్‌పాల్‌కు సుప్రీం ఆదేశం

**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** అత్యాచారం కేసులో దోషిగా తేలిన మాజీ తెహెల్కా ఎడిటర్ తరుణ్ తేజ్‌పాల్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. లొంగిపోవడం నుంచి మినహాయింపు కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు మంగళవారం తిరస్కరించింది. రెండు వారాల్లోగా లొంగిపోవాలని ఆదేశించింది. తేజ్‌పాల్ పిటిషన్‌పై జస్టిస్ అలోక్ అరాధే నేతృత్వంలోని సింగిల్ జడ్జి బెంచ్ సోమవారం విచారణ పూర్తి చేసి తీర్పును రిజర్వ్ చేసింది. తేజ్‌పాల్ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్, గోవా ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్‌మెహతా వాదనలు వినిపించారు. తేజ్‌పాల్ అప్పీల్‌ను విచారణకు స్వీకరించాలంటే ముందుగా ఆయన లొంగిపోయినట్లు ధ్రువీకరించే సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుందని లేదంటే లొంగిపోవడం నుంచి మినహాయింపు కోరుతూ ప్రత్యేక పిటిషన్ దాఖలు చేయాలని తుషార్ మెహతా వాదించారు. సుప్రీంకోర్టు రూల్స్, 2013తో పాటు గత తీర్పులను ఆయన ప్రస్తావించారు. అయితే కపిల్ సిబల్ మాత్రం గోవా ప్రభుత్వం ప్రస్తావించిన సుప్రీంకోర్టు నిబంధనలు ఈ కేసుకు వర్తించవని వాదించారు. బాంబే హైకోర్టు ఇప్పటికే తేజ్‌పాల్‌కు నాలుగు వారాల గడువు ఇచ్చిందని, అప్పటివరకు ఆయనకు కోర్టు రక్షణ ఉందని తెలిపారు. ఆగస్టు 31న రెగ్యులర్ బెంచ్ ముందు కేసును విచారణకు లిస్ట్ చేయాలని కోరారు. ఈనెల 6న బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ తేజ్‌పాల్ ఆగస్టు 20న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. 2021లో గోవా సెషన్స్ కోర్టు ఇచ్చిన నిర్దోషి తీర్పును బాంబే హైకోర్టు కొట్టివేసి తేజ్‌పాల్‌ను అత్యాచారం కేసులో దోషిగా తేల్చింది.

# ఇక పైలట్లకు ప్రతి యేటా డోప్ టెస్టులు

## కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** ఇకపై పైలట్లకు ప్రతి యేడాది డోప్ టెస్టులు నిర్వహించనున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు మంగళవారం వెల్లడించారు. ప్రస్తుతం ఈ అంశంపై డిజిసిఎ దృష్టి సారించిందని, దీనికి సంబంధించి ఇప్పటికే ఉన్న నిబంధనల్ని పరిశీలిస్తోందని మంత్రి అన్నారు. అలాగే, కొత్త నిబంధనల రూపకల్పనపై దృష్టి సారించిందని తెలిపారు. ఇటీవల ఎయిరిండియా విమానం గాలిలో ఉండగా, కుదుపులకు గురైన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో పలువురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. దీనికి గల కారణాలపై విచారించగా పైలట్ గంజాయి సేవించినట్లు తేలింది. పైలట్లు మత్తులో ఉండటం వల్ల విమాన ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు ఉంటుంది. అందువల్ల పైలట్లు ఇలా నిషేధిత డ్రగ్స్ తీసుకోకుండా చర్యలు తీసుకోవాలని, అలాంటి వారిని గుర్తించేందుకు డోప్ టెస్టులు నిర్వహించాలని కేంద్రం భావిస్తోంది.

# బీహార్ సిఎం ఇల్లు ముట్టడి యత్నం

## ఉద్రిక్తంగా మారిన పాట్నా వీధులు




**పాట్నా, ఆగస్టు 25:** బీహార్ రాజధాని పాట్నా రోడ్లు మంగళవారం రణరంగాన్ని తలపించాయి. వందలాది మంది విద్యార్థులు, నిరుద్యోగ అభ్యర్థులు తమ ఆగ్రహాన్ని వ్యక్తంచేస్తూ ముఖ్యమంత్రి సమ్రాట్ చౌధరి నివాసాన్ని ముట్టడించేందుకు దూసుకెళ్లారు. బీహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే 70వ పరీక్షను వెంటనే రద్దు చేయాలని, ప్రశ్నాపత్రాల లీకేజీలు, పరీక్షల నిర్వహణలో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ అభ్యర్థులు ఈ ఆందోళన చేపట్టారు. ఉదయం 10 గంటల ప్రాంతంలో చారిత్రాత్మక గాంధీ మైదాన్ నుంచి ప్రారంభమైన ఈ నిరసన ర్యాలీ క్రమంగా తీవ్రరూపం దాల్చింది. నిరసనకారులు ముఖ్యమంత్రి నివాసంవైపు దూసుకెళ్లకుండా పోలీసులు మార్గమంతటా భారీగా బారికేడ్లను ఏర్పాటు చేసినప్పటికీ, ఆగ్రహంతో ఉన్న విద్యార్థులు వాటిని తోసుకుంటూ ముందుకు సాగారు. బారికేడ్లను బద్దలు కొట్టుకుని వస్తున్న అభ్యర్థులను అడ్డుకునేందుకు పోలీసులు శతవిధాలా ప్రయత్నించడంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నిరసనకారులను చెదరగొట్టడానికి పోలీసులు పలుచోట్ల లాఠీఛార్జ్ చేయడంతోపాటు వాటర్ కెన్లను ప్రయోగించారు. అయినా సరే వెనక్కి తగ్గనివిద్యార్థులు, పోలీసుల హెచ్చరికలను దాటుకుంటూ సిఎం నివాసానికి చేరువగా వెళ్లడం విశేషం. నిజానికి పట్నాలోని గర్దానీబాగ్ ప్రాంతంలో పోటీపరీక్షలు, ఉద్యోగనియామకాలకు సంబంధించి అభ్యర్థులు కొద్దిరోజులుగా నిరంతర నిరసనలు తెలుపుతున్నారు. నిరసనకారుల ప్రతినిధులతో ప్రభుత్వం సోమవారం జరిపిన చర్చలు సానుకూలంగానే ముగిసినప్పటికీ, తమ ప్రధాన డిమాండ్లు నెరవేరేవరకు వెనక్కి తగ్గేది లేదని అభ్యర్థులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే గాంధీమైదాన్ నుంచి సిఎం నివాసానికి మార్చ్‌ను ప్రకటించి అమలు చేశారు. ప్రభుత్వం తరఫున కేవలం జూనియర్ అధికారులతో మాట్లాడించి విషయాన్ని దాటవేస్తున్నారని, ఈసారి నేరుగా ముఖ్యమంత్రే తమతో చర్చలు జరపాలని విద్యార్థి నేత సౌరవ్‌కుమార్ స్పష్టంచేశారు. తమ తరఫున ఒక ప్రతినిధి బృందాన్ని సిఎం లేదా విద్యాశాఖమంత్రి వద్దకు పంపడానికి సిద్ధంగా ఉన్నామని, వారిద్దరూ తప్ప వేరే ఏఅధికారితోనూ మాట్లాడేది లేదని, సిఎం నుంచి అధికారిక ప్రకటన వస్తేనే నిరసన విరమిస్తామని విద్యార్థి నాయకులు తేల్చిచెప్పారు. ఒకవైపు అభ్యర్థుల ఆందోళనలు ఉధృతంగా సాగుతుండగానే, మరోవైపు బీహార్ ప్రభుత్వం విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం విద్యార్థి సహయోగ్ శివిర్ పేరిట ఒక నూతన కార్యక్రమాన్ని ప్రకటించింది. ప్రభుత్వం ఎంతటి సంక్షేమ కార్యక్రమాలు ప్రకటించినప్పటికీ, 70వ బిపిఎస్‌సి పరీక్ష అక్రమాలపై కచ్చితమైన చర్యలు తీసుకునేవరకు పోరాటాన్ని ఆపేది లేదని నిరుద్యోగులు భీష్మించుకూర్చోవడంతో ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది.

# భారత్ ప్రజాస్వామ్యానికి బిఎల్‌ఒలే పునాది

## కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్

### ఎన్నికల యంత్రాంగం ప్రపంచంలోనే అతిపెద్ద కుటుంబంగా అభివర్ణన



**లక్నో, ఆగస్టు 25:** భారత ప్రజాస్వామ్యానికి 'బూత్ స్థాయి అధికారులు' (బిఎల్‌ఒ) పునాది వంటివారని ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం లక్నోలో నిర్వహించిన సమావేశంలో ఆయన బిఎల్‌ఒలతో ముచ్చటించారు. ఈ సమావేశం అనంతరం విలేకరులతోమాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో బిఎల్‌ఒల కీలక పాత్రను, వారి అంకితభావాన్ని, పారదర్శకతను ప్రశంసించారు. "బిఎల్‌ఒలు భారత ప్రజాస్వామ్యానికి పునాది. ప్రతి బూత్ స్థాయి అధికారి తమ బూత్ పరిధిలోని ఓటర్లకు తమ పారదర్శకత, అంకితభావం ద్వారా సుపరిచితులు మాత్రమే కాదు, దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగాకూడా గుర్తింపు, గౌరవం పొందుతున్నారు" అని సిఇసి జ్ఞానేష్ కుమార్‌అన్నారు. బిఎల్‌ఒల అనుభవాలను తెలుసుకోవడం, వారిసూచనలను స్వీకరించడమే ఈ సమావేశం ముఖ్య ఉద్దేశమని ఆయన తెలిపారు. సుమారు 97 కోట్ల మంది ఓటర్లు ఉన్న భారతదేశాన్ని, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల యంత్రాంగం భారీ స్థాయిని నొక్కి చెబుతూ, జ్ఞానేష్ కుమార్ దీనిని "ప్రపంచంలోనే అతిపెద్ద కుటుంబం"గా అభివర్ణించారు.

ఇఎల్‌సి 2.0, ఇసిఐఎన్‌ఇటి ప్రాంతీయ సదస్సులో సిఇసి జ్ఞానేష్ కుమార్ మాట్లాడుతూ, వివిధ స్థాయిలలోని ఎన్నికల అధికారులను అనుసంధానించే వేదికగా ఇసిఐఎన్‌ఇటి ప్రాముఖ్యతను ఆయన వివరించారు. సుమారు నాలుగు, ఐదు నెలల క్రితం ప్రారంభించిన ఈ యాప్, ఈ యేడాది చివరి నాటికి భారతదేశంలోని అతిపెద్ద అప్లికేషన్లలో ఒకటిగా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచంలోని అనేక ప్రధాన ప్రాంతాల మొత్తం ఓటర్ల జనాభా కంటే భారతదేశ ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉందని జ్ఞానేష్ కుమార్ పేర్కొన్నారు. "భారత దేశంలో సుమారు 97 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. ఈ సంఖ్య కేవలం ఒక గణాంకం మాత్రమే కాదు, ఇది చాలా ముఖ్యమైనది. అమెరికా, కెనడా, దక్షిణ అమెరికా, మొత్తం ఐరోపా, మొత్తం ఆఫ్రికా, ఆగ్నేయాసియా దేశాల ఓటర్ల సంఖ్యను కలిపినా, అప్పటికీ సుమారు ఎనిమిది కోట్ల మంది ఓటర్లు మిగిలే ఉంటారు. మీరు అటువంటి భారీ ప్రజాస్వామ్యంలో భాగం. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద కుటుంబం" అని పునరుద్ఘాటించారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో ఎన్నికల సంఘం నిర్వహించే భారీ స్థాయి కార్యకలాపాల గురించి కూడా జ్ఞానేష్ కుమార్ ప్రస్తావించారు. "ప్రపంచంలోనే అతిపెద్ద ప్రభుత్వమైన భారత ప్రభుత్వం 65 లక్షల మందికి ఉపాధి కల్పిస్తుండగా, అతిపెద్ద ప్రైవేట్ సంస్థ అయిన వాల్‌మార్ట్ సుమారు 20 లక్షల మందికి ఉపాధినిస్తోంది. లోక్‌సభ ఎన్నికల సమయంలో, 1.8 కోట్ల మంది సిబ్బందితో కలిసి పనిచేసే భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) ప్రపంచంలోనే అతిపెద్ద సంస్థగా మారుతుంది" అని ఆయన అన్నారు.

# దేశీయ పరిశ్రమలకే డిఆర్‌డిఒ క్షిపణి టెక్నాలజీ

## రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్



**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** ఆయుధాల తయారీలో స్వయం సమృద్ధి సాధించే దిశగా భారత్ చేస్తున్న ప్రయత్నాలకు పెద్ద ఊతం లభించింది. దేశీయంగా ఉత్పత్తి చేసేందుకు వీలుగా, డిఆర్‌డిఒ అభివృద్ధి చేసిన అన్ని సంప్రదాయ క్షిపణి వ్యవస్థల సాంకేతికతను దేశీయ పరిశ్రమలకు బదిలీ చేయడానికి రక్షణ శాఖ ఆమోదం తెలిపింది. ఈ సాంకేతికత బదిలీ (టిఒటి) భారతీయ కంపెనీల భాగస్వామ్యాన్ని పెంచడంలో సహాయపడుతుందని పేర్కొంది. "రక్షణ రంగంలో 'ఆత్మనిర్భరత' (స్వయం సమృద్ధి) లక్ష్యాన్ని సాధించే దిశగా ఒక కీలక అడుగుగా, డిఆర్‌డిఒ అభివృద్ధి చేసిన అన్ని సంప్రదాయ క్షిపణి వ్యవస్థల సాంకేతికతను దేశీయంగా ఉత్పత్తి చేసేందుకు భారతీయ పరిశ్రమలకు బదిలీ చేయడానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆమోదం తెలిపారు" అని రక్షణ శాఖ 'ఎక్స్' వేదికగా తెలిపింది. రష్యా వంటి దేశాల నుండి ఆయుధాల దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడం, దేశంలో బలమైన రక్షణ తయారీ రంగాన్ని నిర్మించడం లక్ష్యంగా కేంద్రం ఈ చర్య చేపట్టింది. "ఈ సాంకేతికత బదిలీ, భారతీయ పరిశ్రమలు తమ అర్హతలు, ధ్రువీకరణలు, నియంత్రణ నిబంధనలకు అనుగుణంగా స్వదేశీ ఉత్పత్తిని చేపట్టేలా చేయడం ద్వారా రక్షణ రంగ వ్యవస్థలో వాటి భాగస్వామ్యాన్ని పెంచడంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది" అని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా రాసుకొచ్చారు. దేశీయ తయారీ పరిశ్రమ సామర్థ్యాలను మెరుగుపరచడం, రక్షణ పారిశ్రామిక పునాదిని బలోపేతం చేయడం, సరఫరా గొలుసులో ఎంఎస్ఎంఇలు, అలాగే ఇతర సాంకేతిక భాగస్వాముల భాగస్వామ్యాన్ని కల్పించడం తమ లక్ష్యమని పేర్కొన్నారు. "ఈ విధానం క్షిపణి వ్యవస్థల అభివృద్ధి నుండి పారిశ్రామిక ఉత్పత్తికి విజయవంతమైన పరివర్తనను సాధ్యం చేస్తుంది. అధునాతన రక్షణ వ్యవస్థల అభివృద్ధి, తయారీ కోసం భారతీయ పరిశ్రమ సామర్థ్యాలను వినియోగించుకోవడంలో డిఆర్‌డిఒ చేస్తున్న నిరంతర కృషిని ఇది ప్రతిబింబిస్తుంది" అని పేర్కొన్నారు.

# మా వద్ద రెండు సంవత్సరాల ప్రణాళిక ఉంది

## అమెరికా ఆంక్షలకు ఇరాన్ కౌంటర్



**టెహ్రాన్, ఆగస్టు 25:** ఇరాన్‌పై కొన్ని నెలలుగా దాడులు చేసిన అమెరికా ఇప్పుడు ఆర్థికంగా వెన్నువిరిచే ప్రయత్నాలు మొదలుపెట్టింది. అంతర్జాతీయంగా ఇరాన్‌కున్న ఆర్థిక సంబంధాలను తెంచేయడమే లక్ష్యంగా అగ్ర రాజ్యం కొత్త ఆంక్షలను ప్రకటించింది. టెహ్రాన్‌తో సంబంధాలు కొనసాగిస్తూ, నగదు అక్రమ చలామణిలో దానికి తోడ్పడే దేశాలను డాలరు వ్యవస్థ నుంచి దూరం చేస్తామని యుఎస్ ఆర్థిక స్కాట్ బెసెంట్ ప్రకటించారు. దీనికి ఇరాన్ దీటుగా స్పందించింది. ట్రంప్ ప్రభుత్వం విధించిన ఆంక్షలను ఎదుర్కోవడానికి తమ వద్ద రెండేళ్ల ప్రణాళికఉందని, ప్రతీకార చర్యలు తప్పవని బదులిచ్చింది. ఇరాన్‌పై ఆంక్షలు విధించడం కొత్తేంకాదు. ఇరాన్‌కు ప్రపంచదంతో ఉన్న ఆర్థిక జీవనాధారాన్ని తెగ్గొట్టడమే తాజా ఆంక్షల లక్ష్యమని బెసెంట్ ప్రకటించారు. అయితే యుఎస్ నుంచి ఎదురయ్యే ఒత్తిడిని తమ వాణిజ్య భాగస్వాములు గట్టిగా వ్యతిరేకిస్తారని టెహ్రాన్ వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ గాలిబఫ్ స్పందించారు. ఇతర దేశాలతో ఇరాన్‌కున్న సంబంధాలను తెగ్గొట్టే స్థితిలో అమెరికా లేద న్నారు. 'అమెరికన్ల ప్రగల్భాలను ఎవరూనమ్మరు. అమెరికా ఆంక్షల ప్రకటనను పరిగణనలోకి తీసుకోబోమని మా వాణిజ్య భాగస్వాములు ఇప్పటికే మాకు సందేశాలు పంపారు' అని పేర్కొన్నారు.

# సంక్షిప్త వార్తలు

## చైనా ఉపాధ్యక్షుడు హాన్‌జెంగ్‌తో అజిత్ దోవల్ భేటీ



**బీజింగ్, ఆగస్టు 25:** జాతీయ భద్రతా సలహాదారు అజిత్‌దోవల్ ప్రస్తుతం చైనాలో పర్యటిస్తున్నారు. మంగళవారం ఆయన చైనా ఉపాధ్యక్షుడు హాన్‌జెంగ్‌తో భేటీ అయ్యారు. చైనా విదేశాంగమంత్రి, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనా సెంట్రల్ కమిటీ సభ్యుడు వాంగ్‌యి ఆహ్వానం మేరకు అజిత్ దోవల్ అక్కడ పర్యటిస్తున్నారు. చైనాకు చెందిన వివిధ ప్రజా ప్రతినిధులతో భేటీలో భాగంగా చైనా ఉపాధ్యక్షుడు హాన్‌జెంగ్‌తో భేటీ అయ్యారు. రెండు దేశాల మధ్య శాంతి నెలకొల్పే అంశాలతోపాటు, సరిహద్దు వివాదంపైకూడా చర్చలుజరిపారు. సరిహద్దులో వివాదాలు, ఉద్రిక్త పరిస్థితులు నెలకొనకుండా చూడటమే లక్ష్యంగా ఈ భేటీ జరిగింది. అలాగే, ఆర్థిక, రాజకీయ అంశాలతో పాటు ఇతర ద్వైపాక్షిక అంశాలపై కూడా చర్చించారు.

## ఢిల్లీలో నిరసనలపై ఇక ప్రత్యేక నిఘా

**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** ఢిల్లీలో వరుసగా జరుగుతున్న నిరసనలు, వాటి వల్ల తలెత్తే శాంతి భద్రతల సమస్యపై ఢిల్లీ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించబోతున్నారు. ఈ నిరసనల్ని ముందుగా గుర్తించేందుకు ఇంటెలిజెన్స్ వ్యవస్థను మరింత పటిష్టంచేయాలని పోలీసులు భావిస్తున్నారు. ఇందుకోసం స్పెషల్ బ్రాంచ్ పోలీసులు శ్రీకారంచుట్టారు. ఇటీవల జంతర్ మంతర్‌వద్ద సిజెపి నిరసన సందర్భంగా తలెత్తిన ఘర్షణల నేపథ్యంలో ఇంటెలిజెన్స్ వ్యవస్థను మరింతపటిష్టం చేయాల్సిందిగా ఢిల్లీపోలీస్ కమిషనర్ ఆదేశించారు.

## డేరాబాబాకు 17వ సారి పెరోల్

**రోహ్‌తక్, ఆగస్టు 25:** అత్యాచారం కేసులో దోషిగా తేలిన డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ అలియాస్ డేరా బాబాకు మరోసారి పెరోల్ దొరికింది డేరా బాబా అత్యాచారం కేసులో 20 యేళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్న ఆయనకు మరో 21 రోజుల పెరోల్ మంజూరైంది. 2017లో శిక్ష పడిన తర్వాత ఇది ఆయనకు ఇది 17వ తాత్కాలిక విడుదల కావడం గమనార్హం. హర్యానాలోని రోహ్‌తక్ సునారియా జైలు నుంచి ఈ రోజు తెల్లవారుజామున రామ్ రహీమ్ బయటకు వచ్చారు. పెరోల్ కాలంలో సిర్సాలోని డేరా సచ్చా సౌదా ప్రధాన కార్యాలయంలో ఆయన ఉండనున్నారు.

## ఢిల్లీలో 2,300 దాటిన స్వైన్‌ఫ్లూ కేసులు

**న్యూఢిల్లీ,ఆగస్టు 25:** దేశ రాజధాని ఢిల్లీలో స్వైన్‌ఫ్లూ కేసుల సంఖ్య 2,300 దాటిందని ఢిల్లీ ఆరోగ్యశాఖ మంత్రి పంకజ్ సింగ్ వెల్లడించారు. కసులు పెరుగుతున్నప్పటికీ ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భారత వైద్య పరిశోధనా మండలి డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజీవ్ బహల్ స్పష్టం చేశారు. ఇవి వారానికొకసారి నమోదయ్యే సాధారణ గణాంకాల్లో భాగమేనని బహల్ తెలిపారు. ప్రస్తుతం నమోదవుతున్న హెచ్‌వన్ఎన్‌వన్ వైరస్ 2009లో కనిపించిన సాధారణ స్ట్రెయిన్‌నేనని, ఇందులో కొత్తదనం ఏమీ లేదని చెప్పారు. ఇప్పుడు దీనిని స్వైన్‌ఫ్లూ అని కాకుండా సీజనల్ ఫ్లూగా పరిగణిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

## స్వరాష్ట్రంలో చేపల మార్కెట్‌కు ప్రధాని మోడీ పేరు!




**సూరత్, ఆగస్టు 25:** గుజరాత్‌లోని సూరత్‌లో ఓ చేపల మార్కెట్‌కు ప్రధాని మోడీ పేరు పెట్టడంపై వివాదం చెలరేగింది. నాన్‌పురాలోని లక్కడ్‌కోట్ ప్రాంతంలో కొత్తగా నిర్మించిన హోల్‌సేల్ చేపల మార్కెట్ ప్రవేశద్వారం దగ్గర 'శ్రీ నరేంద్ర మోడీ హోల్‌సేల్ ఫిష్ మార్కెట్' పేరుతో ఓ బోర్డును ఏర్పాటు చేశారు. అందులో ప్రధాని మోడీ ఫొటోతో పాటు సూరత్ ఫిష్ మర్చంట్ అసోసియేషన్ పేరు కూడా ఉంది. దీనిపై కొందరు స్థానిక చేపల వ్యాపారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ శాఖాహారి కావడంతో ఆయన పేరును చేపల మార్కెట్‌కు పెట్టడం సరైన నిర్ణయం కాదని కొందరు వ్యాపారులు ప్రశ్నించారు.

26-8Pg6exHMNWJQE:26-8Pg6exHMNWJQE.qxd 25/Aug/26 11:16 PM Page 1



# పీఎం సూర్యఘర్ యోజనతో విద్యుత్ పొదుపు

- ప్రతి కుటుంబానికి ప్రయోజనం చేకూరాలి
- రచ్చుమర్రిలో సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్ పరిశీలన



పీఎం సూర్యఘర్ సోలార్‌ను పరిశీలిస్తున్న మంత్రులు గొట్టిపాటి రవికుమార్, నిమ్మల రామానాయుడు

**మంత్రాలయం, ఆగస్టు 25 ప్రభాతవార్త:** పీఎం సూర్యఘర్ యోజనతో విద్యుత్ పొదుపు ప్రతి కుటుంబానికి ప్రయోజనం చేకూరాలని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. మంగళవారం మంత్రాలయం మండలం రచ్చుమర్రి గ్రామంలో లబ్ధిదారుడు అజయ్‌కుమార్ పీఎం సూర్యఘర్ యోజన ద్వారా ఏర్పాటు చేసుకున్న సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్‌ను రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రాష్ట్ర జలవనరులశాఖ, కర్నూలు జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్ ఏర్పాటు, దాని పనితీరు, సామర్థ్యం, లబ్ధిదారులకు అందుతున్న ప్రయోజనాలు, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ తదితర అంశాలను మంత్రులు అధికారులను, లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్ల ఏర్పాటులో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ సూచించారు. సోలార్ ప్యానెళ్లు, ఇన్వర్టర్లు, ఇతర పరికరాలు అత్యున్నత ప్రమాణాలతో ఉండేలా చూడాలని, ఏర్పాటు చేసిన ప్లాంట్లు కనీసం 20 సంవత్సరాల పాటు సమర్థవంతంగా పనిచేసేలా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని స్పష్టం చేశారు. పీఎం సూర్యఘర్ యోజన ప్రధాన ఉద్దేశ్యం ప్రతి కుటుంబానికి సౌర విద్యుత్ ద్వారా విద్యుత్ ఖర్చును తగ్గించడం, స్వచ్ఛమైన ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించడం అని మంత్రి పేర్కొన్నారు. పథకం ద్వారా లబ్ధిదారులకు వాస్తవ ప్రయోజనం అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. రచ్చుమర్రి గ్రామంలో ఏర్పాటు చేసిన సోలార్ రూఫ్‌టాప్ ప్లాంటట్2 కిలో వాట్ల సామర్థ్యంతో ఉందని అధికారులు వివరించారు. ఈ పథకం కింద అర్హత కలిగిన లబ్ధిదారులకు 60 శాతం వరకు సబ్సిడీ అందుతున్నట్లు తెలిపారు. లబ్ధిదారులకు సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్ల ఏర్పాటులో ఏపీఎస్పీడీసీఎల్ ద్వారా అవసరమైన సహకారం, మార్గదర్శకత్వం, సహాయక సేవలు అందిస్తున్నట్లు అధికారులు తెలెఇపారు. పథకం అమలులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా లబ్ధిదారులకు అవసరమైన సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రులు సూచించారు. పీఎం సూర్యఘర్ యోజనను ప్రజలు సద్వినియోగం చేసుకుని సౌర విద్యుత్ వినియోగాన్ని పెంచుకోవాలని, తద్వారా విద్యుత్ పొదుపుతో పాటు పర్యావరణ పరిరక్షణ కూడా సహకరించాలని మంత్రులు కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, ఆదోని ఆర్డీఓ అరుణదేవి, విద్యుత్‌శాఖ ఎస్ఈ ప్రదీప్‌కుమార్, టిడిపి జిల్లా అధ్యక్షులు గుడిసె కృష్ణమ్మ, జోన్-5 ఇన్‌చార్జి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 28నప్రభుత్వ ఉద్యోగులరాష్ట్రస్థాయి సదస్సు



**విజయవాడ, ఆగస్టు 25 (ప్రభాతవార్త):** ఉద్యోగుల సమస్యలు, తమకు రావాల్సిన వేతన బకాయిల సాధన కోసం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు చేపట్టనున్న ఉద్యమానికి తరలిరావాలని ఎ.పి. ఎన్.జి.ఒ, రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘ నాయకులకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల అమరావతి జె.ఎ.సి. విజ్ఞప్తిచేసింది. ఉద్యమంలో భాగంగా ఈ నెల 28వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్ర సదస్సుకు ఎ.పి. ఎన్.జి.ఒ, రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘ నాయకులనుజె.ఎ.సి సభ్యులు మంగళవారం కలిసి ఆహ్వానించారు. ఐక్య ఉద్యమాలకు పిలుపునిచ్చిన ఎ.పి.జె.ఎ.సి. అమరావతి, చైర్మన్ బొప్పరాజు ఆధ్వర్యంలో నాయకుల బృందం విజయవాడ ఎ.పి. ఎన్.జి.ఒ భవన్ కి వెళ్లి రాష్ట్ర అధ్యక్షుడు, ఎ.పి.జె.ఎ.సి. చైర్మన్ ఏ.విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి రమణలను కలసి ఉద్యోగుల, ఉపాధ్యాయులు, పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యలను వివరించారు. ప్రధానంగా ఉద్యోగులబకాయిలపై ప్రభుత్వం గత రెండేళ్లుగా స్పందించనందున, ఎ.పి.జె.ఎ.సి. అమరావతి ఉద్యమ కార్యాచరణకు వివరించారు. ఈసందర్భంగా బొప్పరాజు గారు మాట్లాడుతూ ఏ ప్రభుత్వాలైనా ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపిన వెంటనే నిర్ణయాలు వెల్లడిస్తాయని, కానీ కూటమి ప్రభుత్వం గత నెల 22వ తేదీన చర్చలు జరిపి నెల రోజులు దాటినప్పటికీ ఎటువంటి నిర్ణయాలు ప్రకటించలేదని, ఇది చాలా బాధాకరమని, కాబట్టి ఉద్యోగులు అందరూ గతంలో మాదిరి రెండు జేఏసీ లు కలిసి ఉద్యమం చేయాలని కోరుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బొప్పరాజుతో పాటు సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదర రావు, ఉద్యమ కమిటీ అధ్యక్షుడు టి వి ఫణి పేర్రాజు, కోశాధికారి తిమ్మనర్తి నాగేశ్వరావు, మహిళా విభాగం రాష్ట్ర చైర్ పర్సన్ పారే లక్ష్మి ్ర, సెక్రటరీ జనరల్ పొన్నూరు విజయలక్ష్మి ్ర, వి.ఆర్.ఒ.లసంఘం రాష్ట్ర ప్రధాన కార్య దర్శి జి.అనుపమ, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు బత్తిన రామకృష్ణ, రాజధాని నగర అధ్యక్షుడు రవి ప్రసాద్,ప్రధానకార్యదర్శి మందపాటి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

# గల్లంతైన మత్స్యకారుల కోసం గాలింపు ముమ్మరం

- 15 కోస్ట్‌గార్డ్ నౌకలు, నాలుగు హెలికాప్టర్లతో విస్తృత సెర్చ్ ఆపరేషన్
- మయన్మార్, బంగ్లాదేశ్ సముద్ర అధికారులకు సమాచారం



**విజయవాడ, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** అమలాపురం ప్రాంతానికి చెందిన గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల ఆచూకీ కోసం చేపట్టిన గాలింపు చర్యలను మరింత ముమ్మరం చేసినట్లు రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో భారత తీర రక్షక దళం నౌకాదళం, ఇతర సంబంధిత విభాగాలు సమన్వయంతో విస్తృత సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అమలాపురం పార్లమెంట్ సభ్యులు హారీష్ బాలయోగి మంగళవారం కేంద్ర రక్షణ మంత్రిని కలిసి గల్లంతైన మత్స్యకారుల కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలపై చర్చించిన అనంతరం కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ భారత తీర రక్షక దళాన్ని మరింత అప్రమత్తం చేసిందని మంత్రి తెలిపారు. ఐసీజీ ప్రధాన కార్యాలయంలోని డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (ఆపరేషన్స్) ఆదేశాల మేరకు కోల్‌కతాలోని తూర్పు, ఈశాన్య కమాండ్లను కూడా కార్యాచరణలోకి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. గాలింపు పరిధిని విస్తరించి, ఆపరేషన్‌ను వేగవంతం చేసేందుకు సమీప సముద్ర జలాల్లో ఉన్న 15 ఐసీజీ నౌకలు, నాలుగు హెలికాప్టర్లను మంగళవారం రంగంలోకి దించినట్లు మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. మెరైన్ రెస్క్యూ కోఆర్డినేషన్ సెంటర్ ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్ నిఘా ఏకకాలంలో కొనసాగుతోందన్నారు. గల్లంతైన పడవకు సంబంధించిన సమాచారం లేదా ఆచూకీ లభించే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని మయన్మార్, బంగ్లాదేశ్ సముద్ర అధికారులను కూడా అప్రమత్తం చేసినట్లు తెలిపారు. పడవ విదేశీ జలాల్లోకి కొట్టుకుపోయి ఉండవచ్చనే అవకాశంతో పాటు, ఇంజిన్‌లో సాంకేతిక లోపం కారణంగా సముద్రంలో ఎక్కడైనా నిలిచిపోయి ఉండవచ్చన్న కోణంలోనూ భారత తీర రక్షక దళం పరిశీలన జరుపుతోందని మంత్రి వివరించారు. ఎంఆర్‌సీసీ చేపడుతున్న ఎలక్ట్రానిక్ నిఘాతో పాటు వివిధ సముద్ర అధికారుల నుంచి అందుతున్న సమాచారాన్ని ఎప్పటికప్పుడు విశ్లేషిస్తున్నట్లు చెప్పారు. సముద్ర ప్రవాహాలు, గాలుల దిశ, వేగం, వాతావరణ పరిస్థితులతో పాటు మత్స్యకారులు సాధారణంగా చేపల వేటకు వెళ్లే మార్గాలను పరిగణనలోకి తీసుకుని గాలింపు కొనసాగిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. డైమండ్ హార్బర్, సుందర్‌బన్స్‌తో పాటు పరిసర సముద్ర ప్రాంతాల్లోనూ సెర్చ్ ఆపరేషన్‌ను విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# దొంగల కుటుంబం

**నెల్లూరు క్రైం, ఆగష్టు 25, ప్రభాతవార్త - వైద్యం:** రైల్వే రక్షణ, ప్రయాణికుల భద్రతను ధ్యేయంగా మలుచుకుని నెల్లూరు ప్రభుత్వ రైల్వే పోలీసులు భారీ విజయం సాధించారు. రైళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఘరానా దొంగలను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి భారీ మొత్తంలో సొత్తును రికవరీ చేశారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైల్వే డీఎస్పీ జి. మురళీధర్ వెల్లడించారు. ఆయన తెలిపిన సమాచారం మేరకు ఇటీవల కాలంలో రైళ్లలో జరుగుతున్న దొంగతనాలపై రైల్వే పోలీసులు రైల్వే ఐజీ రాజకుమారి ఆదేశాల మేరకు పూర్తి స్థాయిలో దృష్టి సారించారు. అందులో భాగంగా డీఎస్పీ జి. మురళీధర్ పర్యవేక్షణలో నెల్లూరు రైల్వే సీఐ ఎ. సుధాకర్, గూడూరు ఎస్ఐ ఎం. నారాయణ, నెల్లూరు ఎస్ఐ ఎన్. హరి చందనలతో కూడిన మూడు స్పెషల్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఈ ప్రత్యేక బృందాలు గూడూరు, బొగ్గులదిబ్బకు చెందిన ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. తాళ్ళూరు అనిల్ కుమార్, తాళ్ళూరు సునీల్, షేక్ కాలేషా అనే ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా అరెస్ట్ అయిన ముగ్గురూ కూడా ఒకే కుటుంబానికి చెందినవారు కావడం గమనార్హం. వీరికి తల్లిదండ్రుల సరైన ఆదరణ లేకపోవడం, స్థిర నివాసం లేకపోవడంతో చిన్నతనంలోనే చెడు వ్యసనాలకు బానిసలయ్యారు. జల్సాల కోసం, సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో దొంగతనాలను వృత్తిగా మార్చుకున్నారు. వీరంతా పాత నేరస్తులు కాగా, గతేడాది ప్రకాశం జిల్లా ఇంకొల్లు పోలీస్ స్టేషన్, గూడూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మొత్తం నాలుగు దొంగతనం కేసులు నమోదై ఉన్నాయి.

# తిరుమల సమాచారం

## మహాపూర్ణాహుతితో ముగిసిన పవిత్రోత్సవాలు



**తిరుమల, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలలో ఆనందనిలయంలోని సంపంగి ప్రాకారంలో మలయప్పస్వామి ఉత్సవ మూర్తులకు 3రోజులు జరిగిన పవిత్రోత్సవాలు మంగళవారం సాయంత్రం మహాపూర్ణాహుతితో ముగిశాయి. ఉదయం తిరుమలేశుని ఆలయం లోపల సంపంగి ప్రాకారంలో వేడుకగా శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామి యాగశాలలో హోమాలు వైదిక కార్యక్రమాలను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు, కొబ్బరిజలం తదితర సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. సాయంత్రం మహాపూర్ణాహుతి సమర్పించారు. అనంతరం ఉభయదేవేరులతో మలయప్పస్వామి ఆలయ నాలుగుమాఢవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమాల్లో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దంపతులు, ప్రధాన అర్చకుడు వేణుగోపాల దీక్షితులు, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, వివిఎస్‌ఒ అల్లం సురేంద్ర, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## 28న గోవిందరాజస్వామి ఆలయంలో శ్రావణ ఉపకర్మ



**తిరుమల, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో 28వ తేదీ శ్రావణ ఉపకర్మను ఆగమోక్తంగా భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 6.30 గంటలకు గోవిందరాజస్వామి, శ్రీ కృష్ణస్వామిని మంగళవాయిద్యాల నడుమకపి లతీర్థంలోని ఆళ్వార్‌తీర్థానికి ఊరేగింపుగా తీసుకువెళతారు. అక్కడ స్వామివారికి శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం, ఆస్థానం నిర్వహిస్తారు. అనంతరం సాయంత్రం 4.30 నుండి 6.30 గంటల వరకు ఆర్.ఎస్. మాడ వీధిలోని వైఖానసాచార్యుల ఆలయంలో భూసమేత గోవిందరాజస్వామికి ఆస్థానం నిర్వహించనున్నారు. అనంతరం స్వామివారు తిరిగి ఆలయానికి చేరుకుంటారు. శ్రావణ పౌర్ణమి పర్వదినాన నిర్వహించే ఈ పవిత్ర శ్రావణ ఉపకర్మలో భక్తులు పాల్గొని స్వామివారి దివ్య మంగళానుగ్రహాన్ని పొందాలని టిటిడి కోరింది.

## ఆర్టీసీ విద్యుత్ బస్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

**తిరుపతి, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆర్టీసి విద్యుత్ బస్సులు నడుపుతున్న డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం తక్షణమే పరిష్కరించాలని ఆర్టీసి విద్యుత్ బస్సుల డ్రైవర్స్ యూనియన్ సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ సురేష్ కుమార్‌కి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎస్ జయచంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యుడు జి.బాలసుబ్రహ్మణ్యంతో బాటు డ్రైవర్‌లు పాల్గొన్నారు. ప్రధాన కార్యదర్శి మునీంద్ర, అధ్యక్షుడు మునయ్య, కోశాధికారి యువరాజు, కేఎస్ నాయక్, వి. సోమశేఖర్, పీకే రెడ్డి, యు.విజయకుమార్, ఎం. ప్రవీణ్, సి. సోమశేఖర్, వి. హేమంత్, సి. అనిల్ కుమార్, బి. వినోద్ కుమార్, ఎస్కె మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

# వేళాపాళా లేని సర్వదర్శనం టోకెన్లు జారీ !

- ఆఫ్‌లైన్‌లో టైమ్‌స్లాట్ కోటాకోసం భక్తుల అవస్థలు
- అర్ధరాత్రి దాటాక గంటన్నరలోపే మూసివేత




**తిరుమల, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి దేశ వ్యాప్తంగా భక్తులు భారీగా తరలివస్తున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న సామాన్యభక్తుల తాకిడితో తిరుపతిలో ఆఫ్‌లైన్‌లో టిటిడి జారీచేస్తున్న సమయ నిర్దేశిత సర్వదర్శనం టోకెన్లుకు వేళాపాళా లేకుండా పోయింది. ఈ టోకెన్లు ఎప్పుడు జారీచేస్తారో.. ఎప్పుడు అయిపోతాయో అనే సమాచారం కూడా తెలియకుండా భక్తులు అవస్థలు పడుతున్నారు. రద్దీ పెరిగితే ఈ టోకెన్ల జారీకి సమయం సందర్భం లేకపోతోంది. అధికారుల ఇష్టారాజ్యంగా మారిందనేది భక్తుల నుండి వినిపిస్తున్న విమర్శలు. రోజువారీగా 10వేల సర్వదర్శనం టోకెన్లు, 2వేలు దివ్యదర్శనం టోకెన్లు (శ్రీవారి మెట్టు మార్గం) విడుదల చేస్తున్నారు. ఈ టోకెన్లకోసం దాదాపు ఏడెనిమిది గంటల సమయం తిరుపతిలోని ఆర్టీసి బస్టాండ్ సమీపంలోని శ్రీనివాసం వసతిసముదాయం, రైల్వేస్టేషన్ సమీపంలోని విష్ణునివాసంతోబాటు అలిపిరి భూదేవి కాంప్లెక్స్‌లోని కౌంటర్ల వద్ద భక్తులు బారులు తీరి ఉంటారు. భక్తుల రద్దీ పెరిగితే టిటిడి తలనొప్పిని తగ్గించుకునేందుకు ఈ టోకెన్లు ఎప్పుడు బడితే అప్పుడు జారీ చేస్తుండటం జరుగుతోంది. సాధారణంగా తిరుపతిలో ఆఫ్‌లైన్ కౌంటర్లలో మధ్యాహ్నం 1గంట ప్రాంతంలో ఈ సమయనిర్దేశిత సర్వదర్శనం టోకెన్లు జారీ చేయాల్సి ఉంది. ఈ టోకెన్లు అందుకున్న భక్తులు ఆ రోజుగానీ, మరుసటిరోజుగానీ తిరుమలకు చేరుకోవచ్చు. అయితే వీరికి ఎలాంటి వసతి సౌకర్యం గదులు కేటాయించరు. భక్తులు ఆలయం ముందుగానీ, తిరుమలలోనే పార్కుల్లో, ఖాళీస్థలాల్లో, కాటేజీల వద్ద, యాత్రికుల వసతి సముదాయాల్లో విశ్రాంతి తీసుకునే వెసులుబాటు ఉంది. ఇలా రోజుకు 12వేలమంది వరకు సామాన్యభక్తులు ఆఫ్‌లైన్‌లో టోకెన్లు పొంది తిరుమలకు వస్తుంటే ఎలాంటి టోకెన్లు, దర్శన టిక్కెట్లు లేని భక్తులు 30వేలమంది వరకు వస్తున్నారనేది టిటిడి అంచనా. అయితే తిరుమలలో వసతి మాత్రం వీరికి కేటాయించరు. **ఆఫ్‌లైన్‌కు పెరుగుతున్న డిమాండ్:** సాధారణంగానే తిరుమలకు దేశం నలుమూలల నుండి భక్తులు తరలివస్తున్నారు. మరీ వారాంతంలో ఈ భక్తుల సంఖ్య 50వేల మంది వరకు ఉంటుంది. వారాంతంలోనూ 10వేల సర్వదర్శనం టోకెన్లు మాత్రమే జారీచేస్తుండటంతో మిగిలిన వాళ్ళు సాధారణ సర్వదర్శనంపై ఆధారపడుతున్నారు. ఇలా రద్దీపెరిగితే 24గంటల పైగా భక్తులు నిరీక్షణ తప్పడంలేదు. ఇక లక్షలాదిమంది భక్తులు తమ ఇష్టదైవాన్ని శ్రీవేంకటేశ్వరస్వామిని మరింత దగ్గరగా తనివితీరా వీక్షించాలని తపన పడుతుంటారు. అలాంటి వారికి ఆలయంలోవలబంగారువాకిలిలో జయవిజయుల వరకే మహాలఘు దర్శనం చేసి పంపుతున్నారు. ఆఫ్‌లైన్‌లో జారీచేస్తున్న టైమ్‌స్లాట్ టోకెన్ల కోసం ఇప్పటికీ సమయం సందర్భం లేకుండా ఉండటంతో క్యూలైన్లలో బారులుతీరిన భక్తులు గంట సమయంలోనే ఈ టోకెన్లన్నీ జారీ అయిపోతున్నాయి. దీన్నిబట్టి సామాన్యభక్తులు స్వామివారి దర్శనానికు ఎంతటి ఆసక్తి చూపుతున్నారనేది తెలుస్తుంది. టిటిడి కూడా ఎప్పటికప్పుడు భక్తులకు సంతృప్తికర, సులభ దర్శనం చేయించేందుకు కసరత్తు చేస్తోంది. ప్రతిరోజూ తిరుమలకు చేరుకుని స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు 90వేల మంది వరకు ఉండటం విశేషం. టిటిడి పాలకమండలి, అధికారులు సామాన్యభక్తులకు దేవుని దర్శనమ్ మరింత తక్కువసమయంలో సంతోషంగా చేయించాలనే తపనతో వినూత్నంగా ఆలోచన చేస్తున్నా ఆచరణలో మాత్రం అమలుకు నోచుకోవడం లేదు. టోకెన్లతో కొండకు వచ్చినా సాధారణ సర్వదర్శనమ్‌లోనే వైకుంఠమ్ 2నుండి, రద్దీ పెరిగితే ఆలయం వెలుపల క్యూలైన్ల నుండి ప్రవేశించాల్సిన కష్టం భక్తులకు తప్పడంలేదు.

# శ్రీ రాఘవేంద్రస్వామి సన్నిధిలో రాష్ట్ర మంత్రులు

## ఆశీర్వదించిన పీఠాధిపతి



**మంత్రాలయం, ఆగస్టు 25 ప్రభాతవార్త:** మంత్రాలయంలోని ప్రసిద్ధ శ్రీ గురు రాఘవేంద్రస్వామి మఠాన్ని కర్నూలు జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డాక్టర్ బి.వి.జయనాగేశ్వరరెడ్డి, మంత్రాలయం టిడిపి ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ, జోన్-5 ఇన్‌చార్జి శ్రీనివాసరెడ్డి మంగళవారం భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రులు శ్రీ గురు రాఘవేంద్రస్వామివారి బృందావనాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మఠం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ సుబుదేంద్రతీర్థ స్వామివారు మంత్రులకు శేషవస్త్రం కప్పి, ఫల మంత్రాక్షింతలు, తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. రాష్ట్ర ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని, రాష్ట్రం అన్ని రంగాల్ల మరింత అభివృద్ధి సాధించాలని స్వామివారిని ప్రార్థించినట్లు మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. మంత్రులు మఠం దర్శనానికి ముందుగా మంచాలమ్మ గ్రామదేవతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజల శ్రేయస్సు, జిల్లాభివృద్ధి, సుఖ సంతోషాల కోసం ప్రార్థనలు చేశారు.

# దుర్గమ్మవారి సేవలో నూతన ఏపీ లోకాయుక్త



**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 25, ప్రభాతవార్త:** ఇంద్రకీలాద్రిపై అమ్మవారిని నూతన ఏపీ లోకాయుక్త జస్టిస్ టి. మల్లికార్జున రావు తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ డీఈఓ కిషోర్ కుమార్ అమ్మవారి శేష వస్త్రం, ప్రసాదాలు మరియు అమ్మవారి చిత్రపటాన్ని అందించారు. వేద పండితులు వారికి వేదాశీర్వచనం అందించారు. **- నిత్యాన్నదాన పథకానికి విరాళం:** దుర్గమ్మవారి ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి రు.1,00,150ల విరాళాన్ని బాపట్ల జిల్లా పేటేరు గ్రామంకు చెందిన భావన రుషి మంగళవారం అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం ప్రసాదం, శేషవస్త్రం, మెమెంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

# ఫొటో జర్నలిస్టు నైపుణ్యం, శ్రమ కలగలిసిన కళాకారుడు

- సి.ఆర్. మీడియా అకాడమీ ఛైర్మన్ సురేశ్ కుమార్

**విజయవాడ, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ఫొటో జర్నలిస్టు నైపుణ్యం,శ్రమ కలగలిసిన కళాకారుడని సి.ఆర్. మీడియా అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ పేర్కొన్నారు. ఫొటో కాంటెస్ట్2026 అవార్డుల ప్రధానోత్సవం మంగళవారం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో ఘనంగా నిర్వహించారు. సి.ఆర్.మీడియా అకాడమీ, ఎపి స్టేట్ క్రియేటివ్ అండ్ కల్చరర్ కమీషన్ ఈ కార్యక్రమ నిర్వహణకు తోడ్పాటునందించాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఒక ఫొటో వార్తకు ప్రాణం పోస్తుందనడం అతిశయోక్తి కాదన్నారు. ఒకఅంశాన్ని చిత్రం(ఫొటో)తో పాటు వివరించడం సంఘటనను పాఠకులకు మరింత చేరువ చేస్తుందన్నారు. తమ నలభై యేళ్ళ జర్నలిస్టు అనుభవంలో ఫిల్మ్ కెమెరాలు, డిజిటల్ కెమెరాలు, చివరికి స్మార్ట్ ఫోన్ కెమెరాలు వాడకం చూశామని, అన్ని దశల్లోనూ ఫొటోల నాణ్యత ఒకేలా ఉందని చెప్పలేమన్నారు. ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో ఫొటోగ్రఫీ రంగంలో కూడా విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయని, దానిపై ఫొటో జర్నలిస్టులు నూతన, సాంకేతిక తను అలవర్చుకోవాలని సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి రోజూ 530 కోట్ల ఫొటోలు తీస్తున్నట్లు ఒక సర్వేలో వెల్లడైందన్నారు. ఇదంతా స్మార్ట్ ఫోన్ల వల్లనే సాధ్యం అవుతోందన్నారు. అయితే, సాధారణ ఫొటోలు, వార్తల కోసం తీసే ఫొటోలతోపాటు కళాత్మక ఫొటోగ్రఫీని ప్రోత్సహించాలని ఆయన సూచించారు. గతంలో "ఇలస్ట్రేటెడ్ వీక్లీ"వంటి పత్రికలు కళాత్మక ఫొటోగ్రఫిని, ఫొటో జర్నలిస్టులను ప్రోత్సహించేవన్నారు. తాను క్లిక్ మనిపించిన ఫొటోను మనస్సుతో అనుభూతి చెంది, ఆనందించడం ఫొటో జర్నలిస్టులందరికీ అనుభవంలో ఉంటుందన్నారు. సంఘటనకు అతి చేరువలో వుండి, ఓపిగ్గా నిరీక్షించడం ద్వారా ఫొటో జర్నలిస్టులు ఎన్నో చారిత్రాత్మక ఫొటోలు తీయగలిగారన్నారు. రెండో ప్రపంచ యుద్ధం ముగింపును సూచించే ప్రసిద్ధ ఫొటో అలాంటి వాటిలో ఒకటని ఆయన గుర్తు చేశారు. సమాజంలోని మార్పులను ప్రజల జీవన విధానాన్ని, ప్రకృతి అందాలను కళ్లకు కట్టినట్లు చూపించడంలో ఫొటోగ్రఫీకి ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. సమాజంలో జరిగే సంఘటనలను భవిష్యత్తు తరాలకు భద్రపరచడంలో ఫొటో జర్నలిస్టుల పాత్ర కీలకమన్నారు.

## శ్రీశైలంలో క్యూకాంప్లెక్సు

**శ్రీశైలం ప్రాజెక్ట్, ఆగస్టు 25 ప్రభాతవార్త:** శ్రీశైల దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్‌నాయుడు అధ్యక్షతన ధర్మకర్తల మండలి 10వ సమావేశం పరిపాలన భవనంలో నిర్వహించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు పాల్గొనగా, సమావేశంలో మొత్తం 18 అంశాలు చర్చించారు. వీటిలో 15 అంశాలు ఆమోదించారు. మిగతా 3 అంశాలను వాయిదా వేశారు. సమావేశ ప్రారంభంలో ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్‌నాయుడు మాట్లాడుతూ క్షేత్రపరిధిలో మౌలిక సదుపాయాల కల్పనకు మరిన్ని చర్యలు తీసుకుంటామన్నారు. సామాన్య భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు అవసరమైన సదుపాయాలను కల్పిస్తామన్నారు. శ్రీశైలం క్షేత్రాన్ని దర్శించే సామాన్య భక్తుల సౌకర్యాల కల్పనకే ప్రాధాన్యత ఇస్తామన్నారు. ముఖ్యంగా క్షేత్రాన్ని దర్శించే ప్రతీ భక్తుడిని ఒక అతిథిగా భావిస్తున్నామన్నారు. అందుకు అనుగుణంగా ఆయా సౌకర్యాల కల్పనను చేపడతామని వివరించారు. సర్వదర్శనం క్యూలైన్లలోని భక్తుల సౌకర్యార్థం ప్రతీ శని,ఆది, సోమవారాలలో ఉదయం, మధ్యాహ్నవేళలో శ్రీస్వామివారి స్పర్శదర్శనాన్ని పూర్తిగా నిలుపుదల చేయడం జరిగిందన్నారు. సామాన్య భక్తులకు ఇబ్బందులు లేకుండా కేవలం రాత్రి వేళలో మాత్రమే శ్రీస్వామివారి స్పర్శదర్శనం కల్పిస్తున్నామన్నారు. భక్తుల సౌకర్యార్థం నిర్మించతలపెట్టిన క్యూకాంప్లెక్సు నిర్మాణ పనులను వీలైనంత త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఇప్పటికే ఈ నిర్మాణానికి సంబంధించిన డి.పి.ఆర్ దాదాపుగా పూర్తి కావచ్చిందన్నారు. మొత్తం ఒకేసారి 12వేల మంది భక్తులు వేచివుండే విధంగా 3 అంతస్తులుగా ఈ క్యూకాంప్లెక్సు నిర్మించాలని భావిస్తున్నామన్నారు. ఈ నెల 29 నుంచి 31 వరకు సిద్ధవట ఆలయంలో నూతన ధ్వజప్రతిష్ఠా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

## బ్రహ్మోత్సవాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత

**తిరుమల, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని భక్తులకు పరిశుభ్రమైన వాతావరణం, నాణ్యమైన ఆహారం అందించేందుకు టిటిడి ఆరోగ్యశాఖ ముందస్తు చర్యలు చేపట్టింది. టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి ఆదేశాల మేరకు తిరుమలలోని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ఇకపై ప్రతి మంగళవారం "క్లీనింగ్ డే" ప్రత్యేకంగా నిర్వహించాలని నిర్ణయించింది. ఇటీవల ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల పరిసరాల్లో అపరిశుభ్రత నెలకొంటోందని భక్తుల నుంచి ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో డిప్యూటీ ఇఒ సోమన్నారాయణ ఆదేశాల మేరకు ఆరోగ్యశాఖ అధికారులు ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. వారం రోజుల పాటు వ్యాపార కార్యకలాపాలు నిర్వహించే దుకాణాల పరిసరాల్లో పేరుకుపోయే వ్యర్థాలు, మురికి తదితరాలను తొలగించి పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి మంగళవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను మూసివేసి సంపూర్ణంగా శుభ్రం చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు.

## భక్తుల భద్రతకు అధిక ప్రాధాన్యతనివ్వాలి



**తిరుమల, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలకొండపై రానున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భక్తులకు సురక్షి తమైన సౌకర్యవంతమైన రవాణా సేవలు అందించాలని తిరుపతి జిల్లా రవాణాశాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ సూచించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు తిరుపతికి దేశం నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున జీపులు, సుమోలు, టాక్సీ డ్రైవర్లు బాధ్యతాయుతంగా, క్రమశిక్షణతో భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ విధులు నిర్వహించాలని తెలిపారు. ప్రయాణికుల నుండి అధిక చార్జీలు వసూలు చేయడం, అనుమతించిన ప్రయాణికుల సంఖ్యకు మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం, వాహనాలను నిరక్ష ్యంగా నడపడం వంటి చర్యలకు పాల్పడరాదని స్పష్టం చేశారు. తిరుమల పోలీస్, తిరుపతి జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో జీపులు, సుమోలు, టాక్సీ డ్రైవర్లు వివిధ స్టాండ్‌ల అసోసియేషన్ సభ్యులతో సమన్వయ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్, తిరుపతి ట్రాఫిక్ డిఎస్పీ కొండయ్య, అలిపిరి ఎవిఎస్ఒ రమేష్‌కృష్ణ, ట్రాఫిక్ సిఐ భాస్కర్ నాయక్, ఈ సందర్భంగా డ్రైవర్లకు బ్రహ్మోత్సవాల సమయంలో పాటించాల్సిన ట్రాఫిక్, రవాణా మరియు రోడ్డు భద్రతా నియమాలపై

## నకిలీ బంగారం తాకట్టు

**తిరుపతి, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** యాత్రాస్థలం తిరుపతినగరంలో ముగ్గురు కేటుగాళ్ళు కుదువవ్యాపారులను నమ్మించి నకిలీ బంగారం పెట్టి పెద్ద మొత్తంలో నగదుతో ఉడాయించారు. ఈ ఉదంతం మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వెలుగుచూసింది. తిరుపతిలో వివిధ ప్రాంతాల్లో కేటుగాళ్ళు మూడు కుదువ దుకాణాల్లో దాదాపు 60 గ్రాముల నకిలీ బంగారం పెట్టి రూ. 5.24లక్షలు నగదు తీసుకున్నారు. తిరుపతి లక్ష్మీ ్మపురం సర్కిల్లో ఉన్న భవాని పాన్ బ్రోకర్, దేవేంద్ర పాన్ బ్రోకర్, ఎల్ ఎస్ నగర్ లోని వినాయక కుదువ దుకాణాల్లో వ్యాపారులు మోస పోయారు. అంకిత, భాస్కర్ నాయుడు పేర్లతో ఉన్న ఆధార్ కార్డులు చూపించి నగదు పొందినట్లు పోలీసుల ఫిర్యాదులో ఉంది. ఆ బంగారు నగల హాల్ మార్క్ నమ్మి నగలు తీసుకొని కుదువ పెట్టుకున్న వ్యాపారస్తులు. సాధారణంగా నగలను చూసి డబ్బులు తీసుకోవడం పరిపాటి. అయితే తిరుపతిలో కుదువ వ్యాపారులు (పాన్‌బ్రోకర్స్) చిరునామాల కోసం ఆధార్‌కార్డులు, తెలిసిన నమ్మకైన వ్యక్తులతోనే వ్యాపార లావాదేవీలు

# ఉచితాలకు వ్యతిరేకం

- ప్రభుత్వాలు ఉచితాలకు స్వస్తి పలకాలి
- విద్య, వైద్యం ఉచితంగా అందించాలి
- విద్యార్థులు నైపుణ్యం పెంపొందించుకోవాలి
- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు



**వింజమూరు(నెల్లూరు), ఆగస్టు 25 ప్రభాతవార్త:** విద్యార్థులు కేవలం డిగ్రీలకే పరిమితం కాకుండా దేశ ప్రగతికి ఉపయోగపడేలా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని భారత మాజీ ఉపరాష్ట్రపతి, పద్మవిభూషణ్ ముప్పవరపు వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం వింజమూరులోని వైఆర్ జూనియర్ కళాశాల స్వర్ణోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యను అభ్యసించి, పట్టుదలతో లక్ష్యాలను సాధించి దేశానికి సేవ చేయాలన్నారు. ఉపాధ్యాయ వృత్తి ఒక పవిత్ర ధర్మమని, అధ్యాపకులు తమ ప్రవర్తనతో, వాత్సల్యంతో విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. స్వర్ణభారతి ట్రస్ట్ ద్వారా సెల్ ఫోన్ రిపేరింగ్, టీవీ, రిఫ్రిజిరేటర్, మోటార్ రివైండింగ్, నర్సింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ వంటి వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నామని, దీని వల్ల యువత సొంత కాళ్లపై నిలబడుతున్నారని తెలిపారు. కేవలం సాధారణ డిగ్రీల వల్ల ఉపయోగం లేదని, వృత్తి విద్యా విధానం వల్లనే నిజమైన ఉపాధి లభిస్తుందని స్పష్టం చేశారు. పిల్లల్లో చిన్నప్పటి నుంచే దేశభక్తి, సమయపాలన, మన కట్టు బొట్టు, ఆటపాటలపై గౌరవం పెంపొందించాలన్నారు. వేషభాషలు, కులమతాలు వేరైనా మనమంతా భారతీయులమనిగర్వించాలన్నారు. తెలుగు భాషను తప్పక నేర్పించాలని, తెలుగు మీడియంలో చదువుకున్న వారు సైతం సుప్రీంకోర్టు న్యాయమూర్తుల స్థాయికి ఎదిగారని గుర్తు చేశారు. పిల్లలు పెద్దలతో ఎక్కువ సమయం గడపాలని సూచించారు. ప్రభుత్వాలు నడిపే పెద్దలు ప్రజలను ఉచితాల నుంచి దారి మళ్లించాలని వెంకయ్య నాయుడు సూచించారు.

"నేను ఉచితాలకు వ్యతిరేకం. ప్రభుత్వం వద్ద డబ్బులు లేకపోతే ఉచితాలు ఎలా ఇస్తారు? అడిగినా, అడగకపోయినా అన్నీ ఫ్రీ ఇవ్వడం సరికాదు. ఫ్రీ ఇవ్వాల్సి వస్తే విద్య, వైద్యం మాత్రమే ఉచితంగా ఇవ్వాలి. రోడ్లు, కరెంటు, మంచినీరు, రైతుకు 24 గంటల విద్యుత్, ఆసుపత్రిలో వైద్యుడు, మందులు ఉండేలా చూడాలి" అని అన్నారు. బస్సుల్లో అందరికీ ఉచితం కాకుండా అంగవైకల్యం కలిగిన వారికి మాత్రమే ఇవ్వాలని, స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లైనా ఇంకా ఉచితాలు ఇవ్వడం అర్థరహితమన్నారు. దేశ ప్రజల కోసం ప్రధాని మోడీ ఏటా రూ.82 వేల కోట్లు ఖర్చు చేసి పేదలకు బియ్యం అందిస్తున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు అమరావతి రాజధాని కావడం మనందరి అదృష్టమని, దానికి గొప్ప చరిత్ర ఉందని అన్నారు. దానిపై ఇంకా కొందరు రాజకీయం చేయడం సరికాదని, మన పూర్వీకులను గౌరవించుకోవడం మన సంప్రదాయమని పేర్కొన్నారు.

## ఎఇఇ నియామక పరీక్షకు 81 శాతం హాజరు

**తిరుపతి, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎస్‌పిడిసిఎల్ పరిధిలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి నిర్వహిస్తున్న నియామక పరీక్షల్లో ఘూడవ రోజు మంగళవారం 81 శాతం హాజరయ్యారు. ఎస్‌పిడిసిఎల్ పరిధిలోని 27 పరీక్షా కేంద్రాల్లో ఉదయం నిర్వహించిన ఎలక్ట్రానిక్స్ పరీక్షకు మొత్తం 5,120 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 4,040 మంది ఈ పరీక్షకు హాజరయ్యారని, అదేవిధంగా మధ్యాహ్నం జరిగిన టెలికాం పరీక్షకు 4,764 మంది హాజరు కావాల్సి ఉండగా, 3,967 మంది అభ్యర్థులు హాజరయ్యారని ఎస్పీడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు, పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టడంతో ఈ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని తెలియజేశారు.

## ఎసిబి డిఎస్పీ పేరుతో సైబర్ మోసం



**తిరుపతి(క్రైమ్), ఆగస్టు 25 ప్రభాతవార్త:** ఎసిబి అదికారి పేరుతో తిరుపతిలోని ఓ విశ్రాంత అధికారిని నమ్మించి సైబర్ నేరస్తుడు రూ.2 లక్షలు నగదు బదలీ చేసుకున్నాడు. ఈ ఉదంతంపై అలిపిరి పోలీసులు కేసు నమోదు చేశారు. కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్‌లో డిప్యూటీ సిటీ ప్లానర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన తిరుపతికి చెందిన వై. వెంకటరమణకు ఐదురోజుల క్రిందట గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి తాను ఎసిబి డిఎస్పీగా పరిచయం చేసుకున్నాడు. ఈయన సర్వీసులో ఉన్న సమయంలో లంచాలు తీసుకున్నట్లు ఫిర్యాదులు వచ్చాయని, రూ.5 లక్షలు చెల్లించకపోతే ఉన్నతాధికారులకు నివేదిక పంపి పెన్షన్ ప్రయోజనాలను నిలిపివేయిస్తామని బెదిరించాడు. బెదిరింపులకు భయపడిన బాధితుడు సైబర్ నేరస్థుడు సూచించిన ఫోన్ నంబర్‌కు ఆన్‌లైన్ ద్వారా రూ.2 లక్షలు బదలీ చేశాడు. మళ్ళీ మరో రూ.3లక్షలు చెల్లించాలంటూ మరుసటి రోజు మరో నంబర్ నుండి ఫోన్ చేసి వేధించడంతో సైబర్ మోసానికి గురైనట్లు గుర్తించాడు. బాధితుడు అలిపిరి పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు అలిపిరి పోలీసులు సంబంధిత సైబర్ నేరం, మోసం తదితర వర్తించే చట్టపరమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సైబర్ క్రైమ్ విభాగం సహకారంతో నిందితులను గుర్తించి, వారి కదలికలు ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివరాలను సేకరించి, నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందం దర్యాప్తు కొనసాగిస్తోంది.

## విద్యుదాఘాతంతో ఒకరి మృతి

**దగదర్తి, (నెల్లూరు) ఆగస్టు 25 ప్రభాతవార్త:** మండలంలోని దుండిగం గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై కాప దామోదర్ (47) అనే వ్యక్తి మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దుండిగం ప్రజలు, అధికారుల వివరాల ప్రకారం దామోదర్ తన ద్విచక్ర వాహనాన్ని గ్రామంలోని రహదారి వద్ద ఉంచి, సమీప బీడు పొలాల్లో సుమారు ఎనిమిది అడుగుల ఎత్తులో వెళ్తున్న 11 కేవీ విద్యుత్ వైర్ల వద్ద మృతి చెంది ఉన్నాడు 11 కెవి వైర్లను చూసుకోకుండా చెయ్యి తగిలి మృతి చెంది ఉంటాడా లేక అతనే వైర్లు తాకి మృతి చెంది ఉంటాడా అని అనుమానంతో వ్యక్తం చేస్తూ దుండిగం ప్రజలు చెప్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మహేంద్ర తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉండగా, నెల్లూరులో ఇంటర్ చదువుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## క్రీడా కార్యక్రమాల వద్ద పటిష్ట భద్రతా చర్యలు

### అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా



**తిరుపతి, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి జిల్లా కేంద్రంలో జరుగుతున్న అమరావతి ఛాంపియన్ స్పోర్ట్స్ మీట్ నేపథ్యంలో క్రీడాకారులకు పూర్తిభద్రత కల్పిస్తున్నారు. తిరుపతిలోని తారకరామ స్టేడియం, వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, పద్మావతి విశ్వవిద్యాలయం పరిసర ప్రాంతాల్లో తిరుపతి జిల్లా పోలీసులు శక్తి బృందాలను మోహరించి ప్రత్యేక గస్తీ నిర్వహిస్తున్నారు. శాప్స్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు సూచనలతో క్రీడా కార్యక్రమాలకు హాజరయ్యే విద్యార్థులు, మహిళలు, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఆయా ప్రాంతాల్లో శక్తి బృందాలు నిరంతరం పర్యటిస్తూ అపరిచితులు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచుతున్నాయి. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా మహిళ అదనపు ఎస్పీ ఎం. శ్రీలత పర్యవేక్షణలో ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆదేశాల మేరకు ప్రజల భద్రత, మహిళలు-చిన్నారుల రక్షణకు జిల్లా వ్యాప్తంగా పోలీసుల గస్తీ, నిఘా అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయి.

## వెలిగొండ ప్రాజెక్టుకు జలకళ

# మార్కాపురం జిల్లాలో సంబరాలు

- మార్కాపురం పట్టణంలో భారీ ట్రాక్టర్ల ర్యాలీ

**మార్కాపురం, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** మూడు దశాబ్దాల నిరీక్షణకు ఐదు రోజుల్లోపు తెరపడనుంది.. కరువు దుర్భిక్షంతో అల్లాడిపోతున్న పశ్చిమ ప్రాంతంలో త్వరలో కృష్ణమ్మ పరవళ్ళు తొక్కనుంది. వెలిగొండ టన్నెల్స్ ద్వారా కృష్ణా జలాలను నల్లమల్ల సాగర్‌లోకి విడుదల చేసేందుకు కూటమి ప్రభుత్వం శరవేగంగా అడుగులు వేస్తుంది. కృష్ణమ్మ జలకళతో పశ్చిమ ప్రాంత ప్రజల కష్టాలు తీరిపోనున్న రోజులు దగ్గరలో రానున్నాయి. వెలిగొండ రెండవ టన్నెల కోసం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పోరాటం చేశారు. సైకిల్ యాత్ర, రిలే నిరాహార దీక్షలు చేపట్టి మొదటి టన్నెల వల్ల ప్రజలు జరుగుతున్న అన్యాయంపై అలుపెరగని పోరాటం చేశారు. ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. రెండవ టన్నెల అవశ్యకతను గుర్తించిన అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రెండవ టన్నెల్ మంజూరు చేసింది. అయితే రెండవ టన్నెల్ కోసం అహర్నిశలు పోరాటం చేసి సాధించారు. త్వరలో విడుదల కానున్న వెలిగొండ నీటి విడుదల తో మార్కాపురం జిల్లా రూపురేఖలు మారిపోనున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని మార్కాపురం పట్టణంలో మంగళవారం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి నేతృత్వంలో భారీ ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 31వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు వెలిగొండ ప్రాజెక్టు కు ప్రారంభోత్సవం చేయనున్న సందర్భంగా కృతజ్ఞత ర్యాలీ నిర్వహించారు. మార్కెట్ యార్డ్ నుండి ప్రారంభమైన ట్రాక్టర్ల ర్యాలీ కాలేజీ రోడ్, దోర్నాల బస్టాండ్, అమ్మవారి శాల, గడియార స్తంభం సెంటర్, కంభం బస్టాండ్, కోర్టు సెంటర్, పూల సుబ్బయ్య కాలనీ మీదుగా శ్రీ అల్లూరు పోలేరమ్మ దేవస్థానం వరకు భారీ ర్యాలీ



నిర్వహించారు. అనంతరం కూటమినేతలు దేవస్థానంలో రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు పేరుమీద ప్రత్యేక పూజలు నిర్వహించారు. చంద్రబాబునాయుడు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని వేడుకున్నారు.

**నేడు భారీ బైక్ ర్యాలీ** బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు శ్రీశ్రీ అల్లూరి పోలేరమ్మ దేవస్థానం నుండి శ్రీశ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి ఆలయం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తామని నియోజకవర్గంలోని తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, జనసేన నాయకులు కార్యకర్తలు, బిజెపి నాయకులు కార్యకర్తలు వేల సంఖ్యలో బైకులతో విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ క్లస్టర్ ఇంచార్జ్ కందుల రామిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ ట్రాక్టర్ ర్యాలీలో జనసేన నియోజకవర్గ ఇన్చార్జ ఇమ్మడి కాశీనాథ్, బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి పి.వి కృష్ణారావు, టిడిపి యువ నాయకులు, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తనయుడు కందుల విగ్నేష్ రెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తిరుపతి రైల్వే స్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణకు సీనియర్ డిసిఎంగా పదోన్నతి




**తిరుపతి, ఆగస్టు 26ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి రైల్వే స్టేషన్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న కుప్పాల సత్యనారాయణకు గుంతకల్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ (సీనియర్ డిసిఎం)గా పదోన్నతి లభించింది. సీనియర్ డీసీఎంగా బాధ్యతలు స్వీకరించడంతో బాటు తిరుపతి రైల్వే స్టేషన్ డైరెక్టర్‌గా కూడా తన సేవలనుకొనసాగించనున్నారు. కుప్పాల సత్యనారాయణ రైల్వే శాఖలో స్టేషన్ మాస్టర్‌గా తన ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు. అనంతరం స్టేషన్ మాస్టర్, విజిలెన్స్ ఇన్స్పెక్టర్ తదితర కీలక హోదాల్లో బాధ్యతలు నిర్వహించారు. రైల్వే శాఖ నుండి డిప్యూటేషన్‌పై సిబిఐలో రెండేళ్లపాటు విధులు నిర్వర్తించారు. అనంతరం తిరిగి రైల్వే శాఖలో చేరి లైజన్ ఆఫీసర్‌గా, సికింద్రాబాద్ హెడ్‌క్వార్టర్స్‌లో చీఫ్ కమర్షియల్ మేనేజర్‌గా, తిరుపతి రైల్వే స్టేషన్ డైరెక్టర్‌గా వివిధ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు.



## క్యూర్ పరిధిలో టిజి సేఫ్ దాడులు

### 15 టన్నుల నాణ్యతలేని ఆహారవస్తువుల జప్తు

### పలు సంస్థలకు నోటీసులు, ఒక దుకాణం లైసెన్స్ రద్దు

**హైదరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** కల్తీ ఆహార వస్తువులపై ఉక్కుపాదం మోపేందుకు సర్కారు కొత్తగా ఏర్పాటు చేసిన రాష్ట్ర స్టాండర్డ్స్ అ థారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ (టిజి సేఫ్) మంగళవారం నాడు క్యూర్ (ఓఆర్ఆర్) పరిధిలో వ్యాపారాలు నిర్వహిస్తున్న దుకాణాలు, వ్యాపార సంస్థలపై పెద్ద ఎత్తున దాడులు నిర్వహించింది. ఈ నెల 22వ తేదీన మొదటి సారిగా దాడులు నిర్వహించిన టిజి సేఫ్ మూడు రో జుల వ్యవధిలో మరోదఫా దాడులు చేబట్టింది. కల్తీ ఆహార వస్తులను గుర్తించి తొలగించడం, గడువు ముగిసిన ఆహార ఉత్పత్తుల విక్రయాలను అడ్డుకోవడం వంటి అంశాలను పరిగణలోకి తీసుకున్న టిజి సేఫ్ అధికారులు ఈ దాడులు నిర్వహించారు. టిజి సేఫ్ కమిషనర్ అవినాష్ మొహంతి ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడుల్లో 15 బృందాలు పాల్గొనగా 32 చోట్ల తనిఖీలు జరిగాయి. దాడుల సందర్భంగా అనేకచోట్ల ఆహార వ స్తువుల విక్రయాల కేంద్రాల వద్ద పరిశుభ్రత లేకపోవడం వెలుగు చూసింది. గడువు ముగిసిన వస్తువులను అమ్ముతున్న వైనం రట్టయ్యింది. ఆ హార వస్తువులను నిలువ వుంచే పద్దతులు సవ్యంగా లేక పోవడం గుర్తించారు. కుళ్లిపోయిన కూరగాయలను మంచివిగా చెబుతూ అమ్ముతున్న ట్లు గుర్తించారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనలు చాలాచోట్ల కనిపించలేదు. ఆహార వస్తువుల ప్యాకింగ్ అనేకచోట్ల సవ్యంగా లేదు. 35 ఆహార వస్తువుల శ్యాంపుల్స్ సేకరించగా బాచుపల్లిలో బర్ఫీఘర్ స్వీట్ షాప్‌లో కనీస ప్రమాణాలు లేకుండా మిఠాయిలు తయారు చేస్తున్నందు కు దీని లైసెన్స్‌ను రద్దు చేశారు. 12 దుకాణాల ప్రమాణాలు సరిగ్గా లేకపోవడంతో వాటిని వెంటనే మెరుగు పరచుకోవాలని నోటీసులు ఇచ్చారు. నాలుగు దుకాణాలకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. దాడుల సందర్భంగా నాణ్యత లేకుండా వున్న 15 టన్నుల ఆహార వస్తువులను టిజి సే ఫ్ అధికా రులు జప్తు చేశారు. వీటి విలువ 30 లక్షల రూపాయలు వుంటుందని అధికారులు తెలిపారు.

## సుప్రీంకోర్టులో వైఎస్సార్సీపీకి ఎదురుదెబ్బ

**విజయవాడ, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** వైఎస్సార్సీపీ నేత లేళ్ల అప్పిరెడ్డి దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ప్రభుత్వ ఆదేశాలతో తమ సోషల్ మీడియా ఖాతాలు నిలిపివేశారని, అలాగే కర్నూలు, గుంటూరు జిల్లాల్లోని 4 కేసులపై వైఎస్సార్సీపీ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. అయితే ఈ పిటిషన్‌ను విచారించేందుకు జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ షీల్‌నాగు ధర్మాసనం నిరాకరించింది. ఏవైనా అభ్యంతరాలు ఉంటే హైకోర్టును ఆశ్రయించాలని సూచించింది.

## స్క్రబ్బర్ స్కామ్ నిందితుల రిమాండ్ పెంపు

**విజయవాడ, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** మాషా అల్లా స్క్రబ్బర్ స్కామ్‌లో నిందితుల రిమాండ్ గడువు నేటితో ముగిసింది. వారిని అధికారులు వర్చువల్ విధానంలో విజయవాడ కోర్టు ముందు ప్రవేశపెట్టారు. కేసును విచారించిన న్యాయమూర్తి, ఆ నిందితుల రిమాండ్‌ను కూడా సెప్టెంబర్ 8 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ కేసులో నిందితులు పలువురి స్క్రబర్లు విక్రయాలు ఇతర అంశాలపై మోసగించి, రూ.కోట్లు కొల్లగొట్టారు. దాంతో నిందితులపై పోలీసుల కేసు నమోదు చేసారు. నిందితులపై ఇతర జిల్లాల్లోను కేసులున్నాయి. ప్రస్తుతం వీరు రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు.

## సాయికృష్ణ కేసు నిందితుల రిమాండ్ పొడిగింపు

**విజయవాడ, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** సాయికృష్ణ అదృశ్యం కేసులో నిందితుల జ్యుడీషియల్ కస్టడీ నేటితో ముగిసింది. దీంతో రిమాండ్‌లో ఉన్న నాగరాజు సహా ఇతర నిందితులను అధికారులు వర్చువల్ విధానంలో విజయవాడ కోర్టులో హాజరుపరిచారు. విచారణ జరిపిన న్యాయమూర్తి, వారి రిమాండ్‌ను సెప్టెంబర్ 8 వరకు పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. సాయికృష్ణ కృష్ణలంక పోలీసు స్టేషన్‌లో లాకప్‌డెత్ అయ్యాడు. ఈ విషయాన్ని నిందితుల రిమాండ్ రిపోర్టులో సిట్ స్పష్టం చేసింది. ఈ కేసులో నిందితులందరిని పోలీసులు కోర్టు కస్టడీకి తీసుకుని విచారించారు. ప్రస్తుతం వీరంతా రిమాండ్‌లో ఉన్నారు.

## ఉమెన్ ఎపిఎల్ వేలం

**విజయవాడ, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ఉమెన్ ఆంధ్రా ప్రీమియర్ లీగ్ వేలం విజయవాడలో కొనసాగుతుంది. 191 మంది క్రీడాకారిణులు ఈ వేలంలో పాల్గొన్నారు. జనాలుగు ఫ్రాంచైజీలు ఒక్కొక్కటి రూ.15 లక్షలతో ప్లేయర్లను కొనుగోలు చేసేందుకు వీలుగా ఈ వేలం సాగుతుంది. ఈ లీగ్‌కు అంబాసిడర్‌గా మిథాలీరాజ్ వ్యవహరిస్తారు. సెప్టెంబర్ 15 నుంచి 26 వరకు మంగళగిరిలో డబ్ల్యూఏపీఎల్ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ వేలంలో అమరావతి ఈ ఛాంపియన్స్ ఫ్రాంచైజీ పలువురు కీలక క్రీడాకారిణులను సొంతం చేసుకుంది. హేమసాయి రమ్యను రూ.55 వేలకు, కర్రి సాయిపూజితను రూ.50 వేలు, నక్కా సనాను రూ.45 వేలు, ఓరుగంటి సాహితీశ్రీని రూ.40 వేలకు దక్కించుకుంది. బి.సాయిదీప్తి, తాళ్లూరి మల్లిక, బొడ్డుపల్లి తనిష్కను, సహస్రారెడ్డిని ఒక్కొక్కరినీ రూ.30 వేలకు దక్కించుకుంది. ఈ వేలంలో అమరావతి ఈఛాంపియన్స్ ఫ్రాంచైజీ పలువురు కీలక క్రీడాకారిణులను సొంతం చేసుకుంది. విశాఖకు చెందిన షబ్నంను రూ.1.30 లక్షలకు ఆ జట్టు కొనుగోలు చేసింది. నీరగట్టు అనూషను అత్యధికంగా రూ.2.10 లక్షలకు దక్కించుకుంది. అలాగే బ్యాటర్ పరసా రంగలక్ష్మిని రూ.లక్షకు సొంతం చేసుకుంది. వికెట్ కీపర్ కాత్రగడ్డ దీక్షను రూ.1.90 లక్షలకు ఈఛాంపియన్స్ కొనుగోలు చేసింది.

# హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాల కృష్ణారావుకు ఘన వీడ్కోలు

**విజయవాడ, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేణుతురుమల్లి గోపాల కృష్ణారావుకు హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ సమక్షంలో ఫుల్ బెంచ్ ఘన వీడ్కోలు పలికింది. హైకోర్టు న్యాయమూర్తి గోపాల కృష్ణారావు పదవీ విరమణ చేయనున్న సందర్భాన్ని పురస్కరించుకుని మంగళవారం హై కోర్టు మొదటి కోర్టు హాల్లో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ మాట్లాడుతూ జస్టిస్ గోపాల కృష్ణారావు నిబద్ధత కలిగిన న్యాయమూర్తని కొనియాడారు. జస్టిస్ గోపాల కృష్ణారావు ఉమ్మడి కృష్ణా జిల్లా చల్లపల్లిలో 1964 ఆగస్టు30న జన్మించారని, చల్లపల్లి, మచిలీపట్నంల్లో పాఠశాల, కళాశాల విద్యను పూర్తి చేశారన్నారు. 1989వ సంవత్సరంలో బార్ కౌన్సిల్ సభ్యుడిగా, న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించారని తెలిపారు. 1994లో ఏపీ జ్యుడీషియల్ సర్వీసెస్‌లో ఉత్తీర్ణులై జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారన్నారు. జనవరి 2023లో హై కోర్టు అదనపు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారని, 2024 ఆగస్టులో ఏపీ హై కోర్టు శాశ్వత న్యాయమూర్తిగా నియామకం అయ్యారన్నారు. జస్టిస్ గోపాల కృష్ణారావు తన పదవీ కాలంలో అనేక కీలకమైన తీర్పులను వెలువరించారని తెలిపారు. తదుపరి జిల్లా, సెషన్స్ జడ్జీగా వివిధ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారన్నారు. పదవీ విరమణ అనంతరం జస్టిస్ గోపాల కృష్ణారావు శేష జీవితం ఆయురారోగ్యాలతో ప్రశాంతంగా గడవాలని కోరుకుంటున్నామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ ఆకాంక్షించారు. పదవీ విరమణ చేయనున్న జస్టిస్ గోపాల కృష్ణారావు మాట్లాడుతూ ఉద్యోగ నిర్వహణలో సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. తన విద్యార్థి దశ నుండి న్యాయవాదిగా, న్యాయమూర్తిగా ఉన్నత శిఖరాలను చేరుకోవడానికి ప్రతి దశలోనూ ఉత్తమ సలహాలు అందించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. అంతకు ముందు అదనపు సోలిసిటర్ జనరల్ చల్లా ధనుంజయ్, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, ఎపి హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రభునాథ్ వాసిరెడ్డి జస్టిస్ గోపాల కృష్ణారావుకు పదవీ విరమణ శుభాకాంక్షలు తెలుపుతూ తమ అనుభవాలను పంచుకున్నారు.




హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాల కృష్ణారావుకు వీడ్కోలు కార్యక్రమంలో ప్రసగంగిస్తున్న సీజె జస్టిస్ లీసా గిల్

# స్థానిక సంస్థల ఎన్నికలు స్వేచ్ఛగా జరిగితే వైసిపిదే విజయం


- కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజల తీర్పు ఖాయం: వైఎస్ జగన్

**విజయవాడ, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** స్థానిక సంస్థల ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగితే వైసిపిదే విజయమని, కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు స్పష్టమైన తీర్పు ఇస్తారని ఆ పార్టీ అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్ ధీమా వ్యక్తం చేశారు. పార్టీ ముఖ్యనేతలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని, రాబోయే స్థానిక ఎన్నికలపై దిశానిర్దేశం చేస్తూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికలు కేవలం గెలుపోటములకు సంబంధించినవి మాత్రమే కావని, క్షేత్రస్థాయిలో పార్టీ కోసం శ్రమిస్తున్న కార్యకర్తలకు అండగా నిలబడాల్సిన కీలక సమయమని జగన్ పేర్కొన్నారు. గతంలో జరిగిన ఎంపిటిసి, జడ్‌పిటిసి, మున్సిపాలిటీ ఎన్నికల్లో అధికార దుర్వినియోగం, దౌర్జన్యాలు చూశామన్నారు. ఈసారి ప్రతి స్థానంలోనూ సమర్థులైన, బలమైన అభ్యర్థులను పోటీకి దింపాలని సూచించారు. అవసరమైతే నాయకులు ఏ నియోజకవర్గంలోనూ పోటీ లేకుండా ఏకగ్రీవాలకు తావు ఇవ్వకూడదని, ఒకవేళ ఎక్కడైనా ఏకగ్రీవాలు జరిగితే అక్కడి కోఆర్డినేటర్లు భవిష్యత్తులో అసెంబ్లీ అభ్యర్థులుగా కొనసాగలేరని హెచ్చరించారు. పార్టీ కేడర్ బలోపేతం కోసం 14 నుంచి 15 లక్షల క్యూఆర్ కోడ్ ఆధారిత గుర్తింపు కార్డులు సిద్ధమయ్యాయని, సెప్టెంబరు 5 నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి సమావేశాలు నిర్వహించి వీటిని పంపిణీ చేయనున్నట్లు వైఎస్ జగన్ వెల్లడించారు. 'వెన్నుపోటు పార్టీ - వెన్నుపోటు పాలన్న' అనే నినాదంతో గ్రామ స్థాయిలో వైసిపి- కూటమి పాలన మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వివరిస్తూ ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలను రక్షించుకోవడానికి నియోజకవర్గ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు లీగల్, మీడియా సెల్స్‌ను బలోపేతం చేయాలని... అవసరమైతే కేసులు హైకోర్టు వరకు తీసుకెళ్లేలా సమన్వయ వ్యవస్థ ఉండాలని తెలిపారు. అలాగే సోషల్ మీడియాను పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలని, జగన్ 2.0 సూపర్ యాప్ యూట్యూబ్, ఎక్స్ వంటి వేదికల ద్వారా నిజాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరుతూ, రాజకీయ ఒత్తిళ్లతో చట్టవిరుద్ధంగా వ్యవహరించే అధికారుల పేర్లను డిజిటల్ బుక్‌లో నమోదు చేసి, భవిష్యత్తులో చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాయకులు తమ ఈగోలను పక్కనపెట్టి, రాబోయే 60- 70 రోజులు నియోజకవర్గాల్లోనే ఉంటూ స్థానిక ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కృషి చేయాలని జగన్ పిలుపునిచ్చారు.



# అబద్ధాదలు చెప్పి పెళ్ళి చేసారు, నా గొంతు కోసారు

- మాజీ మంత్రి జోగి రమేష్ కుటుంబంపై కోడలు మేఘన సంచలన ఆరోపణలు



**విజయవాడ, ఆగస్టు 25 ప్రభాతవార్త ప్రతినిధి:** మాజీ మంత్రి జోగి రమేశ్ కుటుంబ వ్యవహారం ఏపీలో సంచలనంగా మారింది. జోగి కుటుంబంపై కోడలు మేఘన సంచలన ఆరోపణలు చేశారు. అన్నీ తెలిసే తన గొంతు కోశారంటూ ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ ఇప్పటి వరకు అండగా నిలిచిన మీడియాకు ధన్యవాదాలు తెలియజేశారు. తనకు జరిగిన అన్యాయాన్ని అందరికీ తెలిపేందుకు మీడియా ముందుకు వచ్చినట్లు చెప్పారు. ఇలాంటి రోజు వస్తుందని, ఆడపిల్లగా ఇలా మాట్లాడాల్సి రావడం చాలా బాధగా ఉందని ఆవేదన చెందారు. "నాకు జరిగిన అన్యాయాన్ని ఎదుర్కొని గట్టిగా నిలబడ్డాను. ఈరోజు ఈ పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొన్నందుకు గర్వంగా ఫీలవుతున్నా. జోగి రమేశ్, వారి కుటుంబ సభ్యులు నాపై నిందలు వేస్తున్నారు. 2025 మేలో జోగి రమేశ్ కుమారుడు రాజీవ్‌తో నాకు పెళ్లి చేశారు. మా నాన్న నా సంతోషం కోసం ఎంతో కష్టపడి ఈ పెళ్లి జరిపారు. జోగి రమేశ్ మీద నమ్మకంతో వారింటికి కోడలుగా పంపారు. అందరి ఆడపిల్లలాగా ఎన్నో ఆశలతో ఆ ఇంట్లో అడుగు పెట్టాను. కొన్ని రోజులకే నన్ను ఇబ్బందులు పెట్టడం ప్రారంభించారు. ఇద్దరి మధ్య విభేదాలు వచ్చి విడిపోవడం అనేది సహజం. కానీ రాజీవ్‌కు ఉన్న ప్రాబ్లమ్ ఆ కుటుంబ సభ్యులు అందరికీ తెలుసు. అయినా నాకు అతనితో పెళ్లి చేసి, తెలిసి తెలిసి అమ్మాయి గొంతు కోయడం అనేది పెద్ద నేరం. జోగి రమేశ్‌కు కూడా ఒక కూతురు ఉంది. ఆమెకు ఇలా జరిగితే ఏం చేస్తారు. అసలు లోపం ఉందని తెలిసి నాతో ఎలా పెళ్లి చేశారో జోగి రమేశ్ చెప్పాలి. మా ఇద్దరి మధ్య గొడవలు రావడం వల్లే విడిపోయారని జోగి రమేశ్ చెబుతున్నారు. అసలు మా ఇద్దరి మధ్య ఎటువంటి గొడవ వచ్చిందో ఆయన చెప్పాలి. అసలు విషయాన్ని పక్కదారి పట్టించేందుకే జోగి రమేశ్ నిన్న మీడియాతో మాట్లాడారు. వాస్తవాలు తెలియజేయాలనే నేడు నేను మీడియా ముందుకు వచ్చాన్ను అని చెప్పుకొచ్చారు. జోగి రమేశ్ నిన్న సింపథీ కోసం, రాజకీయం కోసం మాట్లాడినట్లుగా ఉంది. అసలు వాస్తవాలు ఏమిటో నేను పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో వివరించాను. త్వరలోనే అన్ని విషయాలు అందరికీ తెలుస్తాయి. మా వివాహం జరిగిన తర్వాత ఉన్న ఇబ్బందులను మా మావయ్య, అత్తయ్యకే వివరించాను. సమస్యలను పరిష్కరించకుండా అదనపు కట్నం తేవాలంటూ మా అత్తయ్య నన్ను హింసించింది. మాకు పొలిటకల్ బ్యాక్ గ్రౌండ్ ఉంది. తాము చెప్పిందే చేయాలని బెదిరించారు. అదనపుకట్నం తీసుకువస్తే నువ్వు హ్యాపీగా ఉంటావు.. అప్పడే అతనికి ఫీలింగ్స్ వస్తాయని అత్త మాట్లాడింది. తల్లి స్థానంలో ఉన్న శకుంతల, అర్థం చేసుకోకుండా నన్నే తప్పు బట్టారు. మా పెళ్లికి ముందు హిందువులమని చెప్పి మాకు పెళ్లి చేశారు. కానీ వారి కుటుంబం మొత్తం క్రిస్టియన్స్, ఇంట్లో హిందూ పూజలు అస్సలు చేయరు. నేను చిన్ననాటి నుంచి హిందూ పూజలు చేయడం అలవాటు. నేను వారింటికి వెళ్లిన తర్వాత కూడా ఒక్క హిందూ దేవుళ్ల ఫొటో కూడా లేదు. నేను దేవుళ్ల ఫొటో తెచ్చి పూజ చేస్తుంటే అడ్డుకుని కొట్టారు. ఎవరి నమ్మకం వాళ్లది.. కానీ మాకు క్రిస్టియన్ మతం తీసుకున్నట్లు కూడా చెప్పలేదు. హిందువులమే అని చెప్పి... మాకు ఆ ప్రకారం పెళ్లి చేశారు.. అంటే ఇది కూడా మెసం చేయడం కాదా. ఎవరినో కలిస్తే.. నడిపిస్తున్నారని చెబుతున్నారు. కానీ మా వద్ద ఇంకా చాలా ఆధారాలు ఉన్నాయి.. వాటిని కూడా త్వరలోనే బయట పెడత్తా అని తెలిపారు. అత్తగా ఉన్న శకుంతల అనేక రకాలుగా నన్ను ఇబ్బందులు పెట్టారు. కొడుకు లోపం గురించి మాత్రం మాట్లాడకుండా నిందలు నా పై మోపుతున్నారు. నేను పూజలు చేసుకునే సమయంలో అడ్డుకుని.. చేతిలో ఉన్న హారతి, అగర్ బత్తీలు లాగి పడేశారు. మీ దేవుళ్లు కూడా ఒక దేవుళ్లేనా... ఇవన్నీ ఆవేదన వ్యక్తం చేశారు.



# చిన్నారి సృజనకు స్క్రాచ్ బుక్

బుజ్జాయిల కలల ప్రపంచా న్నంతా కళ్ల ముందు ఆవిష్కరించేలా చేస్తుందీ 'స్క్రాచ్ బుక్' ఇందులో పేజీపై పాపాయి గీసే ప్రతి గీత రంగుల వారివిల్లుగా ఆరిపోతుంది. కళాప్రపంచాన్ని వారెదుట ప్రత్యక్షమయ్యేలా చేసే ఈ బుల్ల పుస్తకం గురించి తెలుసుకుందాం..

ఆర్ట్.. చిన్నా, పెద్ద సైజుల్లో మార్కెట్‌లో లభ్యమయ్యే 'ఆర్ట్ స్క్రాచ్ బుక్‌లోవన్నీ నల్లని పేజీలే. ఈ డ్రాయింగ్ బుక్‌పై చెక్క. పెన్సిల్‌నే ఉపయోగిం చాలి. కందేలు, ఏనుగు, ప్రకృతిదృశ్యం, సూర్య చంద్రులు, అంతరిక్ష మంటూ మనసు కు నచ్చిన వాటిని పెన్సిల్‌తో ఈ పేజీలపై గీస్తే చాలు. రంగురంగుల బొమ్మలు ప్రత్యక్షమవు తాయి. చిన్నారుల సృజనాత్మకతను వెలికి తీస్తాయి. పిల్లలు గీసే ఈ చిత్రలేఖనాలను జ్ఞాపకాలుగా ఫ్రేమ్స్ చేసివారి గదికి అలంకరణగా మార్చితే చాలు. వారి కళ్లల్లో ఆనందం ఇంటినంతటినీ కళకళలాడేలా చేస్తుంది. ప్రేమగా.. స్క్రాచ్ పేపర్‌నోట్ బుక్‌లో తమ మనసులోని మాటకు పిల్లలు రంగులద్దొచ్చు. ప్రత్యేక రోజుల్లో అమ్మానాన్నలకు, స్నేహితులకు ప్రేమగా ఈ పేజీలపై రంగురంగుల అక్షరాలతో శుభాకాంక్షలు రాయొచ్చు. ఆరి మనసులో భావాలను అందంగా తీర్చిదిద్ది మరీ కానుకగా అందించొచున.వీటిని తల్లిదండ్రులు ఫ్రేమ్‌లుగా మార్చి ఇంటి అలంకరణలోనూ భాగం చేసుకోవచ్చు. ఇంట్లోనే స్వయంగా.. చిన్నారుల ఆలోచన లను రంగులుగా మార్చే స్క్రాచ్ బుక్‌ను ఇంట్లోనూ తయారు చేసుకోవచ్చు. ముందుగా దళసరి షీట్‌ను సిద్ధం చేసుకొని దానిపై రంగురంగుల క్రేయాన్స్‌తో పేజి మొత్తంగా గీయాలి. రెండు చెంచాల సబ్బు నీటిలో నలుపు రంగు అక్రిలిక్ పెయింట్ గంటలు అరనిస్తేచాలు. ఆర్ట్ స్క్రాచ్ పేజీ సిద్ధమైనట్టే. □

# ఫేస్‌వాష్ వాడుతుంటే..



మీ చర్మ సౌందర్యానికి పేస్‌వాష్ ఎంతగానో ఉపయోగపడు తుంది. ఎవరినో గుడ్డిగా అనుసరించక.. మీకు అనువైనదేదో మీరే ఎంచుకోండిలా..

ముఖం శుభ్రం చేసుకోవడానికేగా.. ఏదైతేనేం చాలామంది ఇలాగే అనుకుని అశ్రద్ధ చేస్తారు. క్రీములపై పెట్టన శ్రద్ధ దీనిపై పెట్టరు. కానీ అదే తగదు. మీది జిడ్డుచర్మం, యాక్నే కూడా ఉంటే జెల్, క్లే రకాలను ఎంచుకోండి. ఇవి నూనెల విడుదలనుతగ్గించడమే కాదు..యాక్నేకి కారణ మయ్యే బ్యాక్టీ రియానూ దూరం చేస్తాయి. పొడి, సెన్సిటివ్ చర్మాల వాళ్లకి క్రీమ్ తరహావి నప్పు తాయి. ఫోమ్ క్లెన్సర్లు కాంబి నేషన్ చర్మం ఉన్నవారికి సరిపోతాయి. అదే మిసెల్లర్ రకాలనుకోండి.. ఏచర్మరకమైనా ఎంచుకోవచ్చు. ఇక యాక్నే, బ్లాక్, వైట్ హెడ్స్ ఇబ్బంది పెడుతోంటే సాల్సిలిక్ యాసిడ్, బెంజైల్ పెరాక్సైడ్ ఉండేలా చూసుకోవాలి. టీట్రీ ఆయిల్ రకాల్లోని యాంటీ మైక్రోబియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలూ యాక్నేకి చెక్ పెడతాయి. చర్మం పొడిబారి ముడతలు, గీతలు వస్తోంటే హైలురోనిక్ యాసిడ్, సెరమైడ్ రకాలు కావాలి. ఇవైతే కావాల్సిన తేమను అందించి, స్కిన్ నిగనిగలాడేలా చేస్తాయి. చరనమం నునుపుగా కనిపించాలి. పిగ్మెంటేషన్ పోవాలంటే నియాసినమైడ్ చక్కని పరిష్కారం.. మీ ఫేస్‌వాష్‌లో దీనికి చోటివ్వాల్సిందే. చర్మం తీరేదైనా.. ఎంచుకున్నా క్లెన్సర్‌లో సల్ఫేట్స్, కృత్రిమ, సింథటిక్ సువాసనలు, ఆల్కహాల్, థాలేట్స్, పారాబెన్స్ వంటివి ఉండకుండా చూసుకోండి. ఇవి చర్మానికి హాని కలిగించడమే కాదు.. అప్పటికే ఉన్న సమస్యలనీ తీవ్రతరం చేయగలవు. కాబట్టి.. ఎంచుకునేప్పుడే సరిచూసుకోండి. □



# వాన జల్లు కురువగానే..

**ఎన్ని సార్లు శుభ్రం చేసుకున్నా ముఖం జిడ్డుగా మారడం, ఎంత దువ్వుకున్నా జుట్టు పిచ్చుక గూడులా తయార వడం.. వర్షాకాలంలో అధిక హ్యుమిడిటీ వల్ల తలెత్తే సమస్యలివి!**

ఇలాంటి వాతావరణాన్ని ఎదుర్కొని అందాన్ని సంరక్షించుకోవడ మంటే సవాలనే చెప్పాలి. ముఖ్యంగా కుదుళ్లు జిడ్డుగా మారడం, జుట్టు రాలడం, గడ్డిలా తయారవడం.. వంటి కేశ సంబంధిత సమస్యలు ఈ కాలంలో అమ్మాయిలకు ఎక్కువగా ఎదురవు తుంటాయి. అయితే జుట్టు ఆరోగ్యాన్ని సంరక్షించుకునే క్రమంలో కొన్ని చిట్కాలు పాటిస్తే హ్యుమిడిటీలోనూ కేశాలపట్టులా మెరిపించ వచ్చని చెబుతున్నారు చిట్కాలేంటో తెలుసుకుందాం..

**వానలో తడిశారా? ...** వానలో తడవడమంటే అందరికీ ఇష్టమే.. ముఖ్యంగా అమ్మాయిలైతే వర్షాన్ని మరింతగా ఎంజాయ్ చేస్తారు. అయితే ఇలా తడిసిన తర్వాత జుట్టును అలాగే ఆరబెట్టుకోవడం మనలో చాలామందికి అలవాటుకానీ అలా చేయకుండాచల్లటి నీటితో ఓసారి తలస్నానంన చేసి జుట్టు ఆరబెట్టు కోవాలి.

**స్టైలింగా..? వద్దే వద్దు....** జుట్టుతో రోజుకో రకమైన కొప్పు వేసుకోవడం లేదంటే వివిధ హెయిర్‌స్టైల్స్ ప్రయత్నించడం మనకు అలవాటే! అయితే ఈ క్రమంలో వేడి ఉత్పత్తి చేసే హెయిర్ స్టైలింగ్ టూల్స్ వాడక తప్పదు. అలాగని వాడితే జుట్టు ఆరోగ్యందెబ్బతినడం ఖాయం. అసలే హ్యుమిడిలీ కారణంగా జుట్టు గడ్డిలా తయారవుతుంది. దానిపై నుంచి హెయిర్‌స్టైలింగ్ చేశామంటే అది పిచ్చుక గూడులా మారిపోతుంది. కాబట్టి స్టైల్ అంటూ జుట్టును అలాగే వదిలేయడం, వివిధ రకాల హెయిర్ స్టైల్స్ ప్రయత్నించడం, హెయిర్ స్టైలింగ్ టూల్స్ వాడడంకంటే.. చక్కగా పైకి ముడే సుకోవడం/బన్ వేసుకోవడం లేదంటే నీట్‌గా జడ వేసు కోవడం మంచిది.

**నూనె పెట్టుకోవద్దు !.....** జుట్టు, కుదుళ్ల ఆరోగ్యంగా ఉండానికి తరుచు నూనె పెట్టుకోవాలి.,వర్షాకాలంలో మాత్రం ఈ అలవాటును కాస్త తగ్గించు కోవడం మంచిదంటున్నారు. ఎందుకంటే నూనెకు వర్షాకాలంలో ఉండే హ్యుమిడిటీ కూడా తోడవడంతో జుట్టు మరింత జిడ్డుగా మారుతుంది. దీనివల్ల కుదుళ్లలో చుండ్రు, ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఎక్కువ మరి, జుట్టుకు నూనె లేకపోతే ఎలా? అనుకోకడి. నూనెకు బదులు నీటి ఆధారిత సీరమ్స్ వాడవచ్చు. తద్వారా జిట్టు జిడుడ్డగా మారకుండా జాగ్రత్త పడచ్చు. అయితే మరీ అంతగా నూనె పెట్టుకోవాలనుకునే వారు పడుకునే ముందు కుదుళ్ళుజిట్టుకు నూనె పట్టించి.. ఉదయాన్నే గాఢత తక్కువగా ఉండే షాంపూతో తలస్నానం చేసేయాలి.

**ఇలాంటప్పుడు సీరమ్ మంచిదే !..** కొంతమంది జుట్టు ఎంత దువ్వినా కాసేపటికే చెదిరిపోతుంది. దీంతో పదే పదే దువ్వుకోవడం, ఎక్కడికక్కడ హెయిర్ పిన్స్/క్లిప్స్ పెట్టేయడం.. వంటివి చేస్తుంటారు. నిజానికి దీనివల్ల జుట్టు చెదిరిపోకుండా ఉండడమేమో గానీ.. పిన్స్/క్లిప్స్ పెట్టేయడం.. వంటివి చేస్తుంటాయి నిజినాకి దీనివల్ల జుట్టు చెదిరిపోకుండా ఉండడమేమో గానీ.. పిన్స్ తీసేశాక మరింత గడ్డిలాగా మారుతుంది. అందుకే అలాటి వారు జడ/హెయిర్‌స్టైల్ వేసుకోవడానికి ముందు కాస్త హెయిర్ సీరమ్‌ని

# తులసి పవిత్రం



మహిళలు భక్తి శ్రద్ధలతో తులసి మాతను పూజిస్తారు. ఈ తులసి శ్రీ మహావిష్ణువుకు ప్రీతికరమైనది. అందుకే శ్రీ మహా విష్ణువును పూజించడానికి తులసిదళం ఉపయోగిస్తారు. దేవతారాధనలో తులసి ఎంతో విశిష్టమైన స్థానం వున్నది. తులసి మొక్కలు పెరటిలో పెంచుతారు. అక్కడ పవిత్రంగా ఉంచాలి. అపరి శుభ్రత ఉండరాదు. తులసి ఆకులను మాత్రమే తుంచాలి. కొమ్మలను విరువకూడదు. పవిత్రమైన మొక్క తులసి మొక్కగా భావించాలి. సమస్త తీర్థాలు, పవిత్ర నదులు, దేవతలు అందరూ తులసి దళాల్లోనే నివసిస్తారు. అనిపురాణాలు చెబుతున్నాయి. గోదాదేవి కళ్యాణం తులసి అలంకరణతోనే జరగడం విశేషం. గంగానదిలో స్నానం చేస్తే ఎంత ఫలితం కలుగుతుందో అంతట ఫల తులసిని పూజిస్తే కలుగుతుంది. పెళ్లికాని యువతులు తులసికోటని ప్రతి నిత్యం పూజిస్తే చక్కటి ఫలితం లభిస్తుంది. తులసి పరిమళం పవిత్రంగా ఉంటుంది. భక్తి శ్రద్ధలతో తులసిని పూజిస్తే చేసిన పాపాలన్నీ పోతాయి ఓమ్‌నమో నారాయణాయ అని తలచి తులసి ఆకు తుంచాలి. 2తులసి కోట వద్ద సంధ్యా దీపం వెలిగిస్తే శివకేశవులు కొలువుంటారు. శ్రీ కృష్ణుడు, శ్రీ మహావిష్ణువు ఆరాధనలో తులసి దళం వాడకం విశిష్టమైనది. తులసి దళం ప్రాముఖ్యత గురించి విష్ణుపురాణంలో వివరించడం జరిగింది. అనవసరంగా ఎప్పుడు పడితే అప్పుడు తులసి దళాలు తుంచరాదు. పవిత్రమైన తులసి దళాలు తిరుమల శ్రీవారి అలంకారములలో తులసి దళం ఉపయోగిస్తాం. ఇంటి వాకిట తులసి కోట కళకళ లాడుతూ ఉండాలి. ప్రతి నిత్యంఅలికి ముగ్గు వేసి పరిశుభ్రత పాటించాలి. ఆయుర్వేదం లో తులసి ప్రాముఖ్యత అద్భుతంగా వివరించారు. రోజూ రెండు తలసి ఆకులనుతింటే మంచిది ఆరోగ్యకరం. □

# జ్ఞాపక వృద్ధికి..




ఒకప్పుడు పెద్దవాళ్లు మాత్రమే మతిమరపుతో బాధపడేవారు. ఇప్పుడలా కాదు. అందరికీ జ్ఞాపకశక్తి తగ్గిపోతోంది. దీనికి ఒత్తిడీ, ఆందోళనే ముఖ్య కారణం. యోగా, వ్యాయామాలతో చాలావరకూ ఒత్తిడి తగ్గుతుంది. మెదడు ఉత్సాహంగా పనిచేయాలంటే.. జీవనశైలి కూడా సరిగ్గా ఉండాలి. రాత్రి పదింటిలోపు పడుకుని ఉదయం ఐదింటికల్లా నిద్రలేవాలి. దాంతో పాటు ఈ ఆహార పదార్థాలనూ క్రమం తప్పకుండా తింటుండాలి. ✦ ఆకలి తీరితే చాలనుకుని అన్నంలో పచ్చడో, రసమో కలిపి తినడం వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదు. ప్రోటీన్లు ఉన్న పప్పుధాన్యాలు తినాలి. మంచి పోషకాహారం అందితే మెదడు చురుగ్గా పనిచేస్తుంది.

✦. ఒమేగా3 ఫ్యాటీ యాసిడ్స్, యాటీ ఆక్సిడెంట్స్ ఉన్న బాదం, పిస్తా, వాల్‌నట్స్, జీడిపప్పు లాంటివి తినడం వల్లమెదడులో కణాలు పాడు కావు. దాని పనితీరూ మెరుగవు తుంది.

✦. బ్రొకోలీలో మెదడుకు చాలా అవసరమైన కె-విటమిన్ విస్తారంగా ఉంటుంది. ఇది జ్ఞాపకశక్తి తగ్గకుండా కాపాడుతుంది.

✦. నేరేడు, స్ట్రాబెర్రీస్, రేగుపండ్లు, ఉల్లి, వెల్లుల్లి, అవొకాడోల్లో యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. ఇవి మెదడు పనితీరు బాగుండేలా చేస్తాయి. అప్పుడప్పుడూ డార్క్ చాక్లెట్ తిన్నా మెదడు పనితీరులో సమస్య రాదు. ✦ చివరగా మరో విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఏదో తప్పదన్నట్టుగా కాకుండా. ఆస్వాదిస్తూ తినడం వల్ల ఆహారం చక్కగా వంటబడుతుంది. □



# భావోద్వేగాల కలబోత

టాలీవుడ్‌లో కమెడియన్‌గా, విలక్షణ నటుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రంగస్థలం ఫేమ్ ఆచంట మహేష్ ఇప్పుడు కథానాయకుడిగా కొత్త ప్రయాణాన్ని ప్రారంభించబోతున్నారు. ఆయన కథానాయకుడిగా, కాంచన దీప్తిరెడ్డి కథానాయికగా రూపొందుతున్న నూతన చిత్రం శివాలయం హైదరాబాద్‌లోని తెలుగు ఫిలిం ఛాంబర్‌లో పూజా కార్యక్రమాలతో సోమవారం ఘనం గా ప్రారంభమైంది. వెంకట్ రెడ్డి నంది స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న ఈ చిత్రం, ఆధ్యా త్మికతను, భక్తి భావాన్ని మానవ భావోద్వేగాలతో సమ్మిళితం చేస్తూ సాగనుంది. ముహూర్తపు సన్నివేశానికి దిల్ రమేష్ కెమెరా స్విచ్ ఆన్ చేయగా, నటుడు ఘర్షణ శ్రీనివాస్ తొలి క్లాప్ కొట్టారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ వ్యవసాయవేత్త కళ్లెం నరసింహారెడ్డితో పాటు పలువురు సినీ ప్రముఖులు హాజరై చిత్రయూనిట్‌కు అభినందనలు తెలిపారు. దేవుడి నేపథ్యంలో వచ్చే కథలకు ప్రేక్షకుల్లో ఎప్పుడూ ఆదరణ ఉంటుందని, ఈ సినిమాలో తాము ఒక మంచి భక్తిరస కథాంశంతో పాటు బలమైన భావోద్వేగాలను చూపించబోతున్నామని చిత్రబృందం పేర్కొంది. ఈ ప్రాజెక్ట్ కోసం గత ఆరు నెలలుగా ప్రీప్రొడక్షన్ పనులు వేగంగా సాగాయని, త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిం చనున్నట్లు మేకర్స్ వెల్లడించారు.



# ప్రియురాలితో మూడు ముళ్లు

టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో ప్రిన్స్ సెసిల్ వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టారు. తన సుదీర్ఘకాల ప్రియురాలు సాయి ప్రతిమను ఆయన పెళ్లి చేసుకున్నారు. న్యూజిలాండ్‌లోని అత్యంత రమణీయమైన వనాకా ప్రాంతంలో హిందూ సంప్రదాయ పద్ధతిలో వీరి వివాహ వేడుక అత్యంత వైభవంగా జరిగింది. ప్రకృతి ఒడిలో జరిగిన ఈ వేడుకకు ఇరు కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ వేడుకలో వధువు సాయి ప్రతిమ ఎరుపు రంగు పట్టుచీర, సంప్రదాయ ఆభరణాలతో రాయల్ లుక్‌లో మెరిసిపోగా.. వరుడు ప్రిన్స్ ఐవరీ కలర్ ప్రింటెడ్ పైజామాలో రాజకుమారుడిలా కనిపించారు. వీరిద్దరి ప్రేమ ప్రయాణం ఒక ఆసక్తికర పరిణామంతో మొదలైంది. ప్రముఖ నటుడు ప్రియదర్శి ద్వారా ఒక కామన్ ఫ్రెండ్ పెళ్లిలో ప్రిన్స్, సాయి ప్రతిమలకు తొలిసారి పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కొద్దిరోజుల్లోనే స్నేహంగా, ఆ తర్వాత ప్రేమగా మారి ఇప్పుడు పెళ్లి పీటల వరకు తీసుకెళ్లింది.

## తెర

# సూరి కోసం అప్సరసలు ఎందుకు వచ్చారు?



ఒకప్పుడు కామెడీ కింగ్‌గా వరుస విజయాలతో అలరించిన అల్లరి నరేష్, గత కొన్నేళ్లుగా సీరియస్ కథాంశాలు ఉన్న సినిమాలు చేస్తూ వస్తున్నారు. నటుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నప్పటికీ, బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాలను సాధించలేకపోయారు. ఈ క్రమంలో మళ్లీ తనకు అలవాటైన సొంత జోనర్ వైపు అడుగులు వేస్తూ, అవుట్ అండ్ అవుట్ ఫన్ అండ్ ఫాంటసీ ఎంటర్‌టైనర్‌గా రంభ ఊర్వశి మేనక చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ పతాకాలపై రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రానికి చంద్రమోహన్ చింతడ దర్శకత్వం వహించారు. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, టీజర్ ఆకట్టుకోగా, సెప్టెంబర్ 4న సినిమా విడుదల కానున్న నేపథ్యంలో మేకర్స్ తాజాగా ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. చిన్నతనం నుంచి సూరి (అల్లరి నరేష్) దేవలోకం నుండి రంభ, ఊర్వశి, మేనక అనే ముగ్గురు అప్సరసలు భూమిపైకి వచ్చి తన కోరికలు తీరుస్తారని గట్టిగా నమ్ముతుంటాడు. అనుకోకుండా దేవేంద్రుడికి తెలియకుండా ఆ ముగ్గురు అప్సరసలు సూరి కోసం భూమిపైకి వస్తారు. ఈ విషయం తెలుసుకున్న దేవేంద్రుడు ఆగ్రహంతో వారి శక్తులను తీసివేస్తాడు. దీంతో సూరి ఆశలు ఆవిరైపోతాయి. అసలు సూరి కోసం వారు ఎందుకు వచ్చారు? ఆ తర్వాత ఎదురైన విచిత్రమైన, హాస్యభరితమైన పరిస్థితులు ఏంటి? దేవేంద్రుడికి సూరిపై ఉన్న కోపానికి కారణమేంటి? సూరి అసలు కోరికలు నెరవేరాయా లేదా? అనేదే ఈ చిత్ర ప్రధాన కథాంశం. అల్లరి నరేష్ తనదైన కామెడీ టైమింగ్, పంచ్ డైలాగులతో ట్రైలర్‌ను ఆద్యంతం వినోదాత్మకంగా నడిపించారు. దర్శకుడు బోయపాటి శ్రీను సిగ్నేచర్ హావభావాలను ఇమిటేట్ చేయడం, అలాగే చివర్లో ఓజీ సినిమాలోని వాషీ.. ఓ వాషీ డైలాగ్‌ను తన శైలిలో పలకడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

సిద్ధార్థ్ మల్హోత్రా, తమన్నా భాటియా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న బాలీవుడ్ భారీ చిత్రం ది వీవాన్ నుంచి క్రేజీ అప్‌డేట్ వచ్చేసింది. దీపక్ మిశ్రా దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా టీజర్ విడుదల తేదీని నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. ఈ నెల 25న టీజర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు వెల్లడించారు. తాజాగా సూర్యాస్తమయం తర్వాత ఎక్కడికి వెళ్లడం నిషిద్ధమో.. కథ అక్కడి నుంచే మొదలవుతుంది.

# చీకటి పడ్డాక నిషిద్ధ ప్రాంతం నుంచే..

సెప్టెంబర్ 25న ఆ గర్జన వినిపించబోతోంది అనే శక్తివంతమైన డైలాగ్‌తో మేకర్స్ కొత్త వీడియో గ్లింప్స్‌ను విడుదల చేశారు. శతాబ్దాలుగా ఎదురుచూస్తున్న ది వీవాన్ ఎవరు? అతడి రహస్యమేంటి? అనే ఆసక్తికరమైన అంశాలతో ఈ కథనం సాగనుందని తెలుస్తోంది. సిద్ధార్థ్ మల్హోత్రాను ఇప్పటివరకు చూడని విభిన్నమైన అవతార్‌లో చూపించబోతుండటంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అరుణాభ్ కుమార్ కథను అందించిన ఈ చిత్రాన్ని బాలాజీ మోషన్ పిక్చర్స్ బ్యానర్‌పై శోభా కపూర్, ఏక్తా ఆర్. కపూర్, అరుణాభ్ కుమార్, నీరజ్ కొఠారి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో సునీల్ గ్రోవర్, మనీష్ పాల్, శ్వేతా తివారీ, సోనియా అన్ను కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా సెప్టెంబర్ 25న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది.

# ధర్మాధర్మాల మధ్య పోరు



హనుమాన్ ప్రపంచవ్యాప్త విజయం తర్వాత ప్రశాంత్ వర్మ క్రియేటివ్ యూనివర్స్ నుంచి రాబోతున్న అత్యంత ప్రతిష్టాత్మక పౌరాణిక ఫాంటసీ చిత్రం మహాకాళి. పూజ అపర్ణ కొల్లూరు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా నుంచి మేకర్స్ తాజాగా విడుదల చేసిన శుక్రాచార్య వార్ క్రై గ్లింప్స్ ఇప్పుడు సినీ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇటీవల ధురంధర్ చిత్రంతో ఆకట్టుకున్న బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా, ఈ సినిమా ద్వారా తెలుగులోకి అరంగేట్రం చేస్తూ అసుర గురువు శుక్రాచార్యుడిగా కనిపించనున్నారు. పొడవైన తాపసి గడ్డం, రుద్రాక్షలు, జటాజూటంతో గుర్తు పట్టలేనంత తీవ్రమైన విలనిజం నిండిన అక్షయ్ ఖన్నా లుక్ ఈ గ్లింప్స్‌కి ప్రధాన ఆకర్షణగా నిలిచింది. గ్లింప్స్‌లో శంకరాచార్య గొంతుతో సాగే ఏది ధర్మం.. ఏది అధర్మం? అనే ప్రశ్నలు దేవతలు, అసురుల మధ్య ఉన్న వైరాన్ని లోతుగా విశ్లేషించేలా ఉన్నాయి. క్షీ రసాగర మధనంలో అమృతం కేవలం దేవతలకే దక్కడం, అసురులకు జరిగిన అన్యాయాన్ని ప్రశ్నిస్తూ సాగే డైలాగ్స్ ధర్మాధర్మాల గీతను ప్రశ్నించేలా రూపొందించారు. వీడియో ముగింపులో నటి శ్రియా రెడ్డి పెద్దమ్మ చూస్తుంది రా!... అంటూ పవర్‌ఫుల్ అవతారంలో మెరిసి సర్‌ప్రైజ్ చేశారు. భూమి శెట్టి, రోహిత్ సరాఫ్, సముద్రఖని తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని 2027 జనవరి 8న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు ఆర్కేడీ స్టూడియోస్ అధికారికంగా ప్రకటించింది.



# 1500 మందితో డబ్బింగ్

దర్శధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్ బాబుల క్రేజీ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ ప్రెస్టీజియస్ పాన్ వరల్డ్ మూవీ వారణాసి. గ్లోబల్ ప్రేక్షకులను రీచ్ అవ్వడం కోసం ఈ చిత్రాన్ని 50 కంటే ఎక్కువ భాషల్లో డబ్బింగ్ చేయాలని జక్కన్న నిర్ణయించారు. ప్రస్తుత ట్రెండ్ ప్రకారం సింథటిక్ వాయిస్ ఉపయోగించి సులభంగా డబ్బింగ్ చేసే వెసులుబాటు ఉన్నప్పటికీ, రాజమౌళి మాత్రం నాణ్యత, సహజత్వంకే ప్రాధాన్యతనిస్తున్నారు. ఏ దేశ ప్రేక్షకుడు చూసినా ఆ పాత్రలోని భావోద్వేగాలు నేరుగా కనెక్ట్ అవ్వాలనే ఉద్దేశంతో ఒరిజినల్ వాయిస్ ఆర్టిస్టులనే ఎంపిక చేస్తున్నారు. దీని కోసం దాదాపు 1500 మందికి పైగా డబ్బింగ్ ఆర్టిస్టులతో ఆడిషన్లు నిర్వహిస్తున్నట్లు సమాచారం.

# సబ్‌స్క్రిప్షన్ లేకుండా ఓటీటీ ప్లాట్‌ఫామ్

సామాజిక సేవా సంస్థ యువర్ బ్యాకర్స్ ఫౌండేషన్ డిజిటల్ వినోద రంగంలోకి అడుగుపెడుతూ యువర్ బ్యాకర్స్ ప్లే పేరుతో ప్రపంచంలోనే మొట్టమొదటి లాభాపేక్ష లేని డిజిటల్ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ను ఆవిష్కరించింది. నగరంలో జరిగిన ఈ ప్రారంభోత్సవ వేడుకకు తమిళ చిత్రసీమకు చెందిన ఫెఫ్సీ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి, సీనియర్ నటుడు ఎస్వీ శేఖర్ తదితర ప్రముఖులు హాజరై యాప్‌ను ప్రారంభించారు. ఈ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో సినిమాలు చూసేందుకు ఎలాంటి సబ్‌స్క్రిప్షన్ లేదా నెలవారీ రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు. వీక్షకులు ఉచితంగానే సినిమాలు తిలకించవచ్చని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కిశోర్ ఆదిత్య తెలిపారు.

# పుస్తక రూపంలో రజనీకాంత్ జీవితకథ

సూపర్ స్టార్ రజనీకాంత్ తన సుదీర్ఘ సినీ ప్రయాణాన్ని, వ్యక్తి గత అనుభవాలను పుస్తక రూపంలో అభిమానులకు అందించ బోతున్నారు. ఈ విషయాన్ని ఆయన కుమార్తె సౌందర్య రజనీకాంత్ ఒక ఇంటర్వ్యూలో అధికారికంగా వెల్లడించారు. ఐదు దశాబ్దాల సినీ ప్రయాణంలో రజనీ సాధించిన విజయాలు, ఎదుర్కొన్న సవాళ్లతో ఈ పుస్తకం ప్రత్యేకంగా రూపుదిద్దుకుంటోంది. పరమహంస యోగానంద రాసిన ఒక యోగి ఆత్మకథలాగే ఈ పుస్తకం కూడా తరతరాలకు స్ఫూర్తినిస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు.



# మైసూరు ప్యాలెస్‌లోన ఉండాల్సిందాన్ని..

మూవింగ్ డ్రీమ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్‌పై మేరుం భాస్కర్ నిర్మాణంలో, జై జ్ఞాన ప్రభ తోట దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం ధర్మస్థల నియోజకవర్గం. తాజాగా ఈ సినిమా నుంచి విడుదలైన న్యాయం చేయరా దేవుడా థియేట్రికల్ ఎక్స్‌టెండెడ్ వీడియో సాంగ్ సోషల్ మీడియాలో విశేషంగా ఆకట్టుకుంటూ ట్రెండ్ అవుతోంది. ఆస్కార్ అవార్డ్ గ్రహీత, ప్రముఖ గేయ రచయిత చంద్రబోస్ ఈ పాటకు శక్తివంతమైన సాహిత్యాన్ని అందించగా, ఆయన చేతుల మీదుగానే ఈ సాంగ్‌ను విడుదల చేశారు. స్టార్ సింగర్ సునీత ఉపద్రష్ట తన మధురమైన, హుషారైన గాత్రంతో ఆలపించగా, సంగీత దర్శకుడు మహావీర్ యేలేందర్ అదిరిపోయే మాస్ బీట్స్‌ను సమకూర్చారు. ఈ పాటకు శ్రష్టి వర్మ అద్భుతంగా డ్యాన్స్ చేయడంతో పాటు, స్వయంగా కొరియోగ్రఫీ కూడా చేయడం విశేషం.

26 - wed 8Pg9th cheli:26 - wed 8Pg9th cheli.qxd 25/Aug/26 10:57 PM Page 1



# పిల్లలకు సొంత వైద్యమా?



సాధారణంగా చిన్న వయసులో పిల్లలు ఆడుకోవడానికి వివిధ రకాల ఆట వస్తువులను తాకుతుంటారు. వీటి నుంచి సోకే క్రిముల కారణంగా జలుబు వచ్చే అవకాశం ఉంటుంది. అలాగే వాతావరణంలో వచ్చే మార్పులు, కొత్తగా ఏదైనా ఆహార పదార్థాన్ని అలవాటు చేసినప్పుడు కూడా జలుబు చేయడం సహజం. జలుబు ఉన్నా కానీ సాధారణంగా ఆడుకుంటారు. ఎదుగుదలలో ఎలాంటి సమస్యా లేదు అంటే అది అలర్జీ వల్ల వచ్చిన జలుబుగా భావించాలి. ఇతర ఇన్ఫెక్షన్ల వల్ల జలుబు వచ్చినప్పుడు జ్వరం రావడం, సరిగా నిద్రపోకపోవడం.. వంటి లక్షణాలు కనిపిస్తుంటాయి. మొదటి రకం జలుబుకి అలర్జీకి సంబంధించిన మందులు వాడితే సరిపోతుంది. ఏదైనా ఇన్ఫెక్షన్ వల్ల జలుబు వచ్చినప్పుడు ఊపిరితిత్తుల్లో తెమడ చేరుతుంది. ఇలాంటప్పుడు శ్వాస తీసుకోవడానికి పిల్లలు ఇబ్బంది పడుతుంటారు. దానివల్ల వాంతులు చేసుకోవడం, నిద్రపట్టకపోవడం, ఆయాసపడడం.. వంటి లక్షణాలు కనిపిస్తాయి. అలాగే ఎక్కువసేపు ఏడుస్తుంటారు కూడా .ఇలాంటప్పుడు ఈ రకం నెబ్యులైజర్ వాడాల్సి ఉంటుంది. కానీ కొంతమంది ముక్కు దిబ్బడ తగ్గుతుందని జలుబు నుంచి వేగంగా ఉపశమనం పొందచ్చని సొంతం గానే నెబ్యులైజర్ వాడుతుంటారు. కానీ అది సరికాదు. డాక్టర్ సలహా మేరకు మాత్రమే నెబ్యులైజర్‌ని ఉపయోగించాలి. ఒకవేళ బాబుకి తరచుగా అలర్జీ సమస్య ఉంటే అత్యవసర సమయంలో నెబ్యులైజర్ వాడచ్చు. అయితే ప్రతిసారీ జలుబుకి నెబ్యులైజర్ ప్రత్యామ్నాయ చికిత్స కాదన్న విషయం మాత్రం గుర్తుపెట్టుకోండి. □

# మోకాలిచిప్ప సమస్యకు 'జిగురు' !

మన శరీరంలోని కీళ్లన్నింటిలో ఓ మెత్తటి ఎముక ఉంటుంది. కీలు దగ్గర కలిసే రెండు ఎముకలు ఒకదానికొకటి తగిలి రాపిడి ఏర్పడకుండా ఇది కాపాడుతుంది. దీన్నే మృదులాస్థి (కార్టిలేజ్) అంటారు. మిగతావాటికన్నా మోకాలి చిప్పదగ్గర ఉన్న ఈ మృదులాస్థి తొందరగా అరిగిపోతుంటుంది. అందువల్లే ఎక్కువమంది మోకీలు సమస్యతో బాధపడుతుంటారు. ఈ మృదులాస్థి శరీరంలోని మిగతా ఎముకల్లా తనని తాను మరమ్మతు చేసుకోలేదు. పునఃసృష్టించు కోలేదు. రక్తం దీనికి నేరుగా అందకపోవడం ఇందులో కారణం. వైద్యులు మెకాలి చిప్ప శస్త్రచికిత్స చేసినప్పుడు అరిగిపోయిన ఆ మృదులాస్థిలోని కొంతభాఘాన్ని తొలగిస్తారు. దానికిందున్న పెద్ద ఎముకకి రంధ్రాలు చేసి.. వాటి నుంచి రక్తం వచ్చేలా చూస్తారు. నేరుగా వచ్చే ఆ రక్తంతో మృదులాస్థి చాలా పెళుసుగా ఉంటుంది. చిన్న శ్రమకే విరిగిపోతుంది. ఈ సమస్య పరిష్కారానికే ఓ జిగురులాంటి పదార్థాన్ని కనిపెట్టారు అమెరికాలోని నార్త్ వెస్టర్న్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు. ఆ జిగురుని మెకాలిచిప్పలోకి నేరుగా ఇంజెక్ట్ చేస్తారు. జిగురు లోపలికెళ్లాక అందులోని ప్రొటీన్ ఆ ప్రాంతంలో టిజిఎఫ్ బీ 1 అనే రసాయనాన్ని ప్రేరేపిస్తుంది. ఆ రసాయనం అక్కడిక్కడే మృదులాస్థిని మరమ్మతు చేసి గట్టిగా ఎదిగేలా చేస్తోందట. ఇంకే సర్జరీ దీనికి అక్కర్లేదట. ఈ కొత్త విధానంతో త్వరలోనే క్లినికల్ ట్రయల్స్‌కి వెళ్తామంటున్నారు శాస్త్రవేత్తలు. □



# అల్మారాలో సర్దేద్దాం !



బ్రాండెడ్ దుస్తులకు ప్రత్యేకంగా ట్యాగ్ ఉంటుంది. అందులో వాటిని శుభ్రపరిచే విధానం నుంచి ఆరబెట్టడం , ఇస్త్రీ తదితర విషయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలన్నీ పొందుపరచి ఉంటాయి. వాటిని పాటిస్తే ఎక్కువకాలం ఆ వస్త్రం మన్నుతుంది. ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్ చేసిన దుస్తులైతే నాణ్యత తగ్గకుండా జాగ్రత్తపడితే మరిన్ని రోజులు ఆకర్షణగా కనిపిస్తాయి. చిన్న మరక పడినా ఘాటైన రసాయ నాలున్న లిక్విడ్స్‌తో మొత్తం డ్రస్‌ను శుభ్రపరిస్తే కాలక్రమేణా అది కళను కోల్పోతుంది. కొన్నిరకాల వస్త్రాలైతే త్వరగా చిరిగిపోయే ప్రమాదమూ ఉంది. దీనికి బదులుగా మరకలు పడిన ప్రాంతంలో మాత్రం సున్నితమైన డిటర్జెంట్ లేదా సహజమైన స్టెయిన్ రిమూవర్‌ని ఉపయోగించి శుభ్రపరచి ఆరనివ్వాలి. ఆ తర్వాత వస్త్రం మొత్తాన్ని సాధారణంగా ఉతికితే సరిపోతుంది. దుస్తులను చల్లనీటిలో శుభ్రపరచాలి. ముదురు వర్ణంలో ఉన్నవాటిని మొదటిసారి ఉతికే ముందు అరబకెట్ నీళ్లలో రెండుచెంచాల కల్లుప్పు వేసి అయిదు నిమిషాలపాటు నాననివ్వాలి. దాంతో రంగు దిగకుండా ఉంటుంది. ఆ తర్వాత తేలికపాటి డిటర్జెంట్‌తో శుభ్రపరిచి ఆరనిస్తే చాలు. కొన్ని డ్రెస్‌లకు అదనంగా బొత్తాలుంచిన చిన్న కవర్ అటాచ్ చేసి ఉంటుంది. బయటపడేయకుండా దాన్ని భద్రపరచాలి. బటన్ ఊడినప్పుడు ఆ డ్రెస్‌ను పక్కన పడేయ కుండా, ఆ చోట కొత్తదాన్ని కుట్టుకోవాలి. చిన్నగా కుట్టు ఊడినప్పుడు లేదా మరేదైనా మరమ్మతు ఉంటే నేర్చుకుని బాగు చేసుకోవాలి. ఇస్త్రీకి ముందుగా ఆ వస్త్రానికి తగ్గ వేడిని చెక్ చేయాలి. అలాగే అలమరలో కుక్కేయకుండా మడిచి వరసగా సర్దడం లేదా హ్యాంగర్లకు వేయడం అలవరుచుకుంటే దుస్తులు ఎక్కువ కాలం మన్నుతాయి. అలమరలలో దుస్తుల స్థానాన్ని అప్పుడ ప్పుడు మార్చుతూ ఉండాలి. లేదంటే కంటికి కనిపించేవాటిని మాత్రమే ధరిస్తాం. మిగతా వన్నీ అడుగుకు వెళుతుంటాయి. నెలకొకసారి లేదా సీజన్ మారినప్పుడల్లా దుస్తులను బయటకు తీసి వినియోగించేవీ లేదా అనవసరమైన వాటిని విడదీసి తిరిగి సర్దాలి. కొన్నింటిని రీసైకిల్ చేయొచ్చు. అలాగే వాడనివాటినివిరాళంగా ఎన్జీవోలకు అందించడం అలవరచుకోవాలి. □

# బీరపొట్టు పొడి

లేత బీరకాయ పొట్టు- అరకేజీ, వాము- చెంచా, ఎండుమిర్చి-12, మినపప్పు- రెండు చెంచాలు, పసుపు-పావుచెంచా, వెల్లుల్లి రెబ్బలు-ఏడు, చింతపండు-10గ్రా.



**తయారీ :** బీరకాయపొట్టులో చెమ్మలేకుండా చేసుకుని అరచెంచా ఉప్పు వేసి మక్సిలో బరకగా ఆడించుకోవాలి. పొయ్యిమీద పాన్ పెట్టుకుని చెంచా నూనె వేసుకుని ఎండు మిరపకాయల్ని రంగు మారేంతవరకూ వేడి చేసి పక్కనపెట్టేయాలి. ఆ తర్వాత అదేపాన్‌లో మినపప్పుని ఎర్రగా వేయించుకుని పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు పాన్‌లో చెంచా నూనె వేసుకుని వేడెక్కాక బీరకాయ పొట్టుని వేసి పొడిపొడిగా అయ్యేంతవరకూ వేయించుకోవాలి. ఇందులోనే పసుపు, వాము కూడా వేసుకుని మరికాసేపు వేయించుకోవాలి. మక్సీలో వేయించిన ఎండుమిర్చి, మనిపప్పు, వెల్లుల్లిపాయ రెబ్బలు, చింతపండు వేసి పొడి చేసుకోవాలి. ఆ తర్వాత బీరకాయపొట్టు, ఉప్పు కూడా వేసి పొడి చేసుకోవాలి. యాంటీ ఆక్సిడెంట్లు నిండుగా ఉండే ఈ పొడి.. వాముకవల్ల జీర్ణప్రక్రియ సజావుగా సాగేట్టు చేస్తుంది. □

# మెడ నలుపుకిలా..!



**అందంగాకనిపించాలని..** ఎక్కువమంది ముఖ సౌందర్యంపైనే శ్రద్ధ పెడతారు. కాళ్లు, చేతులు, మెడ వంటి భాగాలను పట్టించుకోరు. దాంతో ఆయా ప్రదేశాలు నల్లగామారి.. అందవిహీనంగా కనిపిస్తాయి. కాళ్లు, చేతులను కవర్ చేసినా.. మెడపై ఉండే నలుపు (డార్క్ నెక్)తో ఎక్కువ ఇబ్బంది పడుతుంటారు. అందంగా కని పించాలని.. ఎక్కువమంది ముఖ సౌందర్యం పైనే శ్రద్ధ పెడతారు. కాళ్లు, చేతులు, మెడ వంటి భాగాలను పట్టించుకోరు. దాంతో ఆయా ప్రదేశాలు నల్లగా మారి.. అంద విహీనంగా కనిపిస్తాయి. కాళ్లు, చేతులను కవర్ చేసినా.. మెడపై ఉండే నలుపు (డార్క్ నెక్)తో ఎక్కువ ఇబ్బంది పడుతుంటారు. ఈక్రమంలో కొన్ని చిట్కాలు పాటిస్తే.. డార్క్ నెక్ సమస్యను ఇట్టే దూరం చేసుకోవచ్చని సౌందర్య నిపుణులు అంటున్నారు. నల్లగా మారిన చర్మాన్ని తెల్లగా మార్చడంలో టమాట, నిమ్మరసంలో ఉండే విటమిన్ సి సాయపడు తుంది. తేనెలో ఉండే సుగుణాలు.. చర్మాన్ని మృదువుగా మారుస్తాయి. ఒక చిన్న గిన్నెలో కొద్దిగా టమాటా రసం, రెండుమూడు చుక్కల నిమ్మరసం, కొంచెం తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని మెడపై నల్లగా మారిన ప్రదేశంలో అప్లయి చేయాలి. అర గంటపాటు అలాగే వదిలేసి.. ఆ తర్వాత చల్లటి నీటితో కడిగేయాలి. ఆలుగడ్డలు క్లెన్సర్‌గా పనిచేస్తాయి. నిమ్మ రసం.. అద్భుతమైన బ్లీచింగ్ ఏజెంట్ కూడా. డార్క్ నెక్‌ను తగ్గించడంలో ఈ రెండిటి మిశ్రమం సమర్థంగా పనిచేస్తుంది. □

# సుదర్శన చక్రత్తాళ్వార్


దుష్ట శిక్షణ .. శిష్ట రక్షణ కోసం శ్రీమహా విష్ణువు అనేక అవతారాలను ధరించాడు. లోక కల్యాణం కోసం స్వామివారు అవతరిస్తున్నప్పుడల్లా, ఆయన ఆజ్ఞను పాటించడానికి సుదర్శన చక్రత్తాళ్వార్ కూడా వెన్నంటే వున్నాడు. ఒక్కో అవతారంలో మానుష రూపంలోనూ ఒక్కో సమయంలో ఆయుధ రూపంలోను ఆయన స్వామి ఆదేశాలను పాటిస్తూ వచ్చాడు. శ్రీమహా విష్ణువు రామావతారాన్ని ధరించినప్పుడు, ఆయన తమ్ముడు భరతుడిగా సుదర్శన చక్రత్తాళ్వార్ అవతరించాడు. కృష్ణావతారంలో సుదర్శనుడుగానే స్వామిని అంటిపెట్టుకుని వున్నాడు. పరశురామావతారంలో గొడ్డలిఖిగా అవతరించాడు. నరసింహ స్వామి



అవతారంలో ఆ స్వామి 'గోళ్ల'గా ఆవిర్భవించాడు. ఇలా స్వామివారు ఆయా అవతారాలను ధరిస్తూ ఉండగా, ఆ అవతారాల్లో స్వామివారు అప్పగించే బాధ్యతలను సుదర్శనుడు నెరవేరు స్తుంటాడు. లోక కళ్యాణం కోసం స్వామి వారు తలపెట్టిన కార్యాన్ని పూర్తి చేయడంలో తనవంతు కర్తవ్యాన్ని నిర్వహిస్తుం టాడు.

# తెర

## దివ్యమైన ఆహార్యం



యామదొంగలో యముడిగా కనిపించిన 20 ఏళ్ల తర్వాత జూనియర్ ఎన్టీఆర్ మళ్లీ మైథలాజికల్ టచ్ ఉన్న పాత్ర చేయబోతున్నారు. ఈ చిత్రంలో ఆయన కుమారస్వామి (లార్డ్ మురుగన్) ఆధారిత దివ్యమైన పాత్రలో కనిపించబోతున్నారనేది టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రచారంలో ఉన్న పవర్‌ఫుల్ టైటిల్స్ ఈ చిత్రానికి గాడ్ ఆఫ్ వార్ లేదా దేవసేనాపతి అనే పవర్‌ఫుల్ టైటిల్స్ పరిశీలనలో ఉన్నాయి. కథలోని దివ్యత్వం మరియు యాక్షన్ ఎలిమెంట్స్‌కు అనుగుణంగా త్రివిక్రమ్ టీమ్ స్పెషల్ ఎఫెక్ట్స్, లుక్ టెస్ట్‌లను సిద్ధం చేస్తోంది. వరుస పాన్‌ఇండియా ప్రాజెక్ట్‌లుఎన్టీఆర్ ప్రస్తుతం ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న డ్రాగన్ షూటింగ్ పూర్తి చేసిన వెంటనే ఈ త్రివిక్రమ్ ప్రాజెక్ట్ సెట్స్‌లోకి అడుగుపెట్టనున్నారు. త్రివిక్రమ్ శ్రీనివాస్ ప్రస్తుతం వెంకటేష్‌తో ఆదర్శకుటుంబం సినిమా పూర్తి చేసిన తర్వాత ఈ ప్రాజెక్ట్‌పై దృష్టి పెట్టనున్నారు.సంగీతం: అనిరుధ్ రవిచందర్.నిర్మాణం: హారిక అండ్ హాసిని క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నాయి.

## హిట్ మెషీన్‌కు గ్రీన్ సిగ్నల్..

సూపర్ స్టార్ మహేష్ బాబు, సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి కాంబినేషన్ మరోసారి వెండితెరపై సందడి చేయబోతోందనే వార్త ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది.



దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో మహేష్ నటిస్తున్న పాన్‌వరల్డ్ విజువల్ వండర్ 'వారణాసి' షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. టైమ్ ట్రావెల్, గ్లోబ్‌ట్రాటింగ్ అడ్వెంచర్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ భారీ చిత్రంపై ప్రపంచవ్యాప్తంగా అంచనాలు పరాకాష్టకు చేరాయి. అయితే ఈ ప్రాజెక్ట్ పూర్తికాగానే ఎక్కువ విరామం తీసుకోకుండా, తన తదుపరి చిత్రాన్ని వెంటనే పట్టాలెక్కించే దిశగా మహేష్ బాబు పక్కా ప్లాన్ వేస్తున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. వారణాసి విడుదల కాకముందే మహేష్ తన నెక్స్ట్ సినిమాకు సంబంధించిన కాల్‌షీట్లను కేటాయించడానికి సిద్ధమవుతున్నారు. రాజమౌళి సినిమా ప్రమోషన్ల కోసం కేవలం ఒక నెల రోజులు మాత్రమే గ్యాప్ తీసుకుని, ఆ వెంటనే కొత్త చిత్రాన్ని సెట్స్‌పైకి తీసుకెళ్లాలని భావిస్తున్నారు. ఈ క్రమంలోనే అనిల్ రావిపూడి చెప్పిన ఓ సరికొత్త స్పోర్ట్స్ డ్రామా కథాంశానికి మహేష్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చే ఆలోచనలో ఉన్నారు. వీరిద్దరి కాంబినేషన్‌లో గతంలో వచ్చిన సరిలేరు నీకెవ్వరు భారీ బాక్సాఫీస్ విజయాన్ని సాధించడంతో ఈ కొత్త ప్రాజెక్ట్‌పై చర్చలు ముమ్మరంగా సాగుతున్నాయి. తక్కువ సమయంలోనే నాణ్యమైన వినోదాన్ని అందిస్తూ విజయాలు సాధించడంలో అనిల్ రావిపూడి దిట్ట. దీంతో రాజమౌళి సినిమా తర్వాత ఆయనతో ప్రాజెక్ట్ చేయడం సరైన నిర్ణయమని విశ్లేషకులు భావిస్తున్నారు. అంతేకాకుండా, రాజమౌళితో సినిమా చేసిన తర్వాత కథానాయకులకు ఫ్లాపులు ఎదురవుతాయనే సినీ పరిశ్రమలోని పాత సెంటిమెంట్‌ను బ్రేక్ చేయడానికి కూడా హిట్ మెషీన్ అనిల్ రావిపూడి సరైన ఎంపిక అని మహేష్ బాబు భావిస్తున్నట్లు టాలీవుడ్ టాక్. ఈ చిత్రాన్ని 2028 సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేలా ప్రణాళికలు రచిస్తున్నారు.

## ...ఇది వెయ్యి మాస్ బీట్స్‌తో సమానం



దసరా వంటి భారీ విజయం తర్వాత నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్లో తెరకెక్కుతున్న పాన్ఇండియన్ చిత్రం ది ప్యారడైజ్. ఈ సినిమా మ్యూజిక్ సెషన్స్ నుంచి తాజాగా లీకైన పిక్ సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. జాతీయ పురస్కార గ్రహీత, పాటల రచయిత కాసర్ల శ్యామ్ కాళ్లకు నమస్కరించి అనిరుధ్ రవిచందర్ ఆశీస్సులు తీసుకుంటున్న ఒక ప్రత్యేకమైన ఫొటోను నిర్మాణ సంస్థ ఎస్ఎల్‌వి సినిమాస్ నెట్టింట పంచుకుంది. "ఒక చిత్రం వెయ్యి పదాలతో సమానం.. కానీ ఇది వెయ్యి మాస్ బీట్స్‌తో సమానం" అనే క్యాప్షన్‌తో పాటు ఈ చిత్రం నుంచి సెకండ్ సింగిల్ త్వరలోనే విడుదల కాబోతోందని మేకర్స్ అధికారికంగా వెల్లడించడంతో సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. హైదరాబాద్ మురికివాడల నేపథ్యంలో, సామాజిక వివక్షకు వ్యతిరేకంగా పోరాడే జడల్ అనే పవర్ ఫుల్ పాత్రలో నాని నటిస్తున్న యాక్షన్ డ్రామా ది ప్యారడైజ్.

## సంగీత వారసత్వాన్ని.. కోల్పోతానేమోనన్న భయం

కర్ణాటక సంగీతం, కుటుంబ వారసత్వం, స్వీయ అన్వేషణల సమ్మేళనంగా రూపొందిన కొత్త తెలుగు వెబ్ సిరీస్ జగమే సంగీతం ట్రైలర్ విడుదలైంది. ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ ప్రధాన పాత్ర పోషిస్తున్న ఈ సిరీస్ సెప్టెంబర్ 4 నుంచి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా ట్రైలర్ విడుదలైంది. హిందీలో విశేష ఆదరణ పొందిన బందిష్ బాండిట్స్ సిరీస్ స్ఫూర్తితో ఈ వెబ్ సిరీస్‌ను తెరకెక్కించారు. వైకుంఠపురం అనే దేవాలయ పట్టణం నేపథ్యంలో ఈ కథ సాగుతుంది. ప్రముఖ సంగీత విద్వాంసుడైన శాస్త్రి (ప్రకాశ్ రాజ్) కుటుంబ వారసత్వాన్ని కాపాడుకునేందుకు తాపత్రయపడుతుంటాడు. ఆయన మనవడు బాలు (అక్షయ్ లగుసాని) తాత వారసత్వాన్ని నిలబెడుతూనే, తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు ఎంచుకునే క్రమంలో



ఎదుర్కొనే వైరుధ్యాలు, కుటుంబ సంబంధాల చుట్టూ కథ తిరుగుతుంది. ఈ సదర్భంగా ప్రకాశ్‌రాజ్ మాట్లాడుతూ.. శాస్త్రి పాత్రలోని క్రమశిక్షణ, నమ్మకాలు తనను బాగా ఆకట్టుకున్నాయి. తరతరాల సంగీత వారసత్వాన్ని ఎక్కడ కోల్పోతానేమోనన్న భయంతో ఉండే ఒక తండ్రి పాత్ర ఇది. సంగీతం మనుషులను ఎలా కలుపుతుందో అన్వేషించే అవకాశం దక్కింది. నటి మధుబాల మాట్లాడుతూ ఈ కథలోని కుటుంబ సంబంధాలు, నిజాయతీ తనను ఆకట్టుకున్నాయన్నారు.

సంగీతం కథకు ఆత్మ అయితే, మానవ సంబంధాలు ప్రేక్షకులతో ఉండిపోతాయని పేర్కొన్నారు. గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై సుస్మిత కొణిదెల ఈ సిరీస్‌ను నిర్మించగా, పల్నాటి సూర్య ప్రతాప్ దర్శకత్వం వహించారు.



## ఒక్క అమ్మాయీ లేకుండా కొత్త సినిమా

సినిమా అనేది కేవలం పట్టణాలకే పరిమితం కాదని, పల్లెల్లోనూ ప్రతిభ దాగి ఉందనే ఆలోచనతో కొత్త దర్శకుడు అజర్ రూపొందించిన చిత్రం కొత్త సినిమా. ఏకంగా 100 మంది కొత్త మగ నటులతో, ఒక్క మహిళా పాత్ర కూడా లేకుండా తెరకెక్కించిన ఈ సినిమా ప్రీరిలీజ్ ప్రమోషన్ ఈవెంట్ వై ఇన్ హైదరాబాద్.. వై నాట్ ఇన్ అవర్ ప్లేస్ పేరుతో హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ దర్శకనిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ చిత్ర యూనిట్‌ను అభినందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సినిమా గురించి తమ్మారెడ్డి భరద్వాజ మాటల్లో.. 'దర్శకుడు అజర్ టైటిల్ కొత్త సినిమా అని పెట్టడమే కాకుండా, ఒక వైవిధ్యమైన ప్రయత్నం చేశాడు. అందరూ మేల్ ఆర్టిస్టులతోనే సినిమా తీయడం బహుశా ఇదే మొదటిసారి కావచ్చు. ప్రస్తుతం సినిమా మేకింగ్ అంటే చాలా ఖర్చుతో కూడుకున్నది, నటులు దొరకడం కూడా కష్టమే. అలాంటిది అజర్ తన సొంత ఊరికి వెళ్ళి, అక్కడి లోకల్ టాలెం ట్‌ను ఎంపిక చేసుకుని, వారికి తగిన ట్రైనింగ్ ఇచ్చి ఈ సినిమా రూపొందించడం విశేషం. అయితే 100 మందిని పెట్టి ఒక్క అమ్మాయికి కూడా అవకాశం ఇవ్వక పోవడం కాస్త బాధగా ఉంది. అయినా ఈ కొత్త ప్రయత్నం మంచి విజయం సాధించి, దర్శకుడికి మంచి పేరు తీసుకురావాలని కోరుకుంటున్నాను' అన్నారు. డీవోపీ జానీ బాషా, మ్యూజిక్ డైరెక్టర్ పెద్దపల్లి రోహిత్, నటులు రాకేష్, సురేష్, క్రిటిక్ చల్లా శ్రీనివాస్, డైరెక్టర్లు అజర్, వీరశంకర్, వీఎన్ ఆదిత్య, దర్శక నిర్మాత ఎన్ శంకర్ తదితరులు మాట్లాడారు.

## దిల్ రాజుతో వచ్చే సంక్రాంతికి..



ఇరుముడి ఘనవిజయంతో బాక్సాఫీస్ వద్ద రికార్డు కలెక్షన్లు కొల్లగొడుతున్న మాస్ మహారాజా రవితేజ, తన అభిమానులకు మరో భారీ తీపి కబురు అందించారు. థియేటర్లలో రూ. 200 కోట్ల మైలురాయి వైపు దూసుకెళ్తున్న ఇరుముడి గ్రాండ్ సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్న తరుణంలోనే, రవితేజ తన తదుపరి చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్ కోసం టాలీవుడ్ ప్రముఖ నిర్మాత దిల్ రాజుతో రవితేజ చేతులు కలిపారు. రాజ రాజ చోర చిత్రంతో తన మార్క్ వినోదాన్ని అందించి ప్రేక్షకులను మెప్పించిన యంగ్ డైరెక్టర్ హసిత్ గోలి ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై ప్రొడక్షన్ నంబర్ 64గా ఈ చిత్రం రూపొందనుంది. ఇరుముడి విజయం సందర్భంగా నిర్మాత దిల్ రాజు స్వయంగా రవితేజను కలిసి అభినందనలు తెలియజేశారు. ఇదే సమయంలో ఈ కాంబినేషన్‌కు సంబంధించిన అనౌన్స్‌మెంట్ పిక్స్‌ను విడుదల చేశారు. రవితేజ ఎనర్జీకి హసిత్ గోలి మార్క్ కామెడీ టైమింగ్ తోడైతే థియేటర్లలో నవ్వుల పండగ ఖాయమని చిత్రబృందం ధీమా వ్యక్తం చేస్తోంది. పక్కా ఫన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రాన్ని రాబోయే సంక్రాంతి కానుకగా థియేటర్లలోకి తీసుకురావడానికి ప్లాన్ చేస్తున్నారు.

### కన్నీళ్లు ఆపుకోవడం నా వల్ల కాలేదు

రవితేజ కథానాయకుడిగా, శివ నిర్వాణ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన ఇరుముడి చిత్రం ఘన విజయం సాధించడంతో హైదరాబాద్‌లో చిత్ర బృందం సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ సందర్భంగా రవితేజ మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..'స్క్రీన్ మీద నన్ను చూసి మీరంతా నవ్వుతారు, ఈలలు వేస్తారు. నేను కూడా సాధారణంగా దేనికీ అంతగా ఎమోషనల్ అవ్వను. కానీ ఇరుముడి సినిమా చూశాక నా కన్నీళ్లు ఆపుకోవడం నా వల్ల కాలేదు. నా కూతురు మోక్ష కూడా సినిమా చూసి బాగా ఎమోషనల్ అయ్యింది. ఒక నటుడిగా నన్ను ఇంతలా కదిలించిన కథ ఇది. హిందీలో రాజ్‌కుమార్ హిరాణీ గారు తీసే సినిమాలు గుండెలను పిండేస్తూనే ఒక మంచి అనుభూతిని ఇస్తాయి. తెలుగులో శివ నిర్వాణ ఇరుముడితో సరిగ్గా అలాంటి అనుభూతినే అందించాడు. జీవీ ప్రకాశ్ ఇచ్చిన మ్యూజిక్ ఈ సినిమాకి నిజమైన ఆత్మ. థియేటర్‌లో ప్రతీ సన్నివేశాన్ని ఆయన తన సంగీతంతో నెక్స్ట్ లెవెల్‌కి తీసుకెళ్లాడు. ప్రేక్షకులు కంటతడి పెట్టడానికి ఆ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రధాన కారణం. నాకు అత్యంత సంతోషాన్నిచ్చిన విషయం ఏంటంటే... దాదాపు 20 సంవత్సరాలుగా థియేటర్ వైపే రాని ఎంతో మంది పెద్దవాళ్లు, కుటుంబాలు ఈ సినిమా చూడటానికి మళ్లీ థియేటర్లకు వస్తున్నారు. ఒక నటుడికి అంతకంటే పెద్ద అవార్డు, ఆనందం ఇంకేం ఉంటుంది' అని పేర్కొన్నారు. దర్శకుడు శివ నిర్వాణ మాట్లాడుతూ గతంలో నా నిన్ను కోరి, మజిలీ చిత్రాలు నన్ను తెలుగువారి ఇళ్లలోకి తీసుకెళ్తే, ఇరుముడి ఏకంగా వారి హృదయాల్లో స్థానం సంపాదించిపెట్టిందని రవితేజ గారు అన్నారు. కేవలం కమర్షియల్ లెక్కల కోసమే కాకుండా, ప్రేక్షకులను భావోద్వేగపరంగా మెప్పించాలనే ఉద్దేశంతోనే ఈ చిత్రాన్ని రూపొందించామని పేర్కొన్నారు. సినిమా విడుదలైన అతి తక్కువ కాలంలోనే లాభాల బాట పట్టిందని మైత్రీ మూవీ మేకర్స్ తెలిపారు. గత 50 ఏళ్లలో ఇలాంటి అద్భుత రికార్డులు చూడలేదని డిస్ట్రిబ్యూటర్లు అంటున్నారని హర్షం వ్యక్తం చేశారు. బేబీ నక్షత్ర, నటుడు సాయికుమార్ తదితరులు మాట్లాడారు.

## స్పెషల్ షోకు అదనంగా రూ. 600



కన్నడ రాకింగ్ స్టార్ యశ్ హీరోగా గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కిన భారీ యాక్షన్ థ్రిల్లర్ టాక్సిక్. కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్లపై వెంకట్ కే నారాయణ, యశ్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో సినిమా టికెట్ ధరల పెంపుతో పాటు ప్రత్యేక షోల ప్రదర్శనకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు అనుమతులు మంజూరు చేస్తూ జీవోలు జారీ చేశాయి. సింగిల్ స్క్రీన్స్ పై రూ. 50, మల్టీప్లెక్స్ లలో రూ. 100 చొప్పున (జీఎస్టీతో కలిపి) పెంచుకోవడానికి రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు అనుమతిచ్చాయి. ఈ పెంపు విడుదలైన నాటి నుంచి 10 రోజుల పాటు అమల్లో ఉంటుంది. ఏపీలో ఆగస్టు 26 ఉదయం 6 గంటల నుంచే స్పెషల్ ప్రీమియర్ షోల ప్రదర్శనకు గ్రీన్ సిగ్నల్ లభించింది. ఈ ప్రత్యేక షోలకు జీఎస్టీతో కలిపి టికెట్ ధరపై అదనంగా రూ. 600గా నిర్ణయించారు. థియేటర్లలో రోజుకు ఐదు షోలు వేసుకునే వెసులుబాటు కల్పించారు. తెలంగాణలో టికెట్ రేట్ల పెంపు వల్ల వచ్చే ఆదాయంలో 20 శాతం నిధిని తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ వర్కర్ల సంక్షేమానికి కేటాయించాలనే ప్రభుత్వ నిబంధన మేరకు, టాక్సిక్ నిర్మాతలు రూ. 1 కోటి ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ కమిటీలో డిపాజిట్ చేసినట్లు తెలుస్తోంది. ఒక కన్నడ పాన్‌ఇండియా/డబ్బింగ్ చిత్రానికి తెలుగు రాష్ట్రాల్లో ఈ స్థాయిలో టికెట్ రేట్ల పెంపు లభించడం ట్రేడ్ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది.

26-8Pg6fHMNWJQE:26-8Pg6fHMNWJQE.qxd 25/Aug/26 11:06 PM Page 1



# మండలి, అసెంబ్లీ సంయుక్త ఎస్టీ, బిసి, మహిళా సంక్షేమ కమిటీలు ప్రారంభం

## పాల్గొన్న మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్, మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 25:** శాసన పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం శాసనమండలి,శాసనసభ (లెజిస్లేచర్) సంయుక్త షెడ్యూల్ తెగల సంక్షేమ కమిటీ, వెనుకబడిన వర్గాల సంక్షేమ కమిటీ, మహిళా, శిశు, వృద్ధుల సంక్షేమ కమిటీల ప్రారంభ సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాలను శాసన పరిషత్ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, శాసన వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ ప్రారంభించారు, ఎస్టీ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు, సభ్యులు డాక్టర్ మురళీ నాయక్, రాందాస్ మాలోతు, కోవా లక్ష్మీ, అనిల్ జాదవ్, తెల్లం వెంకట్రావు, పింగళి శ్రీపాల్ రెడ్డి,బిసి వెల్ఫేర్ కమిటీ చైర్మన్ మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, సభ్యులు ఆర్. భూపతి రెడ్డి, చింతా ప్రభాకర్, శ్రీ గణేష్, రామారావు పవార్, యల్ రమణ, తీన్మార్ మల్లన్న. మహిళా, శిశు, దివ్యాంగులు, వృద్ధుల వెల్ఫేర్ కమిటీ చైర్మన్ చిట్టెం పర్ణిక రెడ్డి, సభ్యులు మట్టా రాగమయి, కోవా లక్ష్మి, వాణీ దేవి హాజరయ్యారు. శాసనమండలి కార్యదర్శి డా.వి నరసింహా చార్యులు, శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతి,అధికారులు పాల్గొన్నారు. చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ శాసన వ్యవస్థలో కమిటీలకు ఎంతో ప్రాధాన్యత ఉన్నది. ప్రజల సమస్యలను లోతుగా అధ్యయనం చేసి, వాటి పరిష్కారానికి ప్రభుత్వానికి అవసరమైన సూచనలు, సిఫారసులు చేయడంలో కమిటీలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు.గత ప్రభుత్వ హయాంలో షెడ్యూల్ తెగల వారికి సబ్సిడీ పథకాలు అమలు కాక లబ్దిదారులు నేటికీ సబ్సిడీ పేపర్లు పట్టుకొని తిరుగుతున్నారు. అలాంటి పరిస్థితి రాకుండా చూడాలని బాధ్యత కమిటీ చైర్మన్ సభ్యులపైన ఉన్నదన్నారు. గిరిజనులు, వెనుకబడిన తరగతులు, మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కమిటీలు ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. సంక్షేమ పథకాల అమలులో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, సంబంధిత శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిష్కార మార్గాలను సూచించాలి.కమిటీల సభ్యులు ప్రజల నుంచి వచ్చే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి, వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ లెజిస్లేటివ్ కమిటీలు ప్రభుత్వం, ప్రజల మధ్య ఒక ముఖ్యమైన వారధిగా పని చేయాలి. తద్వారా పథకాల అమలులో ప్రభుత్వం మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రజలకు పథకాలు మరింతగా చేరువయ్యేందుకు ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్ర జనాభాలో 10.45 శాతం మంది ఉన్న షెడ్యూల్ తెగల జీవన పరిస్థితులను అధ్యయనం చేయడం, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల అమలు తీరును సమీక్షించడం, లోటుపాట్లను గుర్తించడం, వారి సమగ్ర అభివృద్ధికి అవసరమైన సూచనలను ప్రభుత్వానికి అందించడం ఈ షెడ్యూల్ తెగల సంక్షేమ కమిటీ ప్రధాన కర్తవ్యం అని చెప్పారు. కమిటీలు ప్రజల అవసరాలను అర్థం చేసుకొని, అర్థవంతమైన సిఫార్సుల ద్వారా వారి జీవన నాణ్యతను మెరుగుపరచడానికి దోహదపడాలని చెప్పారు. మహిళల భద్రత, ఆర్థిక సాధికారత సంబంధించిన పథకాలు, శిశు సంక్షేమ సంస్థలు, అంగన్వాడీల పనితీరు, దివ్యాంగులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలు, అలాగే వయోవృద్ధులకు అందుబాటులో ఉన్న జీవన పరిస్థితులు, ఆరోగ్య సంరక్షణ వంటి అంశాలపై కమిటీ ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. శాసన వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ శాసనమండలి సంయుక్త కమిటీలు అత్యంత ప్రభావితమైనవని,బలహీన వర్గాల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి ఈ సంయుక్త కమిటీ సూచనలు, సలహాలు ఉపయోగపడుతాయన్నారు. క్షేత్ర స్థాయిలోని సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారాలతో ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం

# నేడు ప్రజలతో ముఖాముఖితో వి.హనుమంతరావు

**హైదరాబాద్, ఆగస్టు 25,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించేందుకు గాంధీభవన్‌లో ప్రతి బుధవారం ఏర్పాటు చేసే 'ప్రజలతో ముఖాముఖి' కార్యక్రమంలోని బిసి వెల్ఫేర్ డిపార్ట్మెంట్ తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు పాల్గొంటారు. ప్రజలకు ప్రభుత్వం-పార్టీ మధ్య ప్రత్యక్ష వేదికగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి బుధవారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. ప్రజలు తమ సమస్యలకు సంబం ధించిన వినతిపత్రాలు అవసరమైన ఆధార పత్రాలతో వస్తే వారి సమస్యలను అధికారుదృష్టికి తీసుకెళ్ళిపరిష్కారంకు కృషిచేస్తారు. .ప్రజలు సమర్పించిన వినతులను సంబంధిత ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసి, వీలైనంత త్వరగా పరిష్కారం లభించేలా 'ప్రజలతో ముఖాముఖి' కమిటీ నాయకులు సంగిశెట్టి జగదీశ్వర్ రావు, నిరంతరం కృషిచేస్తారు. అలాంటి వేదికపై విహెచ్ హాజరై ప్రజల విన్నపాలను బుధవారం స్వీకరిస్తారు.




మంగళవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

# సత్యం మాత్రమే సామాజిక మాధ్యమాలు ప్రచారం చేయాలి: మహేశ్‌కుమార్‌గౌడ్

## పిసిసి సోషల్ మీడియా చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన పెట్టెం నవీన్

**హైదరాబాద్, ఆగస్టు 25,ప్రభాతవార్త:** ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసు కెళ్లడంతోపాటు కాంగ్రెస్‌పార్టీ గాంధేయ సిద్దాంతాలకు బహుళ ప్రచారం కలి గించి అహింసాపూరిత ఆలోచనలు పెంచేందుకు సామాజిక మాధ్యమాలు పనిచేయాలని టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ పిలుపు నిచ్చారు. పిసిసిఅధ్యక్షుడు, మహేశ్ కుమార్, ఎఐసిసి కార్య దర్శి సచిన్ సావంత్



సమక్షంలో పిసిసి సోషల్ మీడియా నూతన చైర్మన్ గా నవీన్ పెట్టెం మంగళ వారం అధికారికంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఛైర్మన్‌తో పాటు నూతనంగా నియమితులైన సోషల్ మీడియా కన్వీనర్లు, కోఆర్డినేటర్లు కూడా తమ తమ బాధ్యతలను స్వీకరించారు.ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ సత్యం ఎప్పుడు విజయం సాధిస్తోందని సత్యం మాత్రమే సామాజిక మాధ్యమాలు ప్రచారం చేయాలని కోరారు. ప్రజల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంచాలని ఆయన సామాజికమాధ్యమాలకు హితవు చెప్పారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎంపి, టిపిసిసి మీడియా ఛైర్మన్ చామల కిరణ్ కుమార్ రెడ్డి , జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ , రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ , యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు మరియు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం నవీన్ పెట్టెం మాట్లాడుతూ 'ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లడం, క్షేత్రస్థాయి ముఖ్యంగా గ్రామస్థాయి సమస్యలను పిసిసి అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడం వంటి కర్తవ్యం నిర్వహిస్తామని తెలిపారు. అలాగే 2029లో కాంగ్రెస్ పార్టీని 101 స్థానాల్లో గెలిపించి, మళ్లీ అధికారంలోకి తీసుకు రావడానికి అహర్నిశలు శ్రమించడమే మా లక్ష్యం' అని పేర్కొన్నారు.

# రేపటి నుంచి అగ్రి బిఎస్సీ కోర్సులకు కౌన్సెలింగ్

## ఉపకులపతి అల్దాస్ జానయ్య

**హైదరాబాద్ (అత్తాపూర్) ఆగస్టు 25,ప్రభాతవార్త :** 2026-27 విద్యా సంవత్సరానికి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధి లోని 13 కళాశాల లోని బిఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్, బీ ఎస్సీ (ఆనర్స్) హార్టీకల్చర్, బీ టెక్(ఫుడ్ టెక్నాలజీ) కోర్సు లలోని రెగ్యులర్ సీట్ల భర్తీకి మొదటి విడత కౌన్సిలింగ్ ఈ నెల 27న ప్రారంభం కానుందని ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తెలిపారు. మంగళవారం ఆయన ఓ ప్రకటనలో మాట్లాడుతూ.. రాజేంద్రనగర్‌లోని విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఉదయం 9.30 గంటలకు కౌన్సిలింగ్ ప్రారంభం అవుతుందన్నారు.

తొలి విడత కౌన్సిలింగ్ 29 వ తేదీ( శనివారం) వరకూ సాగుతుందని జానయ్య వివరించారు.తెలంగాణా ఎప్ సెట్ 2026 లో అర్హులై ఇప్పటికే ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకున్న బైపీసీ స్ట్రీమ్ అభ్యర్థులు ఈ కౌన్సిలింగ్ కి హాజరు కావాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. ఏ ఏ తేదీల్లో ఏ ఏ ర్యాంకుల వారు కౌన్సిలింగ్ కి హాజరు కావాలన్న వివరాలు వెబ్ సైట్ లో పొందుపరిచామని జానయ్య వివరించారు.అదే విధంగా కౌన్సిలింగ్ కి హాజరు అయ్యే అభ్యర్థులు, వారి తల్లితండ్రులు తీసుకుని రావాల్సిన ధృవ పత్రాలు తదితర వివరాలని వెబ్ సైట్ లో పొందుపరిచామని జానయ్య పేర్కొన్నారు. పూర్తి సమాచారాన్ని విశ్వవిద్యాలయం వెబ్ సైట్‌లో చూడాలని జానయ్య సూచించారు.



'చలో సచివాలయం ముట్టడి' కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న పిల్లి సుధాకర్ తదితరులు

# మాలలకు జరుగుతున్న అన్యాయాలపై 31న 'చలో సచివాలయం ముట్టడి'

## జాతీయ మాల మహానాడు రాష్ట్ర కమిటీ

**హైదరాబాద్ (సైఫాబాద్), ఆగస్టు 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని లక్షలాది మంది మాలలకు విద్యా, ఉద్యోగ అవకాశాలు గండి కోడుతున్న రోస్టర్ విధానాన్ని సవరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 31న 'చలో సచివాలయం ముట్టడి' కార్యక్రమాన్ని వేలాది మంది మాలలతో నిర్వహిస్తున్నామని జాతీయ మాల మహానాడు రాష్ట్ర కమిటీ హెచ్చరించింది. ఈ మేరకు మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ తదితరులు ఈ చలో సచివాలయం ముట్టడికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు.

మాలలకు 5 శాతం కేటాయించిన రిజర్వేషన్‌లు అమలు జరగడం లేదని, ఉద్దేశపూర్వకం గానే గ్రూప్-3లో ఉన్న మాలలు, మాల ఉపకులాల ప్రభుత్వం వివక్ష చూపుతు న్నదని ఆరోపించారు. తక్షణమే మాల ప్రజా ప్రతినిధులు సిఎం రేవంత్‌రెడ్డిపై వత్తిడీ చేసి జిఓ నెంబరు 99ని రద్దు చేయించాలని, రోస్టర్ 20 లోపు 2 పాయింట్స్ గ్రూప్-3లో 8 కేటాయించాలని ఆయన కోరారు. 31న జరిగే సచివాలయం ముట్టడి కార్యక్రమంలో మాల విద్యార్థి, యువజన, ఉద్యోగ, మేధావులు హాజరై విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# పంట మార్పిడి విధానాలపై రైతులను మరింత చైతన్యపరచాలి

## ఎల్‌నినో ప్రభావం, నీట్-పిజి ప్రవేశపరీక్ష ఏర్పాట్లు, పర్యాటక రంగం అభివృద్ధిపై జిల్లా కలెక్టర్లతో సిఎస్ సంజయ్‌జాజు విడియో కాన్ఫరెన్స్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 25:** రాష్ట్రంలో నెలకొన్న సీజనల్ పరిస్థితులు, నీట్-పిజి ప్రవేశపరీక్ష నిర్వహణకు చేపట్టాల్సిన ఏర్పాట్లు, రాష్ట్రంలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మంగళవారం సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో విడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. సిఎస్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో పంట మార్పిడి విధానాలపై రైతులను మరింత చైతన్యపరిచి వ్యవసాయ సాగుకు అనుసరించాల్సిన నూతన విధానాలపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. జిల్లాల వారీగా సీజనల్ పరిస్థితులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకుంటున్న ముందస్తు చర్యలపై సీఎస్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. పంటల వైవిధ్యీకరణ (క్రాప్ డైవర్సిఫికేషన్) అవసరాన్ని చెబుతూ, తక్కువ నీటి అవసరం ఉండే, ప్రస్తుత వాతావరణ



పరిస్థితులకు అనుకూలమైన పంటలను సాగు చేసేలా రైతులకు నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు.

ఈ నెల 30న జరగనున్న నీట్-పిజి ప్రవేశపరీక్ష సజావుగా, ఎలాంటి అవాంతరాలు లేకుండా నిర్వహించేందుకు జిల్లాల్లో చేపడుతున్న ఏర్పాట్లను సీఎస్ సమీక్షించారు. పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు, విద్యుత్, తాగునీరు, రవాణా తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పరీక్షకు ఎలాంటి అవాంతరాలు లేకుండా సజావుగా జరిగేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు.

### పర్యాటక అభివృద్ధికి ప్రణాళికాబద్ధ చర్యలు

తెలంగాణ టూరిజం 2047 పాలసీలో భాగంగా రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను మరింత అభివృద్ధి చేసి, దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేలా చర్యలు చేపట్టాలని సీఎస్ సూచించారు. ప్రతి జిల్లాలో ఉన్న ముఖ్యమైన పర్యాటక ప్రాంతాలను గుర్తించి, అక్కడ అవసరమైన మౌలిక సదుపాయాలు, కనెక్టివిటీ, పరిశుభ్రత, సౌకర్యాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్లకు సూచించారు. జిల్లాల ప్రత్యేకతలు, చారిత్రక, సాంస్కృతిక, ప్రకృతి పర్యాటక ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. రాష్ట్రంలో టూరిజం అభివృద్ధికి 27 స్పెషల్ టూరిజం ప్రదేశాలు (ఎస్‌టిఏ)లను గుర్తించిందని, ఆ ప్రదేశాలను మరింత అభివృద్ధి చేసి టూరిజం సెక్టార్‌ను మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు జిల్లా కలెక్టర్లు

# టిమ్స్‌లో నిమ్స్ సర్వీసు రూల్స్ అనుసరణ

## పిజి కాలేజీని ప్రారంభించేందుకు నిర్ణయం

## ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశంలో వైద్య మంత్రి దామోదర రాజనర్సింహ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 25:** ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధ్యక్షతన మంగళవారం డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (డాక్టర్ ఎంసీఆర్ టిమ్స్) ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ తొలి సమావేశం జరిగింది. డాక్టర్ ఎంసీఆర్ టిమ్స్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌లో జరిగిన ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, టీజీఎంఎస్‌ఐడీసీ ఎండీ డాక్టర్ గౌరవ్ ఉప్పల్, డాక్టర్ ఎంసీఆర్ టిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ వాణి, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవిందర్ నాయక్, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు. టిమ్స్‌కు ప్రతి రోజూ సగటున 600 మంది అవుట్ పేషెంట్లు వస్తున్నారని, వారికి అవసరమైన వైద్య సేవలను అందిస్తున్నామని డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్ మంత్రికి వివరించారు. అలాగే డే కేర్ ప్రొసీజర్లను కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హాస్పిటల్‌లోని ఐసీయూలు, ఆపరేషన్ థియేటర్లు, డయాగ్నస్టిక్స్ ఎక్విప్‌మెంట్‌తో పాటు ఇతర కీలక వైద్య పరికరాలను పూర్తిస్థాయిలో స్టెరిలైజేషన్ చేయిస్తున్నామని, ఇందుకు సంబంధించిన ప్రక్రియ పూర్తయిన వెంటనే సర్జరీలు ప్రారంభిస్తామని డాక్టర్ నరేంద్ర కుమార్ మంత్రికి వివరించారు. ఎంసీఆర్ టిమ్స్‌లో డాక్టర్లు, సిబ్బంది నియామకాల కోసం నిమ్స్ సర్వీస్ రూల్స్‌ను అనుసరించడంతో పాటు, నిమ్స్‌లో అమలులో ఉన్న టారిఫ్‌లను టిమ్స్‌లో కూడా అమలు చేయడానికి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. నిమ్స్ టారిఫ్‌లను అమలు చేయడం ద్వారా హాస్పిటల్



ప్రారంభ దశ నుంచే ఒక సమగ్రమైన టారిఫ్ విధానం అందుబాటులోకి రావడంతో పాటు, రాష్ట్రంలోని రెండు ప్రముఖ వైద్య సంస్థల మధ్య చార్జీల విధానంలో ఏకరూపత, మెరుగైన ఆర్థిక ప్రణాళికకు అవకాశం కలుగుతుందని ఈసీ అభిప్రాయపడింది.

డాక్టర్ ఎంసీఆర్ టిమ్స్‌కు సంబంధించిన ఆర్థిక లావాదేవీలను ట్రస్ట్ అండ్ రిటెన్షన్ అకౌంట్ ద్వారా నిర్వహించే విధంగా అవసరమైన బ్యాంకింగ్ సేవలను సమన్వయం చేయడానికి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. టిమ్స్‌లో రోగులు, వైద్యులు, సిబ్బందికి అవసరమైన మౌలిక వసతులను మరింత మెరుగుపరిచే పలు ప్రతిపాదనలకు కూడా ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. హాస్పిటల్ స్టాఫ్, పేషెంట్లకు పార్కింగ్ ఇబ్బందులు లేకుండా మల్టీ లెవల్ కార్ పార్కింగ్, రోగుల సహాయకుల కోసం అదనపు టాయిలెట్ కాంప్లెక్స్ నిర్మించే ప్రతిపాదనలకు ఈసీ ఆమోదం తెలిపింది.డాక్టర్ ఎంసీఆర్ టిమ్స్‌ను అత్యాధునిక వైద్య సేవలు అందించే సంస్థగా తీర్చిదిద్దడంతోపాటు, ప్రజలకు నాణ్యమైన సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడం, వైద్య విద్య-పరిశోధనలను ప్రోత్సహించడం లక్ష్యంగా ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు.

# మైనారిటీ విద్యార్థులకు ఎఐలో శిక్షణ

## 80 వేల మందికి డిజిటల్ సేఫ్టీ కోర్సులు

## 205 గురుకులాల్లో అత్యాధునిక శిక్షణ

## రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయం

**హైదరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని మైనారిటీ విద్యార్థుల భవిష్యత్తును సరికొత్త సాంకేతికత వైపు నడిపించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 205 మైనారిటీ గురుకుల పాఠశా లల్లో చదువుతున్న 80 వేల మంది విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ), డిజిటల్ సేఫ్టీపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనుంది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం, మస్క్ నెక్ట్ జన్, డోక్స్ కన్సల్టింగ్ (డిసిపిఎల్) సంస్థల సంయుక్త భాగస్వామ్యంతో రూపొందించిన ఏఐ రెడినెస్ అండ్ డిజిటల్ సేఫ్టీ ప్రోగ్రామ్ ఈ నెల నుండి అధికారికంగా అమలుకు ప్రారంభించింది. ప్రతి బిడ్డకూ నాణ్యమైన సాంకేతిక విద్యను అందించి, తెలంగాణను అంతర్జాతీయ ఐటీ హబ్‌గా మార్చాలనే ముఖ్యమంత్రి దార్శనికతకు అనుగుణంగా ఈ సరికొత్త కార్య క్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈ నూతన విద్యా విధానం ద్వారా గురుకుల విద్యార్థులకు చిన్నతనం నుంచే కృత్రిమ మేధస్సు పరిజ్ఞానం, కోడింగ్ ప్రాథమికాంశాలు, సైబర్ భద్రతపై సమగ్ర అవగాహన కల్పిస్తారు. ఈ అత్యాధునిక శిక్షణ మైనారిటీ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడమే కాకుండా, రాబోయే రోజుల్లో వారికి ఐటీ రంగంలో అద్భుతమైన ఉపాధి, ఉన్నత విద్యా అవకాశాలను కల్పించడంలో మైలురాయిగా నిలవనుంది.

# ఆగస్టు సంక్షోభం కాంగ్రెస్‌లో లేదు.. టిడిపిలో ఉంది

## సిఎం ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ టూర్‌ను అడ్డుకొన్న బిజెపి

## పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి




**హైదరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** ప్రధాన మంత్రిది వన్‌సైడ్ లవ్.. రాహుల్ గాంధీ పట్ల కమిట్‌మెంట్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నడు, ఎక్కువ ఊహించుకోండని పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. గాంధీభవన్‌లో మంగళవారం జగ్గారెడ్డి లైవ్‌స్టాక్ ఏజెన్సీ, చరణ్ కౌశిక్‌యాదవ్ మున్నూరు కాపు కార్పొరేషన్ వైస్‌ఛైర్మన్, అల్లం భాస్కర్, హ్యాం డ్లూమ్ కార్పొరేషన్ వైస్‌చైర్మన్ జక్కని అనిత మనవతారాయ్, రవిచంద్ర, కోట్ల శ్రీనివాస్‌తో కలిసి మీడియాతో మాట్లాడుతూ ప్రధాని టెంప్ట్ అయినా రేవంత్‌రెడ్డి న్యూట్రల్‌గా ఉన్నారని, బ్యాలెన్స్ తప్పలేదని కితాబు ఇచ్చారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో పనిచేయాలని తపనతో సిఎం రేవంత్ ఉన్నా రని నర్ధువీకరించారు. మోడీ ఎందుకు టెంప్ట్‌అయి మాట్లాడారో తెలియదని, అలా మోడీ అడగడం సిఎంకు ఇబ్బందిగానే ఉంటుందని ఆయన వివరిం చారు. ఆగస్టు సంక్షోభం కాంగ్రెస్‌లో లేదు, అది టిడిపిలో ఉంటది ఇక్కడ ఉన్నది కాంగ్రెస్ సిఎం, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి నోడౌట్ అని ధీమా వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన పెట్టుకుని బయలుదేరాడు కానీ ముఖ్యమంత్రి హోదాలో ఏదో కారణం చూపి ఆపడమే కాదు కేంద్ర ప్రభుత్వం లండన్ నుండే వెనక్కి రప్పించిందన్నారు. తెలంగాణ ప్రజల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ టూర్ కోసం అమెరికా పోతే బిజెపి ప్రభుత్వం అడ్డుకొని ఆపిందని, ప్రధాని మోడీ అనధికారికంగా పాకి స్థాన్ పోతే బిజెపి ఎంపిలు ఎందుకు మాట్లాడలేదని పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ సిఎం కాంగ్రెస్ పార్టీ అని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అడ్డుకుందని వివరించారు.

బిజెపి ప్రభుత్వ వైఖరిపై తెలంగాణ ప్రజలు, విద్యార్థులు, మేధావులు ఆలోచించాలని కోరారు. తెలంగాణ ముఖ్యమంత్రిని అవమానించడమంటే తెలంగాణ ప్రజలను అవ మానించినట్టే అన్నారు. అమెరికాకు పోవడం రేవంత్‌రెడ్డికి కొత్త ఏంకాదు కదా? ఎందుకు ఆపాల్సి వచ్చిందని అడిగారు. ఎంపి ఈటల రాజేందర్ దేశానికి వ్యతిరేకంగా మాట్లాడిన వ్యక్తిని కలవడానికి పోతున్నారని ఆరోపిం చారని, మరి ప్రధాని మోడీ ఎవరికి చెప్పకుండా పాకిస్థాన్ ప్రధాని నవాజ్ షరీఫ్ ఇంటికి వెళ్లారు, మరి ఇదేమిటని అడిగారు. నవాజ్‌షరీఫ్ బర్త్‌డే ఉందని పాకిస్థాన్ పోయాడని గుర్తుచేశారు. బిజెపి నేతలు రేవంత్‌రెడ్డిని తప్పుపట్టడం కాదు, అనధికారికంగా మోడీ పాకిస్థాన్ వెళ్లాడని దానిని తప్పు పట్టాలని సూచించారు. మన శత్రు దేశానికి ఎందుకు వెళ్లారో మోడీ తెలపాలని డిమాండ్ చేశారు.

# తప్పుడు ప్రచారం తిప్పికొట్టి ప్రభుత్వాన్ని కాపాడుకొందాం

## భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 25,ప్రభాతవార్త:** ప్రతిపక్షపార్టీ లైన బిజెపి బిఆర్ఎస్ సోషల్ మీడియాలో చేస్తున్న అసత్య ప్రచారం ప్రతి ఒక్కరు తిప్పి కొట్టి ప్రభుత్వంను కాపాడుకోవాలని భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి హితవు చెప్పారు. గాంధీభవన్‌లో మంగళవారం విలేఖరులతో మాట్లాడుతూ దేశంలో మోడీ తో పాటు అందరూ సోషల్ మీడియాలో యాక్టవ్‌గా ఉన్నారని హెచ్చరించారు. మీడియా కమిటీ ఛైర్మన్ గా అందరి సోషల్ మీడియా హ్యాండిల్స్ పరిశీలిస్తా అనిఆయన తెలిపారు. అధికారంలోకి రావడానికి అందరూ కష్టపడ్డారనీ ఇప్పుడు అధికారం వచ్చాక అధికారాన్ని కాపాడు కోవడానికి ప్రతి పక్షాల తప్పుడు ప్రచారం ప్రతి ఒక్కరు తిప్పి కొట్టాలనీ సూచించారు. నీతి ఆయోగ్ ప్రకారం దేశంలో 8.7 కోట్ల మందికి విద్య లేదు,ట్రేనింగ్ లేదు విద్య లేనప్పుడు వికసిత్ భారత్ ఎట్లా అవుతుందనీ ప్రశ్నిం చారు. తెలంగాణ లో రేవంత్ విద్య ను డెవలప్మెంట్ చేస్తుంటే ఆయన అమెరికా పర్యటను అడ్డుకొన్నారని ఆవేదన చెందారు. సగం, సగం తెలిసిన నాయకులు సిఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన పై మాట్లాడుతున్నారనీ అన్నారు.కిషన్ రెడ్డి కూడా నాపర్యటనకు పెర్మిషన్ ఇవ్వలేదు అంటుండనీ ఆయన ఏమైనా సిఎం స్థాయి వ్యక్తా ?కిషన్ రెడ్డి గుజరాత్ కు ముఖ్యమంత్రి అయినట్లు మట్లాడుతుండనీ ఎద్దేవా చేశారు. సిఎం రేవంత్ రెడ్డి యుకె పర్యటనకు అనుమతి ఇచ్చి అమెరికా పర్యటన కు అనుమతి ఇవ్వలేదదన్నారు. ఇలా ఎప్పుడు జరగలేదు తెలంగాణ కు రావాల్సిన సెమికండక్టర్లను గుజరాత్‌కు ఎందుకు తరలించారనీ అన్నారు. మూసీ, ఆర్‌ఆర్‌ఆర్, మెట్రో అభివృద్ధిని ఎందుకు అడ్డుకుంటున్నారని అడిగారు.

# గిరిజనుల సమగ్ర ప్రగతికి ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలి

## గిరిజన సర్పంచ్‌ల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్యా సంతోష్‌నాయక్

**హైదరాబాద్, ఆగస్టు 25,ప్రభాతవార్త:** గిరిజన తండాలు, గూడాల సమగ్ర ప్రగతి కోసం ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేసి ఐదు వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం గిరిజన సర్పంచ్‌లకు పూర్తి అధికారాలు, పరిపాలనా స్వేచ్ఛను కల్పించాలని గిరిజన సర్పంచ్ ఫోరం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు భూక్యా సంతోష్‌నాయక్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం రాష్ట్ర గిరిజన సర్పంచ్ ఫోరం ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో జరిగిన ఆవిర్భావ సదస్సులో ఆయన మాట్లాడుతూ..గిరిజన తండాలను రెవెన్యూ గ్రామ పంచాయతీలుగా గుర్తించాలన్నారు. 2018 పంచాయతీ చట్టం ముందు ఏ విధంగా అయితే సర్పంచులకు గ్రామాలపై పూర్తి అధికారం ఉందో ఆ విధంగా ఉండాలన్నారు. ప్రతి తండా గ్రామపంచాయితీలో డిజిటల్ లైబ్రరీని ఏర్పాటు చేయడంతో పాటు, గిరిజనులకు సబ్సిడీ నిధులు విడుదల చేసి ఇందిరమ్మ ఇల్లుని ప్రత్యేకంగా కేటాయించాలన్నారు. అలాగే తండాల్లోని పాఠశాలను ప్రైవేట్ మాదిరిగా అభివృద్ధి చేసి నాణ్యమైన విద్యను అందించాలని కోరారు. గిరిజన పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని గిరిజనులకు క్యాబినేట్‌లో స్థానం కల్పించాలన్నారు. ఐటీడీఏ గిరిజన గ్రామాల్లో ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచులు చిరంజీవి, రాంజీ నాయక్, లైలా పరమేష్, సునీత, బానోజీ సతీష్ కుమార్, సుధాకర్ నాయ క్, కుర్ర రాజేందర్ నాయక్, మహేందర్, రాంసింగ్‌నాయక్ తదితరులు మాట్లాడారు. ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షుడుగా సంతోష్‌నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు

# కేంద్రం తక్షణమే జనగణనలో బిసి కులగణన చేపట్టాలి: బిసి నేతలు డిమాండ్

**హైదరాబాద్ (సైఫాబాద్), ఆగస్టు 25, ప్రభాతవార్త:** బిసిల కులగణన చేయాలనే డిమాండ్‌ను కే ంద్ర ప్రభుత్వం గుర్తించి తక్షణమే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర శాసన మండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి డిమాండ్ చేశారు. స్వాతంత్ర్య వచ్చిన నాటి నుంచి నేటివరకు దేశంలో సగభాగం ఉన్న బిసిలకు న్యాయం జరగలేదని, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో న్యాయం జరగాలంటే తక్షణమే కేంద్రం జనగణనలో కులగణన చేపట్టాలని కోరారు. బిసిసంక్షేమ సంఘం జాతీయ కమిటీ ఆధ్వర్యంలో మంగళ వారం గన్‌పార్కులో అమరవీరుల స్థూపం వద్ద మండల్ జయంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. మతాలకు లెక్కలు ఉన్నప్పుడు కులాలు ఎందుకు జరగవని, ప్రపంచంలోని వివిధ మతాల జనాభా లెక్కలు అందుబాటులో



గన్‌పార్కు వద్ద నిరసన ప్రదర్శనలో పాల్గొన్న మధుసూదనాచారి, వి.శ్రీనివాస్‌గౌడ్, జాజుల శ్రీనివాస్‌గౌడ్, గుజ్జ కృష్ణ తదితరులు

ఉన్నప్పుడు కుల వ్యవస్థ బలంగా ఉన్న భారతదేశంలో బిసి కులగణన ఎందుకు చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. రాజకీయ పార్టీలు అధికారంలోకి రావడానికి బిసిలను కేవలం ఓటు బ్యాంకుగా ఉపయోగించుకోడమే కాకుండా వారికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బిసిల జనాభపై అధికారిక లెక్కలు లేకపోవడం వల్ల రిజర్వేషన్‌లపై కోర్టుల్లో ఆనేక సమస్యలు వస్తున్నాయని విచారం వ్యక్తం చేశారు. బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బిజెపి బిసిల ఓట్ల కోసం మాత్రమే దీక్షలు, కార్యక్రమాలు చేస్తుందని, బిసిల కులగణన విషయంలో స్పష్టమైన నిర్ణయిం తీసుకోలేకపోతున్నదని ఆరోపించారు. ప్రమావేశంలో బిసి నాయకులు గుజ్జ కృష్ణ, కుందారం గణేషాచారి, కుల్కచర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

26-8Pg7fHMNWJQE:26-8Pg7fHMNWJQE.qxd 25/Aug/26 11:53 PM Page 1






సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

## 22ఎపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి

### మంత్రి పొంగులేటిని వెంటనే బర్తరఫ్ చేయండి : హరీశ్‌రావు

**హైదరాబాద్ (పేట్‌బషీరాబాద్), ఆగస్టు 25, ప్రభాతవార్త:** ప్రజల భూములను 22ఏలో నిషేధిస్తే.. ప్రజలు నిన్ను నిషేధిస్తారు" అంటూ తన్నీరు హరీష్ రావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం షాపూర్‌నగర్‌లోని ఎం.జే. గార్డెన్స్‌లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ 22ఏ బాధితుల సమస్యలపై బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కే.పీ.వివేకానంద్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్ రావుతో పాటు ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, గోరేటి వెంకన్న, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ 22ఏ అంశంపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తప్పు చేసిన అధికారులను, బాధ్యులను గుర్తించి కఠినంగా శిక్షి ంచాలని ఆయన కోరారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని భూములను అకారణంగా 22ఏ నిషేధిత జాబితాలో చేర్చిన అంశంపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సమగ్ర విచారణ జరిపి, అర్హులైన భూ యజమానుల భూములను 22ఏ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. తప్పు చేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు. తెలంగాణలో 22ఏ సమస్య కేవలం రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన అంశం కాదని, వేలాది మంది భూ యజమానుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న సమస్య అని అన్నారు. ఏళ్ల తరబడి కష్టపడి సంపాదించిన డబ్బుతో భూములు కొనుగోలు చేసి, చట్టబద్ధమైన పత్రాలు, పట్టాలు కలిగి ఉండి, పన్నులు చెల్లిస్తున్న ప్రజల భూములను ఒక్కసారిగా 22ఏ జాబితాలో చేర్చడం వల్ల వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

22ఏ జాబితాలో భూములు ఉండటంతో వాటిని విక్రయించుకోవడం, రిజిస్ట్రేషన్ చేసుకోవడం, బ్యాంకు రుణాలు పొందడం వంటి అవకాశాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 22ఏ అంటే కేవలం ఒక నంబర్ కాదు.. ఒక కుటుంబం భవిష్యత్తుపై పడే తాళం అని హరీష్ రావు వ్యాఖ్యానించారు.

ఒక కుటుంబం తమ భూమిని విక్రయించి పిల్లల చదువులకు ఖర్చు చేయడం, కుమార్తె వివాహం చేయడం, వ్యాపారం ప్రారంభించడం, అనారోగ్య సమయంలో వైద్య ఖర్చులు భరించడం, ఇల్లు నిర్మించుకోవడం వంటి అవసరాలను తీర్చుకుంటుందని పేర్కొన్నారు. అలాంటి భూములను నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల కుటుంబాల ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం పడుతుందని అన్నారు. భూభారతి సాక్షి గా అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించిన హరీష్ రావు, 2023 డిసెంబర్ నుంచి 22 ఏ జాబితాలో చేర్చిన, తొలగించిన సర్వే నంబర్లకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రభుత్వం ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తప్పు చేయలేదని చెబుతున్నట్లయితే సంబంధిత శాఖకు బాధ్యత వహిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని వెంటనే బర్తరఫ్ చేయాలని కోరారు.

## రైతులకు పూర్తిస్థాయిలో కేంద్ర పథకాలు

### మరింత పటిష్టంగా శాఖల మధ్య సమన్వయం

### రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయ, రైతు సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి రైతుకు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండ రెడ్డి సూచించారు. రైతు సంక్షేమ కమిషన్ కార్యాలయంలో మంగళవారం వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశానికి ఎం. కోదండరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును చైర్మన్ సమీక్షి ంచారు. ఉద్యాన శాఖకు సంబంధించిన ఎంఐడీహెచ్, ఎన్ఎంఈఓపీ, టీజీఎంఐపీ తదితర పథకాల అమలు, పురోగతిపై చర్చించారు. రైతులకు అందుతున్న ప్రయోజనాలు, పథకాల అమలులో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై సమావేశంలో ప్రస్తావించారు. పథకాల లక్ష్యాలు, ఇప్పటివరకు సాధించిన పురోగతి, రైతులకు అందుతున్న ప్రయోజనాలు, పరిష్కరించాల్సి న అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పథకాల అమలులో వ్యవసాయ, ఉద్యాన శాఖల మధ్య సమన్వయంతో పాటు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ అవసరమని స్పష్టం చేశారు.



## క్యూర్ పరిధిలో టిజి సేఫ్ దాడులు

### 15 టన్నుల నాణ్యతలేని ఆహారవస్తువుల జప్తు

### పలు సంస్థలకు నోటీసులు, ఒక దుకాణం లైసెన్స్ రద్దు

**హైదరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** కల్తీ ఆహార వస్తువులపై ఉక్కుపాదం మోపేందుకు సర్కారు కొత్తగా ఏర్పాటు చేసిన రాష్ట్ర స్టాండర్డ్స్ అ థారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ (టిజి సేఫ్) మంగళవారం నాడు క్యూర్ (ఓఆర్ఆర్) పరిధిలో వ్యాపారాలు నిర్వహిస్తున్న దుకాణాలు, వ్యాపార సంస్థలపై పెద్ద ఎత్తున దాడులు నిర్వహించింది. ఈ నెల 22వ తేదీన మొదటి సారిగా దాడులు నిర్వహించిన టిజి సేఫ్ మూడు రో జుల వ్యవధిలో మరోదఫా దాడులు చేబట్టింది. కల్తీ ఆహార వస్తులను గుర్తించి తొలగించడం, గడువు ముగిసిన ఆహార ఉత్పత్తుల విక్రయాలను అడ్డుకోవడం వంటి అంశాలను పరిగణలోకి తీసుకున్న టిజి సేఫ్ అధికారులు ఈ దాడులు నిర్వహించారు. టిజి సేఫ్ కమిషనర్ అవినాష్ మొహంతి ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడుల్లో 15 బృందాలు పాల్గొనగా 32 చోట్ల తనిఖీలు జరిగాయి. దాడుల సందర్భంగా అనేకచోట్ల ఆహార వ స్తువుల విక్రయాల కేంద్రాల వద్ద పరిశుభ్రత లేకపోవడం వెలుగు చూసింది. గడువు ముగిసిన వస్తువులను అమ్ముతున్న వైనం రట్టయ్యింది. ఆ హార వస్తువులను నిలువ వుంచే పద్ధతులు సవ్యంగా లేక పోవడం గుర్తించారు. కుళ్లిపోయిన కూరగాయలను మంచివిగా చెబుతూ అమ్ముతున్న ట్లు గుర్తించారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనలు చాలాచోట్ల కనిపించలేదు. ఆహార వస్తువుల ప్యాకింగ్ అనేకచోట్ల సవ్యంగా లేదు. 35 ఆహార వస్తువుల శ్యాంపుల్స్ సేకరించగా బాచుపల్లిలో బర్ఫీఘర్ స్వీట్ షాప్‌లో కనీస ప్రమాణాలు లేకుండా మిఠాయిలు తయారు చేస్తున్నందు కు దీని లైసెన్స్‌ను రద్దు చేశారు. 12 దుకాణాల ప్రమాణాలు సరిగ్గా లేకపోవడంతో వాటిని వెంటనే మెరుగు పరచుకోవాలని నోటీసులు ఇచ్చారు. నాలుగు దుకాణాలకు షోకాజ్ నోట ీసులు ఇచ్చారు. దాడుల సందర్భంగా నాణ్యత లేకుండా వున్న 15 టన్నుల ఆహార వస్తువులను టిజి సే ఫ్ అధికా రులు జప్తు చేశారు. వీటి విలువ 30 లక్షల రూపాయలు వుంటుందని అధికారులు తెలిపారు.

# రైతు సంక్షేమమే దేశ సౌభాగ్యానికి పునాది

### పసుపు విలువ ఆధారిత ఉత్పత్తులతో రైతుల ఆదాయం పెంచాలి

### నిజామాబాద్‌లో పసుపు రైతులతో గవర్నర్ శివప్రతాప్‌శుక్లా ముఖాముఖి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు25:** రైతుల సంక్షేమమే రాష్ట్ర, దేశ సంక్షేమమని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు, పసుపు సాగులో ఆధునిక సాంకేతికత, సహజ వ్యవసాయ పద్ధతులు, ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తులు, బలమైన మార్కెట్ అనుసంధానంతో రైతుల ఆదా యాన్ని పెంచాలని గవర్నర్ పిలుపునిచ్చారు. నిజామాబాద్‌లోని జాతీయ పసుపు బోర్డు ప్రధాన కార్యాలయంలో మంగళవారం పసుపు రైతులతో ముఖాముఖి నిర్వహించారు. రైతుల సమక్షంలో సునహరి మిట్టి అభియాన్, మార్కెట్ అనుసంధాన కార్యక్రమాలను గవర్నర్ ప్రారంభించారు. ఉత్తమ రైతు సంఘాలకు గవర్నర్ మెమంటోలు అందించి అభినందించారు. అనంతరం గవర్నర్ పసుపు రైతులను ఉద్దేశించి మాట్లాడారు.నిజామాబాద్‌కు పసుపు సాగులో ప్రత్యేక గుర్తింపు ఉందని గవర్నర్ అన్నారు. సారవంతమైన నేలలు, రైతుల కష్టంతో ఈ ప్రాంతం దేశంలోని ప్రముఖ పసుపు ఉత్పత్తి కేంద్రంగా ఎదిగిందన్నారు. ఇక్కడ జాతీయ పసుపు బోర్డు ప్రధాన కార్యాలయం ఏర్పాటు కావడం ఈ ప్రాంత రైతుల చిరకాల ఆకాంక్షకు ప్రతీకగా నిలిచిందని పేర్కొన్నారు. ఎంపీ ధర్మపురి అరవింద్ ప్రత్యేక చొరవ, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆశీస్సులతో ఇది సాకారం అయ్యింద న్నారు. సాగును లాభదాయకంగా మార్చేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని చెప్పారు, పసుపు కేవలం వ్యవసాయ ఉత్పత్తి మాత్రమే కాదని.. భారతీయ సంస్కృతి, సంప్రదాయం, ఆయుర్వేదం, ఆధ్యాత్మికత, నిత్యజీవితంతో ముడిపడిన విలువైన సంపద అని గవర్నర్ పేర్కొన్నారు. భారతదేశ వ్యవసాయ వారసత్వానికి పసుపు ప్రతీకగా నిలుస్తోందన్నారు. భారత్‌ను ప్రపంచంలోనే అతిపెద్ద పసుపు ఉత్పత్తిదారుగా కొనసాగించడంతో పాటు పసుపు ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీకి ప్రపంచ కేంద్రంగా అభివృద్ధి చేయడమే జాతీయ పసుపు బోర్డు లక్ష్యమని గవర్నర్ అన్నారు. పసుపు పండించే రైతుకు కష్టానికి తగిన గిట్టుబాటు ధర లభించడంతో పాటు.. అంతర్జాతీయ మార్కెట్‌లో భారత పసుపుకు ప్రత్యేక గుర్తింపు లభించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని, నాణ్యమైన




పంటను పండిస్తూ, సమష్టి మార్కెటింగ్ ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు. అన్నదాత సుఖీభవ స్ఫూర్తితో రైతు సంపన్నుడిగా, నేల ఆరోగ్యంగా, ప్రపంచ మార్కెట్‌లో భారత్ అగ్రగామిగా నిలిచే వ్యవసాయ వ్యవస్థను నిర్మించాలి అని గవర్నర్ ఆకాంక్షి ంచారు. ఎంపీ ధర్మపురి అరవింద్ మాట్లాడుతూ ఈ ప్రాంత పసుపు రైతుల నాలుగు దశాబ్దాల కలను నిజామాబాద్ కేంద్రంగా జాతీయ పసుపు బోర్డు ఏర్పాటుతో కేంద్రం నెరవేర్చిందన్నారు. బోర్డు ఏర్పాటుతో పసుపు రైతులకు అన్ని విధాలుగా ప్రయోజనం చేకూరుతుందని, పసుపు క్వింటాలు ధర గతం కంటే పెరిగింద న్నారు. గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం దాన కిషోర్, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, నగర మేయర్ ఉమారాణి, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ గుప్తా, ఆర్మూర్ ఎమ్మెల్యే పి. రాకేష్ రెడ్డి, జాతీయ పసుపు బోర్డు కార్యదర్శి భవానీశ్రీ, నిజామాబాద్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా, నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్యలు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో నకిలీ వైద్యులపై టాస్క్‌ఫోర్స్ కొరడా

### సికిందరాబాద్, జూబ్లీహిల్స్ జోన్లలో దాడులు.. 12 మంది అరెస్టు



పట్టుబడిన నిందితులు, మందులు చూపుతున్న డిసిపి వైభవ్ గైక్వాడ్ రఘునాథ్

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), ఆగస్టు 25, ప్రభాతవార్త:** సరైన వైద్య అర్హతలు లేకపోయినా డాక్టర్లుగా చలామణి అవుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమా డుతున్న నకిలీ వైద్యులపై టాస్క్‌ఫోర్స్ కొరడా ఝుళిపించింది. సికింద్రాబాద్, జూబ్లీహిల్స్ జోన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా దాడులు నిర్వహించిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు మొత్తం 12 మందిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి నకిలీ వైద్య ధ్రువ పత్రాలు, గడువు ముగి సిన మందులు, ఇంజె క్షన్లు, సెలైన్లు, సిరంజిలు, స్టెతస్కోప్‌లు, బీపీ యంత్రాలు తదితర వైద్య పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. సికిందరా బాద్ జోన్‌లో చిలకల గూడ, రాంగోపాల్‌పేట్, దొమల్‌గూడ, ఓయూ సిటీ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఆరుగురిని అదుపులోకి తీసుకున్నా రు. వీరిలో గతంలో కాంపౌండర్లుగా పనిచేసిన వారు కూడా ఉన్నారు. ఎలాంటి వైద్య అర్హతలు లేకుండానే క్లినిక్‌లు నిర్వహిస్తూ ఇంజెక్షన్లు, సెలైన్లు ఇస్తూ రోగులకు చికిత్స అందిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. చిలకలగూడలోని ఓ క్లినిక్‌లో నకిలీ ఎంబీబీఎస్, బీహెచ్ఎంఎస్ ధ్రువపత్రాలతో జనరల్, చైల్డ్ స్పెషలిస్ట్‌గా చలామణి అవుతున్న వ్యక్తిని కూడా అరెస్ట్ చేశారు. మరో వ్యక్తి ఇంట్లోనే మందుల మిశ్రమాలను తయారు చేసి చర్మవ్యాధులకు చికిత్స గా ఇస్తున్నట్లు తేలింది. లోయర్ ట్యాంక్‌బండ్, చిలకలగూడ, మణికేశ్వర్‌నగర్ ప్రాంతాల్లోనూ అర్హత లేని వ్యక్తులు ఏళ్ల తరబడి క్లినిక్‌లు నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వారి వద్ద నుంచి నకిలీ ధ్రువపత్రాలు, 5 స్టెతస్కోప్‌లు, 5 బీపీ యంత్రాలు, 277 ఇంజెక్షన్లు, 933 మాత్రలు, 12 సెలైన్ బాటిళ్లు, 70 సిరంజిలు, 16 ఆయింట్‌మెంట్లు, 57 సిరప్‌లు, ప్రిస్క్రిప్షన్ ప్యాడ్లు, పల్స్ ఆక్సిమీటర్లు తదితరాలను స్వాధీనం చేసుకున్నారు. ఇక జూబ్లీహిల్స్ జోన్‌లోనూ టాస్క్‌ఫోర్స్ విస్తృత దాడులు నిర్వహించింది. మధురానగర్, జూబ్లీహిల్స్, ఫిల్మ్‌నగర్, బోరబండ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఆరుగురిని అరెస్ట్ చేశారు. వీరిలో ఫస్ట్‌ఎయిడ్ సెంటర్ల పేరుతో వైద్యం చేస్తున్న వారు, ఫార్మసీలు నిర్వహిస్తూ పక్కనే క్లినిక్‌లు ఏర్పాటు చేసుకున్న వారు, గతంలో నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఇతర వైద్య సహాయకులుగా పనిచేసిన వారు ఉన్నారు. కొందరు రోజుకు 40 నుంచి 50 మంది వరకు రోగులను చూసి ఫీజులు వసూలు చేస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ తెలిపారు.

## వర్షాలతో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

**హైదరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** వర్షాల కారణంగా సింగరేణి కాలరీస్ ఓపెన్‌కాస్ట్ గనుల్లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలిగింది. సింగరేణి పరిధిలోని పలు ఓపెన్ కాస్ట్ గనుల్లోకి వరద నీరు చేరడంతో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. గనుల్లో నీరు నిలవడంతో షావల్, డంపర్లు వంటి భారీ యంత్రాలు యార్డులకే పరిమితమయ్యాయి. బొగ్గు వెలికితీతతో పాటు మట్టి (ఓవర్‌బర్డెన్) తొలగింపు పనులకు కూడా బ్రేక్ పడింది. మణుగూరు, ఎల్లందు తదితర ప్రాంతాల్లోని సింగరేణి ఓపెన్‌కాస్ట్ గనులలో కురిసన తేలికపాటి వర్షం కారణంగా బొగ్గు ఉత్పత్తితో పాటు, ఓవర్‌బర్డెన్ తొలగింపు కార్యకలాపాలను ప్రభావితం చేసింది. ఫలితంగా మణుగూరులో సుమారు 40 వేల టన్నుల ఓవర్‌బర్డెన్ తొలగింపుకు అంతరాయం కలగింది. అలాగే టేకులపల్లి మండలంలోని కోయగూడెం గనిలో నీరు నిలవడం వల్ల కార్యకలాపాలకు విఘాతం కలిగింది. ఈ ఓపెన్‌కాస్ట్ గనిలో వర్షపు నీరు నిలిచిపోవడంతో, సుమారు 4 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తితో పాటు, ఓవర్‌బర్డెన్ తొలగింపు కార్యకలాపాలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. అంతేకాకుండా గత 24 గంటల్లో కురిసిన తేలికపాటి వర్షం కారణంగా పూర్వపు ఖమ్మంలోని సింగరేణి కాలరీస్ ఓపెన్‌కాస్ట్ గనుల్లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. ఓపెన్‌కాస్ట్ గనుల నుంచి నిలిచిపోయిన నీటిని తోడివేయడానికి చర్యలు కొనసాగు తున్నాయని అధికారులు తెలిపారు.




ధర్నాలో నినాదాలు చేస్తున్న నాయకులు

## ఉద్యమకారులను అవమానించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

### ఆడబిడ్డల ఆత్మగౌరవ దీక్షలో పలువురు వక్తల డిమాండ్

**హైదరాబాద్ (ధర్నాచౌక్), ఆగస్టు 25, ప్రభాతవార్త:** ఉద్యమకారులను అవమానించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ బ్రాహ్మణ ఐక్యవేదిక, తెలంగాణ బ్రాహ్మణుల ఉద్యమకారుల వేదిక ప్రతినిధులు డాక్టర్ యజ్ఞు పవన్‌కుమార్ శర్మ, పోచంపల్లి రమణారావు, గంప రామారావులు డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ బ్రాహ్మణుల ఉద్యమకారుల వేదిక, తెలంగాణ బ్రాహ్మణ ఐక్యవేదిక సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవ దీక్ష నిర్వహించారు. ఈ దీక్షకు బీజేపీ సీనియర్ నాయకులు వంశ తిలక్, బీఆర్ఎస్ నాయకులు దేవి ప్రసాద్, గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ అయాచితం శ్రీధర్, కల్లుగీత కార్మిక కార్పోరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్, ఎమ్మార్పీఎస్ నాయకులు చింత స్వామి, ప్రముఖ రచయిత అన్వేషిలు హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ బ్రాహ్మణ ఐక్యవేదిక, తెలంగాణ బ్రాహ్మణుల ఉద్యమకారుల వేదిక ప్రతినిధులు మాట్లాడుతూ తెలంగాణ ఆడబిడ్డల గౌరవం, దళిత మహిళల పట్ల అవమానకర వ్యాఖ్యలకు వ్యతిరేకంగా సామాజిక చైతన్యం తీసుకురావటమే దీక్ష ప్రధాన ఉద్దేశ్యమన్నారు.

తెలంగాణ బ్రాహ్మణుల ఆకాంక్షలు, అవసరాలను తీర్చడానికి ప్రభుత్వం తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ప్రధాన బాద్యుల నియామకాలు సీమాంధ్ర మూలాలు ఉన్న వ్యక్తులకు ఇవ్వటాన్ని వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ తెలంగాణ ఉద్యమకారులను, దళిత మహిళలను అవమానిస్తూ మాట్లాడిన మాటలు ఆయనలోని కులదురంహాకారానికి నిదర్శనమన్నారు. దళిత మహిళను అవమానించిన తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్‌ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

ఈ దీక్షా కార్యక్రమంలో ఉద్యమకారుల ఐక్య వేదిక ప్రతినిధులు పూరే ప్రసాద్‌రావు, ఆవునూరి రమణారావు, గూడ రాజేశ్వరరావు, రవికిరణ్, పోలంపల్లి రమణ తదితరులు పాల్గొన్నారు.

## పన్ను ఎగవేతదారులకు చెక్

### జీఎస్టీ వ్యవస్థలో కీలక మార్పులు

### వాణిజ్య పన్నుల శాఖలో సంస్కరణలు

**హైదరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త :** రాష్ట్రంలో పన్నుల వసూళ్ల ప్రక్రియను మరింత పారదర్శకంగా మార్చడంతో పాటు ప్రభుత్వ ఆదాయానికి ఎక్కడా గండి పడకుండా ఉండేందుకు తెలంగాణ ప్రభుత్వం వినూత్న అడుగులు వేస్తోంది. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతికతను జోడిస్తూ, ఆర్థిక నిర్వహణలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తోంది. వాణిజ్య పన్నుల శాఖ అధికారవర్గాల వివరాలు ప్రకారం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా పన్ను ఎగవేతలకు అడ్డుకట్ట వేయాలని నిర్ణయించింది. ఈ సాంకేతిక సంస్కరణలపై ఇప్పటికే ముఖ్యమంత్రి ఆర్థికవేత్త అరవింద్ సుబ్రమణియన్‌తో హైదరాబాద్‌లో కీలక చర్చలు జరిపారు.

ఈ నేపథ్యంలో అందుకు అనుగుణంగా తాజాగా సంస్కరణలు అమలుకు వానిజ్య పన్నుల శాఖ సిద్ధమవుతోంది. జీఎస్టీ, ఎక్సైజ్ శాఖల్లో పన్నుల పర్యవేక్షణను ఏఐ ద్వారా కచ్చితంగా నిర్వహిస్తూనే, వ్యాపారులకు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తగ్గకుండా చూడాలని అధికారులు నిర్ణయించారు. అలాగే భవన నిర్మాణాలు, కాంట్రాక్టు పనుల అనుమతుల సమయంలోనే సామగ్రి పన్ను అంచనాలను నమోదు చేసి, లీకేజీలను అరికట్టేలా డేటా విశ్లేషణ వ్యవస్థను రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు. ఇక మున్సిపల్, రేరా, పంచాయతీరాజ్, విద్యుత్, వాణిజ్య పన్నుల శాఖల సమాచారాన్ని ఏఐ ద్వారా అనుసంధానించడం ద్వారా అక్రమాలను ముందే పసిగట్టవచ్చనే దిశగా ఏర్పాట్లు చేస్తున్నారు.

అంతేకాకుండా మీసేవ, ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్ వంటి సంక్షేమ సేవలను ఈ సమీకృత డేటా వ్యవస్థకు జోడించడం ద్వారా పరిపాలనను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. ప్రధానంగా పన్నులు ఎగవేసే వ్యాపారాలను గుర్తించి, తనిఖీ చేయడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అమలు చేయనున్నారు. వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సులభతర వాణిజ్యానికి ప్రాధాన్యత ఇస్తూనే వసూళ్ల ప్రక్రియను పారదర్శకంగా మారుస్తున్నారు. అధికారిక హోదా మార్పు: తెలంగాణ జీఎస్టీ చట్ట సవరణలో భాగంగా రాష్ట్ర పన్నుల శాఖ అధికారుల నామినేషన్‌ను కేంద్ర విధానానికి అనుగుణంగా మార్చినట్లు వాణిజ్య పన్నుల శాఖ అధికారులు వెల్లడించారు.

# గచ్చిబౌలిలో ఇద్దరు పిల్లల కిడ్నాప్

### 4 గంటల్లోనే ఇద్దరు చిన్నారులను రక్షించిన పోలీసులు

### కిడ్నాప్‌కు పాల్పడిన మాజీ నేరస్తుడు అరెస్టు



తల్లిదండ్రుల చెంతకు చేరిన కిడ్నాప్‌కు గురైన చిన్నారులు

**హైదరాబాద్ (గచ్చిబౌలి), ఆగస్టు 25, ప్రభాతవార్త:** గచ్చిబౌలి లేబర్ క్యాంపులో ఆడుకుంటున్న ఇద్దరు చిన్నారులు కిడ్నాప్‌కు గురయ్యారు. ఇద్దరు చిన్నారులను ఓ మాజీ నేరస్థుడు కిడ్నాప్ చేసి రాష్ట్రం దాటేందుకు యత్నిస్తుంగా, తల్లిదండ్రుల పిర్యాదుతో రంగంలోకి దిగిన గచ్చిబౌలి పోలీసులు ఇద్దరు చిన్నారులను కాపాడారు. కేవలం 4 గంటల్లోనే చిన్నారులను రక్షించడంతో పాటు కిడ్నాప్‌కు పాల్పడిన నేరస్థుడిని అరెస్టు చేశారు. నగరం దాటి వెస్ట్‌బెంగాల్ వెళ్లేందుకు ఘట్కేసార్ రైల్వే స్టేషన్‌లో ఉన్న నిందితుడిని పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శేరిలింగంపల్లి డిసిపి శ్రీనివాస్ వెల్లడించారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన చాకు సొరెన్(45) పాత నేరస్థుడు. గతంలో పశ్చిమ బెంగాల్‌లోని కరిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ హత్యాయత్నంతో పాటు అత్యాచారం కేసులు చాకు సొరెన్ మీద ఉన్నాయి. అత్యాచారం కేసులో ఐదేళ్ల జైలు శిక్ష అనుభవించిన చాకు సొరెన్ గత మార్చిలో జైలు నుంచి విడుదలయ్యాడు. అనంతరం బ్రతుకుదెరువు కోసం నగరానికి వచ్చి గచ్చిబౌలి సుదర్శన్ నగర్ సమీపంలోని రాఘవేంద్ర లేబర్ క్యాంపులో నివాసం ఉంటూ స్థానికంగా కూలి పనులు చేస్తున్నాడు. కాగా ఇదే లేబర్ క్యాంపులో ఉంటున్న దేవిడ్ ముర్మ కుమార్తె ప్రమీలా ముర్మ(4), హోపన్ హేమరాయ్ కుమార్తె సంగీత హేమ రాయ్(3.5)లు ప్రతిరోజు ఒంటరిగా ఉండడం గమనించాడు. వీరిని కిడ్నాప్ చేసి వారితో బిక్షాటన చేయించడం లేదా వెస్ట్ బెంగాల్‌కు తీసుకువెళ్లి విక్రయించాలని పథకం వేశాడు. ఇందులో భాగంగా సోమవారం లేబర్ క్యాంపులో ఉన్న వారు పనులకు వెళ్లగా, చిన్నారులు ప్రమీలా, సంగీతలు అక్కడే ఆడుకుంటున్నారు. వీరు ఒంటరిగా ఉండడం గమనించిన చాకు సొరెన్ వారికి చాక్లెట్లు కొనిఇ ిస్తానంటూ అక్కడి నుంచి తీసుకు వెళ్లాడు. ఈ విషయం దేవిడ్ ముర్మ సైతం గమనించాడు. చిన్నారులు చాక్లెట్ల పేరుతో నమ్మించి నేరుగా ఆటోలో లింగంపల్లి రైల్వే స్టేషన్‌కు తీసుకువెళ్లాడు. అక్కడి నుంచి ఎంఎం టిఎస్‌లో ఘట్కేసార్ వరకు వెళ్లాడు. కాగా సాయంత్రం పనుల నుంచి ఇంటికి వచ్చిన రెండు కుటుంబాల వారు తమ చిన్నారులు కనిపించకపోవడంతో చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో గాలించారు. ఫలితం లేకపోవడంతో గచ్చిబౌలి పోలీసులకు అర్థరాత్రి పిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణలో చిన్నారులు చాకు సొరెన్‌తో వెళ్లినట్లు నిర్ధారించుకోవడంతో పాటు చాకు సొరెన్ ఫోన్ స్విచ్చాఫ్ రావడంతో కిడ్నాప్‌కు గురైనట్లు తేల్చారు. ఈ మేరకు సిసి కెమెరాలు, చాకు సొరెన్ సెల్‌ఫోన్ డేటా ఆధారంగా రైలులో వెళ్లినట్లు గుర్తించారు. ఈమేరకు చెంగిచెర్ల, ఘట్కేసార్, భువనగిరి, ఆలేరు పోలీసులను అప్రమత్తం చేశారు. కాగా వెస్ట్ బెంగాల్ వెళ్లేందుకు ఉదయం 10 గంటలకు ఈస్ట్‌కోస్ట్ రైలు ఉండడంతో దానిలో చిన్నారులను తీసుకొని వెళ్లేందుకు చాకు సొరెన్ ఘట్కేసార్ రైల్వే స్టేషన్‌లో వేచి ఉన్నాడు. ఇతన్ని గమనించిన ఘట్కేసార్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఘట్కేసార్‌కు చేరుకున్న గచ్చిబౌలి పోలీసులు నిందితుడిని అరెస్టు చేయడంతో పాటు అతని వద్ద నుంచి చిన్నారులను రక్షించారు. కాగా చిన్నారులను కిడ్నాప్ చేసి, వారిని వెస్ట్ బెంగాల్‌కు తీసుకువెళ్లి, వారితో బిక్షాటన చేయిండం లేదా విక్రయించి సొమ్ము చేసుకోవాలని చాకు సొరెన్ పథకం వేసినట్లు పోలీసులు విచారణలో తేల్చారు. ఈమేరకు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడంతో పాటు కిడ్నాప్‌కు గురైన చిన్నారులను తల్లిదండ్రులకు అప్పగించారు.

## మెక్సికాలీలో భద్రతా హెచ్చరిక

### అమెరికా ప్రభుత్వ కార్యకలాపాలు, ప్రయాణాలపై నిలిపివేత

**మెక్సికోసిటీ, ఆగస్టు 25:** మెక్సికోలోని బాజా కాలిఫోర్నియా రాష్ట్రంలోని ప్రధాన సరిహద్దు నగరం మెక్సికాలీలో భద్రతా పరిస్థితులపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. గుర్తుతెలియని ముప్పు సమాచారం అందడంతో మంగళవారం మెక్సికాలీలో అమెరికా ప్రభుత్వ కార్యకలాపాలను నిలిపివేస్తున్నట్లు అమెరికా రాయబార కార్యాలయం ప్రకటించింది. నగరానికి అమెరికా ప్రభుత్వ సిబ్బంది ప్రయాణాలను కూడా నిలిపివేసింది. "మెక్సికాలీలో ఉన్న అమెరికా పౌరులకు కూడా రాయబార కార్యాలయం భద్రతా సూచనలు జారీ చేసింది. నగరంలో ముప్పు పొంచి ఉందని హెచ్చరించిన అధికారులు అప్రమత్తంగా ఉండాలని, పరిస్థితులకు అనుగుణంగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముప్పు సమాచారాన్ని దృష్టిలో ఉంచుకుని మంగళవారం మెక్సికాలీలో అమెరికా ప్రభుత్వ కార్యకలాపాలు, ప్రయాణాలను నిలిపివేశాం" అని అమెరికా రాయబార కార్యాలయం తన ప్రకటనలో తెలిపింది. అయితే ఈ ముప్పు ఏ ప్రాంతంలో ఉంది, దాని స్వభావం ఏమిటి, సమాచారం ఎక్కడి నుంచి అందిందనే విషయాలను మాత్రం వెల్లడించలేదు.

26-08pg10:26-08pg10.qxd 25/Aug/26 10:32 PM Page 1





## నెక్సో ఛాంపియన్‌షిప్.. శుభంకర్ 46వ స్థానం

**స్కాట్లాండ్‌బి:** ట్రంప్ ఇంటర్నేషనల్ గోల్ఫ్ లింక్స్‌లో జరిగిన 2026 నెక్సో ఛాంపియన్‌షిప్ చివరి రౌండ్‌లో ఈవెన్‌పార్ 72 స్కోరు సాధించిన భారత గోల్ఫ్ క్రీడాకారుడు శుభంకర్ శర్మ, 46వ స్థానంలో నిలిచాడు. మూడు బర్డీలు, మూడు బోగీలు నమోదు చేసిన శర్మ, 73, 72, 75, 72 రౌండ్ల తర్వాత నాలుగు ఓవర్ 292 స్కోరుతో టోర్నమెంట్‌ను ముగించాడు. తోటి భారత ఆటగాడు యువరాజ్ సంధు ఈ వారం ప్రారంభంలో కట్ మిస్ అయ్యాడు. స్కాట్లాండ్‌కు చెందిన స్కాట్ జేమీసన్ తన స్వదేశంలో రెండవ డీపీ వరల్డ్ టూర్ టైటిల్‌ను గెలుచుకోవడానికి, చివరి రౌండ్‌లో 67 స్కోరుతో అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. 42 ఏళ్ల అతను 11అండర్ పార్ స్కోరుతో ముగించి, ఇంగ్లాండ్‌కు చెందిన మాథ్యూ జోర్డాన్ కంటే రెండు షాట్లు ముందున్నాడు. జామీసన్ చివరి రౌండ్‌ను రాత్రికి అగ్రస్థానంలో ఉన్న షాన్ నారిస్ కంటే మూడు షాట్లు వెనుకబడి ప్రారంభించినప్పటికీ, ఫ్రంట్ నైన్‌లో మూడు బర్డీలతో ఆ లోటును త్వరగా పూడ్చాడు. స్ట్రోక్‌ను ప్రభావితం చేసే పరిస్థితులను మెరుగుపరిచే చర్యలకు సంబంధించిన రూల్ 8.1ను ఉల్లంఘించినందుకు నారిస్‌కు తదనంతరం రెండుస్ట్రోక్ పెనాల్టీ విధించబడింది, దీంతో జామీసన్ టర్న్ వద్ద స్పష్టమైన ఆధిక్యాన్ని సాధించాడు.

ఆట



## దులీప్ ట్రోఫీ.. సెమీఫైనల్‌కు ఈస్ట్ జోన్

**న్యూఢిల్లీ:** ఈస్ట్ జోన్, నార్త్ ఈస్ట్ జోన్‌ను ఒక ఇన్నింగ్స్ మరియు 210 పరుగుల తేడాతో చిత్తుగా ఓడించి దులీప్ ట్రోఫీ సెమీఫైనల్స్‌లో స్థానం సంపాదించింది. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ గ్రౌండ్‌లో మంగళవారం జరిగిన ఈ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ఈస్ట్ జోన్ భారీగా 467 పరుగులు చేయడంతో ఈ ఘన విజయం సాధ్యమైంది. ఆ తర్వాత వారు తమ ప్రత్యర్థులను రెండు ఇన్నింగ్స్‌లలో 111 మరియు 146 పరుగులకే ఆలౌట్ చేశారు. షాబాజ్ అహ్మద్ అద్భుతమైన 167 పరుగులతో విజయాన్ని నిలబెట్టగా, రెండో ఇన్నింగ్స్‌లో అనుకుల్ రాయ్ ఐదు వికెట్లు పడగొట్టి మ్యాచ్‌ను ఖరారు చేశాడు. ఈస్ట్ జోన్ తొలుత తడబడి, ఐదు వికెట్ల నష్టానికి 138 పరుగులకే పరిమితమై, ఆ తర్వాత పుంజుకుంది. వారు చివరికి 112.5 ఓవర్లలో 467 పరుగులు సాధించారు. షాబాజ్ 244 బంతుల్లో 17 ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 167 పరుగులు చేసి, జట్టును పునరుద్ధరించాడు. సుదీప్ కుమార్ ఘరామి క్రీజులో అద్భుతమైన సహకారం అందించాడు. అతను 185 బంతుల్లో 25 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 146 పరుగులు చేశాడు. ఈ జోడీ ఇన్నింగ్స్‌ను పునర్నిర్మించడానికి విలువైన భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. బౌలింగ్ దాడిని ఎదుర్కోవడంలో తడబడిన నార్త్ ఈస్ట్ జోన్, తమ తొలి ఇన్నింగ్స్‌లో 42.5 ఓవర్లలో 111 పరుగులకే ఆలౌట్ అయింది.

# భారీ ఆధిక్యం దిశగా భారత్

## 236 రన్స్‌తో వెనుకబడిన శ్రీలంక



**కొలంబో:** శ్రీలంకతో రెండో టెస్ట్‌లో టీమిండియా పట్టు బిగించి భారీ ఆధిక్యంతో విజయానికి చేరువలో ఉంది. బ్యాటింగ్ తరహాలోనే బౌలింగ్‌లోనూ సత్తా చాటింది. దాంతో మంగళవారం మూడో రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక 83.4 ఓవర్లలో 8 వికెట్లకు 265 పరుగులు చేసి, టీమిండియా కంటే 236 పరుగులు వెనకబడి ఉంది. క్రీజులో లాహిరు కుమార(8 బ్యాటింగ్)తో పాటు సోనాల్ దినుషా(85 బ్యాటింగ్) ఉన్నాడు. ఇక 8/2 ఓవర్‌నైట్ స్కోర్‌తో మూడో రోజు ఆటను కొనసాగించిన శ్రీలంకకు ఆదిలోనే గట్టి షాక్ తగిలింది. కామిల్ మిషారా(19)ను ప్రసిధ్ కృష్ణ ఔట్ చేయగా, కామిందు మెండిస్‌తో కలిసి పసిందు సూర్య బండార ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఈ క్రమంలో అతను 76 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 87 పరుగుల భాగస్వామ్యంతో క్రీజులో పాతుకు పోయిన ఈ జోడీని ప్రసిధ్ కృష్ణ విడదీసాడు. కామిందు మెండీస్(32)ను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో శ్రీలంక 130/4 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. ఈ సమయంలో వర్షం అంతరాయం కలిగించడంతో రెండో సెషన్ ఆలస్యంగా ప్రారంభమైంది. సెకండ్ సెషన్ ఆరంభంలోనే ధనంజయ డిసిల్వా(8)ను మానవ్ సుతార్ పెవిలియన్ చేర్చాడు. దాంతో శ్రీలంక 137 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ పరిస్థితుల్లో సోనాల్ దినుషాతో కలిసి పసిందు జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. సెంచరీ దిశగా సాగిన పసిందును జడేజా క్లీన్ బౌల్డ్ చేశాడు. ఆ వెంటనే నిరోషన్ డిక్‌వెల్లా(0)ను సిరాజ్ డకౌట్‌గా పెవిలియన్ చేర్చాడు. కేశర నువాంతతో కలిసి సోనాల్ దినుషా పోరాడాడు. తొలి టెస్ట్ ఫామ్‌ను కొనసాగిస్తూ 82 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. దాంతో శ్రీలంక 216/7 స్కోర్ తో టీ బ్రేక్‌కు వెళ్లింది. ఆఖరి సెషన్‌లోనూ ఈ జోడీ ఆచితూచి ఆడింది. 57 పరుగుల భాగస్వామ్యంతో ప్రమాదకరంగా మారిన ఈ జోడీని మానవ్ సుతార్ విడదీసాడు. లాహిరు కుమారా ఆచితూచి ఆడగా, సొనాల్ దినుషా తనదైన శైలిలో బ్యాటింగ్ చేశాడు. మరోవికెట్ పడకుండా ఈ ఇద్దరూ జాగ్రత్త పడటంతో శ్రీలంక 265/8 స్కోర్ వద్ద మూడో రోజు ఆటను ముగించింది. భారత బౌలర్లలో ప్రసిధ్ కృష్ణ(3/47), మానవ్ సుతార్(3/83) మూడేసి, మహమ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజా తలో వికెట్ పడగొట్టారు. కాగా తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 503/9 స్కోర్ వద్ద డిక్లేర్డ్ చేసిన సంగతి తెలిసిందే.



## డబ్ల్యూటిఎ టోర్నీ కోకో గాఫ్‌కు టైటిల్


**సిన్సినాటి:** యూఎస్ ఓపెన్ సమీపిస్తున్న తరుణంలో, సిన్సినాటిలో జరుగుతున్న డబ్ల్యూటీఏ 1000 టోర్నమెంట్‌లో జెస్సికా పెగులాపై 6-2, 6-4 తేడాతో కోకో గాఫ్ ఆధిపత్యం చెలాయించి, 2026లో తన తొలి టైటిల్‌ను కైవసం చేసుకుంది. ప్రపంచ నంబర్ ఫోర్ గాఫ్, ఈ ఏడాది మయామి, రోమ్‌లలో జరిగిన ఫైనల్స్‌లో ఓటమిపాలైన తర్వాత, గత అక్టోబర్‌లో వుహాన్‌లో తన మొదటి డబ్ల్యూటిఎ టైటిల్‌ను కైవసం చేసుకుంది. మూడవ ర్యాంక్ క్రీడాకారిణి పెగులాపై 75 నిమిషాల్లో విజయంతో టోర్నమెంట్‌ను ముగించిన గాఫ్ రెండవ సిన్సినాటి కిరీటాన్ని అందించింది. గాఫ్, పెగులా సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసి 4-0 ఆధిక్యం సాధించింది. పెగులా తన సర్వీస్‌ను నిలబెట్టుకుని, ఒక బ్రేక్‌ను తిరిగి సాధించి స్కోరుబోర్డుపైకి రాకముందే గాఫ్ 5-0తో ఆధిక్యంలో ఉంది. 34 నిమిషాల తర్వాత గాఫ్ మళ్లీ బ్రేక్ చేసి తొలి సెట్‌ను కైవసం చేసుకోవడంతో అది ఒక స్వల్ప ఉపశమనంగా నిలిచింది. రెండవ సెట్ కూడా అదే విధంగా సాగింది, గాఫ్ 3-0 ఆధిక్యం సాధించే క్రమంలో బ్రేక్ చేయగా, పెగులా ఆమెను అందుకోవడానికి ప్రయత్నించింది. అయితే గాఫ్ తన మొదటి మ్యాచ్ పాయింట్‌తో విజయాన్ని ఖాయం చేసుకుంది. గాఫ్ విజయంతో ఇద్దరి మధ్య కెరీర్ సిరీస్ చెరో ఐదు విజయాలతో సమమైంది. వింబుల్డన్ క్వార్టర్‌ఫైనల్‌లో తన స్వదేశీయురాలిని ఓడించిన తర్వాత, ఈ సీజన్‌లో పెగులాపై గాఫ్ తన రెండవ మ్యాచ్‌ను గెలుచుకుంది.



## వరల్డ్ ర్యాంకింగ్స్‌లో.. 12 స్థానాలు ఎగబాకిన ట్రీసా-గాయత్రి

**న్యూఢిల్లీ:** బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో భారత బ్యాడ్మింటన్ మహిళల డబుల్స్ జోడీ ట్రీసా జాలీ, గాయత్రి గోపీచంద్ 12 స్థానాలు ఎగబాకి ప్రపంచ 27వ ర్యాంకును సాధించారు. ఈ మేరకు మంగళవారం విడుదలైన ర్యాంకింగ్స్‌లో ఈ భారత్ మహిళల డబుల్స్ జోడీ అనూహ్యంగా పాయింట్లుతో పై పైకి చేరింది. ఇటీవల జరిగిన బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించిన కొద్ది రోజులకే ట్రీసా, గాయత్రిల ఎదుగుదల చోటుచేసుకుంది. స్వదేశంలో జరిగిన ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లలో, భారత జంట ప్రపంచ ర్యాంకింగ్‌లో 39వ స్థానంలో ఉండి, అన్‌సీడెడ్‌గా బరిలోకి దిగింది. ఈ టోర్నమెంట్‌లో వారు రెండు పెద్ద సంచలనాలు సృష్టించారు. వరుస రౌండ్లలో జపాన్‌కు చెందిన ఏడవ సీడ్ రిన్ ఇవానగాకీ నకానిషిని, నాలుగవ సీడ్ జియా యి ఫాన్‌జాంగ్ షు జియాన్‌ను ఓడించి సెమీఫైనల్స్‌కు చేరుకున్నారు. సెమీఫైనల్స్‌లో చైనాకు చెందిన ప్రపంచ నంబర్1 జోడీ లియు షెంగ్ షు మరియు టాన్ నింగ్‌లతో తలపడిన ట్రీసాగాయత్రి, 18-21, 21-13, 8-21 తేడాతో ఓడిపోయి కాంస్య పతకంతో సరిపెట్టుకున్నారు. కాంస్య పతకం సాధించడం ద్వారా వారికి మొత్తం 10,500 ర్యాంకింగ్ పాయింట్లు లభించి, తాజా ర్యాంకింగ్స్‌లో వారు ప్రపంచ 27వ స్థానానికి చేరుకున్నారు. ఒకప్పుడు ప్రపంచ 9వ ర్యాంకు వరకు చేరుకున్న భారత జంట, గాయాల సమస్యలు మరియు నిలకడలేని ఫామ్ కారణంగా ఇటీవలి కాలంలో ర్యాంకింగ్‌లో గణనీయంగా వెనుకబడ్డారు. వారు ఈ ఏడాది మార్చిలో ప్రపంచ ర్యాంకింగ్‌లో 30వ స్థానం కంటే దిగువకు పడిపోయి, జూన్‌లో 58వ స్థానానికి కూడా దిగజారారు. మళ్లీ ఇప్పుడు పైకి ఎదిగారు.

## ఈ యేడాది దీపమ్ ఓఎఫ్ఎస్ లక్ష్యం రూ.80వేల కోట్లు!




**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** ప్రభుత్వ డిజిన్వెస్ట్‌మెంట్ కార్యక్రమం కొనసాగింపు ఆర్థిక సంవత్సరం మిగిలిన కాలంలోనూ ప్రభుత్వ డిజిన్వెస్ట్‌మెంట్ కార్యక్రమం చురుగ్గా కొనసాగనున్నట్లు కేంద్రం సంకేతాలు ఇచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన రూ.80వేల కోట్ల డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యాన్ని సాధిస్తామని పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ విభాగం ప్రకటించింది. ఇప్పటికే ప్రభుత్వం ఎల్ఐసీ ఆఫర్ ఫర్ సేల్, తాజా హిందుస్థాన్ కాపర్ వాటాల విక్రయం తదితర లావాదేవీల ద్వారా సుమారు రూ.52 వేల కోట్లను సమీకరించింది. లక్ష్యాలను చేరుకోవడంతో పాటు ఫలితాలపై కూడా ప్రభుత్వం దృష్టి సారిస్తోందని తెలుస్తోంది. తదుపరి ఏ ప్రభుత్వ రంగ సంస్థ వాటాలను మార్కెట్‌లో విక్రయించనున్నారనే విషయాన్ని వెల్లడించేందుకు దీపమ్ కార్యదర్శి నిరాకరించారు. మరిన్ని మార్కెట్ ఆఫర్లు కొనసాగుతాయని సూచించారు. పెద్ద మొత్తంలో ఓఎఫ్ఎస్‌లావాదేవీలకు సంబంధించి ప్రభుత్వం సిద్ధం చేస్తున్న ప్రణాళికపై ప్రశ్నించగా, మార్కెట్ ఆఫర్లతో ప్రభుత్వం ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. దీంతో తాజా హిందుస్థాన్ కాపర్ ఒక్కటే కాకుండా, రాబోయే రోజుల్లో మరిన్ని ప్రభుత్వ సంస్థల వాటాల విక్రయాలు ఉండే అవకాశం కనిపిస్తోంది. మార్కెట్ పరిస్థితులను అంచనా వేసేందుకు దీపమ్‌లో ప్రత్యేక మార్కెట్ రీసెర్చ్ యూనిట్‌తో పాటు కురుక్షేత్ర పేరుతో అంతర్గత ఆపరేషన్స్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు కార్యదర్శి తెలిపారు. వాటాల విక్రయాలను ప్రారంభించే ముందు మార్కెట్ పరిస్థితులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుందని చెప్పారు.

వాణిజ్యం




## నివాస గృహాల మార్కెట్‌లో మందగమనం!

**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** దేశంలో నివాస గృహాల మార్కెట్ ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో వృద్ధి బాటలో కొనసాగింది. అయితే గత త్రైమాసికంతో పోలిస్తే వార్షిక ప్రాతిపదికన ఇళ్ల ధరల పెరుగుదల వేగం కొంత మందగించినట్లు భారతీయ రిజర్వ్ బ్యాంక్ వెల్లడించింది. ఆర్‌బీఐ ఆల్ ఇండియా హౌస్ ప్రైస్ ఇండెక్స్ ప్రకారం, ఈఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో గృహ ధరల సూచీ వార్షికంగా 3.6 శాతం పెరిగింది. అంతకుముందు త్రైమాసికంలో నమోదైన 4.5 శాతం వృద్ధితో పోలిస్తే ఇది తక్కువ. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో నమోదైన వృద్ధి రేటు కూడా 3.6 శాతమే కావడం గమనార్హం. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో ఆల్ ఇండియా ఇండెక్స్ 117.5కి చేరింది. గత త్రైమాసికంలోని 116.2తో పోలిస్తే ఇది 1.1 శాతం పెరుగుదల. గత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో సూచీ 113.4గా ఉంది. వార్షిక ప్రాతిపదికన గృహ ధరల పెరుగుదలకు ప్రధానంగా చండీగఢ్, జైపూర్, కాన్పూర్, లక్నో, తిరువనంతపురం నగరాల్లో నమోదైన ధరల పెరుగుదల దోహదపడింది. త్రైమాసిక ప్రాతిపదికన సూచీ 1.1 శాతం పెరగడానికి ముఖ్యంగా చండీగఢ్, లక్నో, తిరువనంతపురం నగరాల్లో అధిక ధరలు కారణమయ్యాయి. 2022-23ను బేస్ ఇయర్‌గా తీసుకుని దేశంలోని 18 ప్రధాన నగరాల్లో నివాస గృహాల ధరల మార్పులను ఈ సూచీ ప్రతిబింబిస్తుంది. ఈ సూచీలో ముంబై, ఢిల్లీ, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, లక్నో, అహ్మదాబాద్, జైపూర్, కాన్పూర్, కొచ్చి, హైదరాబాద్, తిరువనంతపురం, పుణె, ఘజియాబాద్, థానే, గౌతమ్ బుద్ధ నగర్, చండీగఢ్, నాగ్‌పూర్ నగరాలు ఉన్నాయి.

## బ్రెంట్ క్రూడ్ ధరలు 3 శాతం పతనం



**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** మధ్యప్రాచ్యంలో మరోసారి పూర్తిస్థాయి ఉద్రిక్తతలు చెలరేగుతాయన్న సంకేతాలతో మంగళవారం అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ ధరలు దాదాపు 3 శాతం పడిపోయాయి. బ్యారెల్‌కు సుమారు 87 డాలర్లకు చేరాయి. బ్రెంట్ ఫ్యూచర్స్ 2.92 శాతం క్షీణించి 87.90 డాలర్ల వద్ద ట్రేడయ్యాయి. అమెరికా పలు మధ్యప్రాచ్య దేశాల్లోని రాయబార కార్యాలయాల నుంచి తరలించిన దౌత్య సిబ్బందిని తిరిగి విధుల్లోకి పంపించే అవకాశం ఉందన్న వార్తల క్రమంలో మార్కెట్లలో ధరలు తగ్గాయి. అమెరికా విదేశాంగ సిబ్బంది ఈ వారంలోనే తమ పోస్టులకు తిరిగి వెళ్లే అవకాశం ఉందని పేర్కొంది. ఇరాన్‌తో మరోసారి పూర్తిస్థాయి సైనిక ఘర్షణలు చెలరేగే అవకాశాన్ని ట్రంప్ ప్రభుత్వం ప్రస్తుతం అంచనా వేయడం లేదనే సంకేతంగా ఈ నిర్ణయాన్ని మార్కెట్లు భావిస్తున్నాయి. ఇజ్రాయెల్, లెబనాన్, సౌదీ అరేబియా, ఖతార్, జోర్డాన్, ఒమన్, ఇరాక్, కువైట్‌లలోని అమెరికా దౌత్య కార్యాలయాల్లో సిబ్బందిని తిరిగి నియమించే ప్రక్రియ చేపట్టనున్నట్లు సమాచారం. వీటిలో బీరుట్‌లోని అమెరికా రాయబార కార్యాలయంలో తొలుత సిబ్బంది తిరిగి విధుల్లో చేరే అవకాశం ఉంది.

## హెచ్చుతగ్గులున్నా చివరికి లాభాలే!

**ముంబయి, ఆగస్టు 25:** దేశీయ ఈక్విటీ మార్కెట్లు మంగళవారం తీవ్ర ఒడిదుడుకుల మధ్య చివరకు లాభాలతో ముగిశాయి. ప్రారంభంలో నష్టాల్లో ట్రేడైన సూచీలు, చివరి గంటల్లో కొనుగోళ్లు పెరగడంతో కోలుకున్నాయి. భారీగా పడిపోయిన షేర్లలో ఇన్వెస్టర్లు కొనుగోళ్లు జరపడం, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గడం మార్కెట్‌కు ఊరటనిచ్చాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 286.98 పాయింట్లు లాభపడి 77,656.09 వద్ద ముగిసింది. నిఫ్టీ50 115.50 పాయింట్లు పెరిగి 24,334.55 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్ సమయంలో నిఫ్టీ 24,115.45 కనిష్ఠ స్థాయికి పడిపోయినా, తిరిగి పుంజుకుని 24,300 మార్క్‌ను తిరిగి అధిగమించింది. హెల్త్‌కేర్, పీఎస్‌యూ బ్యాంకులు, ఐటీ రంగాల షేర్లు మంచి ర్యాలీ తీసాయి. ప్రైవేట్ బ్యాంకులు, మెటల్ రంగ షేర్లు ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఇన్ఫోసిస్ - 1.24 లాభం రిలయన్స్ ఇండస్ట్రీస్ - 0.55 పెరుగుదఐసీఐసీఐ బ్యాంక్ - 0.54 లాభం



నెలవారీ డెరివేటివ్స్ ఎక్స్‌పైరీకి ముందు ట్రేడర్లు తమ పొజిషన్లను సర్దుబాటు చేసుకోవడంతో మార్కెట్లో అధిక అస్థిరత కనిపించింది. కొత్త క్లోజింగ్ ఆక్షన్ సెషన్ విధానంలో నిర్వహించిన తొలి నెలవారీ నిఫ్టీ ఎక్స్‌పైరీ కావడంతో, చివరి గంట ట్రేడింగ్ మరింత హెచ్చుతగ్గులకు లోనైంది. బీఎస్ఈ 150 మిడ్‌క్యాప్ సూచీ 0.37 పెరిగింది. బీఎస్ఈ 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.17 తగ్గింది. బీఎస్ఈలో మొత్తం 2,007 షేర్లు లాభపడగా, 2,330 షేర్లు నష్టపోయాయి. 196 షేర్లు మార్పులేకుండా ముగిశాయి. కమోడిటీలు, రూపాయిఅక్టోబర్ 2026 డెలివరీ బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 2.73 డాలర్లు (2.96 ) తగ్గి 89.44 డాలర్లకు చేరింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి స్వల్పంగా బలపడింది. రూపాయి విలువ 95.4350 వద్ద ట్రేడవగా, గత ముగింపు 95.7000. భారత 10 ఏళ్ల ప్రభుత్వ బాండ్ రాబడులు 6.872 నుంచి 6.854కు తగ్గింది. ఎంసీఎక్స్‌లో అక్టోబర్ 5 గోల్డ్ ఫ్యూచర్స్ 0.18 తగ్గి రూ.1,62,936 వద్ద ముగిశాయి. శంకేష్ జువెలర్స్ షేరు బీఎస్ఈలో రూ.95.03 వద్ద లిస్ట్ అయి, ఇష్యూ ధర రూ.93పై 2.18 ప్రీమియం నమోదు చేసింది. సన్‌షైన్ పిక్చర్స్ షేరు రూ.368.90 వద్ద లిస్ట్ అయి, రూ.360 ఇష్యూ ధరపై 2.47 ప్రీమియంతో ముగిసింది. నీలి ఫైనాన్స్, 4.74 ఎంటెరో హెల్త్‌కేర్ సొల్యూషన్స్ 6.39 నెట్‌వెబ్ టెక్నాలజీస్ ఇండియా 2.92, లార్సెన్ అండ్ టూబ్రో 0.71, సిగ్మా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్5 (అప్పర్ సర్క్యూట్)పురవంక 1.73 అఫ్కాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ 2.42 గ్రేట్ ఈస్టర్న్ షిప్పింగ్ 0.68చొప్పున పెరిగాయి. ఐపీఓలకు పెట్టుబడిదారుల నుంచి మంచి స్పందన లభించింది. "అన్నూ ప్రాజెక్ట్స్0.34 రెట్లు, ఆగ్‌మాంట్ ఎంటర్‌ప్రైజెస్ 105.7 రెట్లు, స్కైవేస్ ఎయిర్ సర్వీసెస్ 2.46 రెట్లు, సింబయోటెక్ ఫార్మాల్యాబ్ 1.85 రెట్లు, హైటెక్ ఇంజినీర్స్ 19.31 రెట్లుమొత్తంగా, అంతర్జాతీయ ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ ముడి చమురు ధరలు తగ్గడం, దిగువ స్థాయిల్లో కొనుగోళ్లు పెరగడం వల్ల దేశీయ మార్కెట్లు మంగళవారం సానుకూలంగా మార్కెట్లు ముగిసాయి.






Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14